సోమవారం
4•2•2019
కరీంనగర్
• వెల. రూ.6.50
• సంపుటి 8 • సంచిక 220
• పేజీలు : 16 + 16

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM KARIMNAGAR | HYDERABAD | WARANGAL | KHAMMAM | NALGONDA | MAHABUBNAGAR | NIZAMABAD



ఆదివారం యాదాద్రి ఆలయ విస్తరణ పనులపై సీఎం కేసీఆర్‌కు వివరిస్తున్న ఈవో గీత . చిత్రంలో ఎంపీ బూర నర్సయ్యగౌడ్, ఆర్కిటెక్ట్ ఆనంద సాయి, వైడీటీఏ అధికారులు కూడా ఉన్నారు.

యాదాద్రికి విశ్వఖ్యాతి

నభూతో నభవిష్యతిలా.. ఆలయ పునఃప్రతిష్ఠ మహోత్సవం

- 1008 హోమగుండాలతో ప్రతిష్ఠాపనోత్సవాలు
- ఏకకాలంలో 6,500 మంది రుత్వికుల వేదపఠనం
- వెయ్యేండ్లు గుర్తుండిపోయేలా ఆలయ పనులు
- యాదాద్రి సందర్శనలో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు
- మరో పదిహేను రోజుల్లో మళ్లీ వస్తానని వెల్లడి
- వెయ్యి ఎకరాల్లో టెంపుల్ సిటీ నిర్మాణం
- భూసేకరణకు రూ.70 కోట్లు విడుదల
- స్వామివారి తెప్పోత్సవానికి గండి చెరువు
- 60 ఎకరాల్లో ప్రవచన మండపాలు
- బస్వాపూర్ ప్రాజెక్టువద్ద హోటళ్లు, థియేటర్లు

యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:

అద్భుత దివ్యక్షేత్రంగా యాదాద్రి ఆలయ విస్తరణ పనులు శరవేగంగా సాగుతున్నాయని, విశ్వఖ్యాతిని గడించేలా యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం ఉండబోతున్నదని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు చెప్పారు. యాదాద్రి దేవాలయ పునఃప్రతిష్ఠ మహోత్సవం దేశంలో ఎక్కడా చేయనివిధంగా 1008 హోమగుండాలతో ప్రపంచంలో, దేశం నలుమూలల్లో ఉన్న శ్రీవైష్ణవ సంప్రదాయం పాటించే పెద్దలతో నిర్వహిస్తామని తెలిపారు. చినజీయర్‌స్వామి ఆధ్వర్యంలో బద్రినాథ్ వైష్ణవ పండితులతోపాటు 133 దేశాల నుంచి వైష్ణవ పండితులు ఈ ప్రతిష్ఠాపన మహోత్సవానికి తరలివస్తామని లేఖలు రాశారని వివరించారు. 6,500 మంది రుత్వికులు ఏకకాలంలో వేదపఠనం చేస్తారని, వారి సహాయకులే దాదాపు రెండుమూడు వేల మంది ఉంటారని తెలిపారు. పునఃప్రతిష్ఠాపన సమయంలో ఐదు లక్షల నుంచి 15 లక్షలమంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉందని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని ఓ కార్యకర్తలా తానే దగ్గరుండి జరిపిస్తానని అన్నారు. ఆలయ నిర్మాణం ప్రపంచదేశాలు అబ్బురపడేలా, వెయ్యేండ్లు గుర్తుండేలా ఉంటుందని చెప్పారు. ఇప్పుడు ప్రారంభం, అప్పుడు ప్రారంభం అంటూ మీడియా, పత్రికాసోదరులు వార్తలు రాయవద్దని కోరారు. ఇంత పెద్ద గొప్పకార్యం రెండుమూడు నెలల్లో పూర్తయ్యేదికాదన్న కేసీఆర్.. ఎప్పుడు ప్రారంభమవుతుందో స్వయంగా తానే వచ్చి చెప్తానని, అప్పటివరకు ప్రారంభోత్సవంపై ఎలాంటి వార్తలు రాయొద్దని సూచించారు. యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ విస్తరణ పనులను ఆదివారం వైడీటీఏ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆయన మళ్లీ పది పదిహేను రోజుల్లో

మిగతా 2వ పేజీలో

మోదీ X దీదీ

కోల్‌కతాలో రాత్రంతా హైడ్రామా

- చిట్‌ఫండ్ కేసులో కేంద్రంతో కయ్యానికి సిద్ధమైన మమత
- నగర పోలీస్ కమిషనర్ ఇంటికి 40 మంది సీబీఐ అధికారులు
- అదుపులోకి తీసుకొన్న బెంగాల్ పోలీసులు.. సీబీఐ కార్యాలయాల ముట్టడి
- వెంటనే రంగంలోకి దిగిన సీఆర్పీఎఫ్ బలగాలు.. సీబీఐ ఆఫీసులకు కాపలా
- కేంద్రం వైఖరికి నిరసనగా ధర్నాకు దిగిన సీఎం మమతాబెనర్జీ
- బెంగాల్ ప్రభుత్వంపై సుప్రీంకోర్టుకు ఫిర్యాదు చేస్తామన్న కేంద్రం

కోల్‌కతా, ఫిబ్రవరి 3: చిట్‌ఫండ్ కుంభకోణాలకు సంబంధించిన కేసుల దర్యాప్తులో కేంద్రం, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ప్రత్యక్ష పోరుకు దిగాయి. కేసు దర్యాప్తులో భాగంగా కోల్‌కతా నగర పోలీస్ కమిషనర్‌ను ప్రశ్నించేందుకు వచ్చిన సీబీఐ అధికారులను రాష్ట్ర పోలీసులు అడ్డుకోవడం కలకలం రేపింది. సీబీఐ అధికారులను అడ్డుకోవడమే కాకుండా వారి పట్ల దురుసుగా ప్రవర్తిస్తూ, బలవంతంగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించడం ఉద్రిక్తతలకు దారితీసింది. ఆ తరువాత వెంట వెంటనే పలు నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. సీబీఐ అధికారులు కమిషనర్ ఇంటికి వచ్చారన్న విషయం తెలుసుకున్న సీఎం మమతా బెనర్జీ హుటాహుటిన అక్కడికి తరలివచ్చారు. కమిషనర్ రాజీవ్‌కుమార్‌కు మద్దతు ప్రకటించిన దీదీ, మోదీ సర్కార్ తమపై ప్రతీకార రాజకీయాలకు పాల్పడుతున్నదని ఆరోపించారు. కేంద్రం వైఖరిని నిరసిస్తూ రాత్రి తొమ్మిది గంటల సమయంలో మెట్రో సినిమా థియేటర్ వద్ద ధర్నాకు దిగారు. మరోవైపు రాష్ట్ర పోలీసులు కోల్‌కతాలోని సీబీఐ కార్యాలయాన్ని, జాయింట్ డైరెక్టర్ ఇంటిని చుట్టు ముట్టారు. ఈ విషయాన్ని జాయింట్ డైరెక్టర్ పంకజ్ శ్రీవాస్తవ కేంద్రానికి తెలియజేశారు. దీంతో వెంటనే సీఆర్పీఎఫ్ బలగాలు రంగంలోకి దిగి సీబీఐ కార్యాలయం, జాయింట్ డైరెక్టర్ ఇంటి వద్ద మోహరించాయి. మరోవైపు సీబీఐకి వ్యతిరేకంగా తృణమూల్ కాంగ్రెస్ కార్యకర్తలు వీధుల్లోకి వచ్చి ప్రదర్శనలు నిర్వహించారు. అదుపులోకి తీసుకున్న



శారదా చిట్‌ఫండ్ స్కాంలో కోల్‌కతా సీపీని ప్రశ్నించేందుకు వచ్చి అరెస్టయిన సీబీఐ అధికారులు

మిగతా 5వ పేజీలో

ఓటాన్ అకౌంట్‌లోనే కేటాయింపులు!

- ఎన్నికల హామీల అమలుపై అధికారుల కసరత్తు
- ఉన్నతస్థాయి సమీక్షలు నిర్వహించిన సీఎం కేసీఆర్
- కొత్త జిల్లాల ఏర్పాటుకు ఇప్పటికే డ్రాఫ్ట్ నోటిఫికేషన్
- పింఛన్లు, పంటపెట్టుబడి పెంపుపై ప్రతిపాదనలు
- ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లోనే పొందుపరిచే అవకాశం
- వయోపరిమితి తగ్గింపుతో మరో 20 లక్షల మంది పింఛన్‌దారులకు లబ్ధి.. బడ్జెట్‌లో అదనంగా 5 వేలకోట్లు

హైదరాబాద్,నమస్తే తెలంగాణ:



ఎన్నికల ప్రచారం సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేదిశగా కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఇప్పటికే ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు పలుమార్లు ఉన్నతస్థాయి సమీక్షా సమావేశాలు నిర్వహించారు. హామీల అమలు, నిధుల కేటాయింపునకు సంబంధించిన ప్రతిపాదనలు రూపొందించి ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లోనే పొందుపర్చాలని ఆదేశించారు. సీఎం కేసీఆర్ ఎన్నికల ప్రచారం సందర్భంగా నారాయణపేట, ములుగు బహిరంగసభల్లో ఆ ప్రాంతాలు కేంద్రంగా కొత్త జిల్లాలు ఏర్పాటుచేస్తానని ప్రకటించారు. ఎన్నికల ప్రక్రియ పూర్తికాగానే రెవెన్యూ అధికారులతో ప్రత్యేకంగా సమీక్షా సమావేశం నిర్వహించి నారాయణపేట, ములుగు కొత్త జిల్లాల ఏర్పాటుకోసం డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. దీనిపై వచ్చిన సలహాలు, సూచనలను అధికారులు పరిశీలిస్తున్నారు. పది, పదిహేను రోజుల్లో ములుగు, నారాయణపేట జిల్లాలను అధికారికంగా ఏర్పాటుచేస్తూ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉన్నది. గ్రామాలకు స్వయంపాలన

మిగతా 8వ పేజీలో



జయరాం కేసులో రోజుకో ట్విస్ట్!

కుక్కను చంపే విషంతో హత్య?

- జయరాంతో వివాహేతర సంబంధం
- విచారణలో శిఖాచౌదరి వెల్లడి!
- జయరాంను రాకేశ్ హత్యచేశాడని ఆరోపణ
- శిఖాకు పలువురితో సంబంధాలున్నాయన్న రాకేశ్!
- హైదరాబాద్‌లోని మహాప్రస్థానంలో ముగిసిన జయరాం అంత్యక్రియలు

8

కేసీఆర్ కిట్ల లబ్ధిదారులు
నాలుగు లక్షలు

సమర్థంగా అమలవుతున్న పథకం

సర్కారు దవాఖానల్లో పెరిగిన ప్రసవాలు

జాతీయ నాణ్యతా ప్రమాణాల తనిఖీ బృందం ప్రశంసలు

3

కఠినంగా అటవీ చట్టం

అన్ని కేసుల్లో నాన్‌బెయిలబుల్ సెక్షన్లు నమోదు

నేరస్థులు భయపడేలా చట్టంలో మార్పులు.. రెండురోజుల్లో ప్రభుత్వానికి ప్రతిపాదనలు

వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో చట్టసవరణకు చర్యలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

కలప స్మగ్లింగ్‌కు పాల్పడినా, విలువైన సంపదను దోచుకున్నా, అటవీ స్థలాలు కబ్జాచేసినా మూడేండ్ల నుంచి పదేండ్ల వరకు జైలుశిక్ష విధించేలా రాష్ట్ర ప్రభుత్వం అటవీ చట్టానికి పదును పెడుతున్నది. అన్ని కేసులను నాన్‌బెయిలబుల్ సెక్షన్ల కింద నమోదుచేయాలని నిర్ణయించారు. జరిమానా కూడా భారీగా పెంచడమే కాకుండా కేసుతో సంబంధం లేకుండా జైలుకు పంపేలా చర్యలు తీసుకొంటున్నారు. అడ్డదారిలో చెట్టు నరికినా మూడేండ్ల జైలు, స్మగ్లింగ్ చేసేందుకు చెట్లు నరికితే ఆరేండ్లు, అటవీ భూమి కబ్జా చేస్తే మూడు నుంచి పదేండ్ల జైలుశిక్ష విధించేలా అటవీ చట్టంలో మార్పులు తీసుకురానున్నారు. అటవీ చట్టంలో మార్పులు చేసే అధికారం రాష్ట్రానికి ఉన్నందున భారీగా మార్పులు చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. తెలంగాణ స్టేట్ ఫారెస్ట్ యాక్ట్‌కు సవరణలు చేసి వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఆమోదింపజేయాలని ప్రభుత్వం భావిస్తున్నది. నేరస్థులను ప్రాసిక్యూట్ చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలుచేసే అధికారాలను అటవీ అధికారులతోపాటు పోలీసు అధికారులకు కూడా ఇవ్వనున్నారు. దీంతో అటవీ నేరగాళ్లను అరెస్టు చేసి అక్రమ కలపను సీజ్‌చేసే అధికారం అటవీ శాఖతోపాటు పోలీసులకు లభిస్తుంది. అటవీ సంపద రక్షణకు కఠినచర్యలు తీసుకోవాలని, అడవుల నుంచి పూచికపుల్ల కూడా బయటకు వెళ్లడానికి వీలులేదని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఇటీవల సమీక్ష సందర్భంగా అధికారులను ఆదేశించారు. అవసరమైతే అటవీ చట్టాలను కఠినతరం చేయాలని సూచించారు. దాంతో

ప్రతిపాదిత శిక్షలివే!

అక్రమంగా చెట్టు నరికితే	మూడేండ్లు
స్మగ్లింగ్ చేసేందుకు చెట్లు నరికితే	ఆరేండ్లు
అటవీ భూమి కబ్జా చేస్తే	3 నుంచి పదేండ్లు

మిగతా 8వ పేజీలో





యాదాద్రి భువనగిరి జిల్లాలోని యాదాద్రి పుణ్యక్షేత్రం, టెంపుల్ సిటీ నిర్మాణ పనుల ఏరియల్ వ్యూ

ఫొటో సౌజన్యం: జోగినిపల్లి సంతోష్‌కుమార్, రాజ్యసభ సభ్యుడు



ఆదివారం యాదాద్రి పుణ్యక్షేత్ర నిర్మాణ పనులను పరిశీలించేందుకు వచ్చిన సీఎం కేసీఆర్‌కు స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో గీత, ఆలయ అధికారులు

శాశ్వతంగా నిలిచిపోవాలి

యాదాద్రిని అణువణువూ పరిశీలించిన సీఎం కేసీఆర్ • వెయ్యేండ్లలో ఎవరూ చేయనివిధంగా నిర్మాణం చేపట్టాలి • తొందర, తొట్రుపాటులేకుండా పనులు చేయాలి

దక్షిణంవైపు నిర్మాణాలపై పలు సూచనలు చేసిన సీఎం • శివాలయం శిల్పి పనులపై సంతృప్తి • యాదాద్రికొండపై ముఖ్యమంత్రి కేసీఆర్ విహంగవీక్షణం

యాదాద్రి భువనగిరి జిల్లాప్రతినిధి, నమస్తే తెలంగాణ: యాదాద్రిపై విహంగవీక్షణం.. కొండపై రాజగోపురాలు, ప్రాకారాలు అణువణువు పరిశీలన.. పనులు బాగా జరిగినచోట ప్రశంస.. జరుగనిచోట సుతిమెత్తగా మందలింపు.. ఆలయస్వామిని పాంచరాత్ర ఆగమశాస్త్రానుసారమే పనులు జరుగాలనే తపన.. వెయ్యేండ్లలో ఎవరూచేయని విధంగా నిర్మాణాలు చేపట్టాలని సూచనలు.. ఆదివారం యాదాద్రిలో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు పర్యటన సాగిందిలా. 14నెలల తరువాత సీఎం కేసీఆర్ ఆదివారం యాదాద్రికి వచ్చారు. రెండోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక తొలిసారి యాదాద్రికి వచ్చిన కేసీఆర్‌కు ఎంపీ బూర నర్సయ్యగౌడ్, ఎమ్మెల్యేలు జీ జగదీశ్‌రెడ్డి, గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, గాదరి కిశోర్, పైళ్ల శేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు ఎలిమినేటి కృష్ణారెడ్డి, కర్నె ప్రభాకర్, టీఆర్‌ఎస్ నేత ఉమామాధవరెడ్డి, కలెక్టర్ అనితారామచంద్రన్, సీపీ మహేశ్‌భగవత్, వైటీడీఏ వైస్‌చైర్మన్ కిషన్‌రావు ఘనస్వాగతం పలికారు. యాదాద్రి ఆలయ ప్రధానార్చకుడు నల్లంథీగల్ లక్ష్మీనరసింహాచార్యుల ఆధ్వర్యంలో వేదపండితులు పూర్ణకుంభస్వాగతం పలికారు. స్వామివారికి పూజలు చేసిన అనంతరం కేసీఆర్ ఆలయ పునర్నిర్మాణ పనుల పరిశీలన చేపట్టారు.

యాదాద్రి చుట్టూ విహంగవీక్షణం

ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదివారం బేగంపేట విమానాశ్రయం నుంచి హెలికాప్టర్ ద్వారా 11.15 గంటలకు యాదాద్రికి చేరుకొన్నారు. తొలుత యాదాద్రి చుట్టూ విహంగవీక్షణం చేశారు. ప్రధానాలయం ఉన్న గుట్టతోపాటు, టెంపుల్‌సిటీగా అభివృద్ధి చేస్తున్న పెద్దగుట్ట, ప్రెసిడెన్షియల్ సూట్లు నిర్మించనున్న గుట్టను హెలికాప్టర్ ద్వారా పరిశీలించారు. కొండపై దిగిన వెంటనే బాలాలయంలో శ్రీలక్ష్మీనరసింహస్వామివారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకులు నల్లంథీగల్ లక్ష్మీనర్సింహాచార్యులు, కారంపూడి నర్సింహాచార్యుల ఆధ్వర్యంలో వేదపండితులు ముఖ్యమంత్రికి ఆశీర్వచనం జరిపారు. అనంతరం ప్రధాన దేవాలయం పునర్నిర్మాణం పనులను పరిశీలించారు. మండపాలు, గర్భగుడి, బాహ్య, అంతర్ ప్రాకారాలు, మాడవీధులు, రథశాల, వ్రతమండపం, ధ్వజస్తంభం, ప్రసాదం కౌంటర్లు, శివాలయం పనులను పరిశీలించారు. ప్రధానాలయం ఉన్నప్రాంతంలో 14.5 ఎకరాల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఆ తరువాత టెంపుల్ సిటీగా అభివృద్ధి చేస్తున్న గుట్టను సందర్శించి, పనులను పరిశీలించారు. రెండుగుట్టలను కవర్ చేస్తూ బౌటరింగ్ రోడ్డును నిర్మాణం చేస్తామని చెప్పారు. యాదాద్రి దేవాలయ పునర్నిర్మాణ పనులన్నింటినీ సమాంతరంగా చేపట్టాలని ఆదేశించారు. వందల ఏండ్లపాటు నిలిచిపోయే శాశ్వత నిర్మాణం కాబట్టి ఎలాంటి తొందరపాటు.. తొట్రుపాటు లేకుండా పనులు నిర్వహించాలని సూచించారు. నాణ్యత విషయంలో రాజీపడవద్దని పేర్కొన్నారు.

దక్షిణంవైపు నిర్మాణాలపై సూచనలు

ప్రధానాలయం ప్రాకారం నిర్మాణం పనుల పరిశీలన అనంతరం సీఎం కేసీఆర్ కొండపై జరుగుతున్న విస్తరణపనులను పరిశీలించారు. దక్షిణం వైపు జరుగుతున్న పనులపై 25 నిమిషాలపాటు ఆరాతీశారు. దక్షిణగోపురం, వాహనశాల, సహస్రదీపాలంకరణ నిర్మాణాలను పరిశీలించారు. దక్షిణభాగంలో కొండను ఆనుకుని జరుగుతున్న ల్యాండ్ స్కేపింగ్‌ను ఇంకా సుందరంగా తీర్చిదిద్దాలని ఆర్కిటెక్ట్ ఆనందసాయిని ఆదేశించారు. రక్షణగోడను పెంచేందుకు వేసిన నాలుగు కాంక్రీట్‌పిల్లర్లను వెంటనే తొలగించాలని సూచించారు. అక్కడినుంచి పడమర భాగానికి చేరుకొన్నారు. సప్తతల రాజగోపురం నిర్మాణంపై సంతృప్తి వ్యక్తంచేశారు. కృష్ణశిలలతో ఆలయం నుంచి మహానాశిక వరకు ప్రపంచంలో ఎక్కడా రాజగోపురాలను నిర్మించలేదని స్థపతి డాక్టర్ ఆనందాచారివేలు ముఖ్యమంత్రికి నివేదించారు. దీంతో సీఎం కేసీఆర్ చాలా బాగా వచ్చిందంటూ ప్రశంసించారు. ఉత్తరభాగంలో నిర్మిస్తున్న శ్రీసత్యనారాయణవ్రత మండపాల విషయంలో పలు సూచనలు చేశారు. వ్రతమండపాల నిర్మాణం కోసం వేసిన నాలుగు పిల్లర్ల వల్ల ఈశాన్యం నుంచి కొండను చూసేవారికి మహారాజగోపురాలు కనిపించడంలేదని.. అదేవిధంగా ఈశాన్యంలో బరువు ఎక్కువగా ఉండకూడదని రాష్ట్ర ప్రభుత్వ వాస్తు సలహాదారు సుద్దాల సుధాకర్‌తేజ కూడా సలహా ఇవ్వడంతో వాటిని తొలగించాలని సీఎం ఆదేశించారు.

శివాలయం శిల్పి పనులపై సీఎం సంతృప్తి

శివాలయం పనులు జరుగుతున్న తీరుపై సీఎం సంతృప్తిని వ్యక్తంచేశారు. ప్రాకారం పనులు బాగున్నాయని అన్నారు. శిల్పి పనులు చక్కగా ఉన్నాయని ప్రశంసించిన కేసీఆర్ పనుల్లో వేగం పెంచాలని సూచించారు. తొగుట పీఠాధిపతి సూచించిన ప్రకారం పనులు జరుగుతున్నాయా? అని ఆరాతీశారు.

అద్భుతంగా మహామండపం: సీఎం ప్రశంస

శిల్పులు చెక్కిన ఆళ్వార్ స్తంభాలు.. తెలంగాణ సంస్కృతిని చాటిచెప్పే కాకతీయ స్తంభాలు అద్భుతంగా ఉన్నాయని సీఎం కేసీఆర్ ప్రశంసించారు. మహామండపాన్ని నిశితంగా పరిశీలించారు. మహామండపం లోపలికి వెళ్లడం, ఉపాలయాలతోపాటు, క్షేత్రపాలక ఆంజనేయస్వామి దర్శనం ఎలా జరుగుతుందనే విషయాలపై చర్చించారు. ఆలయంలో క్యూలైన్లు, భక్తులు బయటకు వెళ్లే మార్గాలు ఎలా ఉంటాయనేది పరిశీలించారు. లిఫ్టులు ఎక్కడ ఏర్పాటుచేస్తారు? వాటివల్ల భక్తులకు కలిగే ప్రయోజనాలను అడిగితెలుసుకున్నారు. మండల పూజలు చేసే భక్తులు శ్రీవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసేతీరును కూడా పరిశీలించారు.

అన్నదానసత్రం కోసం రూ.10కోట్లు విరాళం

యాదాద్రిలో అన్నదాన సత్రం నిర్మాణం కోసం హైదరాబాద్, విశాఖపట్నంలో స్వచ్ఛంద కార్యక్రమాలు నిర్వహిస్తున్న రాజు వేగేశ్న ఫౌండేషన్ సభ్యులు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు రూ.10 కోట్లు విరాళం అందించారు. ఫౌండేషన్ అధ్యక్షుడు ఆనంతకోటి రాజు, కార్యదర్శి ఆనంద రాజు ఆధ్వర్యంలో ఫౌండేషన్ సభ్యులు యాదాద్రిలో ముఖ్యమంత్రి కేసీఆర్‌కు చెక్కురూపంలో విరాళం అందజేశారు. సత్రం నిర్మాణానికి ఇంకా ఎక్కువ వ్యయం అయినా భరిస్తామని ఈ సందర్భంగా హామీఇచ్చారు. యాదాద్రిలో అతిథిగృహాల నిర్మాణం చేసేందుకు రూ. 2 కోట్లు చొప్పున విరాళం ఇచ్చేందుకు 43 మంది ముందుకొచ్చారని ముఖ్యమంత్రి ప్రకటించారు. వారందరికీ ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. సాయంత్రం 5.40 గంటలకు సీఎం కేసీఆర్ హైదరాబాద్ బయలుదేరివెళ్లారు.



యాదాద్రి ఆలయ నిర్మాణ పనులను కాలినడకన తిరుగుతూ పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో ఎంపీ బూర నర్సయ్యగౌడ్, ఎమ్మెల్యే సునీతామహేందర్‌రెడ్డి, ఈవో గీత, ఆర్కిటెక్ట్ ఆనందసాయి తదితరులు కూడా ఉన్నారు.



ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావును ఆశీర్వదిస్తున్న యాదాద్రి ఆలయ పండితులు. చిత్రంలో ఎంపీ జోగినిపల్లి సంతోష్‌కుమార్, ఎమ్మెల్యేలు గొంగిడి సునీత, గాదరి కిశోర్, పైళ్ల శేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, ఆలయ ఈవో గీత తదితరులు కూడా ఉన్నారు.

ముహూర్తం

సూర్యోదయం: 6.51 గంటలకు

సూర్యాస్తమయం: 6.09 గంటలకు

వికంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, అమావాస్య, నక్షత్రం: శ్రవణం, అమృతఘడియలు: సాయంత్రం 6.17 నుంచి రాత్రి 7.53 వరకు, రాహుకాలం ఉదయం 8.16 నుంచి 9.41 వరకు, దుర్ముహూర్తం: మధ్యాహ్నం 12.07 నుంచి 12.53 వరకు, తిరిగి మధ్యాహ్నం 3.08 నుంచి 3.53 వరకు, వర్జ్యం: ఉదయం 7.27 నుంచి 9.03 వరకు.

యాదాద్రికి విశ్వఖ్యాతి

మొదటిపేజీ తరువాయి...

యాదాద్రి సందర్శనకు వస్తానని చెప్పారు. తొలుత యాదాద్రిపై హెలికాప్టర్‌లో విహంగ వీక్షణం చేశారు. కొండపై మహారాజ గోపురాలు, ప్రాకారాలను అణువణువు పరిశీలించారు. అనంతరం పెద్దగుట్టపై నిర్మాణమవుతున్న టెంపుల్‌సిటీలో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. కేవలం శని, ఆదివారాల్లోనే 70 వేలమంది భక్తులు వస్తున్నారంటే ఈ ఆలయానికి ఎంత మహిమ ఉందో అర్థమవుతున్నదన్నారు. ఇంత గొప్పక్షేత్రం సమైక్య రాష్ట్రంలో వివక్షకు గురైందని ఆవేదన వ్యక్తంచేశారు. మన ఆలయాలను, సంస్కృతిని, సంస్కారాన్ని కాపాడుకునేందుకు ఆరాటపడుతున్నామని తెలిపారు. యాదాద్రి దేవాలయాన్ని మరింత అద్భుతంగా తీర్చిదిద్దేందుకు గొప్పగా నిర్మాణ పనులు చేపట్టామని చెప్పారు.

విస్తరణ పనుల్లో మరింత వేగం

ఆలయ విస్తరణ పనుల్లో వేగం మరింత పెంచాల్సిన అవసరం ఉన్నదని సీఎం కేసీఆర్ చెప్పారు. మండపాలు, గోపురాలు, పురవీధుల పనులు అద్భుతంగా ఉన్నాయన్నారు. గాలిగోపురం పూర్తిగా శిలలతోనే నిర్మిస్తున్నామని వివరించారు. శివాలయం, గర్భాలయం, మండప నిర్మాణంతోపాటు అన్ని ప్రాంతాల్లో కృష్ణ శిలలను వాడుతున్నామని చెప్పారు. పనులు పూర్తయ్యాక అద్భుతమైన దివ్యక్షేత్రంగా యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం భక్తులకు సాక్షాత్కారం అవుతుందని తెలిపారు. ఆలయ విస్తరణ పనులకు 173 ఎకరాల భూమిని సేకరిస్తున్నామని, ఇందుకు రూ.70 కోట్లు మంజూరుచేశామని సీఎం చెప్పారు. ఇందులో ఉత్తరభాగంలో ఆలయ కిందివైపు 30 ఎకరాలు గండిచెరువు కింద ఉన్నదని, ఈ చెరువును స్వామివారి తెప్పోత్సవానికి ఉపయోగిస్తామని వెల్లడించారు. జూన్‌లో కాళేశ్వరం నుంచి యాదాద్రి కొండ కింద యాదగిరిపల్లిలో ఉన్న గండిచెరువులోకి స్వచ్ఛమైన నీళ్లు వస్తాయని చెప్పారు. చెరువుల చుట్టు చెట్లు, లైట్లతోపాటు రోడ్డుతో అందంగా తీర్చిదిద్దుతామని, స్వచ్ఛమైన నీటితోకూడిన గండిచెరువును స్వామివారి తెప్పోత్సవానికి ఉపయోగిస్తామని వివరించారు.

నిత్యాన్నదాన సత్రానికి రూ.10 కోట్లు

143 ఎకరాల్లో భక్తులకు నిత్యాన్నదానం సత్రం, బస్‌స్టేషన్, కారు పార్కింగ్, మార్కెట్, క్యూ కాంప్లెక్స్ వంటివి నిర్మిస్తామని సీఎం కేసీఆర్ చెప్పారు. ఇందుకు ఆనందరాజు రూ.10 కోట్ల విరాళం అందజేశారని, మరింత విరాళం ఇచ్చేందుకూ సిద్ధంగా ఉన్నారన్నారు. 15 రోజుల్లో మళ్లీ వస్తానని, చిన్నజీయర్‌స్వామివారిని తీసుకొస్తానని చెప్పారు. ఆలయ నిర్మాణం ఆగమశాస్త్రం ప్రకారం జరుగుతున్నదని స్పష్టం చేశారు. కొద్దిమార్పులు తప్ప పనుల్లో ఎలాంటి మార్పులేదని తెలిపారు. ఆలయం బయట పశ్చిమభాగంలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై ఆలయ అధికారులతో మాట్లాడినట్టు చెప్పారు.



ఆదివారం యాదాద్రిలో మీడియాతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్. చిత్రంలో మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి, ఎంపీలు బూర నర్సయ్యగౌడ్, బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్యేలు సునీతా మహేందర్‌రెడ్డి, కంచర్ల భూపాల్ రెడ్డి, గాదరి కిశోర్, ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, టీఆర్‌ఎస్ నేత ఉమామాధవరెడ్డి తదితరులు కూడా ఉన్నారు.

వెయ్యి ఎకరాల్లో టెంపుల్‌సిటీ

యాదాద్రి టెంపుల్‌సిటీ 1,100 ఎకరాల్లో ఉంటుందని సీఎం కేసీఆర్ తెలిపారు. ఇప్పటికే 832 ఎకరాలు తమ స్వాధీనంలో ఉన్నదని, మరో 250 ఎకరాలు టెంపుల్ వద్ద ఉన్నట్టు చెప్పారు. 354 అధునాతన కాటేజీలు నిర్మించేందుకు 250 ఎకరాల్లో లేఔట్ తయారుచేశామని తెలిపారు. ఒక్కొక్క కాటేజీని రూ.2 కోట్లు, రూ.కోటి, రూ.50 లక్షలు, రూ.25 లక్షలతో నిర్మించేలా లేఔట్ చేశామని చెప్పారు. రూ.2 కోట్లు ఇచ్చి కాటేజీలు నిర్మింపజేయడానికి 43 మంది దాతలు మందుకు వచ్చారని సీఎం కేసీఆర్ వెల్లడించారు. నిర్మాణానికి సహకరించే దాతలకు సముచితస్థానం ఇస్తామని చెప్పారు. క్వార్టర్లను బ్లాకులవారీగా నిర్మిస్తామని, ఒక్కో బ్లాక్‌కు లక్ష్మీనరసింహ, ప్రహ్లాద, అలివేలుమంగ వంటి పేర్లు పెడుతామని తెలిపారు. టెంపుల్‌టౌన్ సర్వాంగ సుందరంగా ఉండేలా, ఒకమొగ్గలా, పువ్వులా నిర్మిస్తామని చెప్పారు.

ప్రపంచంలో యూనిక్‌గా యాదాద్రి

యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయం ప్రపంచంలోనే ఒక యూనిక్ టెంపుల్‌గా ఉండబోతుందని సీఎం కేసీఆర్ తెలిపారు. ఇది రెండు, మూడునెలల్లో నిర్మించేది కాదని అన్నారు. పవిత్ర పుణ్యక్షేత్రమైన యాదాద్రిని పూర్తిగా కృష్ణశిలలతో నిర్మిస్తున్నామని చెప్పారు. ఏడంతస్థుల రాజగోపురాలు సైతం కృష్ణశిలలతో నిర్మించామన్నారు. మండపాలు, టెంపుల్ సంపద చూస్తే ఆషామాషీగా ఉండబోదని అన్నారు. దేవాలయాలు ఒక తరం నుంచి మరో తరానికి సంస్కారం, సంస్కృతిని అందించే గొప్ప కమ్యూనిటీ సంస్థలని సీఎం పేర్కొన్నారు. కొంత మంది నాస్తికులు పిచ్చిపిచ్చి మాటలు మాట్లాడుతున్నారని, వాటిని నమ్మొద్దని కోరారు.

నాడు అష్టాదశ శక్తిపీఠం జోగుళాంబపై తీవ్రవివక్ష

‘ఉద్యమ సమయంలో చెప్పాను.. సమైక్య పాలనలో మా నదులు మాకు కాలె, మా పుష్కరాలు మాకు కాలేదన్నాను.. 100 శాతం ఇది నిజమన్నాను. మా దేవతలను దేవుళ్లుగా చూడలేదని చెప్పాను.. ఇందుకు ఒక ఉదాహరణ చెప్తాను.. అష్టాదశ శక్తిపీఠాల్లో ఒకటి శ్రీలంకలో ఉన్నది. ఈ అమ్మవారు ఉపాసన చేసేవారు 18 శక్తి పీఠాల్లో ఉపాసన చేయాలి. అలా చేస్తే సంపూర్ణ ఉపాసకులుగా పిలువబడుతారు. అలా చేసేవారు చండీయాగాలు చేసేందుకు అర్హులుగా ఉంటారు. అష్టాదశ శక్తిపీఠాల్లో గద్వాల జిల్లా అలంపూర్‌లోని జోగుళాంబ ఆలయం కూడా ఒకటి. అలాంటి మహాశక్తిపీఠం నాటి సమైక్య పాలకులవల్ల తీవ్ర వివక్షకు గురైంది. 60 ఏండ్లుగా అక్కడికి వచ్చే ఉపాసకులకు సైతం మౌలిక వసతులు కల్పించలేదంటే తెలంగాణ రాష్ట్ర దేవాలయాలపై ఆంధ్రా నేతల వివక్ష ఎంతో ఉందో అర్థమవుతుంది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. జోగుళాంబలో వసతులు కల్పించాం. ఇప్పుడు ప్రతిరోజు జోగుళాంబను 30 వేలమంది భక్తులు దర్శించుకుంటున్నారు’ అని సీఎం కేసీఆర్ చెప్పారు. మీడియా సమావేశంలో ఎంపీలు జోగినిపల్లి సంతోష్‌కుమార్, డాక్టర్ బూర నర్సయ్యగౌడ్, బడుగుల లింగయ్యాయాదవ్, ఎమ్మెల్యేలు జగదీశ్‌రెడ్డి, గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డి, పైళ్ల శేఖర్‌రెడ్డి, గాదరి కిశోర్, మర్రి జనార్దన్‌రెడ్డి, కంచర్ల భూపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీలు ఎలిమినేటి కృష్ణారెడ్డి, కర్నె ప్రభాకర్, మాజీమంత్రి ఉమామాధవరెడ్డి, స్పెషలాఫీసర్ జీ కిషన్‌రావు, కలెక్టర్ అనితారామచంద్రన్, రాచకొండ సీపీ మహేశ్‌భగవత్, డీసీపీ రామచంద్రారెడ్డి, ఆలయ ఈవో ఎన్ గీత పాల్గొన్నారు.

60 ఎకరాల్లో ప్రవచన మండపాలు

143 ఎకరాల్లో బస్టాండ్, క్యూకాంప్లెక్స్, అన్నదాన సత్రాలు, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాక మిగిలిన భూమిలో 50 నుంచి 60 ఎకరాల్లో ప్రవచన మండపాలు నిర్మిస్తామని కేసీఆర్ తెలిపారు. బ్రహ్మోత్సవాల సమయంలో కొండపైన కల్యాణోత్సవానికి స్థలం సరిపోకపోతే కింద నిర్వహించేలా ప్రవచన మండపాలు నిర్మించి ఉపయోగిస్తామని చెప్పారు. త్వరలో డిజైన్ పనులు పూర్తి చేస్తామని తెలిపారు.

బస్వాపూర్ ప్రాజెక్టువద్ద హోటళ్లు, థియేటర్లు

గంధమల్ల, బస్వాపూర్ రిజర్వాయర్ల పనులను పూర్తి చేస్తామని సీఎం కేసీఆర్ తెలిపారు. బస్వాపూర్‌లో అద్భుతమైన కన్వెన్షన్ సెంటర్లు, సినిమా థియేటర్లను నిర్మిస్తామని చెప్పారు. బస్వాపూర్ ప్రాజెక్టు కింద 260 ఎకరాల్లో స్టార్ హోటళ్లను, హైదరాబాద్‌లోని హెచ్‌ఐసీసీ మాదిరిగా భవనాలను నిర్మిస్తామన్నారు. గంధమల్ల ప్రాజెక్టులో బోటింగ్ సౌకర్యం ఉంటుందని తెలిపారు. హైదరాబాద్‌కు అతి సమీపంలో ఉన్న యాదాద్రి క్షేత్రం, భువనగిరి ఖిల్లా, కొలనుపాక, జైన దేవాలయాలను ఉమ్మడి లింక్ పర్యాటక కేంద్రాలుగా మార్చనున్నామని చెప్పారు. యాదాద్రికి వచ్చేవాళ్లు ఈ ప్రాంతంలో మరో రెండురోజులు ఉండేలా అన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు.

రింగురోడ్డు.. 16 ప్రెసిడెన్షియల్ సూట్లు

యాదాద్రికి రింగురోడ్డు మంజూరు చేశామని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని సీఎం కేసీఆర్ చెప్పారు. ఇందుకు కావాల్సిన భూసేకరణ పనులు త్వరలో పూర్తవుతాయన్నారు. వీవీఐపీలకోసం 16 ప్రెసిడెన్సియల్ సూట్స్ నిర్మిస్తామన్నారు. ఆలయ ఉద్ఘాటన సమయంలో రాష్ట్రపతి, దేశనాయకులు, ఇతర రాష్ట్రాల నాయకులు, మన రాష్ట్రంలో ముఖ్య నేతలు హాజరవుతారని, వారికి కావాల్సిన వసతులు కల్పించేలా అద్భుతమైన సూట్ల నిర్మాణం చేపడుతామని చెప్పారు.

లోకం పోకడ



వామ్మో బాబును ఆదర్శంగా తీసుకుంటే మాకు పెండ్లిండ్లుకావు మేడం.. పిల్లనివ్వడానికి ఏమామా ముందుకు రాడు!!



మేడారంలో సందడి

ఆదివాసీ గిరిజన దైవాలు మేడారం సమ్మక్క-సారక్కను ఆదివారం పెద్దఎత్తున భక్తులు దర్శించుకున్నారు. రాష్ట్రంనుంచే కాకుండా ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ నుంచి భక్తులు తరలివచ్చి జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించి సమ్మక్క-సారక్క, గోవిందరాజు, పగిడిద్దరాజుల గద్దెలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఛత్తీస్‌గఢ్ ఎక్సైజ్‌శాఖ మంత్రి కవ్వాసి లక్మా, బీజాపూర్ ఎమ్మెల్యే విక్రమ్ మాండవి, పీసీసీ మెంబర్ అజయ్ సింగ్, భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య, ములుగు ఎమ్మెల్యే సీతక్క అమ్మవారిని దర్శించుకున్నారు.

– తాడ్వాయి (జయశంకర్ భూపాలపల్లి)



అంతర్జాతీయ తెలుగు మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి రెండు, మూడు తేదీల్లో మలేషియా తెలుగు సంఘం, ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మలేషియాలో నిర్వహించే ప్రపంచ తెలుగు మహిళా సదస్సుకు హాజరుకావాలని ఆయా సంఘాల ప్రతినిధులు నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవితను కోరారు. ఆదివారం హైదరాబాద్‌లో ఆమెను కలిసి ఆహ్వాన లేఖ అందజేశారు. ఈ సందర్భంగా తెలుగు మహిళా తేజం ప్రత్యేక సంచిక కవర్‌పేజీని కవిత ఆవిష్కరించారు. కార్యక్రమంలో సదస్సు నిర్వహణ అధ్యక్షుడు వినయ్‌కుమార్, కార్యవర్గసభ్యులు జపన్యా, కోమల్‌రాణి, ప్రమీల, జ్యోత్స్న, రాజేజ్ పాల్గొన్నారు. – **గోల్నాక**

కేసీఆర్ కిట్ల లబ్ధిదారులు నాలుగు లక్షలు

సమర్థంగా అమలవుతున్న పథకం సర్కారు దవాఖానల్లో పెరిగిన ప్రసవాలు

జాతీయ నాణ్యతా ప్రమాణాల తనిఖీ బృందం ప్రశంసలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

మాతా, శిశు మరణాల నియంత్రణ, ప్రసవాలు ప్రభుత్వ దవాఖానల్లో జరిగేలా చేపట్టిన చర్యల్లో భాగంగా సర్కారు ప్రవేశపెట్టిన కేసీఆర్ కిట్ల పథకం రాష్ట్రంలో సమర్థంగా అమలవుతున్నది. ఇప్పటికే ఈ పథకాన్ని దేశంలోని పలు రాష్ట్రాలు అమలుచేసేందుకు సిద్ధమవుతున్నాయి. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తున్న కేసీఆర్ కిట్ల పథకం అమలు తీరుకు జాతీయస్థాయిలో ప్రశంసలు అందుతున్నాయి. తాజాగా ఈ పథకాన్ని జాతీయ నాణ్యతా ప్రమాణాల తనిఖీ బృందం ప్రశంసించింది. ఇటీవల కరీంనగర్ జిల్లా గంగాధరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ఈ బృందం కేసీఆర్ కిట్‌ను చూసి ఆశ్చర్యం వ్యక్తంచేసింది. ప్రభుత్వ దవాఖానలో ప్రసవించినవారికి ఆడపిల్లపుడితే రూ.13 వేలు, మగ పిల్లాడు పుడితే రూ.12 వేలతోపాటు కేసీఆర్ కిట్ పేరిట రూ.2 వేల విలువైన 16 రకాల వస్తువులు అందజేయడాన్ని చూసిన జాతీయ బృందం తెలంగాణ ప్రభుత్వ విధానాన్ని అభినందించింది. మహిళల ఆరోగ్యానికి ఈ పథకం భరోసా కల్పిస్తున్నది. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా సర్కారు దవాఖానల్లో ప్రసవాల సంఖ్య గణనీయం పెరుగుతున్నది. 2017-18 ఆర్థిక సంవత్సరం తర్వాత.. 30 శాతం ఉన్న ప్రసవాలు 51 శాతానికి పెరిగాయి. ఈ ఆర్థిక సంవత్సరం చివరినాటికి ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాలు 58.63 శాతానికి పెరిగే అవకాశం ఉన్నదని వైద్యశాఖ అంచనాలు రూపొందించింది. 2017 జూన్ 3న కేసీఆర్ కిట్ల పథకం ప్రారంభమైన నాటినుంచి 2019 జనవరి చివరినాటికి 3,92,707 మంది బాలింతలకు లబ్ధి చేకూరింది. ఇందుకు ఇప్పటివరకు ప్రభుత్వం రూ.472.24 కోట్లు వెచ్చించింది. ఇందులో గర్భిణులు, బాలింతలకు పోషకాహారం కోసం రూ.393.50 కోట్లు ఖర్చు చేయగా, కేసీఆర్ కిట్లు అందజేసేందుకు రూ.78.74 కోట్లు వెచ్చించారు. దేశంలో మరెక్కడా లేనివిధంగా సీఎం కేసీఆర్.. 16 వస్తువులతో కూడిన కిట్ల పథకం అమలు చేస్తున్నారు. ఈ పథకం అమలు తీరును పలు రాష్ట్రాల ప్రతినిధులు సైతం పరిశీలించి ప్రశంసల వర్షం కురిపించారు.



2017 జూన్ 3న పథకం ప్రారంభం

ఇప్పటివరకు లబ్ధిపొందిన బాలింతలు **3,92,707**

ప్రభుత్వం వెచ్చించినది **472.24 కోట్లు**

తల్లీబిడ్డలకు అవసరమైన 16 వస్తువులతో కూడిన కిట్.

ప్రభుత్వ దవాఖానల్లో పెరిగిన ప్రసవాలు **30%** నుంచి **51%**

అందుబాటులో కేసీఆర్ కిట్లు

ఉన్నత లక్ష్యంతో అమలు చేస్తున్న కేసీఆర్ కిట్ల పథకం ప్రారంభమైన నాటినుంచి సకాలంలో నగదు చెల్లిస్తున్నారు. ప్రసవానంతరం కేసీఆర్ కిట్లను ఎప్పటికప్పుడు అందించేందుకు వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమశాఖ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. నవజాత శిశువుల సంరక్షణకోసం రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న కేసీఆర్ కిట్లను ప్రసవానంతరం జాప్యం లేకుండా అందించేందుకు అన్ని జిల్లా దవాఖానల్లో అందుబాటులో ఉంచారు. ఈనెల చివరివరకు ప్రభుత్వ దవాఖానల్లో జరగనున్న ప్రసవాల సంఖ్య అంచనా ప్రకారం 31 జిల్లాల పరిధిలో 20,562 కిట్లను అందుబాటులో ఉంచారు.



ఆదివారం హైదరాబాద్‌లో మాదిగ జేఏసీ, బీసీ జనసభ ఆధ్వర్యంలో జరిగిన 'భారతదేశం-రాజ్యాంగం-సమాఖ్యస్ఫూర్తి-ఫెడరల్ ఫ్రంట్ ఆవశ్యకత' అంశంపై నిర్వహించిన సదస్సులో 'తెలి రేకలు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న శాసనమండలిలో ప్రభుత్వ చీఫ్‌విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి. చిత్రంలో బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అయాచితం శ్రీధర్, టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి గట్టు రాంచందర్‌రావు, టీఆర్ఎస్ నాయకుడు పిడమర్తి రవి, బీసీ జనసభ నాయకుడు రాజారాం యాదవ్ తదితరులు కూడా ఉన్నారు.

ప్రజల కోసమే ఫ్రంట్

జిల్లా, మండల స్థాయిల్లో అవగాహన కల్పించాలి

వికేంద్రీకరణ ద్వారానే రాష్ట్రాలకు న్యాయం

ఫ్రంట్ ఆవశ్యతపై సెమినార్‌లో చీఫ్‌విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి

ఫెడరల్ ఫ్రంట్‌ను ప్రజాకోణంలో చూడాలి: బీఎస్ రాములు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

ప్రజల సంక్షేమమే లక్ష్యంగా, సమాఖ్య స్ఫూర్తితో ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటవుతున్నదని మండలిలో చీఫ్‌విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఫెడరల్ ఫ్రంట్ లక్ష్యాలు, ప్రయోజనాలపై జిల్లా, మండల స్థాయిలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉన్నదన్నారు. 'భారతదేశం-రాజ్యాంగం- సమాఖ్యస్ఫూర్తి-ఫెడరల్ ఫ్రంట్ ఆవశ్యకత' అనే అంశంపై ఆదివారం హైదరాబాద్‌లో మాదిగ జేఏసీ, బీసీ జనసభ ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాతూరి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా రిజర్వేషన్ల స్వరూపం మార్చాల్సిన అవసరం ఉన్నదన్నారు. అధికారాల వికేంద్రీకరణ ద్వారానే రాష్ట్రాలకు, ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రతిపాదించిన ఫెడరల్ ఫ్రంట్ మంచి ఫలితాలు ఇస్తుందన్నారు. ఈ ఫ్రంట్‌ను రాజకీయ కోణంలో కాకుండా ప్రజల కోణంలో చూడాల్సిన అవసరం ఉన్నదన్నారు. తెలంగాణ పుట్టుకలోనే ఫెడరల్ ఫ్రంట్ స్వభావం ఉన్నదని, కొత్త జిల్లాల ఏర్పాటులోనూ ఫెడరల్ స్ఫూర్తి ఉన్నదని చెప్పారు. ఒకవైపు వికేంద్రీకరణ కోసం పోరాడుతుంటే కేంద్ర ప్రభుత్వం కేంద్రీకరణ వైపు అడుగులు వేస్తున్నదని ఆరోపించారు. అసెంబ్లీలో మహిళలకు 33 శాతం, చట్టసభల్లో బీసీలకు 33 శాతం రిజర్వేషన్లు అమలుచేయాలని రాష్ట్రం తీర్మానం చేసినా, కేంద్రం వాటిని పక్కపెట్టిందని విమర్శించారు.

సేవ్ ఇండియా.. సేవ్ ఫెడరల్

టీఎన్జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రం రాష్ట్రాలపై గుత్తాధిపత్యం ప్రదర్శించడం పనిచేయదన్నారు. ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటును స్వాగతిస్తున్నామని, సేవ్ ఇండియా, సేవ్ ఫెడరల్ ఫ్రంట్ నినాదంతో ముందుకు పోదామని పిలుపునిచ్చారు. యూపీఏ, ఎన్డీయే ప్రభుత్వాలు ఉద్యోగులకు నష్టాలు చేశాయని ఆరోపించారు. స్వాతంత్య్రం వచ్చి 70 ఏండ్లయినా కొన్ని రాష్ట్రాల్లో ఇప్పటికీ పరాయిపాలన మాదిరిగానే ఉన్నదన్నారు. తెలంగాణ ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయని గుర్తుచేశారు. ఫెడరల్ ఫ్రంట్‌కు ఉద్యోగ సంఘాల పూర్తి మద్దతు ఉంటుందని చెప్పారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ అయాచితం శ్రీధర్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్ ప్రతిపాదిస్తూ రాజకీయ ప్రత్యామ్నాయంగా కాకుండా.. ప్రజల మౌలిక సమస్యలకు పరిష్కారంగా చూపారన్నారు. తెలంగాణ అవసరాలకు అనుగుణంగా రిజర్వేషన్లపై తీర్మానం చేసి పంపిస్తే.. కేంద్రం వాటిని పక్కకు పెట్టిందని గుర్తుచేశారు. బీసీ జనసమితి నాయకుడు రాజారాంయాదవ్ మాట్లాడుతూ స్వాతంత్య్రం వచ్చిన 70 ఏండ్లలో కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగాన్ని అభాసుపాలు చేసిందన్నారు. రాష్ట్రాలు ఇప్పటికీ కేంద్రం మీద ఆధారపడాల్సి వస్తున్నదని, అధికార వికేంద్రీకరణ, స్వయం పాలన కోసం పోరాటం చేయాలన్నారు. ప్రజాస్వామ్యం పరిపూర్ణం కావాలంటే ఫెడరల్ ఫ్రంట్ ఆవశ్యకత ఉన్నదని చెప్పారు. రమేశ్ హజారి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఆలోచన విధానాన్ని ప్రజల్లోకి తీసుకుపోవాలని, కేసీఆర్ ఇజంపై దేశవ్యాప్తంగా చర్చ జరుగాల్సి ఉన్నదన్నారు. టీఆర్ఎస్ నాయకుడు పిడమర్తి రవి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, ఓయూ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపల్ రవీందర్, ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్, ప్రొఫెసర్ రమణానాయక్, రాజేశ్ పాల్గొన్నారు.

అభివృద్ధిలో వెనుకబడ్డాం



మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ మాట్లాడుతూ, జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ బలహీనపడ్డాయని తెలిపారు. దేశంలో తయారీరంగం బలోపేతం కాలేదని, సర్వీస్ సెక్టార్‌లో మునిగిపోయామని పేర్కొన్నారు. బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్ మాట్లాడుతూ జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ ప్రజల మౌలిక సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యాయని విమర్శించారు. దేశంలో ప్రత్యామ్నాయ రాజకీయాలు, విధానాలు రావాల్సిన అవసరం ఉన్నదన్నారు. దేశంలో గత 70 ఏండ్లలో రైతులకు ఏం చేయలేదని కేంద్ర ప్రభుత్వాలు, ఇప్పుడు తెలంగాణను చూసి ఏడాదికి రూ.6 వేలు ఇస్తామని ప్రకటించే పరిస్థితి వచ్చిందన్నారు. టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి గట్టు రాంచందర్‌రావు మాట్లాడుతూ ప్రజల అవసరాల కోసం ఫ్రంట్ ఏర్పాటైతే నిలబడుతుందని, ఇప్పటివరకు ఏర్పడిన ఫ్రంట్‌లు అధికారం కోసం మాత్రమే ఏర్పడ్డాయని విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ఫ్రంట్ ఏర్పాటు చేస్తున్నామని సీఎం కేసీఆర్ అనేకసార్లు స్పష్టంచేశారని గుర్తుచేశారు. ఫెడరల్ స్టేట్ వ్యవస్థ విజయవంతమైనప్పుడు ఫెడరల్ ఫ్రంట్ ఎందుకు విజయవంతం కాదని ప్రశ్నించారు.

ఆహార విప్లవం మొదలు

- ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లపై క్షేత్రస్థాయి సర్వే పూర్తి
- రేపు జిల్లాలవారీగా నివేదికలతో ఉన్నతస్థాయి సమావేశం
- తొలిదశలో ప్రయోగాత్మకంగా జిల్లాకో పంట

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్రంలో ఆహార విప్లవం మొదలవుతున్నది. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మార్చేందుకు బహుముఖ వ్యూహంతో సీఎం కేసీఆర్ రూపకల్పన చేసిన ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటవుతున్నాయి. మహిళా సంఘాలను బలోపేతం చేయడంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో పండిన ఉత్పత్తులను విదేశాలకు మార్కెంటింగ్‌చేసేలా బృహత్ ప్రణాళికలు రచించారు. రైతులు పండించే పంటలను మహిళా సంఘాలు నేరుగా కొనుగోలు చేసి, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లలో వాటిని ప్రాసెస్ చేసి దేశ, విదేశాలకు ఎగుమతి చేయనున్నారు. దీంతో తెలంగాణ ఉత్పత్తులకు మార్కెటింగ్ అవకాశాలు, మహిళలకు ఉపాధి పెరుగనున్నది. అంతేకాదు ఈ ఉత్పత్తులను రేషన్‌డీలర్ల ద్వారా గ్రామాలకు సరఫరా చేస్తారు. ఫలితంగా రేషన్‌డీలర్లకు అదనపు కమీషన్ వస్తుంది. ఈ బృహత్ ప్రణాళికను అతిత్వరలో రాష్ట్రంలో అమలుచేసే ప్రక్రియ మొదలైంది. అధికారులు పలు అంశాలపై క్షేత్రస్థాయిలో సర్వే చేస్తున్నారు. మహిళా సంఘాలు ఇప్పటివరకు చేపట్టిన చిరువ్యాపారాలు, వాటి ఆర్థిక ప్రగతిని, ఇబ్బందులు, మార్కెటింగ్ వ్యవస్థను పరిశీలిస్తున్నారు. ఇప్పటివరకు గుర్తించిన అంశాలతో మంగళవారం ఉన్నతస్థాయి సమావేశం నిర్వహిస్తున్నారు.

మన దగ్గరే అతి పెద్ద వ్యవస్థ

రాష్ట్రంలోని మహిళాసంఘాలు అత్యధిక సభ్యులు, రుణాల చెల్లింపులో రికార్డు సాధించాయి. రాష్ట్రంలో మొత్తం 30 జిల్లా సమాఖ్యలు, 553 మండల సమాఖ్యలు, 17,750 గ్రామ సమాఖ్యలు ఉన్నాయి. మొత్తం 4,12,455 మహిళా సంఘాలు ఉండగా, 45,09,414 మంది సభ్యులుగా ఉన్నారు. మ్యాక్స్ యాక్ట్ కింద ఇంత పెద్దమొత్తంలో నమోదైన సంఘాలు మన దగ్గరే ఉండటం విశేషం. 99.01 శాతం అప్పులు చెల్లిస్తూ మిగతా రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నారు. 2014-18 మధ్య దాదాపు రూ.25 వేల కోట్లు అప్పుగా తీసుకొని, తిరిగి చెల్లించారు. పేదరిక నిర్మూల సంస్థ సర్వే ప్రకారం రుణాలు తీసుకుంటున్న మహిళల్లో దాదాపు 15,618 మంది మహిళలు చిరు వ్యాపారాలు, కుటీర పరిశ్రమలు నిర్వహిస్తున్నారు. పాపడ్, స్నాక్స్, మక్క అటుకులు, పచ్చళ్లు, సీతాఫలాల గుజ్జు, మామిడి గుజ్జు వంటివి ఉత్పత్తి చేస్తున్నారు. అయితే చాలామంది మార్కెటింగ్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేయలేక, స్థానికంగా అమ్ముకుంటున్నారు. ఈ నేపథ్యంలో సంఘాలు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రత్యమ్నాయ మార్గాలు వంటివాటిపై సెర్ప్ అధికారులు నివేదిక సిద్ధంచేశారు. ఇప్పటికే వ్యాపారంలో ఉన్న మహిళలకు ఆహారశుద్ధి యంత్రాలను అందించి, శిక్షణ ఇస్తే ఎలాంటి ఫలితాలు వస్తాయో అంచనా వేస్తున్నారు.

జిల్లా పంటల యూనిట్‌గా

గ్రామీణాభివృద్ధి అధికారులు జిల్లాల వారీగా.. అత్యధికంగా పండే పంటలు, వాటి మార్కెటింగ్ సదుపాయాలు, మద్దతు ధర, నిల్వ సామర్థ్యం వంటి అంశాలను క్షుణంగా పరిశీలించారు. ఉదాహరణకు నిజామాబాద్ జిల్లాలో వరి, మొక్కజొన్న, పసుపు పండుతున్నది. అక్కడ పసుపునకు మార్కెటింగ్ సౌకర్యం లేదు. కాబట్టి పసుపు పంటకు నిజామాబాద్ జిల్లాను యూనిట్‌గా తీసుకుని ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటుచేస్తారు. ఈ విధంగా ఆయా జిల్లాల్లో పంటల ఆధారంగా ఆహార శుద్ధి కేంద్రాలను ఏర్పాటుచేస్తారు. ఇందులో భాగంగా జిల్లాల్లో ఎలాంటి సౌకర్యాలు ఉన్నాయి? ఎంతమంది రైతులు, ఎన్ని ఎకరాల్లో పండిస్తున్నారు? దిగుబడి ఎంత? మద్ధతు ధర, నిల్వ సామర్థ్యం, మార్కెటింగ్ సౌకర్యాలు వంటి వివరాలను సేకించారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటుచేస్తే అవసరమయ్యే భూమి, మార్కెటింగ్ లోపాలు, వాటిని ఎలా సరిచేయాలి? సాంకేతిక సహకారం, ఎంతమంది సిబ్బంది అవసరం? పంటల రవాణా.. వంటి అంశాలపై ప్రాథమిక నివేదిక తయారుచేశారు.



మహబూబ్‌నగర్ జిల్లాలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో కొనసాగుతున్న పసుపు ప్రాసెసింగ్

చిరుధాన్యాల పరిశ్రమలు

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు అనుగుణంగా చిరుధాన్యాల పరిశ్రమలను ఏర్పాటుచేస్తారు. ఉత్పత్తులు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు చేరిన తర్వాత మహిళా సంఘాల సభ్యులు ప్రాసెసింగ్, మార్కెటింగ్ చేస్తారు. ఈ ప్రక్రియకు మూడు నెలలు పట్టినా.. మళ్లీ కొత్త పంట రావడానికి మరో మూడు నెలలు ఖాళీగా ఉండాల్సి వస్తున్నంది. ఈ సమయంలో వారికి ఉపాధి, అదనపు ఆదాయం కల్పించేందుకు చిరుధాన్యాల పరిశ్రమలను ఏర్పాటుచేయనున్నారు. చిరు ధాన్యాలు, పప్పు దినుసులను పండించేందుకు అనువైన భూములను గుర్తించి, రైతులను ఆ పంటల వైపు మళ్లిస్తారు. దీనిపైనా అధికారులు సర్వేచేస్తున్నారు.

రేపు ఉన్నతస్థాయి సమీక్ష

ఫుడ్ ప్రాసెసింగ్‌యూనిట్ల ఏర్పాటుపై మంగళవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించనున్నారు. గ్రామీణాభివృద్ధి అధికారులు నివేదికలతో సమావేశానికి రావాలని ఆదేశాలు ఇచ్చారు. జిల్లాలవారీగా అత్యధికంగా సాగు చేస్తున్న పంటలు, ఎంపిక చేయాల్సిన పంటలు, ప్రస్తుత పరిస్థితులు, మార్కెటింగ్ సమస్యలు, అధిగమించే అవకాశాలు, ప్రతిపాదనలు వంటి అన్ని అంశాలతోకూడిన పూర్తిస్థాయి నివేదికలతో హాజరుకానున్నారు.

నాగోబా జాతరకు సర్వం సిద్ధం

- నేడు అర్ధరాత్రి ప్రత్యేక పూజలతో జాతర ప్రారంభం
- గోదావరి జలాలతో మర్రిచెట్ల కింద మెస్రం వంశీయులు

ఆదిలాబాద్ / నమస్తే తెలంగాణ ప్రతినిధి: ఆదివాసీల సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఆదిలాబాద్ జిల్లాలోని నాగోబా జాతర సోమవారం అర్ధరాత్రి నుంచి ప్రారంభంకానుంది. నాలుగురోజుల కిందట మెస్రం వంశీయులు జన్నారం మండలం హస్తలమడుగు నుంచి పవిత్ర గోదావరి జలాలను తీసుకొని కాలినడకన కెస్లాపూర్‌కు చేరుకున్నారు. నాగోబా ఆలయ పరిసరాల్లోని మర్రిచెట్ల కింద సేదతీరారు. అర్ధరాత్రి సమయంలో మెస్రం వంశీయల ప్రత్యేక పూజల అనంతరం జాతర ప్రారంభమవుతుంది. ఈ నెల 7న దర్బార్ జరుగనుండగా.. జాతరకు వచ్చేవారి కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

వివిధ రాష్ట్రాల నుంచి

నాగోబాను ఆదివాసీలు తమ ఆరాధ్యదైవంగా కొలుస్తారు. ఏటా వారంపాటు జరిగే ఈ జాతరకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల నుంచి లక్షల సంఖ్యలో భక్తులు తరలివస్తారు. సమ్మక్క, సారలమ్మ జాతర తర్వాత రెండో అతిపెద్దదైన ఈ జాతర ఆదివాసీల ఐక్యతకు చిహ్నంగా నిలుస్తుంది. జాతరలో ప్రజా దర్బార్ కీలకమైనది. మంత్రులు, కలెక్టర్, వివిధశాఖల అధికారులు హాజరై గిరిజనుల సమస్యలకు పరిష్కారం చూపడం ఇక్కడి ప్రత్యేకత. 1946లో శాస్త్రవేత్త ప్రొఫెసర్ హైమన్‌డార్ఫ్ సూచనలో నిజాంకాలం నుంచి ప్రభుత్వం అధికారికంగా జాతరను నిర్వహిస్తున్నది.

ఇబ్బందుల్లేకుండా చర్యలు

తెలంగాణ సర్కారు గత ఏడాది నాగోబా ఆలయ నిర్మాణంతోపాటు ఇతర వసతులకు నిధులు మంజూరు చేసింది. ఆలయ పునర్నిర్మాణానికి రూ.2 కోట్లు, రూ.1.5 కోట్లతో దర్బార్, విశ్రాంతి భవనం నిర్మాణాలు జరుగుతున్నాయి. కెస్లాపూర్ నుంచి నాగోబా ఆలయం వరకు రూ.66 లక్షలతో డబుల్ రోడ్డు నిర్మాణం, మల్లాపూర్ నుంచి నాగోబా ఆలయం వరకు రూ.84 లక్షలతో బీటీ రోడ్డు పూర్తయింది. జాతరకు వచ్చే ఆదివాసీలు ఇబ్బందులు పడకుండా అధికారులు అన్ని ఏర్పాట్లుచేశారు. మరుగుదొడ్ల నిర్మాణం, తాగునీరు, విద్యుత్ సౌకర్యం, భోజన వసతి, పారిశుద్ధ్య ఏర్పాట్లు చేయనున్నారు.



నాగోబా జాతరకు సిద్ధమవుతున్న దర్బార్ హాల్

చైనాకు పాక్ గాడిదలు!

ఎగుమతి చేసి కోట్లు ఆర్జించేందుకు పాకిస్థాన్ కసరత్తు



ఇస్లామాబాద్, ఫిబ్రవరి 3: గాడిదలు పాకిస్థాన్‌కు కాసుల వర్షం కురిపించనున్నాయి. చైనాలో గార్దభాలకు విపరీతమైన డిమాండ్ ఉండడంతో వీటిని పెద్దసంఖ్యలో ఎగుమతి చేసి భారీగా విదేశీ మారకద్రవ్యాన్ని ఆర్జించాలనేది పాక్ లక్ష్యమని మీడియా నివేదిక ఒకటి వెల్లడించింది. చైనా సంప్రదాయ వైద్యంలో గాడిద పాలు, చర్మం, రక్తాన్ని విరివిరిగా వినియోగిస్తారు. ప్రపంచంలో గాడిదలు ఎక్కువ సంఖ్యలో ఉన్న దేశాల్లో పాక్ మూడో స్థానంలో ఉంది. ఇక్కడ సుమారు 50 లక్షల గార్దభాలు ఉన్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. చైనాలో ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని గాడిదల పెంపకం కేంద్రాల్ని నెలకొల్పేందుకు అధికారులు ఇప్పటికే చర్యలు ప్రారంభించారు. పలు విదేశీ సంస్థల సౌజన్యంతో సుమారు 300 కోట్ల డాలర్లతో ఈ కేంద్రాల్ని ఏర్పాటు చేయనున్నట్లు ఖైబర్-ఫక్తూన్ రాష్ట్ర పశుగణాభివృద్ధిశాఖ అధికారులు చెప్పారు. తొలి మూడేళ్లలో 80వేల గాడిదలను ఎగుమతి చేయనున్నట్లు వారు వివరించారు.

అంధులకు బ్రెయిలీ ఓటరు స్లిప్‌లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: కంటి చూపు లేని వారికి, తక్కువగా ఉన్నవారికి లోక్‌సభ ఎన్నికల సందర్భంగా బ్రెయిలీ ఓటరు స్లిప్‌లను అందజేయనున్నామని ఎన్నికల కమిషన్ (ఈసీ) ఆదివారం ప్రకటించింది. ఈ బ్రెయిలీ స్లిప్ చుక్కలతో ఉంటుందని, అంధులు దీన్ని వేలతో తడుముతూ చదవవచ్చని తెలిపింది. వీరికి ఫొటోతో కూడిన బ్రెయిలీ ఓటరు స్లిప్‌లను అందజేయాలని రాష్ట్రాల ఎన్నికల ప్రధానాధికారులకు సూచించినట్లు పేర్కొంది. ఇప్పటికే ఈవీఎంలలో బ్రెయిలీ ఫీచర్లు ఉన్నాయని, అందుకే లోక్‌సభ ఎన్నికల్లో బ్రెయిలీ ఓటరు స్లిప్‌లను అందజేయనున్నామని ఈసీ తెలిపింది.

కోడిపుంజు కొంటె చేష్టలు!

- మధ్యప్రదేశ్‌లో ఐదేండ్ల చిన్నారికి ముక్కుతో ముద్దులు
- పోలీసులకు తల్లిదండ్రుల ఫిర్యాదు
- ఆ పుంజు తమ కుమారుడని, చంపొద్దని వేడుకున్న యజమాని



భోపాల్, ఫిబ్రవరి 3: నమ్మడానికి విడ్డూరంగా ఉన్నా.. ఇది మాత్రం వాస్తవం! ఓ కోడిపుంజు ఐదేండ్ల చిన్నారి బుగ్గలపై ముద్దు పెడుతున్న (ముక్కుతో పొడవడం) ఘటన మధ్యప్రదేశ్‌లోని శివపురిలో చోటుచేసుకున్నది. పప్పు జాదవ్, లక్ష్మి దంపతులు ఓ కోడిపుంజును సాకుతున్నారు. ఈ పుంజు పొరుగునే ఉన్న పూనమ్ కుష్వాహా కూతురైన ఐదేండ్ల చిన్నారిపై వరుసగా దాడిచేస్తున్నది. ముద్దులు పెడుతున్నట్లుగా ముక్కుతో బుగ్గలపై రాస్తున్నది. ఇలా గత ఐదు నెలల్లో నాలుగు సార్లు దాడిచేసింది. దీంతో పూనమ్ పోలీసు కేసు పెట్టారు. వెంటనే పోలీసులు పుంజుతోపాటు దాన్ని సాకుతున్న పప్పు జాదవ్ దంపతుల్ని స్టేషన్‌కు పిలిపించారు. పుంజు తమకు కుమారుడితో సమానమని, దాని కోసం అవసరమైతే తాము జైలుకు వెళ్లేందుకు సిద్ధమని వారు చెప్పడంతో పోలీసులు అవాక్కయ్యారు. పుంజును మాత్రం చంపొద్దని విన్నవించారు. పుంజు మరోసారి చిన్నారిపై దాడి చేయకుండా చూస్తామని జాదవ్ దంపతులు ప్రాధేయపడడంతో పూనమ్ కుష్వాహా కేసును వెనక్కి తీసుకున్నారు.

పౌరసత్వ బిల్లును వ్యతిరేకిస్తూ

పద్మశ్రీ పురస్కారం వెనక్కి

ప్రకటించిన ప్రముఖ సినీ డైరెక్టర్ అరిబామ్ శ్యాం శర్మ



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: పౌరసత్వ బిల్లును వ్యతిరేకిస్తూ పద్మశ్రీ పురస్కారాన్ని వెనక్కి ఇవ్వనున్నట్లు మణిపూర్‌కు చెందిన ప్రముఖ సినీ దర్శకుడు అరిబామ్ శ్యాం శర్మ ఆదివారం చెప్పారు. ఈ పురస్కారాన్ని కేంద్ర ప్రభుత్వం తనకు 2006లో ఇచ్చిందని, అయితే వివాదాస్పద పౌరసత్వ బిల్లును ఈశాన్య రాష్ట్రాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో తాను కూడా పద్మశ్రీని వెనక్కి ఇవ్వనున్నానని తెలిపారు. 'పౌరసత్వ బిల్లు ఈశాన్య రాష్ట్రాల ప్రయోజనాలకు విరుద్ధం. ఈ బిల్లును తీసుకురావద్దని ఈశాన్య రాష్ట్రాల ప్రజలు, రాజకీయ నాయకులు కేంద్రాన్ని కోరినా పట్టించుకోలేదు. ఈ బిల్లును త్వరలోనే ఆమోదిస్తామని ఇటీవల ప్రధాని మోదీ పేర్కొనడాన్ని విన్నాను. దీన్నిబట్టి ఈశాన్య రాష్ట్రాల ప్రజల విన్నపాన్ని ప్రధాని మోదీ పట్టించుకోవడం లేదన్న విషయం అర్థమవుతున్నది. అందుకే పద్మశ్రీ పురస్కారాన్ని వెనక్కి ఇస్తా' అని అరిబామ్ శ్యాం శర్మ పేర్కొన్నారు. లోక్‌సభలో ఆమోదం పొందిన పౌరసత్వ బిల్లును ఈశాన్య రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే.

ఆరుగురు ప్రయాణికుల దుర్మరణం, 29 మందికి తీవ్ర గాయాలు

- బీహార్‌లోని వైశాలి జిల్లాలో ఘోర ప్రమాదం
- పట్టాలు తప్పిన 11 బోగీలు
- మృతుల కుటుంబాలకు 5 లక్షల పరిహారం: రైల్వే శాఖ





సీమాంచల్ రైలు ప్రమాద దృశ్యం

పట్టాలు తప్పిన సీమాంచల్

సోన్‌పూర్ (బీహార్), ఫిబ్రవరి 3: బీహార్‌లో ఘోర రైలు ప్రమాదం జరిగింది. ఢిల్లీలోని ఆనంద్ విహార్ టెర్మినల్ నుంచి బీహార్‌లోని జోగ్బని మధ్య నడిచే సీమాంచల్ ఎక్స్‌ప్రెస్ ఆదివారం తెల్లవారుజామున నాలుగు గంటలకు వైశాలి జిల్లాలో ప్రమాదానికి గురైంది. మొత్తం 11 బోగీలు పట్టాలు తప్పడంతో పెను విషాదం చోటుచేసుకుంది. ప్రయాణికులంతా గాఢనిద్రలో ఉన్న సమయంలో ఈ ప్రమాదం జరుగడంతో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. 29 మంది తీవ్రంగా గాయపడ్డారు. మరో 21 మందికి సాధారణ గాయాలయ్యాయి. 'సోన్‌పూర్ డివిజన్ షహదాయ్ బుజుర్గ్ ప్రాంతంలో రైలు పట్టాలు తప్పింది. మూడు స్లీపర్ క్లాస్, ఒక జనరల్, ఒక ఏసీ, మరో ఆరు సాధారణ బోగీలు పట్టాలు తప్పాయి. తీవ్రంగా గాయపడిన వారిని వెంటనే సమీపంలోని దవాఖానలకు తరలించాం. అపస్మారక స్థితిలోకి వెళ్లిన పలువురిని ముజఫర్‌పూర్, పాట్నాలకు తరలించాం' అని తూర్పు మధ్య రైల్వే జోన్ చీఫ్ పీఆర్వో తెలిపారు. మృతుల్ని ఇచ్ఛాదేవి (66), ఇందిరాదేవి (60), శంషుద్దీన్ ఆలం (26), అన్సార్ ఆలం (19), సైదా ఖాతూన్ (40), సుదర్శన్‌దాస్ (60)గా గుర్తించారు. మరోవైపు సీమాంచల్ ఎక్స్‌ప్రెస్ ప్రమాద వార్తపై రైల్వే మంత్రి పీయూష్ గోయెల్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ప్రమాదంలో మృతి చెందిన వారికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా, తీవ్రంగా గాయపడిన వారికి రూ.లక్ష, సాధారణ గాయాలైన వారికి రూ.50వేల పరిహారం అందించనున్నట్లు ప్రకటించారు. ప్రమాద వార్త తెలియగానే ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యల్లో పాల్గొన్నారని ఆయన పేర్కొన్నారు. గ్యాస్ కట్టర్‌లతో బోగీల్లో చిక్కుకున్న ప్రయాణికులను రక్షించినట్లు తెలిపారు. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తునకు ఆదేశించినట్లు మంత్రి చెప్పారు. రైలు ప్రమాదం జరిగిన ప్రాంతం సోనేపూర్, బరౌని పట్టణాలకు అత్యంత సమీపంలో ఉండడంతో అటు స్థానికులు, ఇటు పోలీసులు, వైద్యులు సకాలంలో సహాయక చర్యల్లో పాల్గొనడంతో ప్రాణనష్టం తగ్గిందని బీహార్ సీఎం నితీశ్‌కుమార్ వెల్లడించారు. స్థానిక జిల్లా కలెక్టర్, అధికార యంత్రాంగం బాధితులకు సేవలందిస్తున్నారని తెలిపారు. ప్రమాదానికి గురికాని బోగీల్లో 500 మంది ప్రయాణికులున్నారు. వీరిని ప్రత్యేక బస్సుల్లో హాజీపూర్‌కు తరలించారు. ప్రయాణికులకు ఆహారం, ఇతర సౌకర్యాలను రైల్వే అధికారులు కల్పించారు. రైలు పట్టాల్లో ఏర్పడిన పగుళ్ల వల్లే ప్రమాదం జరిగినట్లు రైల్వేశాఖ ప్రాథమిక అంచనాకు వచ్చినట్లు తెలిసింది. కానీ, రైల్వేశాఖ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని వివిధ పార్టీల నేతలు ఆరోపించారు. మోదీ హయాంలో ప్రయాణికుల భద్రత గాలిలో దీపంలా మారిందని లోక్‌తాంత్రిక్ జనతాదళ్ నేత శరద్‌యాదవ్ విమర్శించారు. రైల్వే మంత్రి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.



ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి సపర్యలు చేస్తున్న ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది

బాంబు పేలినట్లుగా భారీ శబ్దం వినిపించింది

రైలు ప్రమాద సమయంలో బాంబు పేలినట్లుగా భారీ శబ్దం వినిపించిందని ప్రత్యక్షసాక్షి, ప్రయాణికురాలు ఇమారతి దేవి చెప్పారు. 'కిషన్‌గంజ్ స్టేషన్‌లో నేను, మా అత్త రైలులో ఎక్కాం. ఆ తర్వాత నిద్రించేందుకు ఏర్పాట్లు చేస్తుండగానే ఒక్కసారిగా భారీ శబ్దం వినిపించింది. బాంబు పేలుడేమోనని అనుకున్నాను. ఇంతలో రైలు బలంగా భూమిని తాకింది. నేను ఎగిరి కిందపడిపోయాను. నా పక్క సీట్లలో వారికి తీవ్ర గాయాలయ్యాయి. కొందరు ప్రయాణికులు రైలు కిటికీలు విరగ్గొట్టి బయటపడ్డారు' అని ఆమె వివరించారు. సీమాంచల్ రైల్వే ప్రమాదంపై ప్రధాని నరేంద్రమోదీ, కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ తీవ్ర విచారం వ్యక్తంచేశారు. '

పద్మభూషణ్ వాపస్ ఇస్తా

- ఐదు రోజుల్లోగా డిమాండ్లను పరిష్కరించాలి
- కేంద్రానికి అన్నా హజారే డెడ్‌లైన్
- ఐదో రోజుకు చేరిన అమరణ దీక్ష



రాలెగావ్ సిద్ధి (మహారాష్ట్ర)/ముంబై, ఫిబ్రవరి 3: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఐదు రోజుల్లోగా నెరవేర్చకపోతే తనకు ఇచ్చిన పద్మభూషణ్ పురస్కారాన్ని వెనక్కి ఇస్తానని సామాజిక కార్యకర్త అన్నా హజారే హెచ్చరించారు. కేంద్రంలో లోక్‌పాల్, రాష్ట్రాల్లో లోకాయుక్తాలను ఏర్పాటు చేస్తామని, రైతుల సమస్యలు పరిష్కరిస్తామని మోదీ సర్కార్ హామీ ఇచ్చిందని, కానీ ఈ హామీలను నెరవేర్చలేదని దుయ్యబట్టారు. ఈ డిమాండ్లను నెరవేర్చాలంటూ తాను ఐదు రోజులగా అమరణ దీక్ష చేస్తున్నానని.. మరో ఐదు రోజుల్లోగా హామీలను అమలు చేయకపోతే కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన అత్యున్నత పురస్కారం పద్మభూషణ్‌ను వెనక్కి ఇచ్చేస్తానని తెలిపారు. అన్నా హజారే చేపట్టిన ఆమరణ నిరహార దీక్ష ఆదివారం నాటికి ఐదో రోజుకు చేరుకోవడంతో ఆయన బీపీ, షుగర్ స్థాయిలు పెరిగిపోయాయి. 3.8 కిలోల బరువు తగ్గారు. మరోవైపు హజారేకు మద్దతుగా చాలా మంది గ్రామస్తులు అహ్మద్‌నగర్- పుణె రహదారిని దిగ్బంధించారు. దీంతో తీవ్ర ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు ఆందోళన విరమించాలని నిరసనకారులను కోరారు. అయినా వినకపోవడంతో 110 మందిని అదుపులోకి తీసుకొని తర్వాత వదిలేశారు. హజారే దీక్షకు మద్దతుగా అహ్మద్‌నగర్ జిల్లాకు చెందిన 5000 మంది రైతులు సోమవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టనున్నారు. రహదారి దిగ్బంధానికి నాయకత్వం వహించిన షాహిర్ గైక్వాడ్ మాట్లాడుతూ లోక్‌పాల్, లోకాయుక్తాల ఏర్పాటు, రైతుల సమస్యలను పరిష్కరించడానికి స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయడంలాంటి హజారే డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని కోరారు.

నేపాల్, భూటాన్ భారత్‌లో భాగమే

ట్రంప్ ఇలాగే భావిస్తున్నారన్న అమెరికా ఇంటెలిజెన్స్ అధికారి

వాషింగ్టన్, ఫిబ్రవరి 3: నేపాల్, భూటాన్ భారత్‌లో భాగమేనని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భావిస్తున్నారు. ఈ విషయాన్ని అమెరికాకు చెందిన ఇంటెలిజెన్స్ అధికారి ఒకరు చెప్పినట్లు టైమ్స్ మ్యాగజైన్ పేర్కొంది. ఇటీవల ట్రంప్ దక్షిణాసియా మ్యాప్‌ను పరిశీలించినప్పుడు నేపాల్ ప్రత్యేక దేశమని ఒక అధికారి చెప్పగా.. స్పందించిన ట్రంప్ కాదు.. ఆ దేశం భారత్‌లో భాగమని వ్యాఖ్యానించారు. అంతేకాదు.. భూటాన్ కూడా భారత్‌లో భాగమని పేర్కొన్నారు. అలా కాదని వాదించిన అధికారులపై ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 2017లో కూడా నేపాల్‌ను నిప్లి అని, భూటాన్‌ను బట్టన్ అని ట్రంప్ ఉచ్చరించినట్లు వార్తలు వచ్చాయి.

ఇంటిని చక్కదిద్దుకోలేని వాళ్లు..

దేశాన్నేం ఉద్ధరిస్తారు

కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీ వ్యాఖ్యలు



నాగ్‌పూర్: ఇటీవల సొంత పార్టీపైనే విమర్శలు సంధిస్తున్న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. బీజేపీ విద్యార్థి విభాగమైన ఏబీవీపీ పూర్వ కార్యకర్తల సమావేశంలో శనివారం రాత్రి గడ్కరీ మాట్లాడుతూ.. ఇంటిని చక్కదిద్దుకోలేని వారు.. దేశాన్నేం ఉద్ధరిస్తారంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. 'నేను ఎంతో మంది కార్యకర్తల్ని కలిశాను. వారిలో అత్యధికులు తమ జీవితాల్ని బీజేపీ కోసం, దేశం కోసం త్యాగం చేసేందుకు సిద్ధమని చెప్పారు. వీరిలో ఒకరిని.. నువ్వు ఏం చేస్తుంటావు? మీ కుటుంబంలో ఎంత మంది ఉన్నారు? అని ప్రశ్నించాను. నాకు ఒక దుకాణం ఉందని, అది సరిగా నడువకపోవడంతో మూసివేశానని ఆ కార్యకర్త చెప్పాడు. అలాగే తన భార్య, పిల్లల గురించి వివరించాడు. నేను అతడికి ఒకటే చెప్పాను. ముందు నీ ఇంటిని చక్కదిద్దుకోమని సూచించాను. ఎందుకంటే ఇంటిని చక్కదిద్దుకోలేని వారు.. దేశాన్నేం ఉద్ధరిస్తారు. ముందు నీ ఇంటిని, కుటుంబాన్ని బాగా చూసుకో. ఆ తర్వాత పార్టీ, దేశం కోసం పనిచేయి.. అని అతడికి సూచించాను' అని గడ్కరీ పేర్కొన్నారు.



రాజస్థాన్‌లో వరుసగా ఢీకొన్న వాహనాలు

ముంచిన పొగమంచు!

- ప్రమాదాల బారినపడుతున్న వాహనదారులు
- యూపీలో ఇద్దరు మృతి

సిమ్లా/కనౌజ్/జైపూర్/అమృత్‌సర్, ఫిబ్రవరి 3: ఉత్తరాదిని చలి గజగజ వణికిస్తున్నది. ఉష్ణోగ్రతలు కనిష్ఠ స్థాయికి పడిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దట్టమైన పొగమంచుతో ఇటు వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. పొగమంచు కారణంగా ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించకపోవడంతో యూపీలోని ఆగ్రా-లక్నో ఎక్స్‌ప్రెస్ వేపై ప్రమాదం చోటుచేసుకున్నది. ఈ ఘటనలో కారు.. ఏకంగా ట్రక్కు కిందకు దూసుకుపోయింది. దీంతో ఇద్దరు సంఘటనాస్థలంలోనే ప్రాణాలు కోల్పోగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి.

రాజస్థాన్‌లో వరుసగా 40 వాహనాలు ఢీ

పొగమంచు కారణంగా రాజస్థాన్‌లోని శిఖర్ జిల్లాలో 40 వాహనాలు వరుసగా ఢీకొన్నాయి. కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచింది.

చలి గుప్పిట్లోనే హిమాచల్, పంజాబ్

హిమపాతంతో గజగజలాడుతున్న హిమాచల్‌ప్రదేశ్‌లోని సిమ్లా, మనాలీలో ఉష్ణోగ్రతలు స్వలంగా పెరిగాయి. అయితే, డల్హౌసీ, కుఫ్రీలో మాత్రం అత్యల్ప ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. లాహోల్‌లో అత్యల్పంగా మైనస్ 15 డిగ్రీల ఉష్ణోగత్ర నమోదైంది. పంజాబ్‌లోనూ కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి కంటే పడిపోయాయి.

చెట్టును ఢీకొన్న బస్సు.. ఐదుగురి మృతి

జార్ఖండ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. దియోగఢ్ జిల్లా కచువాబంద్ సమీపంలో ఆదివారం తెల్లవారుజామున ఓ బస్సు చెట్టు ఢీకొట్టి బోల్తాపడిన దుర్ఘటనలో ఐదుగురు ప్రాణాలు కోల్పోగా, 30 మందికిపైగా గాయపడ్డారు. మృతుల్లో ఓ మహిళ, చిన్నారి ఉన్నారు. డ్రైవర్ నిద్రమత్తులో బస్సుపై నియంత్రణ కోల్పోవడంతోనే ప్రమాదం జరిగినట్లు పోలీసులు చెప్పారు.





ఆదివారం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో నిర్వహించిన రూసా 2.0 ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని తిలకిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు.. కార్యక్రమ వేదికపై రూసా స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ నవీన్ మిట్టల్, ఉన్నత విద్యామండలి చైర్మన్ టీ పాపిరెడ్డి, ఉస్మానియా వర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ రామచంద్రం, ఓయూ రిజిస్ట్రార్ గోపాల్ రెడ్డి, రూసా పీవో సౌందర్య జోసెఫ్ తదితరులు ఉన్నారు.

రూసా 2.0 ప్రారంభం

ఫేజ్-2ను ఆన్‌లైన్‌లో ప్రారంభించిన ప్రధాని మోదీ

- నిధుల వాటాలో టాప్-10 వర్సిటీల్లో నిలిచిన ఓయూ
- ఓయూకు 107 కోట్లు, కేయూకు రూ.50 కోట్లు, ఎంజీయూ, టీయూకు రూ.20 కోట్లు
- పరిశోధనలు, ఆవిష్కరణలకు మరింత ఊతం

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ/ ఉస్మానియా యూనివర్సిటీ:

ఉస్మానియా యూనివర్సిటీలో పరిశోధనలు కొత్త పుంతలు తొక్కనున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో అమలుచేయనున్న రూసా (రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్షా అభియాన్) ఫేజ్-2 కింద ఓయూకు దాదాపు రూ.107 కోట్లు కేటాయించారు. ఇప్పటికే ప్రపంచస్థాయి వర్సిటీలకు దీటుగా నిలుస్తున్న ఓయూలో.. ఈ నిధులతో విద్యాప్రమాణాలు మరింత పెరుగనున్నాయి. రూసా 2.0 పథకాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆదివారం జమ్ముకశ్మీర్ రాజధాని శ్రీనగర్‌లోని షేర్-ఈ-కశ్మీర్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ నుంచి ఆన్‌లైన్ ద్వారా ప్రారంభించారు. దేశవ్యాప్తంగా ఎంపికచేసిన విద్యాసంస్థలకు రూ.3వేల కోట్లు విడుదల చేయనున్నారు. ఉస్మానియాకు న్యాక్ ఏ ప్లస్ గుర్తింపు ఉండటంతో రూ.100 కోట్లకుపైగా నిధులను కేటాయించారు. దేశంలోని పది యూనివర్సిటీలకు మాత్రమే ఈ గౌరవం దక్కింది. న్యాక్ ఏ గ్రేడ్ గుర్తింపు ఉన్న వరంగల్‌లోని కాకతీయ యూనివర్సిటీకి రూ.50 కోట్లు కేటాయించారు. అలాగే మహాత్మాగాంధీ యూనివర్సిటీ, తెలంగాణ యూనివర్సిటీలకు రూ.20 కోట్ల చొప్పున మంజూరయ్యాయని అధికారులు తెలిపారు.

రూసా-1లో మూడోస్థానం

రూసా 2.0 కింద ఓయూలో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, ఇన్నోవేషన్ అండ్ కెరీర్ హబ్‌ను ప్రారంభించారు. వర్సిటీలోని ఠాగూర్ ఆడిటోరియంలో ఏర్పాటుచేసిన భారీ స్క్రీన్‌పై కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారంచేశారు. ఈ కార్యక్రమానికి ప్రొఫెసర్లు, అధికారులు, పరిశోధక విద్యార్థులు పెద్దఎత్తున హాజరయ్యారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర కళాశాల విద్య కమిషనర్, రూసా స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ నవీన్ మిట్టల్ మాట్లాడారు. రూసా 2.0 కింద ఓయూను ఎంపికచేయడం గర్వకారణమన్నారు. ఓయూ ప్రపంచస్థాయి వర్సిటీగా మారడంలో ఇది మైలురాయిగా నిలుస్తుందని చెప్పారు. ఈ పథకం కింద యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియాతోపాటు ప్రపంచంలోని టాప్ వర్సిటీలతో ఎంవోయూలు కుదుర్చుకునేందుకు చర్చలు జరుపుతున్నట్టు తెలిపారు. రూసా 1.0 పథకం అమలులో తెలంగాణ దేశంలోనే మూడోస్థానంలో నిలిచిందని గుర్తుచేశారు. దీంతో రూసా 2.0 కింద ఓయూకు రూ.107 కోట్లు, కేయూకు రూ.50 కోట్లు, ఎంజీయూ, టీయూకు రూ.20 కోట్లు చొప్పున మంజూరయ్యాయని వివరించారు. ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ టీ పాపిరెడ్డి మాట్లాడుతూ.. రూసా కింద నిధులు పొందాలంటే న్యాక్ గుర్తింపు తప్పనిసరి అని, రాష్ట్రంలోని మిగతా వర్సిటీలు, విద్యాసంస్థలు నాణ్యతాప్రమాణాలు పెంచుకొని న్యాక్ గుర్తింపు కోసం ప్రయత్నించాలని సూచించారు. ఓయూ వీసీ ప్రొఫెసర్ రామచంద్రం మాట్లాడుతూ ఓయూ న్యాక్ ఏ ప్లస్‌తోపాటు యూపీఈ హోదా, డీబీటీ, డీఎస్‌టీ, ఎన్‌ఐఆర్‌ఎఫ్‌ను కలిగి ఉన్నదన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ గోపాల్‌రెడ్డి, ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్లు ప్రొఫెసర్ లింబాద్రి, ప్రొఫెసర్ వెంకటరమణ, రూసా పీవో సౌందర్య జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.



ఆదివారం ప్రధాని నరేంద్రమోదీ ఆన్‌లైన్ ద్వారా ప్రారంభించిన మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేటలో రూసా నిధులతో నిర్మించిన మోడల్ డిగ్రీ కాలేజీ భవనం

మారనున్న రూపురేఖలు

రూసా నిధులతో రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో విద్యాప్రమాణాలు పెరుగనున్నాయి. ముఖ్యంగా ఓయూ రూపురేఖలు మారనున్నాయి. ఈ నిధులు దక్కడం వెనుక రాష్ట్ర ప్రభుత్వ కృషి ఎంతగానో ఉన్నది. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిననాటినుంచి రాష్ట్రంలో విద్యాప్రమాణాలను మెరుగుపర్చేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నది. ఇందులోభాగంగా వర్సిటీలకు విరివిగా నిధులు కేటాయించడంతోపాటు ఇతర సమస్యలను పరిష్కరిస్తున్నది. ఇందులో భాగంగా ఉస్మానియా యూనివర్సిటీలో సౌకర్యాలు కల్పించడం, విద్యా ప్రమాణాలను పెంచడంతో న్యాక్ ఏ ప్లస్ గుర్తింపు వచ్చింది. దీని ఆధారంగానే ఓయూను కేంద్ర ప్రభుత్వం రూసా 2.0కు ఎంపికచేయడంతోపాటు రూ.107 కోట్లు కేటాయించింది. న్యాక్ ఏ ప్లస్ గుర్తింపులేని విద్యాసంస్థలకు రూ.50 కోట్లకు మించి కేటాయించలేదు. ఓయూకు కేటాయించిన నిధులను నిబంధనల ప్రకారం 2020 మార్చి నాటికి మాత్రమే ఖర్చు చేయాల్సి ఉంది. ఈ నిధుల్లో 60 శాతం కేంద్రం ఇవ్వనుండగా, 40 శాతం రాష్ట్రం ప్రభుత్వం చెల్లించాల్సి ఉంటుంది. ఓయూకు కేటాయించిన రూ.107 కోట్ల నిధుల్లో రూ.20 కోట్లతో వసతి గృహాల నిర్మాణం, మరమ్మతులు, మౌలిక వసతుల కల్పన, రూ.70 కోట్లతో యూనివర్సిటీలోని భవనాలు, నీటి సరఫరా, సోలార్ విద్యుత్ ప్రాజెక్టు, తరగతి గదులు, వసతి గృహాల ఆధునీకరణ, మరో రూ.10 కోట్లతో అమ్మాయిలు, అబ్బాయిలకు ఆధునాతన సౌకర్యాలతో ప్రత్యేకంగా జిమ్నాజియం ఏర్పాటు చేయనున్నారు. రూ.7 కోట్లతో అకాడమిక్ కాలేజ్ స్టాఫ్ కాలేజీ నిర్మించనున్నారు. వర్సిటీలో మౌలిక వసతుల అభివృద్ధి కోసం ఇప్పటికే రూ.20 కోట్లు మంజూరయ్యాయి.

కేయూలో..

హన్మకొండ, నమస్తే తెలంగాణ: కాకతీయ విశ్వవిద్యాలయంలో ఏర్పాటుచేసిన ప్రధాని వీడియో కాన్ఫరెన్స్‌లో వీసీ ప్రొఫెసర్ సాయన్న, రిజిస్ట్రార్ పురుషోత్తం, వివిధ విభాగాల అధిపతులు, ప్రొఫెసర్లు పాల్గొన్నారు. అనంతరం వీసీ సాయన్న మాట్లాడుతూ.. కేయూకు రూ.50 కోట్ల రూసా నిధులు మంజూరయ్యాయన్నారు. వీటితో విద్యాప్రమాణాలు పెంచడం, విదేశీ వర్సిటీలతో ఎంవోయూ కుదుర్చుకుంటామని చెప్పారు.

మోడల్ డిగ్రీ కాలేజీలను ప్రారంభించిన పీఎం

లక్సెట్టిపేట/ఆసిఫాబాద్ రూరల్: మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేటలో, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని అంకుసాపూర్‌లో రూ.12 కోట్ల చొప్పున రూసా నిధులతో నిర్మించిన ఆదర్శ డిగ్రీ కళాశాలలను ప్రధాని మోదీ ఆదివారం ఆన్‌లైన్ ద్వారా ప్రారంభించారు. కార్పొరేట్‌స్థాయి విద్యను ఉచితంగా అందించేందుకు 119 మోడల్ డిగ్రీ కాలేజీలను ఏర్పాటుచేశామన్నారు. మంచిర్యాలలో ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే నడిపల్లి దివాకర్‌రావు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం కాలేజీ నిర్మాణానికి పది ఎకరాల భూమితోపాటు అన్నిరకాల వసతులను కల్పించిందన్నారు. కార్యక్రమంలో కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, ఎమ్మెల్సీ పురాణం సతీశ్, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, మాజీ ఎమ్మెల్యే కోవలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మోదీకి 'మూడి'ందే!

ఆ ముగ్గురు మహిళల నుంచే ప్రధానికి అతిపెద్ద సవాలు

వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయే విజయావకాశాలకు గండికొట్టనున్న ప్రియాంక గాంధీ, మమతా బెనర్జీ, మాయావతి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: దేశంలోని ముగ్గురు పవర్‌ఫుల్ మహిళా రాజకీయ వేత్తల నుంచి ప్రధాని నరేంద్రమోదీకి పెద్ద సవాలు ఎదురుకానున్నది. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో వీరు మోదీ సర్కారు విజయావకాశాలకు గండికొట్టే అవకాశమున్నది. స్వతంత్ర భారత దేశాన్ని ఎక్కువకాలం పాటు పరిపాలించిన నెహ్రూ-గాంధీ కుటుంబం నుంచి వచ్చిన ప్రియాంకా గాంధీ వాద్రా (47) ఈ ముగ్గురిలో ఒకరు. గత నెల క్రియాశీల రాజకీయాల్లో చేరిన ప్రియాంకను ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ దేశంలోనే అత్యధిక జనాభా ఉన్న ఉత్తరప్రదేశ్‌లో ప్రధాన అస్త్రంగా ప్రయోగిస్తున్న విషయం తెలిసిందే. ఆమెతో పాటు మరో ఇద్దరు సీనియర్ మహిళా రాజకీయవేత్తలైన పశ్చిమ బెంగాల్ ఫైర్‌బ్రాండ్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ (64), ఉత్తర ప్రదేశ్ మాజీ సీఎం మాయావతి (63) కూడా మోదీ విజయావకాశాలను దారుణంగా దెబ్బ తీయవచ్చు. ఇప్పటివరకూ వీరిద్దరు ఎటువంటి నిర్దిష్ట ఒప్పందాన్ని కుదుర్చుకోకపోయినప్పటికీ విపక్షాలతో పెద్ద పెద్ద గ్రూపులను ఏర్పాటుచేస్తూ మోదీ నేతృత్వంలోని ఎన్డీయే సర్కారును గద్దె దింపేందుకు కత్తులు నూరుతున్నారు. శక్తిమంతులైన మహిళా నేతలు ఎన్డీయేలో కంటే ప్రతిపక్షంలోనే ఎక్కువగా ఉన్నారని, సాధారణ ఓటర్లకు ప్రత్యేకించి మహిళా ఓటర్లకు వీరు సులభంగా చేరువకాగలుగుతారని కేంద్ర ఆర్థికశాఖ మాజీ మంత్రి యశ్వంత్ సిన్హా (81) చెప్తున్నారు. ఎన్డీయేలో ఆధిపత్యం చెలాయిస్తున్న బీజేపీ నుంచి యశ్వంత్ సిన్హా గతేడాది వైదొలిగిన విషయం తెలిసిందే. ఇటీవల వరుస పరాజయాలతో సతమతమవుతున్న బీజేపీ ఇప్పుడు తీవ్రమైన ఆందోళనలో ఉన్నదని ఆయన వ్యాఖ్యానించారు. మరోవైపు ప్రియాంక రాజకీయ అరంగేట్రంపై భారత మీడియా చాలా వేగవంతంగా స్పందించింది. అచ్చం తన నానమ్మ, మాజీ ప్రధాని ఇందిరా గాంధీని పోలి ఉండే ప్రియాంక తన వాక్చాతుర్యంతో ఓటర్లకు సులభంగా చేరువకాగలుగుతారని చాలా మంది అభిప్రాయపడుతున్నారు. అధికారంపై మోదీ పట్టుకు విఘాతం కలిగిస్తారని భావిస్తున్న ముగ్గురు మహిళా నేతల్లో మిగిలిన ఇద్దరు ప్రియాంక కంటే ఎంతో అనుభవజ్ఞులు. రాజకీయాల్లో తలపండిన మమతా బెనర్జీ, మాయావతిలను సంకీర్ణ ప్రభుత్వంలో ప్రధాన మంత్రి పదవిని అధిష్ఠించేందుకు తగిన అభ్యర్థులుగా పరిగణింపబడుతున్నారు. ఉపాధ్యాయ వృత్తిని వదిలి బీఎస్పీ అధినేతగా రాజకీయాల్లో ఇప్పటికే సత్తా చాటుకున్న మాయావతి తన బద్ధ శత్రువైన సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ)తో గత నెలలో పొత్తు పెట్టుకుని మోదీకి వ్యతిరేకంగా కూటమి కట్టారు. దళితులు, యాదవులు, ముస్లింలతోపాటు ఇతర నిమ్న కులస్థుల మద్దతుతో ఈ కూటమి యూపీలో బీజేపీకి చుక్కలు చూపించే అవకాశం కనిపిస్తున్నది. మరోవైపు కేంద్రంలో రెండుసార్లు రైల్వేశాఖ మంత్రిగా పనిచేసిన తృణమూల్ కాంగ్రెస్ అధ్యక్షురాలు మమతా బెనర్జీ ప్రస్తుతం బెంగాల్ ముఖ్యమంత్రిగా దూసుకెళ్తున్నారు. బీజేపీకి వ్యతిరేకంగా గత నెల కోల్‌కతాలో భారీ బహిరంగ సభను నిర్వహించిన మమతా బెనర్జీ ఎంతో మంది విపక్ష నేతలతోపాటు లక్షలాది మంది ప్రజలను ఆకట్టుకోగలిగారు. అయితే గత ఐదేండ్ల కాలంలో మోదీ దేశంలోని మహిళల సమస్యలను విస్మరించలేదన్న అభిప్రాయం బలంగా వినిపిస్తున్నది. గర్భస్థ ఆడశిశువుల హత్యలను నిరోధించేందుకు 'బేటీ బచావో, బేటీ పడావో' అంటూ పిలుపునిచ్చిన మోదీ.. మహిళల ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకు పెద్ద సంఖ్యలో మరుగుదొడ్లను నిర్మించడం, పేద మహిళల కన్నీళ్లు తుడిచేందుకు రాయితీపై గ్యాస్ సిలిండర్లను అందజేయడం ద్వారా నారీ లోకాన్ని ఆకట్టుకోగలిగారు. అయితే తన మంత్రివర్గంలో ఆరుగురు మహిళలకు చోటు కల్పించిన మోదీ ఇప్పటికీ ఎన్నో అధికారాలను తనవద్దనే అట్టిపెట్టుకుని చాలా శాఖలపై పెత్తనం చెలాయిస్తున్నారన్న అపవాదు ఉంది.

- వ్యవసాయ రుణాల రద్దు ఎన్నికల జిమ్మిక్కే
- కశ్మీరీ పండిట్లకు గౌరవాన్ని కల్పిస్తాం
- కశ్మీర్ పర్యటనలో ప్రధాని మోదీ..
- పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన



కాంగ్రెస్‌ది మొసలి కన్నీరు

జమ్ము, ఫిబ్రవరి 3: ఎన్నికలకు ముందు రైతుల పట్ల మొసలి కన్నీరు కారుస్తున్న కాంగ్రెస్ పార్టీ.. ప్రజల ఓట్ల కోసం వ్యవసాయ రుణాల రద్దును జిమ్మిక్కులా వాడుకుంటున్నదని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గతంలో ఆ పార్టీ చేపట్టిన ఇటువంటి కార్యక్రమాల వల్ల దళారీలకు, కేవలం కొద్దిమంది రైతులకు మాత్రమే లబ్ధి చేకూరిందని విమర్శించారు. ఐదు ఎకరాలలోపు వ్యవసాయం చేస్తున్న రైతులకు ఏటా రూ.6 వేల చొప్పున ప్రత్యక్ష ఆదాయ తోడ్పాటును అందజేయడంసహా ప్రస్తుత ఎన్డీయే ప్రభుత్వం ప్రారంభించిన వివిధ పథకాల గురించి మోదీ ప్రస్తావిస్తూ.. గత ప్రభుత్వాల హయాంలో నిరాదరణకు గురైన అన్నదాతల సంక్షేమం కోసమే ఈ పథకాలను ప్రారంభించినట్టు చెప్పారు. కాంగ్రెస్ ప్రకటించిన వ్యవసాయ రుణాల రద్దు పథకం ద్వారా దాదాపు 70 నుంచి 89 శాతం మంది పేద రైతులకు లబ్ధి చేకూరలేదని, ఆ రైతుల సంగతి ఏమిటని ప్రశ్నించారు. విజయ్‌పూర్‌లో ఎయిమ్స్ (అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ) సహ జమ్మూ-కశ్మీర్‌లో రూ.6 వేలకోట్ల విలువైన వివిధ ప్రాజెక్టులకు ఆదివారం మోదీ శంకుస్థాపన చేశారు. అనంతరం విజయ్‌పూర్‌లో బహిరంగ సభలో ప్రసంగిస్తూ.. ఈ పథకాలను ప్రారంభించేందుకు మళ్లీ తానే వస్తానని చెప్పారు. తద్వారా కేంద్రంలో మళ్లీ తమ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని ఆయన పరోక్షంగా ధీమా వ్యక్తం చేశారు. పౌరసత్వ బిల్లుకు చేయతలపెట్టిన సవరణలను మోదీ ఈ సందర్భంగా ప్రస్తావించారు. పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్‌లో విచారణ ఎదుర్కొంటున్న భరతమాత బిడ్డలకు దేశం అండగా నిలుస్తుందన్నారు. చెల్లాచెదురైన కశ్మీరీ పండిట్లకు గౌరవాన్ని, హుందాతనాన్ని కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని చెప్పారు. ఉగ్రవాదుల భరతం పట్టేందుకు నియంత్రణ రేఖ వెంబడి సర్జికల్ స్ట్రైక్స్ నిర్వహించి భారత్ తన సత్తా నిరూపించుకున్నదని, ఉగ్రవాదాన్ని ఎదుర్కొనేందుకు మనం అనుసరించే విధానాలు, సాంప్రదాయాలేమిటో ప్రపంచానికి చాటిచెప్పిందని మోదీ పేర్కొన్నారు. రిటైర్డ్ రక్షణ సిబ్బందికి సంబంధించిన ఓఆర్వోపీ (వన్ ర్యాంక్, వన్ పెన్షన్) గురించి కాంగ్రెస్ అబద్ధాలాడుతున్నదని మోదీ ఆరోపించారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో ముందు జాగ్రత్తగా ఇంటర్నెట్ సేవలు నిలిపివేశారు.

రైతు రుణాలు మాఫీ

నిరుద్యోగ సమస్యనూ పరిష్కరిస్తాం
రైతులను మోదీ అవమానించారు

- అన్నదాతల ఆదాయం కొల్లగొట్టి పారిశ్రామికవేత్తల జేబులు నింపుతున్నారు
- పాట్నా సభలో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ధ్వజం




విమానంలో ఎకానమీ క్లాస్‌లో సభకు వెలుతున్న రాహుల్, కమల్‌నాథ్, గెహ్లాట్, బఘేల్, పటేల్

పాట్నా/న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: కేంద్రంలో తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే పేదలందరికీ కనీస ఆదాయ భరోసా కల్పిస్తామని ఇదివరకే ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ తాజాగా రైతులకు ఎన్నికల వరం ప్రకటించారు. దేశవ్యాప్తంగా రైతులందరి రుణాలనూ మాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. రైతు రుణమాఫీ హామీతో రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయఢంకా మోగించిన విషయం తెలిసిందే. ఈ మూడు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన కొద్దిరోజుల్లోనే రైతు రుణాలను మాఫీ చేశామని రాహుల్ గాంధీ చెప్పారు. పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి బీహార్‌లో నిర్వహించిన సభలో రాహుల్ మాట్లాడుతూ... కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దేశవ్యాప్తంగా రైతులందరి రుణాలు మాఫీ చేస్తామని ప్రకటించారు. రైతులను ప్రధాని మోదీ అవమానించారని మండిపడ్డారు. రైతులను మీరు అవమానిస్తే, వారే మీకు తగిన సమాధానం చెబుతారని మోదీకి స్పష్టం చేశారు. తమకు కాంగ్రెస్ పార్టీ కావాలని, బీజేపీ వద్దు అని రైతులు చెబుతున్నారన్నారు. చిన్న, సన్నకారు రైతులకు నేరుగా నగదు బదిలీ చేయనున్నట్లు కేంద్ర ప్రభుత్వం మధ్యంతర బడ్జెట్‌లో ప్రకటించిన రెండు రోజులకే రాహుల్ గాంధీ రైతు రుణమాఫీ హామీ ప్రకటించడం గమనార్హం.

పారిశ్రామిక వేత్తల జేబులు నింపేదుకే పంటబీమా పథకం...

పంట బీమా పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం రైతుల ఆదాయాన్ని కొల్లగొట్టి బడా పారిశ్రామిక వేత్తల జేబులు నింపుతున్నదని రాహుల్ గాంధీ ధ్వజమెత్తారు. బీహార్‌లోని నితీశ్ కుమార్ ప్రభుత్వం కూడా మోదీలాగే ఉత్తుత్తి హామీలను ఇస్తున్నదని విమర్శించారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే నిరుద్యోగం, రైతు సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. 'చౌకీదార్ చోర్ హై' అని మోదీని ఉద్దేశించి మరోసారి వ్యాఖ్యానించారు. రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు ఒప్పందంలో బీజేపీ సర్కారు అక్రమాలకు పాల్పడిందని పునరుద్ఘాటించారు. కార్యక్రమంలో మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి కమల్‌నాథ్, ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేశ్ బఘేల్, రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్, కేంద్ర మాజీ మంత్రి శరద్ యాదవ్, బీహార్ మాజీ ముఖ్యమంత్రి జితిన్ రామ్ మాంజీ తదితరులు పాల్గొన్నారు. కాగా, పాట్నా సభకు హాజరయ్యేందుకు రాహుల్‌తో పాటు ఇతర కాంగ్రెస్ నేతలు విమానంలో ఒకే వరసలో కూర్చొని ప్రయాణిస్తున్న ఫొటోను ఆ పార్టీ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. ఎకానమీ క్లాస్‌లో పాట్నా సభకు వెళుతున్నట్లు తెలిపింది. అనంతరం అదే ఫొటోను వేరే క్యాప్షన్ పెట్టి రాహుల్ షేర్ చేశారు. 'పార్టీ నూతన ముఖ్యమంత్రులు, పార్టీ కోశాధికారితో కలిసి బీహార్‌లోని గాంధీ మైదాన్‌లో జరిగే సభకు వెళుతున్నాం. ఈ జెంటిల్‌మెన్ అందరినీ ఒకే వరుసలో తీసుకురావడం కష్టమైనా, మేం సాధించాం' అని రాహుల్ పోస్ట్ చేశారు.

ప్రధాని పదవికి రాహుల్ అర్హుడు : తేజస్వియాదవ్

ప్రధాని పదవి చేపట్టేందుకు రాహుల్‌గాంధీకి అన్ని అర్హతలు ఉన్నాయని పాట్నా సభలో ఆర్జేడీ నేత తేజస్వియాదవ్ అన్నారు. అయితే ఇతర పార్టీలను కలుపుకుపోయే బాధ్యత కూడా రాహుల్‌పైనా, కాంగ్రెస్‌పైనా ఉందన్నారు. సంకీర్ణ ప్రభుత్వాల్లో తమను సమానంగా చూడాలని కాంగ్రెస్‌ని మిత్ర పక్షాలు తరచూ కోరుతున్న విషయం తెలిసిందే. తేజస్వీ యాదవ్ వ్యాఖ్యలపై రాహుల్ స్పందిస్తూ.. ఆర్జేడీ వంటి మిత్రపక్షాలతో కలసి లోక్‌సభ ఎన్నికల్లోనే కాకుండా వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ ఉమ్మడిగా పోరాటం చేస్తుందని చెప్పారు. తేజస్వియాదవ్ డైనమిక్ లీడర్ అని, అబద్ధాలు ఆడరని, పాలనలో ఇప్పటికే తనేంటో నిరూపించుకున్నారని ప్రశంసించారు. కాగా, డీఎంకే అధినేత స్టాలిన్ కూడా విపక్షాల ప్రధాని అభ్యర్థిగా రాహుల్ గాంధీని ఇదివరకే ప్రతిపాదించిన విషయం తెలిసిందే.

అణగారిన వారి ఉద్యోగావకాశాలు లాగేసుకుంటున్నారు

విశ్వవిద్యాలయాల్లో అణగారిన వర్గాలకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ప్రధాని మోదీ నిరాకరిస్తున్నారని రాహుల్ ట్విట్టర్‌లో మండిపడ్డారు. ప్రధాన స్రవంతి నుంచి వారిని దూరం చేయడం, పారిశ్రామిక మిత్రులకు లబ్ధి చేకూర్చడమే మోదీ మంత్రమని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు యూనివర్సిటీ ఫ్యాకల్టీ పోస్టుల్లో డిపార్ట్‌మెంట్ స్థాయిలో రిజర్వేషన్ల కల్పనకు సుప్రీంకోర్టు అంగీకారం తెలపడం వల్ల ఆ వర్గాలకు అందుబాటులో ఉండే పోస్టులు 25-100 శాతం తగ్గే అవకాశం ఉందని ఓ మీడియా కథనాన్ని ప్రస్తావిస్తూ ప్రధానిపై రాహుల్ విమర్శలు గుప్పించారు. 'మొదట సీట్లు తగ్గించడం ద్వారా అణగారిన వర్గాల విద్యావకాశాలను మోదీ లాగేసుకుంటారు. ఉపకార వేతనాలు నిలిపివేస్తారు. రోహిత్ వేముల వంటి యువకులపై దాడులకు దిగుతారు' అని రాహుల్ ట్వీట్ చేశారు. ఇప్పుడు 13 పాయింట్ రోస్టర్ ద్వారా యూనివర్సిటీల్లో అణగారిన వర్గాలకు ఉద్యోగావకాశాలు కూడా మూసుకుపోయినట్లేనని చెప్పారు.


కోల్‌కతాలోని సీబీఐ కార్యాలయం వద్ద సీఆర్పీఎఫ్ సిబ్బంది

మోదీ X దీదీ

మొదటిపేజీ తరువాయి...

సీబీఐ అధికారులను కొద్దిసేపు ప్రశ్నించిన పోలీసులు ఆ తరువాత విడుదల చేశారు. రాష్ట్ర పోలీసులు తమను అడ్డుకుంటున్నారని ఫిర్యాదు చేసేందుకు సీబీఐ అధికారులు గవర్నర్‌ను అపాయింట్‌మెంట్ కోరారు. ఇదిలా ఉండగా, మమతా బెనర్జీకి పలువురు ప్రతిపక్ష నేతలు సంఘీభావం తెలిపారు. కాగా, రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని బీజేపీ డిమాండ్ చేసింది. దర్యాప్తును అడ్డుకుంటున్న పశ్చిమ బెంగాల్ ప్రభుత్వంపై సుప్రీంకోర్టుకు ఫిర్యాదు చేసేందుకు కేంద్రం సిద్ధమైనట్టు అధికార వర్గాలు పేర్కొన్నాయి. రోజ్‌వ్యాలీ, శారదా చిట్ ఫండ్ కుంభకోణాల కేసులకు సంబంధించి కోల్‌కతా పోలీస్ కమిషనర్ రాజీవ్‌కుమార్‌ను ప్రశ్నించేందుకు సీబీఐ అధికారులు ఆయన ఇంటికి వచ్చారు. కేంద్ర ప్రభుత్వంలోని మోదీ సర్కారుకు, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి నడుమ తీవ్ర వైరం నడుస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో తాజా ఘటన తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. రాజీవ్‌కుమార్ పారిపోయారని, ఆయన కోసం వెతుకుతున్నట్లు శనివారం ప్రకటించిన సీబీఐ అధికారులు ఆదివారం సాయంత్రం ఆయన నివాసానికి వెళ్లారు. అయితే అక్కడి సెక్యూరిటీ సిబ్బంది వారిని అడ్డుకున్నారు. సీబీఐ దాడుల విషయం తెలిసిన వెంటనే రాష్ట్ర పోలీసు అధికారులు కూడా రాజీవ్ నివాసానికి చేరుకున్నారు. రాజీవ్‌ను ప్రశ్నించేందుకు అవసరమైన డాక్యుమెంట్లు చూపాలని సీబీఐ అధికారులను నిలదీశారు. అనంతరం పలువురు సీబీఐ అధికారులను బలవంతంగా వాహనాల్లో ఎక్కించి షేక్‌స్పియర్ శరణి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రాష్ట్ర డీజీపీ వీరేంద్ర, ఏడీజీ (శాంతిభద్రతలు) అనుజ్‌శర్మ కూడా రాజీవ్‌కుమార్ నివాసానికి చేరుకున్నారు. అక్కడ మీడియా సమావేశం ఏర్పాటుచేసిన మమత.. కేంద్రంపై నిప్పులు చెరిగారు. కేంద్రం ప్రతీకార రాజకీయాలకు పాల్పడుతున్నదని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. చిట్ ఫండ్ సంస్థల యజమానులను తమ ప్రభుత్వమే అరెస్ట్ చేసిందని, ఈ స్కాముల్లో దర్యాప్తుకు సిట్ ఏర్పాటు చేసినది కూడా తమ ప్రభుత్వమే అని చెప్పారు. అనంతరం కేంద్రం వైఖరిని నిరసిస్తూ కోల్‌కతా మెట్రో సినిమా థియేటర్ వద్ద ధర్నాకు కూర్చున్నారు. ఈ డ్రామాలో కేంద్ర బిందువైన రాజీవ్‌కుమార్ కూడా మమత పక్కనే ధర్నాలో కనిపించడం గమనార్హం. రాజీవ్‌కుమార్ విధులకు హాజరుకావడం లేదన్న ఆరోపణలను కోల్‌కతా పోలీసులు ఖండించారు. 2019 జనవరి 31న మాత్రమే ఆయన లీవ్‌లో ఉన్నారని, మిగతా రోజుల్లో రెగ్యులర్‌గా విధులకు హాజరయ్యారని ఓ ప్రకటనలో తెలిపారు. నిర్ధారణ లేకుండా ఈ విషయంలో ఎవరైనా దుష్ప్రచారానికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.'50-60 రాష్ట్ర పోలీసులు నా నివాసాన్ని చుట్టుముట్టారు. నా పదమూడేండ్ల కూతురు, భార్యతో కలిసి ఇంట్లో ఉన్నా. కేసుకు సంబంధించిన డాక్యుమెంట్లు ధ్వంసం చేస్తారేమోనని ఆందోళనగా ఉంది. భారత ప్రభుత్వం కలుగజేసుకోవాలి' అంటూ కోల్‌కతా సీబీఐ జాయింట్ డైరెక్టర్ పంకజ్ శ్రీవాస్తవ మొరపెట్టుకున్నారు. ఆ వెంటనే సీబీఐ తాత్కాలిక డైరెక్టర్ మన్నెం నాగేశ్వరరావు మాట్లాడుతూ... ఆధారాలను ధ్వంసం చేసేందుకే బెంగాల్ పోలీసులు కోల్‌కతాలోని సీబీఐ కార్యాలయాన్ని చుట్టుముట్టారని ఆందోళన వ్యక్తం చేశారు. ఏ సెక్షన్ల కింద తమ సిబ్బందిని అరెస్ట్ చేశారో తెలియడం లేదన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకే తమ కర్తవ్యాన్ని నిర్వహిస్తున్నామని, రాజీవ్ కుమార్ విచారణకు సహకరించడం లేదని సుప్రీంకోర్టే పేర్కొందని చెప్పారు. జాయింట్ డైరెక్టర్, ఆయన కుటుంబాన్ని కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వ సాయం కోరినట్లు తెలిపారు. అనంతరం సీబీఐ కార్యాలయానికి రక్షణగా సీఆర్‌పీఎఫ్ బలగాలు రంగంలోకి దిగాయి.

రాజీవ్‌కు వ్యతిరేకంగా ఆధారాలున్నాయి: సీబీఐ

చిట్ ఫండ్ కేసులకు సంబంధించిన ఆధారాలను ధ్వంసం చేయడంలో రాజీవ్‌కుమార్ ప్రమేయం ఉందనేదానిపై తమ వద్ద ఆధారాలు ఉన్నట్లు సీబీఐ తాత్కాలిక డైరెక్టర్ నాగేశ్వరరావు తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈ కేసు విచారణ చేపడుతున్నామని, అంతకుముందు ఈ కేసు దర్యాప్తుపై పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసిందని చెప్పారు. అన్ని ఆధారాలు, డాక్యుమెంట్లు వారు స్వాధీనం చేసుకున్నారని, వాటిని తమకు అప్పగించడంలో సహకరించడం లేదని ఆరోపించారు. ఇప్పటికే చాలా ఆధారాలు ధ్వంసమయ్యాయని చెప్పారు.


సీబీఐ అధికారిని బలవంతంగా అరెస్టు చేస్తున్న బెంగాల్ పోలీసులు

అరెస్టు చేద్దామనుకున్నాం:సీబీఐ జేడీ

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకే తాము చిట్‌ఫంట్ కేసు దర్యాప్తు చేపట్టామని సీబీఐ జాయింట్ డైరెక్టర్ పంకజ్ శ్రీవాస్తవ చెప్పారు. దర్యాప్తులో భాగంగా తాము కోల్‌కతా నగర పోలీస్ కమిషనర్ రాజీవ్‌కుమార్‌ను ప్రశ్నించేందుకు ఆయన ఇంటికి వెళ్లామని తెలిపారు. ఆయన తమకు సహకరించకపోయి ఉంటే అరెస్టు చేయడానికి సిద్ధపడి వచ్చామని చెప్పారు. రాష్ట్ర పోలీసులు తనను కూడా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారని తెలిపారు. కొందరు పోలీసులు తన ఇంటి వద్ద మోహరించారన్నారు. నగర జాయింట్ పోలీస్ కమిషనర్ (క్రైం) ప్రవీణ్ త్రిపాఠి మాట్లాడుతూ, సీబీఐ అధికారులందరినీ విడుదల చేశామని చెప్పారు. తాము వారిని ప్రశ్నించినప్పుడు 'ఒక సీక్రెట్ ఆపరేషన్ కోసం వచ్చామని తెలిపారు' అన్నారు. అయితే ఆ ఆపరేషన్ ఏమిటన్నది మాత్రం వెల్లడించలేదన్నారు.

నేడు సుప్రీంకోర్టుకు కేంద్రం

చిట్‌ఫండ్ కుంభకోణాల కేసుల దర్యాప్తును పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం అడ్డుకుంటున్నదని సీబీఐ ఆరోపించింది. ఆ రాష్ట్ర ప్రభుత్వంపై చర్య తీసుకోవాలని కోరుతూ సీబీఐ సోమవారం సుప్రీంకోర్టుకు ఫిర్యాదును చేయనున్నట్టు అధికార వర్గాలు పేర్కొన్నాయి.

ఇది మోదీ, అమిత్‌షా కుట్ర: మమత

'వారంట్ లేకుండా ఓ పోలీస్ కమిషనర్ ఇంటికి రావడానికి మీకెంత ధైర్యం? నా అధికారులను కాపాడుకోవడం నా కర్తవ్యం' అని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సీబీఐ అధికారులనుద్దేశించి నిప్పులు చెరిగారు. కోల్‌కతాలోని మెట్రో సినిమా వద్ద రాత్రి 9.00 గంటలకు రాజ్యాంగ సంస్థలను కాపాడండి అంటూ ధర్నాకు కూర్చున్న మమత మీడియాతో మాట్లాడారు. 'ప్రధాన మంత్రి ఆడించినట్టు జాతీయభద్రతా సలహాదారు అజిత్ దోవల్ ఆడుతున్నారు. తమ రాజకీయ ప్రత్యర్థులను వేధించేందుకు వారు సీబీఐని ఉపయోగించుకుంటున్నారు. దోవల్ ఆదేశాల మేరకే సీబీఐ అధికారులు వ్యవహరిస్తున్నారు. వారిద్దరూ కలిసి సీబీఐ అధికారులను 'కుచ్‌తో కరో (ఏమన్నా చేయండి) అంటూ ఒత్తిడి చేస్తున్నారు. బీజేపీ దొంగ పార్టీ. మేము కాదు. చిట్‌ఫండ్ కేసు నెపంతో వారిష్టమొచ్చినట్టు వ్యవహరిస్తున్నారు. చిట్‌ఫండ్ యజమానులను అరెస్టు చేసింది మేము' అంటూ మమత మండిపడ్డారు. ఇటీవల కోల్‌కతాలోని బ్రిగేడ్ గ్రౌండ్స్‌లో బీజేపీకి వ్యతిరేకంగా సభ నిర్వహించినందుకు మోదీ సర్కార్ తమపై ప్రతీకారానికి దిగిందని ఆమె ఆరోపించారు. తమపైకి సీబీఐని ఉసిగొల్పుతారని ముందే తెలుసునని అన్నారు. 'ఆయన (మోదీ) గద్దె దిగేందుకు గంట మోగింది. ఆయన ఎక్స్‌పయరీ డేట్ (పదవీకాలం)ముగిసింది. భారతీయులు, బెంగాల్ ప్రజలు బీజేపీతో విసిగిపోయారు. మోదీని వెంటనే గద్దె దింపాలి లేకపోతే దేశాన్ని రక్షించుకోలేం' అని చెప్పారు. అంతకుముందు, సీబీఐ అధికారులు పోలీస్ కమిషనర్ రాజీవ్‌కుమార్‌ను కలిసేందుకు రానున్నారని తెలియగానే, ఆయనకు తన మద్దతును ప్రకటించారు. కోల్‌కతా కమిషనర్ ప్రపంచంలోనే అత్యుత్తమ పోలీస్ అధికారి అని, ఆయన నిజాయితీని, సాహసాన్ని అనుమానించలేమని కితాబునిచ్చారు. రాష్ట్ర పోలీసులను తమ స్వాధీనంలోకి తీసుకొనేందుకు బీజేపీ నాయకత్వం రాజ్యాంగ సంస్థలను ధ్వంసం చేస్తున్నదని ఆరోపించారు. మమతా బెనర్జీకి ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, జమ్ముకశ్మీర్ మాజీ సీఎం ఒమర్ అబ్దుల్లా, ఉత్తర్‌ప్రదేశ్ మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్, కాంగ్రెస్ నాయకుడు అహ్మద్‌పటేల్, డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ తదితరులు సంఘీభావం తెలిపారు. ఈ సంక్షోభ సమయంలో తాము తృణమూల్‌తో భుజం భుజం కలిపి నడుస్తామని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ట్వీట్ చేశారు.


మెట్రో సినిమా వద్ద ధర్నా చేస్తున్న సీఎం మమత. చిత్రంలో కోల్‌కతా పోలీసు కమిషనర్ రాజీవ్‌కుమార్ (ఎడమవైపు చివరి వ్యక్తి)


బహిరంగ సభకు హాజరైన జనసందోహం. పక్కచిత్రంలో ప్రసంగిస్తున్న సీతారాం ఏచూరి



మోదీ, మమత ప్రభుత్వాలను గద్దెదించండి

- గతంలో బీజేపీ, టీఎంసీ చెట్టాపట్టాల్
- బ్యాంకులను లూటీ చేసిన వాళ్లు బీజేపీకి పార్టీ ఫండ్‌లు ఇస్తున్నారు
- కోల్‌కతా సభలో సీపీఎం ప్రధాన కార్యదర్శి ఏచూరి ధ్వజం

కోల్‌కతా, ఫిబ్రవరి 3: కేంద్రంలో మోదీ ప్రభుత్వాన్ని, పశ్చిమబెంగాల్‌లో మమతాబెనర్జీ సర్కార్‌ను గద్దెదించాలని సీపీఎం పిలుపునిచ్చింది. ఇవి రెండూ అవినీతి ప్రభుత్వాలేనని, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నాయని విమర్శించింది. ఆదివారం పశ్చిమబెంగాల్‌లోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన భారీ బహిరంగ సభలో సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మాట్లాడుతూ గుజరాత్ అల్లర్లు జరిగిన తర్వాత ఎన్డీయే ప్రభుత్వంలో మమతాబెనర్జీ పార్టీ తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ఎందుకు చేరిందని ప్రశ్నించారు. 'కేంద్రంలో మోదీ ప్రభుత్వాన్ని ఓడించాలని ప్రతిపక్షాలు కోరుతున్నాయి. పశ్చిమబెంగాల్‌లో మమతాబెనర్జీ సర్కార్‌ను ఓడించాలని బీజేపీ కోరుతున్నది. కానీ ఈ రెండు ప్రభుత్వాలను ఓడిస్తేనే అవినీతి రహిత పాలన అందుతుంది' అని ఏచూరి పేర్కొన్నారు. ప్రధాని మోదీ అవలంభిస్తున్న విధానాల వల్ల దేశంలో నిరుద్యోగం పెరిగిపోయిందని, రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆరోపించారు. జీఎస్టీ, పెద్ద నోట్ల రద్దు వల్ల వ్యాపారులు తమ దుకాణాలను మూసేయాల్సి వచ్చిందని విమర్శించారు. ప్రధాని మోదీ స్నేహితులు 15లక్షల కోట్లను బ్యాంకుల నుంచి దోచుకొని విదేశాలకు పారిపోతే ఇప్పటి వరకు వాళ్లపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని ధ్వజమెత్తారు. 'దోచుకోవడానికి కేంద్ర ప్రభుత్వం అనుమతినిచ్చింది. దోచుకున్న వాళ్లు ఎలక్టోరల్ బాండ్ల రూపంలో బీజేపీకి నిధులు సమకూర్చుతున్నారు. ఎలక్టోరల్ బాండ్ల రూపంలో అందిన నిధులు 95 శాతం బీజేపీకే చేరాయి. ఇది ముమ్మాటికీ అవినీతే' అని ఏచూరి ఆరోపించారు. సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశంలోని స్వయం ప్రతిపత్తి కలిగిన అన్ని వ్యవస్థలను కేంద్ర ప్రభుత్వం ధ్వంసం చేసిందని, చివరికి పార్లమెంట్ కూడా నిబంధనల ప్రకారం నడువలేని పరిస్థితి నెలకొన్నదని విమర్శించారు.

యూపీ సీఎంకు బెంగాల్‌లో చేదు అనుభవం

ఆయన హెలికాప్టర్ దిగడానికి అనుమతి నిరాకరణ

న్యూఢిల్లీ, బాలూర్‌ఘాట్ (పశ్చిమబెంగాల్)/లక్నో, ఫిబ్రవరి 3: ఉత్తర్‌ప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్‌కు చేదు అనుభవం ఎదురైంది. ఆయన ప్రయాణిస్తున్న హెలికాప్టర్ పశ్చిమబెంగాల్‌లో దిగడానికి ఆ రాష్ట్ర సీఎం మమతాబెనర్జీ అనుమతి నిరాకరించారు. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన ఆదిత్యనాథ్.. మమతాబెనర్జీ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని విమర్శించారు. అనంతరం బెంగాల్‌లో ఆయన పాల్గొనాల్సిన రెండు సభలకు హాజరుకాకుండా టెలిఫోన్ ద్వారా ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. బీజేపీ నాయకులు మాట్లాడుతూ సీఎం ఆదిత్యనాథ్ హాజరు కావాల్సిన రెండు సభల వద్ద కూడా హెలికాప్టర్ దిగకుండా అధికారులు అడ్డుకున్నారని పేర్కొన్నారు.

'కిసాన్ సమ్మాన్ నిధి'కి ప్రత్యేకాధికారులు

రాష్ట్రాల్లో పథకం అమలు పర్యవేక్షణ బాధ్యత

హైదరాబాద్, నమస్తేతెలంగాణ: రైతులకు పెట్టుబడి సాయం అందిస్తూ తాజాగా ప్రకటించిన 'ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి' అమలు కోసం ప్రతి రాష్ట్రానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించాలని కేంద్రం నిర్ణయించింది. ఆయా రాష్ట్రాల్లో పథకం అమలు పర్యవేక్షణ బాధ్యతలను వారికి అప్పగించనుంది. రెండు మూడు రోజుల్లోగా పూర్తిస్థాయిలో మార్గదర్శకాలు ఖరారుచేసి పథకాన్ని అమలు చేయనున్నది. ఆలోగా పథకం పరిధిలోకి వచ్చే రైతుల పేర్లు, వారికి ఉన్నభూమి, బ్యాంకు ఖాతాలు, తదితర వివరాలు పంపాలని కేంద్రం రాష్ట్రాలను ఆదేశించిన సంగతి తెలిసిందే. 2015-16 వ్యవసాయ గణాంకాల నివేదిక ప్రకారం పెట్టుబడి సాయం అందిస్తామని కేంద్రం ప్రకటించింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల లెక్కలు తేల్చే పనిలో పడ్డాయి.

తెలంగాణలో స్పష్టంగా గణాంకాలు

తెలంగాణలో మొత్తం రైతుల వివరాలు, గణాంకాలు స్పష్టంగా ఉన్నాయి. రాష్ట్రంలో 47.08 లక్షల మంది సన్న, చిన్నకారు రైతులు ఈ పథకానికి అర్హులుగా తేలారు. వీరికి ఏడాదికి రూ.2,824 కోట్లు సాయం అందనున్నది. ఈ పథకం కింద అత్యధికంగా ఉత్తరప్రదేశ్ రైతులు (2.21 కోట్ల మంది) లబ్ధిపొందనున్నారు. ఆతర్వాతి స్థానాల్లో బీహార్ (1.59 కోట్ల మంది), మహారాష్ట్ర (1.18 కోట్ల మంది), మధ్యప్రదేశ్ (75.60 లక్షల మంది), ఏపీ (75.50 లక్షల మంది) ఉన్నాయి. కేరళలో ఏకంగా 99శాతం మంది (75.14 లక్షల మంది) సన్న, చిన్నకారు రైతులే ఉన్నట్టు కేంద్రం తెలిపింది.



ఈ భూగోళాన్ని తన భుజాలపై మోసేది అట్లాస్ కాదు, మహిళ. అప్పుడప్పుడూ ఆమె భూగోళాన్ని బంతిలా ఆడుకుంటుంది.

హెన్రిక్ సీన్‌క్జెవిక్జ్

మోస్ట్ ఎఫెక్టెడ్ ట్రైలర్



సుట్టిముట్టిన వెండి కొండల్ని తొల్చుకొని
అటెంక..
వాన మింగినంక మిగిలిన మట్టి గోడల మీద పాకిన
కాకరపువ్వుల తీగరా వారి

ఒంకరటింకర అపస్వరాలను సరిచేసే జమ్మిక మోత
నిశ్శబ్దాన్ని ఎగిరి తన్నే కాంగో దరువుల కరిగట్టు
గదొక పొలన్ స్కీ బిట్టర్ మూన్ వొగరొగరు నవ్వు

నిద్రల జాగరపు అగరొత్తుల ముంత పొగ అది ఉక్కపో
తల ఎడతెగని సోది మల్లెపూలను మసిబొగ్గు చేసే ఆరు
పిల్లేరి గంతులు బొక్కలిరగంగ మూడు కాన్ బైరీలు
గ్లిజరిన్ తడి తదిగిణతోం
మాటల సాలెగూట్ల ఇరక్కపోయి
డిటిఎస్‌ల అరిగోస పెట్టాల్సిందే

ఇదొక..
మంత్రించిన నీళ్ల చల్లిన ఇలాకా రా తమ్మీ
కళ్లల్ల దుంకే జలతారల తెరల తెరల సాంబ్రాణి చీకటి

సప్పుజచచ్చిన నాలిక మీద వాలిన
లేదా..
కాలిన చింతగింజల రుచి..
కల్లు కంపొండ్ల మసాలా పాపడ
ఇసుక అడవులల్ల నాత్రి వినపడ్డ
ఫతే అలీఖాన్ దమాద మ్ మస్త్ కలందర్

చినిగిన బొంతల మీద చెక్కిన గైర్నికా బొమ్మ
అమాస రంగుని మలిపిన రంగురంగుల చెమ్కీల దండ

కుతకుత వుడికి లోపిన క్యుములోనింబసే
మూల విరాట్టు జయరాజ్
పాదాలు తాకి నిమ్మలబడ్డ వాన తుక్డా

ఇరికిరుకు గల్లీల పొంటి ఉర్కి ఉర్కి
పెయ్యింతా డొక్క పోయింది
ఏడుపుగొట్టు బాషెన్లు విని విని కళ్లన్నీ మెలిక పడ్డయాల్ల

మోస్ట్ ఎఫెక్టెడ్ పర్సన్ చీకిపోయిన
డెనిమ్ జేబుల దొర్కిన
అత్తరంటిన బంగారు తాళపత్రపు కమ్మ
విట్టోరియా డి సికా పోగొట్టుకున్న సైకిల్ పయ్య
మార్లిన్ బ్రాండో గుసగుసల రాతిశాసనం

రంది కొల్మిల సాన బెట్టిన శోకపు జీర
గోడలల్కిన మట్టి వాసన
సందెపూట చెర్వు మీద పర్సుకున్న
ఎలుగునీడల సంధికాలమిది
వొయ్యిల అచ్చరాలని మల్లేసి మల్సుకోవాలె
కతలబడ్డ కతలు కాదురా అయ్యా
కలలల్ల గూడ కదిలే బొమ్మల నుమాయిష్

వెండి భస్మమై ఆవరించినంక
రంగులన్నీ అరచేతిల జడకొప్పులెయ్యాలె

వాన ఎల్సిన నాలుగో జాము
వో జీరగొంతు ఇనపడి ఇనపడనట్లు
యే ట్రైలర్ కాకా పిక్చర్ అభీ బాకీ హై

– తమ్మనబోయిన వాసు, 70130 70939

దేవులపల్లి గోపాల్ కిషన్‌రావు కు నివాళి

తొలితరం జర్నలిస్టు, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు దేవులపల్లి గోపాల్ కిషన్‌రావు తన 83వ ఏట తుదిశ్వాస విడిచారు. జీవితాంతం విలువల కోసం, మానవీయ సమాజం కోసం పరితపించిన అవిశ్రాంత యోధుడు ఆయన. గోలకొండ పత్రికకు ఆ రోజుల్లో న్యూస్ కాంట్రిబ్యూటర్‌గా పని చేశారు. నిజాం ప్రభుత్వ ప్రజావ్యతిరేక చర్యలకు వ్యతిరేకంగా ప్రజాచైతన్యం కోసం పనిచేస్తూ అనేక ఉద్యమాలు నిర్వహించారు. తెలంగాణ ప్రాంతానికి జరుగుతున్న వివక్ష, అణిచివేతలకు వ్యతిరేకంగా ఉద్యమించారు. నవ యువ రచయితలకు స్ఫూర్తిదాతగా నిలిచారు. ఆయన ఆశయసాధన కోసం నేటితరం యువ రచయితలు నిబద్ధతతో పనిచేయాల్సిన ఆవశ్యకత ఉందని దేవులపల్లి ప్రభాకరరావు, ప్రభాకర్ జైని, వనం లక్ష్మీకాంతరావు, ఎం.వి.రంగారావు, అంపశయ్య నవీన్, రమా చంద్రమౌళి తదితరులు పిలుపునిచ్చారు.

- వాణీ దేవులపల్లి, 98669 62414

ప్రపంచ కవిత

డొరొతీ పార్కర్

(1893, ఆగస్టు 22-1967, జూన్ 7)



సృజనాత్మకత, హక్కుల పోరాటం, రాజకీయ సిద్ధాంతం, విస్తృత సాహితీ వ్యవసాయం, జర్నలిజం, సినీరంగ ప్రస్థానం- అన్నింటినీ ఒక్కచోట కలిపితే ప్రత్యక్షమయ్యే మానవ రూపం.

– డొరొతీ షిల్డ్ పార్కర్!

అమెరికాలోని న్యూజెర్సీ నగరంలో స్కాటిష్ తల్లికీ, జర్మన్ యూదు తండ్రికీ జన్మించిన డొరొతీ, తన 5వ ఏటనే తల్లిని కోల్పోయింది. తండ్రి మరో స్త్రీని పెళ్లాడటం నచ్చని డొరొతీ, తండ్రికీ, సవితి తల్లికీ దూరంగానే పెరిగింది. జీవిక కోసం కొద్దినాళ్లు పియానో టీచర్‌గా పనిచేసినప్పటికీ తర్వాత జర్నలిస్ట్‌గా, రచయితగా Vogue, Vanity Fair వంటి పత్రికల్లో పనిచేసింది. ఆ తర్వాత కొంతమంది మిత్రులతో కలిసి Algonquin Round Table పేరిట ఒక రచనా ఉద్యమాన్ని ప్రారంభించి, సమకాలీన అంశాలపై వ్యంగ్యంగా, చతురంగా, సరదా వ్యాఖ్యలతో రచనలు చేసి విస్తృత ప్రజాదరణ ను సాధించింది.

1914లో తన 21వ ఏట తొలి కవితను Vanity Fair పత్రికలో ప్రచురించిన డొరొతీ, 1926లో తన తొలి కవితా సంకలనం Enough Ropeతో మొదలుపెట్టి Sunset Guns (1928), Death and Taxes (1931), Not So Deep As Well (1936) వంటి కావ్యాలను ప్రచురించింది. కథలను, నాటకాలను రచించిన డొరొతీ, ఆ తర్వాత హాలీవుడ్ సినిమాలకు రచనలు చేసి A Star is Born (1937) సినిమాకు, Smash-Up, the Story of A Woman (1947) సినిమాకు గాను ఉత్తమ స్క్రీన్ ప్లే రచయిత్రిగా ఆస్కార్ అవార్డుకు నామినేషన్లు పొందింది. 1930 దశకంలో సంభవించిన ఆర్థిక మాంద్యం కాలంలో వివిధ పౌరహక్కులు, మానవ హక్కుల సంస్థలతో కలిసి చురుకుగా పనిచేసింది. 1936లో Hollywood Anti-Nazi League హక్కుల పేరిట ఒక మేధో బృందాన్ని స్థాపించి, నాటి ప్రపంచంలో విజృంభించిన ఫాసిస్ట్ విధానాలకు వ్యతిరేకంగా పోరాడింది. అలా స్వేచ్ఛా భావనల కోసం, ప్రజా హక్కుల కోసం పోరాడిన డొరొతీని కమ్యూనిస్టుగా భావించిన అమెరికా FBI ఆమెపై 1000 పేజీల నివేదికను రూపొందించింది. దీంతో హాలీవుడ్ సినీ ప్రపంచం 1949లో డొరొతీపై నిషేధాన్ని విధించింది. ఆ తర్వాత మద్య వ్యసనానికి అలవాటుపడిన ఆమె, చివరివరకూ నిత్య సంచలనాలకు మారుపేరుగా నిలిచింది.

మృత స్వప్నం!

ఇక్కడ ఓ స్వప్నం
మృతిచెంది పడి ఉంది
ఈ ప్రదేశం గుండా నువ్వు
నెమ్మదిగా నడువాల్సి ఉంటుంది సుమా!
నీ కళ్లను మరోవైపు తిప్పుకొని
నీ చూపుల భారాన్ని తెల్సుకునే ప్రయత్నం చేయకు
జీవించటం కోసం
జీవిత పోరును తట్టుకోలేక మరణించిందని
విషాద పాదాలతో నడువకు
కానీ, నీ అడుగుల్ని మాత్రం నెమ్మదిగా వెయ్యి!
నా మాటమీద దయ ఉంచి
మీ మధురమైన వివేకాన్ని ఉపయోగించి
ఆటలలో ఆశలని, వసంతాన్ని,
లేలేత ఆకాశాన్ని చూపించు!
ఇప్పటికి ఆ విషయం
దుఃఖితులందరికీ తెలిసిపోయింది.
ఇక్కడ ఒక స్వప్నం నిర్జీవమై పడి ఉందని!

ఎప్పుడైతే ఒక పండుటాకు
చెట్టు కొమ్మలలోంచి రాలిపోయిందో
పూర్వం తనలో ఉన్న ధవళ వికసనం
నిరీక్షిత జన్మల గర్వపు ఆవిష్కారం స్తంభించిందో
అప్పుడే ఒకింత ప్రేమత్వం కూడా
కనిపించకుండాపోయింది
అలాగే, సౌందర్యం కూడా
తన అసంపూర్ణ శిరస్సును
నిస్త్రాణయై వాల్చేసింది!
ఎందుకంటే..
ఆ చిరస్వప్నం మోహావేశ పరవశమై
వాంఛిత మృత్యువుతో జత కూడింది!!


మూలం: డొరొతీ పార్కర్

స్వేచ్ఛానువాదం: మామిడి హరికృష్ణ, 80080 05231

మఖ్దూమే మన సాహితీ ప్రదాత

తెలంగాణ సాహిత్యరంగాన్ని ప్రత్యేక శ్రద్ధతో అధ్యయనం చేసినప్పుడు ఏదో ఒక కొత్త సంగతి బయటపడటం ఖాయం. హైదరాబాద్ వంటి ఆధునిక నగరం తెలంగాణ నడిమధ్యలో నాలుగు వందల ఏండ్ల నుంచి ఉన్నది. నగరమేదైనా నాగరికతకు, జీవనరీతికి కేంద్రబిందువు. నాలుగు శతాబ్దాల తరబడి హైదరాబాద్ కూడా అంతే. నాలుగు సాహిత్య సంప్రదాయాలున్న నగరమిది. అనేక కళా, కవితా ఉద్యమాలకు కూడలి. కానీ 1940ల నుంచి 1956 వరకు తెలంగాణ కేంద్రంగా తలెత్తిన ప్రజా సాహిత్య ఉద్యమాలపై ఒక చీకటి తెర కమ్ముకున్నది. 1956 తర్వాత ఆంధ్ర అభ్యుదయ సాహిత్యోద్యమం, సంస్థగా అరసం, కవిగా శ్రీశ్రీ దిగుమతి కావడంతో మరింత మరుగున పడిపోయింది. మహాకవి దాశరథిని మినహాయిస్తే అభ్యుదయ సాహిత్యమన్నా, ఆధునిక సాహిత్యమన్నా ఆంధ్రదే అన్న భావం తెలంగాణలో ఏర్పడింది. అయితే తెలంగాణలో కూడా ఆనాటికి భారతదేశం, అంతర్జాతీయంగా తలెత్తిన అన్ని ఉద్యమాలను చవిచూసింది. దానికి కారణం ప్రగతిశీల లేఖక్ సంఘ్, దానికి నాయకుడు మహాకవి మఖ్దూం. ఆ తర్వాత తెలంగాణ రచయితల సంఘం. దీనికి నాయకుడు కాళోజీ. 1940ల నుంచి రావి నారాయణరెడ్డితో పాటు మఖ్దూం కూడా ఆంధ్ర మహాసభలో అగ్ర నాయకుడయ్యాడు. ఆ సభలో మఖ్దూం కవితా పఠనం గురించి ప్రగతిశీల లేఖక్ సంఘ్ గురించి దాశరథి, వెల్దుర్తి మాణిక్‌రావు, సీహెచ్ హనుమంతరావు రాసి ఉన్నారు. నాటి హైదరాబాద్ కమ్యూనిస్టు పార్టీ వల్ల బాధ్యతాయుత ప్రభుత్వం, రాచరిక, జాగీర్దారీ వ్యవస్థ రద్దుకు పోరాటాలు తలెత్తడంతో రచయితలకు ప్రేరణగా నిలిచింది. మరోరకంగా చూస్తే 1939లో స్పానిష్ తిరుగుబాటు తర్వాత అత్యధికంగా రచయితలు కలాన్ని, కత్తిని చేతబట్టి పోరాడి జైలుకెళ్లింది తెలంగాణ పోరాటాల్లోనే. 1943 నుంచి ఎంతో చురుకుగా పనిచేసిన సంస్థగా ఇంగ్లీషులో వెలువరించిన అది ఆ సంస్థ జాతీయ నివేదికలు తెలుపుతున్నాయి. ఈ సంస్థ ఆంధ్ర అరసం అది సృష్టించిన ప్రమాణాలకు భిన్నమైంది. అయితే బాపిరాజు వల్ల ఇక్కడా అరసం ఏర్పడ్డది. కానీ పేరుకే.

నాటి హైదరాబాద్ రాజ్యంలోని తెలంగాణ రచయితలు షాద్, కాళోజీ, దాశరథి, సినారె సహా యువ రచయితలకు ప్రేరణ ప్రగతిశీల లేఖక్ సంఘ్, మఖ్దూం కవితా రచనే. తెలంగాణను గొప్పగా కీర్తిస్తూ రాసిన తొలికవి ఆయనే. ఇందుకు దాఖలా వారి ఉర్దూ, ఇంగ్లీషు అనువాదాలే. కాళోజీ, సినారె, దాశరథి ఉర్దూలో కవిత్వం కూడా రాశారు. లక్నో కేంద్రంగా 1936లో ప్రేమ్‌చంద్ అధ్యక్షతన ప్రగతిశీల్ లేఖక్ సంఘ్ ఏర్పడింది. హైదరాబాద్ రాజ్యం నుంచి ఈ సభకు ఉర్దూ భాషోద్యమకారుడు, అబ్దుల్ హక్, ఆంగ్ల కవయిత్రి సరోజినీ నాయుడు ప్రాతినిధ్యం వహించారు. ఈ సంస్థపై కమ్యూనిస్టు పార్టీపై అటు బ్రిటిష్ ఇలాఖాలో, ఇటు హైదరాబాద్ రాజ్యంలో నిషేధం ఉండేది. దానితో నామమాత్రమైంది. దీంతో ఈ సంస్థలు 1940ల నుంచి ఆంధ్ర మహాసభలో లోపాయిగా పనిచేశాయి. వీటిలో మఖ్దూం రాసిన పాటలను, ఈ సభల్లో విస్తృతంగా పాడేవారు. లేఖక్‌సంఘ్, ఇండియన్ పీపుల్స్ థియేటర్ ఆర్ట్స్ 1943)లపై. నిషేధం తొలిగిపోవడంతో ప్రగతిశీల్ లేఖక్ సంఘ్ చురుకుగా మారింది. మహాకవి మఖ్దూం నేతృత్వంలో పనిచేసింది. తెలంగాణ తెలుగు రచయితపై మఖ్దూం ప్రభావమే అధికం. ఇందుకు దాఖలా ఆయన మరణించినప్పుడు తెలంగాణ రచయితల స్పందనే. ఈ కారణం వల్లనే ఆయన కాలం చేసినప్పుడు సినారె 'ప్యారే మఖ్దూం' పేరుతో గొప్ప స్మృతి కవిత రాస్తే, హీరాలాల్ మోరియా 'ఆయన జీవితచరిత్ర'పై పుస్తకం రాశారు. దాశరథి తన యాత్రా చరిత్రలో మఖ్దూం జ్ఞాపకాలను కొంతమేరకు పదిలపరిచారు. కౌముది స్మృతి కవిత రాశారు. ఇంతే కాకుండా సినారె 1950ల తొలినాళ్లలోనే మఖ్దూం కవితను అనువాదం చేశారు. తెలంగాణను ఎంతగానో ప్రేమించిన మహాకవి మఖ్దూం. ప్రపంచానికే ప్రవక్తగా సంభావించిన ఆ కవి 1969 ఉద్యమానికి కూడా మద్దతు తెలిపాడు.



పోలీసు చర్య పేరుతో జరిగిన ఇంటిగ్రేషన్, హత్యాకాండ, ఆజాద్ హైదరాబాద్ పేరుతో రజాకార్ల, విశాలాంధ్ర పేరుతో జరిగిన హింసాకాండ నేపథ్యంలో హైదరాబాద్ కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో జరిగిన తెలంగాణ సాయుధ ప్రతిఘటనతో కవిత్వం రూపంలో వచ్చిన నిరసన కూడా చాలా విశిష్టమైంది. తెలంగాణ కేంద్రంగా స్థానికంగా, జాతీయ, అంతరాతీయ స్థాయిలో వచ్చిన కవిత్వమిది తెలుగు, హిందీ, బెంగాలీ, ఉర్దూ, ఇంగ్లీషుతో సహా పోలీష్, రష్యన్ భాషల్లో ఉద్యమస్థాయిలో వచ్చిన కవిత్వమిది. తెలంగాణనే తీసుకుందాం. ఇంటిగ్రేషన్‌కు ప్రత్యక్ష సాక్షులైన సురవరం, సరోజినీ నాయుడు, మఖ్దూం, అంజద్ హైదరాబాదీ, గార్లపాటి వంటి సాహితీవేత్తల అంతే వాసులుగా కాళోజీ, దాశరథి, పొట్లపల్లి రామారావు, వానమామలై వరదాచార్యులు, నాటి యువకవులు దాశరథి, బూర్గుల రంగనాథరావు, కవి రాజమూర్తి, ఊటుకూరు రంగారావు, రాజారాం, రావెల, సినారె, యశోదారెడ్డి, సామల సదాశివ, సుప్రసన్న, పేర్వారం, రాయప్రోల్ రాజశేఖర్, ఉర్దూ కవులు హీరాలాల్ మోరియా, ఇంగ్లీషు కవులు హరిన్ చట్టో, శ్రీనివాస్ రాయప్రోల్, బాపురెడ్డి, ఇందిరా దన్‌రాజ్‌గిర్‌ల కవిత్వ సంపుటాలు మచ్చుకు కొన్నిమాత్రమే. ఫాసిజాన్ని, నాజీజాన్ని నిరసిస్తూ వచ్చిన అంతర్జాతీయ ప్రగతిశీల సాహిత్యోద్యమం శాంతిపేరుతో బలహీన పడిన కాలాన హైదరాబాద్, తెలంగాణ కేంద్రంగా వచ్చిన కవిత్వమిది. పూర్తిగా స్థానిక పరిస్థితుల నుంచి రూపుదిద్దుకున్నది. మలిదశ తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సందర్భంలో కాళోజీ నా గొడవ, పొట్లపల్లి రామారావు ఆత్మ నివేదన, దాశరథి కవిత చర్చలోకి వచ్చాయి. అదికూడా నామ మాత్రమే. నాటి ఈ కవులకు స్వతంత్ర ప్రచురణ సంస్థలు, స్రవంతి, శోభ (ఓయు), సారస్వత జ్యోతి వంటి తెలంగాణ పత్రికలు వేదికయ్యాయి. 1946 నుంచి 1954ల మధ్య వరదలా ఉరకలేసిన ఈ కవితోద్యమానికి అటు విశాలాంధ్ర కోసం ప్రచారంలో పెట్టిన అభ్యుదయ సాహిత్యోద్యమానికి అసలు సంబంధం లేదు. భారత జాతీయుడు నిజాం పాలిత ప్రాంతమైన హైదరాబాద్ రాజ్యం సామాజిక, రాజకీయ పరిస్థితులు, భాషలు, జీవనరీతి మద్రాసులో భాగమైన ఆంధ్ర సామాజిక పరిస్థితులు భాష పూర్తిగా వేర్వేరు.

రెండు ప్రపంచయుద్ధాల మధ్య అంతర్జాతీయంగా తలెత్తిన డాడా, సర్రియలిస్టు ధోరణుల ప్రభావం కూడా తెలంగాణ నుంచి వెలువడిన కవిత్యోద్యమంపై పడింది. సారాంశంలో చూస్తే రెండు ప్రపంచ యుద్ధాల మధ్యకాలంలో స్పానిష్‌సివిల్ వార్, ఫాసిస్ట్ వ్యతిరేక పోరాటాలకు రచయితలకు, కవులకు ప్రేరణగా నిలిచాయి. దాని తర్వాత తెలంగాణ కేంద్రంగా హైదరాబాద్ రాజ్యం ఆ తర్వాత వెలువడిన సాహి త్యం వాటి స్థాయికి ఏ మాత్రం తీసిపోదు.

రెండూ పూర్తిగా భిన్న ప్రపంచాలు. రెండు దేశాల మధ్య ఉండే తేడా వంటిది. అందుకే ఆ తేడా నాటి తెలంగాణ, ఆంధ్ర సాహిత్య రంగాల్లో కూడా ప్రతిఫలించింది. కారణం దాని ప్రమాణాల కంటే భిన్నమైంది. ఆంధ్ర అభ్యుదయ సాహిత్యం పేరుతో ప్రచారంలో పెట్టిన ముస్లిం వ్యతిరేకత, హింసాకాండను తెలంగాణపై ప్రతికూలత, తెలుగు సెంటిమెంట్ వంటివి తెలంగాణ కవులు ఏనాడు ఖాతరు చేయలేదు. ఈ కవులనే తీసుకుందాం. వీరు ప్రచారంలో పెట్టిన కవితా విలువలు, ప్రమాణాలు, ప్రాధామ్యాలు పూర్తిగా భిన్నమైనవి. సార్వజనీనత, వర్గ పోరాటం, జన సామాన్యం పక్షం, సెక్యులరిజం, సహా స్థానికత, ఉర్దూ ప్రభావం వల్ల కావచ్చు విషాద ప్రణయం, ప్రగతిశీల లేఖక్ సంఘ్ వల్ల కావచ్చు అంతర్జాతీయ ప్రభావం కూడా కనిపిస్తుంది. దీనివల్లే తమ చుట్టుముట్టు ఆవరించిన రాజకీయ, సామాజిక పరిస్థితులపై తిరుగుబాటు నిరసన, ఆందోళన ప్రధాన లక్షణాలుగా ఈ కవితోద్యమం నడిచింది. నాటి కవితా సంపుటాల పేర్లు కూడా దీన్ని ప్రతిబింబిస్తున్నాయి. మచ్చుకు కాళోజీ నా గొడవ, పొట్లపల్లి రామారావు ఆత్మనివేదన, సినారె జలపాతం (కన్నీటి) కవిరాజమూర్తి మహైక కవితా ప్రమాణాలే కాదు ఈ పేర్లు కూడా ఆయా కవుల నిరసనను తెలియజెప్పేవి. నాటి పరిస్థితులపై గొప్ప నిరసన కావ్యాలివి. నాటి హైదరాబాద్ రాజ్యం అందులో భాగమైన తెలంగాణ దుర్బల స్థితిని బాగా ప్రతిబింబించాయి. హైదరాబాద్ రాజ్యం విలీనం, దాని దరిమిలా ఏర్పడిన యుద్ధ వాతావరణం, సంఘర్షణను చాలా గొప్పగా ప్రతిబింబించిన మహా కావ్యాలు దాశరథి, అగ్నిధార, రుద్రవీణ, కవి రాజమూర్తి మహైక మానవ సంగీతం, సినారె జలపాతం, విశ్వగీతి. రెండు ప్రపంచ యుద్ధాల మధ్య ప్రబలిన బీభత్సకర పరిస్థితులను, సామాన్యుల విషాదాన్ని, క్షీణ విలువలను చిత్రించిన ఆంగ్లకవి టి.ఎస్.ఇలియట్ రాసిన వేస్ట్‌లాండ్ 'మహైక' ముందుమాట కర్తలు పోల్చారు. చాలా అర్థవంతమైన పోలిక అది. నాటి హైదరాబాద్ రాజ్యం అందులో భాగమైన తెలంగాణలో పూర్తి యుద్ధ పరిస్థితులు నెలకొన్నాయి. ఆ పరిస్థితులను పరోక్ష ప్రతిఫలనాలను ఊటుకూరు రంగారావు శరధార, అష్టకాల రామ్మోహనశర్మ శిథిల విపంచి కావ్యాలు కూడా చిత్రించాయి. హైదరాబాద్ రాజ్యం భారత్‌లో విలీనమైనా మారని పరిస్థితులపై దుఃఖపూరిత విషాదం, ఆవేదన నిరసన వ్యక్తం చేసిన మహా కావ్యాలివి. మరొక సంగతి చెప్పుకోవాలి. కాళోజీ కవిత పార్థివ వ్యయం బొంబాయి నావికా తిరుగుబాటును చిత్రించింది. రెండు ప్రపంచయుద్ధాల మధ్య అంతర్జాతీయంగా తలెత్తిన డాడా, సర్రియలిస్టు ధోరణుల ప్రభావం కూడా తెలంగాణ నుంచి వెలువడిన కవిత్యోద్యమంపై పడింది. సారాంశంలో చూస్తే రెండు ప్రపంచయుద్ధాల మధ్యకాలంలో స్పానిష్‌సివిల్ వార్, ఫాసిస్ట్ వ్యతిరేక పోరాటాలకు రచయితలకు, కవులకు ప్రేరణగా నిలిచాయి. దాని తర్వాత తెలంగాణ కేంద్రంగా హైదరాబాద్ రాజ్యం ఆ తర్వాత వెలువడిన సాహిత్యం వాటి స్థాయికి ఏ మాత్రం తీసిపోదు. ఇంతటి చరిత్రకు కారణమైన భారత కమ్యూనిస్టు పార్టీ అగ్రశేణి నాయకుడు, దక్షిణాది నుంచి మొదటి పొలిట్‌బ్యూరో సభ్యుడు రావి నారాయణరెడ్డి ఆయన ప్రియమిత్రుడు మఖ్దూంకు తెలంగాణ ప్రజల పక్షాన నా జోహార్లు.

– సామిడి జగన్‌రెడ్డి, 85006 32551

అమ్మలాంటి కావ్యం..



ఏ కవైనా,రచయితైనా తన జీవితం చవిచూసి న అనుభవాల నుంచో, అనుభూతుల నుంచో ఏదో ఒక విషయం తీసుకుని, దానికి తమవైన తాత్విక చింతనలు, కల్పనలు జోడించి సాహిత్యంగా ప్రపంచానికి అందిస్తారు. అనుభవం నుంచి పలువరించినపుడు పురుడుపోసుకున్న కవిత్వానికి, ఊహాత్మకంగా చెప్పిన సాహిత్యానికి ఆర్ద్రతలో, అభివ్యక్తిలో తేడా ఉంటుంది. ఆనాడు దళిత వేదనలో మగ్గి ప్రసవించబడిన 'గబ్బిలం' కావ్యమైనా, తాడిత పీడిత కన్నీటి చారికలు అనుభవించి శిగమెత్తిన 'మహా ప్రస్థానం' గీతాలైనా గుండె లోతుల్లోని తడిని అద్దుకుని పుట్టినవే. అలాంటి హృదయ వేదన, సంవేదన నుంచి పుట్టిన కవిత్వం యువ కవి కుంచె లక్ష్మీనారాయణ కలం నుంచి అక్షరీకరించబడిన భావోద్వేగమైన కావ్యం **'అమ్మ పేరే నా కవిత్వం'**. గతం తాలూకు స్మృతిని, వర్తమాన భవిష్యత్ కాలాల్లో తల్లీ కొడుకుల అనుబంధాలకు, విలువలకు ప్రతిరూపంగా నిలిచి అనురాగాన్ని, సందేశాన్ని మోసుకొచ్చిన కావ్యం **'అమ్మ పేరే నా కవిత్వం'**. ఈ కవితా సంపుటి అణువణువునా అనుభూతి నిండిన నాస్టాల్జియా, ఆర్ద్రత నిండిన కవిత్వం ఉన్నది. ఈ సంపుటిని పాఠకుడు తల్లీ కొడుకుల కథగా, కావ్యంగా అనుభూతి చెందుతాడు.

వస్తువు శిల్పంతో సంబంధం లేకుండా, ప్రతి మనసును ఆర్ద్రతతో నింపేది ఏదైనా వుంది అంటే, ఆ వస్తువుకు రూపం అమ్మ. మరి వస్తువు, శిల్పం రెండూ అమ్మే అయితే.. పాఠకుడికి ఆ కవిత్వం అమ్మ పాడిన జోలపాటే.**'చందమామ రావే జాబిల్లి రావే..'** అని ఎన్నిసార్లు కవితల్లో చూసినా, ప్రతీసారీ ఓ కొత్త అనుభూతి మనసును పసి తనపు అమ్మ ఒడిలోకి తీసుకెళ్లుతుంది. అలాంటిది దాదాపుగా ఒక కవితా సంపుటి మొత్తం అమ్మే వస్తువుగా సాగితే అది పాఠకుడిని తిరిగి తన మాతృమూర్తి పొత్తిళ్ళలో తాను ఉమ్మ నీటిలో ఉన్నప్పుడు,అమ్మ చెప్పిన కథల దగ్గరి నుంచి,చేయి పట్టుకుని నడిపిన బాల్యాన్నీ, గోరు ముద్దలను, లాలి పాటలను హృదయాంతరాలలో పలికిస్తుంది. అలాంటి కావ్యానికి చిరునామా **'అమ్మ పేరే నా కవిత్వం'**.

ముఖ్యంగా పల్లెటూరిలో పెరిగిన బాల్యానికి ప్రతీకగా కవితా వాస్తుశిల్పం సాగింది. పచ్చని పంట పొలాల నడుమ పెరిగిన వారు, ఈ కవిత్వాన్ని చదువుతున్నంత సేపు తమ బాల్యంతో తాము నడిచి వెళ్తున్న అనుభూతిని పొందుతారు. అయితే ఈ కవితా సంపుటికి ఉన్న ప్రత్యేకత 'నవ మాసాలు మోసిన అమ్మకు, కొడుకే అమ్మైన సందర్భం'. ఈ సంపుటిని చదువుతున్నప్పుడు పాఠకుణ్ణి రెండు ఆత్మల్లోకి పరకాయ ప్రవేశం చేపిస్తాడు కవి. అప్పటి వరకు వస్తువులోని అమ్మను తన అమ్మగా, కవి బాల్యాన్ని తన బాల్యంగా ఊహా ప్రపంచంలో విహరిస్తున్న పాఠకుడిని 'అమ్మ చేయి అలిగింది' అన్న కవిత నుంచి తనదైన ప్రపంచంలోకి తీసుకెళ్తాడు కవి. సంపుటిలో నాన్న వస్తువుగా కొన్ని కవితలు సాగినా, అవి అంతర్లీనంగా తల్లి సంవేదనను తెలియజెప్పేవే. 'అమ్మతో నేను' అనే కవితలో 'తన కడుపుకు తానే కాపరై' అనడం ద్వారా కాపరి అన్న పదానికి మరో భాష్యం చెప్పారు.'తన హృదయంతో నా హృదయానికి రక్త సంబంధాన్ని జోడిస్తూ' అనడం కవి అంతరాల్లో దాగిన ఆత్మబంధానికి నిదర్శనం. ఓ చోట **'నా ఊతం లేని పరుగు చూపి తాను విజయం సాధించిన ఆనందం..'** అనడంలో పుత్రుడు స్వతంత్రుడైతే తల్లి కళ్ళలో మెరిసే కాంతిని అందంగా చిత్రించాడు కవి. ఎన్ని సార్లు విన్నా, ఎన్ని మార్లు చూసినా తనివితీరని అమ్మ పద ముద్దలను ఈ కవితలో జొప్పించాడు.

చిరిగినా చొక్కా కవితలో.. **'నేను ఇంటికి మోసుకెల్లేది/రేగి చెట్ల జ్ఞాపకాలు/కంప చెట్ల గుర్తులు..'** అని అభివ్యక్తీకరించడం పల్లెటూరి బాల్యానికి నిదర్శనంగా నిలుస్తూనే, ఈనాటి పట్టణాలలోని పిల్లలు ఏయే జ్ఞాపకాలను, అనుభూతులను కోల్పోతున్నారో చెప్పే సందేశాన్ని చెప్పకనే చెప్పాడు కవి.

ఓ చోట సూర్యుణ్ణి పిల్లాడితో పోల్చి, భూమిని అమ్మతో పోల్చి, చక్కని పోలికలను ఆవిష్కరించారు. అప్పటి వరకు తండ్రి,భర్త ప్రపంచంగా ఉన్న ఆమెకు,అమ్మయ్యాక ఆ బిడ్డే ప్రపంచమనే అంతర్లీన సహజ భావాలను ప్రకటించారు. ఓ చోట 'ఉషోదయ కిరణాలను అమ్మ మాటల తాకిడితో..' పోలిక చేయడం మంచి ప్రతీక. **'దారి పొడవునా అమ్మ జ్ఞాపకాలు'** అనే కవిత ఇటు వర్తమానంలో, అటు స్మృతిలో అమ్మ జ్ఞాపకాలతో సాగే చక్కని కవిత. అమ్మను,అమ్మ ప్రేమను ఎన్నో ప్రతీకలతో ఈ కావ్యంలో అక్షరీకరించారీ యువకవి. అమ్మ ప్రేమనే కాదు,ఆ అమ్మ పలుకులకు కారణమైన అమ్మ భాషనూ 'నాతోనే నాలోనే అమ్మ భాష' అంటూ 'అమ్మే నాలో నిండిపోయిన శ్వాస' అన్న అభివ్యక్తి కవిలో అణువణువునా పరిమళిస్తున్న, స్మరిస్తున్న అమ్మ తత్వానికి నిదర్శనం. ఇలా అమ్మే వస్తువుగా, శిల్పంగా, అభివ్యక్తిగా రూపుదిద్దుకున్న ఈ కావ్యం ప్రతీ పాఠకుడికి ఏదో సమయంలో తన తల్లిని, బాల్యాన్ని గుర్తుకు తెచ్చి కనుల వెంట కన్నీటి చెమ్మలను మెరిపించగలదు **'అమ్మ పేరే నా కవిత్వం'**.

– పరవస్తు విశ్వక్సేన్, 83283 84951

కొత్త పుస్తకాలు

కవిత్వ భాష (సాహిత్య వ్యాసాలు)




కవిత్వం భాష యొక్క భాష అంటారు వేగుంట మోహన ప్రసాద్. బొల్లోజు బాబా కవిత్వ భాష అంటున్నారు. ఏది కవిత్వ భాష, ఎందుకు కవిత్వ భాష సాధారణ భాషకంటే భిన్నంగా ఉంటుంది? ఇంకా ఇట్లాంటి ప్రశ్నలకు సమాధానం ఈ పుస్తకంలో దొరుకుతుంది.

రచన: బొల్లోజు బాబా, వెల: రూ. 100, ప్రతులకు: బొల్లోజు బాబా, 30-7-31, సూర్యనారాయణ పురం, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లా సెల్: 9849320443

భూమిక

(సుధామ- పీఠికలు,ముందు మాటలు)



సుధామ అసలు పేరు అల్లంరాజు వెంకటరావు. పద్నాలుగో ఏట నుంచే కవిత్వం రాస్తూ కార్టూన్లు గీస్తూ ప్రపంచానికి తెలుసు. సుధామ రాసిన పీఠికలు, ముందుమాటల సంకలనం ఇది. విస్తారమైన తెలుగు సాహిత్యానికి ప్రవేశిక లాంటి ఆయన రచనల ప్రతిబింబం ఈ పుస్తకం..

సంపాదకులు: అల్లంరాజు ఉషారాణి, వెల: రూ. 300, ప్రతులకు: అన్ని ప్రధాన పుస్తక కేంద్రాలు

నిదురించే తోటలోకి

(నవల)



అనేక నవలలు, కథలు రాసిన మన్నెం శారద నలభై నాలుగవ నవల 'నిదురించే తోటలోకి'.కౌముది అంతర్జాల పత్రికలో మూడేండ్లు ధారావాహికంగా ప్రచురింపబడి పాఠకుల ప్రశంసలందుకున్న నవల నిదురించే తోటలోకి...

రచన: మన్నెం శారద, వెల: రూ. 150, ప్రతులకు:జ్యోతి వలబోజు, ఫోన్:8096310140

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229..

కేటీఆర్ చొరవతోనే చేనేతకు పునరుజ్జీవం

- 'మల్లేశం' చిత్రంతో చేనేత రంగానికి విశ్వవ్యాప్త ఆదరణ
- బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు ఆకాంక్ష

సిరిసిల్ల టౌన్: అణగారిన వర్గాలే సంపద సృష్టి కర్తలని.. సామాన్యులే సమాజ ప్రగతిరథ చక్రాలని బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు అన్నారు. స్థానిక ఎమ్మెల్యే, టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అందిస్తున్న ప్రోత్సాహంతోనే చేనేతరంగం పునరుజ్జీవం పోసుకుంటున్నదని కొనియాడారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఆలయ, కలయిక ఫౌండేషన్, శ్రీనివాస చారిటబుల్ ట్రస్టుల ఆధ్వర్యంలో 'కలయిక' 28వ వార్షికోత్సవాన్ని స్థానిక పద్మశాలీ కల్యాణ మండపంలో ఆదివారం రాత్రి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీసీ కమిషన్ చైర్మన్ రాములు, కవి, వాగ్గేయకారుడు గోరటి వెంకన్న ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తొలుత 'చేనేత పరిశ్రమ' చరిత్రను తెలిపే ఇతివృత్తాంతంతో రూపొందించిన 'మల్లేశం' సినిమా పోస్టర్‌ను ఆ చిత్ర హీరో ప్రియదర్శి, దర్శక నిర్మాతలతో కలిసివారు ఆవిష్కరించారు. అనంతరం బీఎస్ రాములు మాట్లాడుతూ.. ఆగస్టు 7వ తేదీని జాతీయ చేనేత దినోత్సవంగా నిర్వహించడం గర్వకారణమన్నారు. తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని చేనేత కార్మికులకు పిలుపునిచ్చారు. మల్లేశం చిత్రం ద్వారా చేనేత రంగానికి విశ్వవ్యాప్త ఆదరణ లభిస్తుందని ఆకాంక్షించారు.


పద్మశ్రీ పురస్కార గ్రహీత చింతకింది మల్లేశానికి వివేకానంద ఎక్సలెన్సీ అవార్డు అందజేస్తున్న బీసీ కమిషన్ చైర్మన్ రాములు, నిర్వాహకులు

పద్మశ్రీ పురస్కార గ్రహీతలకు సత్కారం..

ఈ వేడుకలో పలువురు పద్మశ్రీ పురస్కార గ్రహీతలను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. గజం గోవర్ధన్, గజం అంజయ్య, చింతకింది మల్లేశానికి వివేకానంద ఎక్సలెన్సీ అవార్డులను బీసీ కమిషన్ చైర్మన్ రాములు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు వెంకటనారాయణ, కవి, రచయిత పెద్దింటి అశోక్, మున్సిపల్ అధ్యక్షురాలు పావని, శ్రీనివాస చారిటబుల్ ట్రస్టు చైర్మన్ శ్రీనివాస్, కలయిక ఫౌండేషన్ నిర్వాహకులు నారాయణ పాల్గొన్నారు.

మంటగలిసిన మానవత్వం

అద్దెకుంటున్న ఇంట్లో మహిళ మృతి.. దవాఖాన నుంచి నేరుగా శ్మశానానికి

అంత్యక్రియల తరువాత కుటుంబ సభ్యులను ఇంట్లోకి రానివ్వని యజమాని

జగిత్యాల రూరల్: అద్దె ఇంట్లో నివాసం ఉండే ఓ కుటుంబంలోని మహిళ అనారోగ్యంతో దవాఖానలో మృతి చెందగా.. కుటుంబ సభ్యులు అటునుంచి అటే నేరుగా శ్మశానవాటికకు తీసుకెళ్లి దహనసంస్కారాలు నిర్వహించారు. ఆ తరువాత ఇంటికి వచ్చిన వారిని లోనికి వెళ్లకుండా ఇంటియజమాని అడ్డుకున్నాడు. ఈ ఘటన జగిత్యాల మండలం లక్ష్మీపూర్‌లో చోటుచేసుకున్నది. లక్ష్మీపూర్‌కు చెందిన ఇల్లందుల పద్మ(41) తన భర్త శ్రీనివాస్, ఇద్దరు పిల్లలు పల్లవి, హర్షవర్ధన్‌తో కలిసి అదే గ్రామంలోని ఓ అద్దె ఇంట్లో నివాసముంటున్నారు. వారం క్రితం పద్మ తీవ్ర అస్వస్థతకు గురికాగా జగిత్యాల ప్రభుత్వ దవాఖానలో చేర్పించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. సొంతిల్లు లేకపోవడంతో కుటుంబసభ్యులు ఆమె మృతదేహాన్ని దవాఖాన నుంచి నేరుగా శ్మశానవాటికకు తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు. ఆ తర్వాత సదరు కుటుంబ సభ్యులు అద్దెఇంటికి చేరుకోగా లోనికి వెళ్లకుండా యజమాని అడ్డుకున్నాడు. దీంతో వారు చేసేదేమీ లేక గ్రామంలోని ఓ చెట్టు కిందకు చేరుకున్నారు. స్థానిక ఫ్రెండ్స్ యూత్ సభ్యులు స్పందించి ఆ కుటుంబానికి అదే చెట్టు కింద టెంట్ వేసి నీడ కల్పించారు.


టెంటుకింద నివాసం ఉంటున్న బాధిత కుటుంబం


ఎస్వీ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, చిత్రంలో ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ తదితరులు

ఎయిడెడ్ కళాశాలల పరిరక్షణకు ప్రత్యేక కార్యాచరణ

- ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి వెల్లడి
- ఎస్వీ కళాశాలలో అ'పూర్వ'సమ్మేళనం

సూర్యాపేటవ్యవసాయం/భానుపురి: తెలంగాణ ప్రభుత్వం ఎయిడెడ్ కళాశాలల పరిరక్షణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించనున్నదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి అన్నారు. సూర్యాపేటలోని శ్రీవేంకటేశ్వర డిగ్రీ కళాశాల స్థాపించి 47ఏండ్లు పూర్తికావడంతో ఆదివారం సూర్యాపేటలోని కళాశాల ఆడిటోరియంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు. సుమారు రెండువేల మందికిపైగా హాజరైన పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. పూర్వ విద్యార్థులైన మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ తదితరులు హాజరయ్యారు. ఫొటో గ్యాలరీలో అప్పటి తమ ఫొటోలను చూసి పూర్వ విద్యార్థులు మురిసిపోయారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎస్వీ డిగ్రీ కళాశాలలో చదువుకోవడం వల్ల తనకు మంచి బోధన అందడంతోపాటు, విద్యార్థి సంఘాల ద్వారా రాజకీయాలతోపాటు సమాజాన్ని చదువుకోగలిగి నేడు రాజకీయాల్లో రాణిస్తున్నానని చెప్పారు. అలాంటి కళాశాల అభివృద్ధికి సహకరిస్తానన్నారు. ఎంపీ బడుగుల మాట్లాడుతూ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి కోరిక మేరకు కళాశాల అభివృద్ధికి తన నిధుల నుంచి రూ.10లక్షలు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ రవీంద్రాచారి, పూర్వ విద్యార్థుల సంఘం ప్రధాన కార్యదర్శి వడ్డాణం శ్రీనివాస్, సమన్వయకర్త నంద్యాల దయాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓట్లేయలేదంటూ గడ్డివాముకు నిప్పు

టేకులపల్లి: తమ అభ్యర్థికి ఓట్లు వేయలేదంటూ కొందరు వ్యక్తులు ఓ కుటుంబానికి చెందిన గడ్డివాముకు నిప్పుపెట్టిన ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం రాంపురం తండాలో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకున్నది. టేకులపల్లి ఎస్సై ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం.. రాంపురంతండాలో సర్పంచ్ పదవికి ఇస్లావత్ కాంతి అనే మహిళ స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేశారు. కాగా ఫలితాల్లో ఆమె ఐదు ఓట్లతో ఓటమి పాలయ్యారు. టీఆర్ఎస్ సానుభూతిపరుడైన భద్రు కుటుంబ సభ్యులు నలుగురు ఓట్లు వేయకపోవడం వల్లే తాము ఓడిపోయామని కాంతి వర్గీయులు వారితో ఘర్షణకు దిగారు. తాము కాంతికే ఓటు వేశామని భద్రు కుటుంబ సభ్యులు పసుపు, బియ్యం చేతపట్టుకుని ప్రమాణం కూడా చేశారు. ఈ నేపథ్యంలో శనివారం అర్ధరాత్రి కొందరు వ్యక్తులు భద్రుకు చెందిన గడ్డివాముకు నిప్పుపెట్టారు.

వేల్పూర్‌లో ఫుడ్ ప్రాసెసింగ్!

యూనిట్ నెలకొల్పాలని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి వినతి

పైలట్ ప్రాజెక్టు ఏర్పాటుకు సర్కార్ యోచన.. రేపటి సమావేశంలో నిర్ణయం!

రైతులు, మహిళా సంఘాలకు ప్రయోజనం

వేల్పూర్: నిజామాబాద్ జిల్లా వేల్పూర్‌లో పైలట్ ప్రాజెక్టు కింద ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ నెలకొల్పేందుకు ప్రభుత్వం యోచిస్తున్నది. వేల్పూర్‌లోని పసుపు పరిశోధనా కేంద్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేసే అవకాశాలను అధికారులు పరిశీలిస్తున్నారు. ఈ ప్రాంతంలో పసుపు సాగవుతుండటం, నిజామాబాద్, జగిత్యాల, నిర్మల్, కామారెడ్డి జిల్లా ల్లో మిర్చి, పప్పు దినుసులు సాగు అధికంగా ఉండటంతో వేల్పూర్‌లో ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు కోసం బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఇక్కడ ఫుడ్ ప్రాసెసింగ్ పైలట్ ప్రాజెక్టు చేపట్టే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అయితే ఈ విషయమై ఉన్నతస్థాయి సమావేశంలో స్పష్టత రావాల్సి ఉన్నది.

ప్రాసెసింగ్‌కు అనువైన ప్రాంతం..

రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధర రావడానికి, మహిళల ఆదాయాభివృద్ధికి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను నెలకొల్పడం చక్కని పరిష్కారమని సీఎం కేసీఆర్ భావించారు. సీఎం ఆదేశాల మేరకు వ్యవసాయ, ఉద్యాన, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖలు, సెర్ప్ ఉన్నతాధికారులు ఇదివరకే పలు ఉన్నత స్థాయి సమావేశాలు నిర్వహించారు. బాల్కొండ ఆర్మూర్ ప్రాంతాల్లో పసుపు అత్యధికంగా సాగు చేస్తారు. జిల్లాలో ఏటా సరాసరిన 78,300మెట్రిక్‌టన్నులు ఉత్పత్తి అవుతుంది. సగటున 32 వేల ఎకరాల్లో సాగవుతున్నది. ఇందులో ఎక్కువ సాగయ్యేది బాల్కొండ, ఆర్మూర్ నియోజకవర్గాల్లోనే. ఈ సారి బాల్కొండలో 19 వేల ఎకరాల్లో, ఆర్మూర్‌లో 9,800 ఎకరాల్లో, నిజామాబాద్ రూరల్‌లో 6 వేల ఎకరాల్లో సాగయ్యింది. దీనికితోడు జగిత్యాల, కరీంనగర్, నిర్మల్ జిల్లాల్లో సాగయ్యే పసుపు కూడా నిజామాబాద్ మార్కెట్‌కే వస్తుంది. పసుపు పార్కు వేల్పూర్ మండలంలో ఉంది. ఈ మండలంలోని అంక్సాపూర్, తదితర గ్రామాలు పసుపు సాగుకు పెట్టింది పేరు.

పొరుగు జిల్లాల్లోని పసుపు నిజామాబాద్‌కు..

ఆర్మూర్ డివిజన్‌తోపాటు పొరుగు జిల్లాల నుంచి పసుపు ఉత్పత్తులు జనవరి నుంచి మార్చి వరకు నిజామాబాద్ జిల్లా మార్కెట్‌కు వస్తాయి. ఇక్కడినుంచి అంతర్జాతీయ మార్కెట్‌కు వెళ్తుంది. గతంతో పోలిస్తే ఇప్పుడు నాణ్యమైన వంగడాల సాగు జరుగుతున్నందున కుర్కుమిన్ శాతం అధికంగా ఉండే పసుపు రాక పెరుగుతున్నది. కొనుగోలు ప్రారంభమయ్యే జనవరి నుంచి ఏప్రిల్, జూన్ వరకు ఇక్కడ ప్రాసెసింగ్ చేసుకునే అవకాశం ఉన్నది. పసుపు ఆధారిత ఉప ఉత్పత్తుల ద్వారా ఇక్కడ మహిళా సంఘాలకు ఆదాయం చేకూరే అవకాశం ఉంటుంది. పసుపునకు తోడు మిర్చి, పప్పు దినుసుల ప్రాసెసింగ్‌కు కూడా జిల్లాతో పాటు పొరుగు జిల్లాల నుంచి వచ్చే మిర్చి, కందులు, పెసర్లు అందుబాటులో ఉంటాయి.


నిజామాబాద్ జిల్లా వేల్పూర్‌లోని పసుపు పరిశోధన కేంద్రం

రైతులకు ఎంతోమేలు..


ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటైతే రైతులకు ఎంతోమేలు జరుగుతుంది. వేల్పూర్‌లో యూనిట్ ఏర్పాటుకు కృషి చేస్తున్న ఎంపీ కల్వకుంట్ల కవిత, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డికి గ్రామస్థులు రుణపడి ఉంటారు. **-ఏలేటి చిన్నారెడ్డి, రైతు**

చేతినిండా పని దొరుకుతుంది..


ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటైతే మహిళా సంఘాల సభ్యులకు చేతినిండా పని దొరుకుతుంది. సీఎం కేసీఆర్ చేస్తున్న కొత్త ఆలోచనలతో మహిళలు ఆర్థికంగా బలపడుతారు. **– గైని లక్ష్మి, మండల మహిళా సమైక్య అధ్యక్షురాలు, వేల్పూర్**

రైతులకు గిట్టుబాటు ధర రావడానికి దోహదపడుతుంది. అధికారులు పరిశీలించిన కేంద్రం.. రవాణా సౌకర్యానికి, నీటి వసతి, ఇదివరకే ఉన్న ధాన్యం ఆరబెట్టే ప్లాట్ ఫారాలతో అనువుగా ఉన్నది. వేల్పూర్ ఎక్స్ రోడ్డులోనే నెలకొల్పుతున్న పసుపు పార్కులోనే ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుతో చేస్తే ఎంతో మేలు జరుగుతుందని పలువురు భావిస్తున్నారు.

రేపు హైదరాబాద్‌లో సమావేశం

వేల్పూర్‌లో ఫుడ్ ప్రాసెసింగ్ ఏర్పాటు విషయమై ఈనెల 5న హైదరాబాద్‌లో ఉన్నతాధికారులు సమావేశం నిర్వహించనున్నారు. ఇక్కడ ఫుడ్ ప్రాసెసింగ్ ఏర్పాటుకు ఉన్న సదుపాయాలను జిల్లా అధికారులు ఉన్నతాధికారులు విన్నవించనున్నారు. ఈ సమావేశం తరువాత యూనిట్ ఏర్పాటుపై స్పష్టమైన ఆదేశాలు వచ్చే అవకాశాలు ఉన్నాయి.



యూనిట్ ఏర్పాటుతో ఎందరికో ప్రయోజనం

వేల్పూర్‌లో ఫుడ్ ప్రాసెసింగ్ ఏర్పాటుకు అనువైన ప్రాంతం. ఇక్కడ ఈ యూనిట్ ఏర్పాటైతే మహిళలకు ప్రయోజనంతోపాటు రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. ఈ ప్రాంతంలో పసుపు, చుట్టుపక్కల జిల్లాల్లో మిర్చి, పప్పు దినుసులు పండించే రైతులు అధికంగా ఉన్నారు. అందుకే వేల్పూర్‌లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశా. **-వేముల ప్రశాంత్‌రెడ్డి, బాల్కొండ ఎమ్మెల్యే**

గంజాయి పట్టివేత

పటాన్‌చెరు రూరల్, నమస్తే తెలంగాణ: సంగారెడ్డి జిల్లా ముత్తంగి ఓఆర్ఆర్ టోల్‌ప్లాజా వద్ద ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రూ. 20 లక్షలు విలువచేసే గంజాయిని స్వాధీనం చేసుకొని నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ కమిషనర్ కేఏబీ శాస్త్రి తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం రాత్రి ముత్తంగి ఓఆర్ఆర్ మీదుగా గంజాయిని తరలిస్తున్నట్టు సమాచారమందడంతో తనిఖీలు నిర్వహించి రెండు వాహనాల్లో తరలిస్తున్న గంజాయిని సీజ్‌చేశారు. నిందితులను ఒడిశాకు చెందిన దేవేందర్ అనుపాల్, నారాయణఖేడ్ నాగల్‌గిద్దకు చెందిన సంజీవ్‌లుగా గుర్తించారు. నిందితులతోపాటు వాహన డ్రైవర్లు జే సింగ్, మణికంఠలను రిమాండ్‌కు తరలించారు.

భర్తకు తలకొరివి పెట్టిన భార్య

డిచ్‌పల్లి, నమస్తే తెలంగాణ: నిజామాబాద్ జిల్లా ఇందల్వాయికి చెందిన శ్రీపతి నడిపి సాయిలు శనివారం రాత్రి గుండెపోటుతో మృతిచెందాడు. సాయిలు కుమారుడు దుబాయ్‌లో ఉండడంతో అంత్యక్రియలకు రాలేదు. దీంతో సాయిలు భార్య సత్యవ్వ భర్త చితికి తలకొరివి పెట్టారు. అంత్యక్రియల్లో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు పాల్గొన్నారు.


కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్‌లోని కాళేశ్వరం ఎనిమిదో ప్యాకేజీ టన్నెల్‌లో పంప్‌హౌస్‌ను పరిశీలిస్తున్న చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, ప్రజాప్రతినిధులు

'కాళేశ్వరం' ప్రపంచస్థాయి ప్రాజెక్టు

- చొప్పదండి ఎమ్మెల్యే రవిశంకర్
- లక్ష్మీపూర్ కాళేశ్వరం ఎనిమిదో ప్యాకేజీ సందర్శన

రామడుగు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు ప్రపంచస్థాయి ప్రాజెక్టుల్లో అగ్రస్థానంలో నిలిచిందని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గంలోని రామడుగు మండలం లక్ష్మీపూర్‌లో నిర్మిస్తున్న కాళేశ్వరం ఎనిమిదో ప్యాకేజీని ఆదివారం రామడుగు, గంగాధర, చొప్పదండి, కొడిమ్యాల మండలాలకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులతోకలిసి ఆయన సందర్శించారు. ప్రాజెక్టు అధికారులతో వాహనాల్లో సుమారు 115 మీటర్ల లోతులో ఉన్న సర్జిపూల్‌కు వెళ్లారు. అక్కడి నుంచి పంపుహౌస్ చేరుకొని ట్రాన్స్‌ఫార్మర్‌బేలో బాహుబలి మోటర్లను పరిశీలించారు. అనంతరం గ్రావిటీ కాలువను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాళేశ్వరం పూర్తయితే నిరుద్యోగులు గల్ఫ్ దేశాలకు వలస పోవాల్సిన అవసరం ఉండదన్నారు. శ్రీరాంసాగర్ పునర్జీవన పథకంలో భాగంగా ఎనిమిదో ప్యాకేజీ నుంచి నేరుగా వరదకాలువ ద్వారా తిరిగి పోచంపాడుకు రివర్స్ పంపింగ్ పనులు తమ నియోజకవర్గంలోనే చేపట్టడం ఆనందాన్నిచ్చిందన్నారు.

220 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

రఘునాథపాలెం: ఖమ్మంలో అక్రమంగా తరలిస్తుండగా రేషన్‌బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. ఖమ్మం నగరానికి చెందిన బాలకృష్ణ, రేపాక ప్రసాద్, దుర్గాప్రసాద్, సురేశ్, శ్రీనివాస్ ముఠాగా ఏర్పడి రఘునాథపాలెం మండలంలోని లబ్ధిదారుల వద్ద కొనుగోలుచేసిన బియ్యాన్ని కోయచలక శివారులో నిల్వచేశారు. ఆదివారం ఉదయం ఒక లారీ, రెండు బొలేరో వాహనాల్లో మహారాష్ట్రకు తరలించే ప్రయత్నం చేస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రెహమన్ నేతృత్వంలోని బృందం దాడి చేసి 220క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకున్నది. నిందితులు పరారయ్యారు.

జూదరుల అరెస్ట్

పటాన్‌చెరు రూరల్, నమస్తేతెలంగాణ: సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులోని అల్విన్‌కాలనీలో పేకాట ఆడుతున్న పలువురిని శనివారం రాత్రి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పటాన్‌చెరు సీఐ నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆల్విన్ కాలనీలో మూతపడిన ఓ పరిశ్రమలో కొందరు పేకాట ఆడుతున్నట్టు స మాచారం రావడంతో పోలీసులు అక్కడికి వెళ్లి 27 మందిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.3,82,400 స్వాధీనం చేసుకున్నారు.


మహబూబ్‌నగర్ జిల్లా బాదేపల్లి మార్కెట్‌యార్డులో అభిమానులు, కార్యకర్తలు, మధ్య కేక్‌ను కట్ చేస్తున్న మాజీమంత్రి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి


మెగా రక్తదాన శిబిరంలో రక్తదానం చేస్తున్న లక్ష్మారెడ్డి, ఆయన కుమారుడు స్వరణ్‌రెడ్డి. చిత్రంలో లక్ష్మారెడి సతీమణి శ్వేతా లక్ష్మారెడ్డి

ఘనంగా లక్ష్మారెడ్డి జన్మదిన వేడుకలు

- 2020 మందికిపైగా రక్తదానం
- 100 మందికిపైగా అవయవదానాలకు అంగీకారం

మహబూబ్‌నగర్, నమస్తే తెలంగాణ ప్రతినిధి/ జడ్చర్ల రూరల్: మాజీ మంత్రి, జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి జన్మదినం సందర్భంగా నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి విశేషస్పందన లభించింది. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా బాదేపల్లి మార్కెట్ యార్డు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు, అభిమానులు, టీఆర్ఎస్ శ్రేణుల మధ్య కేక్ కట్ చేశారు. జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర సంగీత నాటక అకాడమీ చైర్మన్ బాద్మి శివకుమార్ కార్యక్రమానికి హాజరై లక్ష్మారెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ఆయన కుమారుడు స్వరణ్‌రెడ్డితోపాటు టీఆర్ఎస్ కార్యకర్తలు, లక్ష్మారెడ్డి అభిమానులు రక్తదానం చేశారు. రాష్ట్ర చరిత్రలోనే రికార్డుస్థాయిలో 2020 మందికి పైగా రక్తదానం చేశారని రెడ్‌క్రాస్ సంస్థ చైర్మన్ లయన్ నటరాజ్ వెల్లడించారు. అనంతరం 'మా ఆప్‌కీ చాయ' స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, మరో వందమంది అభిమానులు తమ అవయవాలను దానం చేయడానికి అంగీకరిస్తూ సంతకాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అన్ని దానాల్లోకెల్లా అవయవదానం గొప్పదని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి శ్వేతాలక్ష్మారెడ్డి, రాష్ట్ర సంగీత, నాటక అకాడమీ చైర్మన్ బాద్మి శివకుమార్, జెడ్పీటీసీ జయప్రద తదితరులు పాల్గొన్నారు.

రైతుబంధు దేశానికే ఆదర్శం

ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి వెల్లడి

మదనాపురం: సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన రైతుబంధు పథకం దేశానికే ఆదర్శంగా నిలిచిందని దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం వనపర్తి జిల్లా మదనాపురం మండల కేంద్రంలోని పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులైన ప్రజలు రెండోసారి టీఆర్ఎస్ ప్రభుత్వానికి పట్టం కట్టారని అన్నారు. అన్ని వర్గాల ప్రజలను ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు.

ఘనంగా ఎంఎస్ రాజలింగం శతజయంతి ఉత్సవం

వరంగల్ చౌరస్తా: వరంగల్ నియోజకవర్గ మొట్టమొదటి శాసనసభ సభ్యులు, గాంధేయవాది, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు ముదిగొండ సిద్దవీర రాజలింగం శతజయంతి ఉత్సవాలను ఆదివారం వరంగల్‌లోని మొగిలయ్య స్మారక భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ బండా ప్రకాశ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 'నిజాం విమోచనోద్యమ' పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఎంపీ బండా ప్రకాశ్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్యోద్యమంలో క్రియాశీల పాత్ర పోషించిన రాజలింగం అనేకమందికి స్ఫూర్తిగా నిలిచారన్నారు. కార్యక్రమంలో మాజీ మేయర్ టీ రాజేశ్వర్‌రావు, కార్పొరేటర్ గుండా ప్రకాశ్ రావు తదితరులు పాల్గొన్నారు.


నిజాం విమోచనోద్యమ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ బండా ప్రకాశ్


సూర్యాపేట జిల్లా మునగాలలో టీఆర్ఎస్‌లో చేరిన వారికి కండువాలు కప్పుతున్న కోదాడ ఎమ్మెల్యే మల్లయ్య యాదవ్


సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లో టీఆర్ఎస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి


సూర్యాపేట జిల్లా నేరేడుచర్లలో టీఆర్ఎస్‌లో చేరినవారికి కండువాలు కప్పుతున్న టీఆర్ఎస్ నాయకుడు శానంపూడి సైదిరెడ్డి

టీఆర్ఎస్‌లో చేరికల జోష్


నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: టీఆర్ఎస్‌లోకి చేరికలు కొనసాగుతున్నాయి. ఆదివారం వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు టీఆర్ఎస్‌లో చేరారు. సూర్యాపేట జిల్లా ఆత్మకూర్ (ఎస్) మండలం మంగలితండాకు చెందిన కాంగ్రెస్ వార్డు మెంబర్‌తోపాటు పలువురు నాయకులు, కార్యకర్తలు మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి సమక్షంలో, మునగాల మండలం నేలమర్రికి చెందిన 50 మంది కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ సమక్షంలో, హుజూర్‌నగర్ సెగ్మెంట్ పరిధిలోని నేరేడుచర్లలో 100 మంది టీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు శానంపూడి సైదిరెడ్డి సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు. నిజామాబాద్ జిల్లా ఏర్గట్ల మండలం తొర్తి కాంగ్రెస్ ఎంపీటీసీ గంగాధర్, సర్పంచ్ నవీన్, ఉప సర్పంచ్ మహ్మద్ తాహెర్, వార్డు సభ్యులు, గ్రామ అంబేద్కర్ సంఘం, అధ్యక్షుడు జంబుశంకర్, ఆదర్శ యువజన సంఘసభ్యులు గంగాధర్, సురేశ్, ప్రణీత్, మైనార్టీ సంఘం సభ్యులు సాధిక్‌షా, సాదుల్ల షేక్ ఆదివారం బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి సమక్షంలో, సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌కు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు, వంద కుటుంబాలవారు ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు.


టీఆర్ఎస్‌లో చేరిన నిజామాబాద్ జిల్లా తొర్తి సర్పంచ్, కాంగ్రెస్ నాయకులతో బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

క్యాన్సర్ పరీక్షలతో గిన్నిస్‌రికార్డ్

ఒకేరోజు 4,578 మందికి పరీక్షలు

మహబూబాబాద్, నమస్తే తెలంగాణ: మహబూబాబాద్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా క్యాన్సర్ శిబిరం గిన్నీస్ బుక్ ఆఫ్ రికార్డ్‌లో చోటు సాంపాదించుకున్నది. గ్రేస్‌క్యాన్సర్ ఫౌండేషన్ సహకారంతో డిప్యూటీ డ్రగ్స్ కంట్రోలర్ రాంకిషన్‌నాయక్ మహబూబాబాద్‌లోని బాలాజీగార్డెన్‌లో వివిధ జిల్లాల నుంచి వచ్చిన 4,578 మందికి అపోలో దవాఖానకు చెందిన రోబోటిక్ సర్జికల్ ఎస్ చిన్నబాబు బృందం క్యాన్సర్ పరీక్షలు నిర్వహించింది. గిన్నిస్ బుక్ రికార్డ్స్ జడ్జి రిషినాథ్ క్యాంపును సందర్శించి మెగా క్యాన్సర్ శిబిరం గిన్నిస్ బుక్ఆఫ్ వరల్డ్‌లో చోటు సంపాదించినట్టు ప్రకటించి సర్టిఫికెట్ అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావు, ఢిల్లీలో టీఆర్ఎస్ అధికార ప్రతినిధి తేజావత్ రాంచంద్రునాయక్ పాల్గొన్నారు.


క్యాన్సర్ శిబిరం గిన్నిస్‌బుక్‌ఆఫ్ రికార్డులో చోటు సంపాదించినట్టు ప్రకటిస్తున్న అధికారి రిషినాథ్

కొమురవెల్లిలో కోలాహలం



సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయం భక్తులతో రద్దీగా మారింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం మల్లన్న క్షేత్రానికి సుమారు 50 వేల మంది భక్తులు తరలివచ్చారు. అభిషేకాలు, పట్నాలు, అర్చన, ప్రత్యేక పూజలు, ఒడి బియ్యం, కేశ ఖండన, గంగరేగు చెట్టు వద్ద ముడుపులు తదితర మొక్కులు తీర్చుకున్నారు. - చేర్యాల, నమస్తే తెలంగాణ



భక్తజనసంద్రంగా బాసర

నిర్మల్ జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం బాసర శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. తెలంగాణతోపాటు ఏపీ, మహారాష్ట్రకు చెందిన భక్తులు, పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో విద్యార్థులు పెద్దఎత్తున తరలివచ్చారు. పవిత్ర గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకున్నారు. - బాసర

రుద్రేశ్వరుడి కల్యాణ వైభోగం



వరంగల్ హన్మకొండలోని వెయ్యిస్తంభాల దేవాలయంలో పుష్యమాసం బహుళ చతుర్దశి 11వ మాసశివరాత్రి సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ నేతృత్వంలో ఆదివారం రుద్రేశ్వరి రుద్రేశ్వరస్వామి కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా కర్నూలు జిల్లాకు చెందిన ముస్లిం యువతి రజియాబేగం రుద్రేశ్వరస్వామికి అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం. - రెడ్డికాలనీ

ఈసీకి 'డబుల్' హైరానా

- రెండుచోట్ల ఓటుపై ప్రత్యేకదృష్టి
- నేడు ఓటరు సవరణ ముసాయిదాకు చివరి గడువు
- రేపటినుంచి పరిశీలన.. 21న తుది జాబితా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఓటరు జాబితాలో డబుల్ ఓట్ల అంశం ఎన్నికల కమిషన్‌కు తలనొప్పిగా మారింది. ఓటరు జాబితాలో ఒకే వ్యక్తి పేరుపై రెండు ఓట్లు రాకుండా ఉండేందుకు ప్రత్యేకంగా చర్యలు చేపట్టింది. గత ఏడాది నవంబర్ 26న ప్రారంభమైన ఓటరు సవరణ ముసాయిదా కార్యక్రమం సోమవారంతో (ఈ నెల 4వ తేదీతో) ముగుస్తుంది. ఇప్పటివరకు 20.31 లక్షల దరఖాస్తులు వచ్చినట్టు ఎన్నికల కమిషన్ అధికారులు పేర్కొన్నారు. ఓటర్ల నమోదు ముసాయిదా కార్యక్రమంలో ఒకే ఓటరు పలు రకాలుగా దరఖాస్తు చేసుకున్నారని తేలింది. ఒక్కొక్కరు రెండుమూడుచోట్ల ఆన్‌లైన్‌లో, మాన్యువల్‌గా దరఖాస్తు చేసుకోవడంతో అధికారులు తికమకపడుతున్నారు. ఓటరు నివాసమున్నచోట, మరో జిల్లాకు మారినప్పుడు, జిల్లా నుంచి వేరే నియోజకవర్గానికి వెళ్లిన సమయంలో కొత్త ఓటు కోసం దరఖాస్తు చేసుకుంటున్నాడు. దరఖాస్తు చేసుకున్న ప్రతీ చోట ఓటుహక్కు వస్తుంది. కానీ, కొత్త ప్రాంతంలో ఓటుహక్కు వచ్చినప్పుడు పాత ఓటును తొలిగించుకోకపోవడంతో ఒక్కో ఓటరు రెండు, మూడుచోట్ల ఓటుహక్కును కలిగి ఉంటున్నాడు. ఇలాంటి అంశాలపై ఈసీ ప్రత్యేకంగా దృష్టిపెట్టి గత జాబితాలో ఏకంగా 1.87 లక్షల మంది రెండుచోట్ల ఓటు హక్కు కలిగి ఉన్నట్టు గుర్తించింది. వీటిని సవరణ ముసాయిదా పరిశీలనలో తొలిగించాలని సీఈవో రజత్‌కుమార్ ఆదేశించారు. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో విడుదలచేసిన ఓటర్ల తుది జాబితాలో 1.16 లక్షల మంది రెండుచోట్ల ఓటు హక్కును నమోదు చేసుకున్నారు. వీటిని తొలిగించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం నుంచి అనుమతి రాకున్నా ప్రత్యేకంగా మార్క్‌చేసి డబుల్ ఓట్లు పోల్‌కాకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకున్నారు.

జాబితాలో తనిఖీ చేసుకోవాలి

రాష్ట్రంలో ఉన్నతాధికారుల ఓట్లు జాబితాలో నుంచి తొలిగిపోవడంపై విచారణ కొనసాగుతున్నది. ఏటా జనవరి 1 నుంచి జాబితా ముసాయిదా సవరణ చేపడుతారు. ఈ సందర్భంగా ప్రజలు.. ఓటరు జాబితాలో పేరుందో లేదో తెలుసుకోవాల్సి ఉంటుంది. మనదగ్గర ఓటరు ఐడీ కార్డు (ఎపిక్‌కార్డు) ఉన్నా.. జాబితాలో పేరు లేకపోతే ఓటు వేసేందుకు అవకాశం ఉండదు. అందుకే ప్రతిసారి కొత్తగా వచ్చే ఓటరు జాబితాలో పేర్లను విధిగా తనిఖీ చేసుకోవాలని ఎన్నికల అధికారులు చెప్తున్నారు. ఈసీకి ఓటర్లంతా సమానమేనని వీఐపీలు, వీవీఐపీలు అంటూ ఉండరని ఈసీవో రతజ్ కుమార్ స్పష్టంచేశారు. ఓటరు సవరణ ముసాయిదాలో 20.31 లక్షల దరఖాస్తులు రాగా, ఇందులో ఓటర్ల నమోదుకు అత్యధికంగా 15.91 లక్షల దరఖాస్తులు వచ్చాయి. ఇందులో ఫారం-6ఏకు 1991, ఫారం-7కు 1,45,613, ఫారం-8కు 1,83,223, ఇతరాలకు దరఖాస్తులు వచ్చాయి. ప్రత్యేక సవరణ కార్యక్రమం ఈనెల 4తో ముగిసినా ఫారం-6 కింద నమోదు చేసుకొనేవారికి నామినేషన్ల వరకు అవకాశం ఉంటుంది.

రేపటినుంచి దరఖాస్తుల పరిశీలన

వచ్చిన దరఖాస్తులను మంగళవారం (5వ తేదీ) నుంచి పరిశీలిస్తారు. ఓటరు ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకున్నా వాటిని పరిశీలించి ఒకేసారి ఉండేలా చర్యలు తీసుకోనున్నారు. ఈ నెల 14 వరకు అభ్యంతరాలు స్వీకరించి, 22న తుది ఓటర్ల జాబితా విడుదలచేస్తారు.



తన పుట్టిన రోజు సందర్భంగా ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిసిన వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్



'తెలంగాణలో సుస్థిర వ్యవసాయం- నా వ్యాసాలు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మండలి చైర్మన్ స్వామిగౌడ్, ఎంపీలు గుత్తా సుఖేందర్‌రెడ్డి, వినోద్‌కుమార్, ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్, వ్యవసాయ వర్సిటీ వీసీ ప్రవీణ్‌రావు తదితరులు.



కేక్ కట్‌చేసి స్పీకర్‌కు తినిపిస్తున్న ఎమ్మెల్యే చెన్నమనేని



శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

సాగుకు సమగ్ర ప్రణాళిక

- రైతు బాధలకు విముక్తి కలిగితేనే..
- ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ రచించిన 'తెలంగాణలో సుస్థిర వ్యవసాయం- నా వ్యాసాలు' పుస్తకావిష్కరణలో స్పీకర్ పోచారం
- నేతల సమక్షంలో పుట్టినరోజు వేడుకలు జరుపుకొన్న చెన్నమనేని

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సుస్థిర వ్యవసాయానికి సమగ్ర ప్రణాళిక అవసరమని, దూరదృష్టితో ఆర్థిక వనరులను, సాంకేతికతను కూడా సమకూర్చుకోవాలని అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం బంజారాహిల్స్‌లోని హుడాహైట్స్‌లో వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ రచించిన వ్యాసాల సంపుటితో కూడిన 'తెలంగాణ సుస్థిర వ్యాపారం'అనే పుస్తకాన్ని స్పీకర్ ఆవిష్కరించి మాట్లాడారు. చెన్నమనేని రమేశ్‌కు వ్యవసాయం, రైతుల పట్ల ప్రత్యేక అభిమానం ఉన్నదన్నారు. వ్యవసాయ రంగంపై చర్చకు అవకాశం కల్పించేలా రచనలు చేసినందుకు అభినందించారు. సీఎం కేసీఆర్ సాహసోపేత నిర్ణయంతో రాష్ట్రంలో భూ రికార్డుల ప్రక్షాళన జరిగిందని, 58 లక్షల మంది రైతులకు లబ్ధి కలిగిందన్నారు. రాష్ట్రంలో, దేశంలో అత్యధికంగా చిన్న, సన్నకారు రైతులే ఉన్నారని, బాధల నుంచి సంపూర్ణంగా విముక్తి చేసినప్పుడే వారికి నిజమైన స్వాతంత్రం వచ్చినట్టు అవుతుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం వారికి అండగా నిలుస్తున్నదని, రాష్ట్ర పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని, ఐక్యరాజ్యసమితి కూడా రైతుబంధు, రైతుబీమాను ప్రపంచంలోనే వినూత్న పథకాలుగా గుర్తించిందన్నారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు పూర్తయితే 1.20 కోట్ల ఎకరాల్లో పంటలు పండుతాయని, వీటి విలువ సుమారు రూ.1.25 లక్షల కోట్లు ఉంటుందని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వ తోడ్పాటుతో ఉన్నత విద్యావంతులు, విదేశాల్లో స్థిరపడ్డ వారు కూడా వ్యవసాయం చేస్తున్నారన్నారు. ప్రభుత్వ చర్యలు, ప్రోత్సాహంతో ఈ ఏడాది రాష్ట్రంలో ధాన్యం ఉత్పత్తి పెరిగిందన్నారు. పంటకాలనీలు ఏర్పాటుచేసి డిమాండ్‌కు అనుగుణంగా పంటలు పండించేలా ప్రణాళిక సిద్ధం చేయాలని సీఎం కేసీఆర్ ఆదేశించారన్నారు. పంటల ప్రాసెసింగ్‌కు సైతం ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నదన్నారు.

వ్యవసాయరంగం దారిన పడుతున్నది

పుస్తక రచయిత, ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ మాట్లాడుతూ దేశ, విదేశాల్లోని వ్యవసాయ పరిస్థితులు, మారుతున్న తీరుతెన్నులను క్రోడికరిస్తూ ఈ పుస్తకాన్ని రచించానన్నారు. తెలంగాణలో 60 ఏండ్లుగా సంక్షోభంలో కూరుకుపోయిన వ్యవసాయ రంగం ఇప్పుడిప్పుడే దారినపడుతున్నదన్నారు. నాలుగున్నరేండ్లలో కీలకమార్పులు చోటుచేసుకున్నాయని చెప్పారు. పీఠభూమి ప్రాంతమైన తెలంగాణలో సాగునీటి సమస్య ఎక్కువని, మొట్టమొదటిసారిగా దీర్ఘ దృష్టితో వ్యవసాయానికి సమగ్ర విధానం రూపొందించిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని కొనియాడారు. చిన్న, సన్నకారు రైతులు సమిష్ఠిగా పనిచేసినప్పుడే సాగు లాభసాటిగా మారుతుందన్నారు. సుస్థిర వ్యవసాయానికి వ్యవసాయం, పర్యావరణం, మార్కెటింగ్ రంగాల మధ్య సమన్వయం, సహకారం అవసరమని చెప్పారు. రైతు సమన్వయ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అమలుచేసిన రైతు సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయని పేర్కొన్నారు. చెన్నమనేని వ్యాసాలను, పుస్తకాలను తెలుగులోకి అనువదిస్తే రైతులకు మరింత ఉపయుక్తంగాఉంటాయన్నారు. కార్యక్రమంలో మాజీ సీఎస్ అజయ్‌కల్లాం, వ్యవసాయ వర్సిటీ వీసీ డాక్టర్ వీ ప్రవీణ్‌రావు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం సందర్భంగా చెన్నమనేని రమేశ్ పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు. అతిథులందరూ శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్యే రమేశ్‌కు సీఎం కేసీఆర్ శుభాకాంక్షలు

ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ ఆదివారం తన పుట్టినరోజు సందర్భంగా ప్రగతిభవన్‌కు వెళ్లి సీఎం కేసీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. మండలి చైర్మన్ స్వామిగౌడ్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, జూపల్లి, ఎంపీలు కెప్టెన్ లక్ష్మీకాంతరావు, బీ వినోద్, ఎమ్మెల్యేలు శ్రీనివాస్‌గౌడ్, రసమయి, రామలింగారెడ్డి, నిరంజన్‌రెడ్డి,మనోహర్‌రెడ్డి, స్టీఫెన్‌సన్, ఎమ్మెల్సీలు పాతూరి సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కర్నె ప్రభాకర్, కార్పొరేషన్ల చైర్మన్లు నరేందర్‌రావు, సోమారపు సత్యనారాయణ, లోక భూమారెడ్డి, బాపురెడ్డి, యాదవరెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్, సీడ్ కార్పొరేషన్ డైరెక్టర్ కే కేశవులు, ప్రభుత్వ సలహాదారు ఏకే ఖాన్, సీఎం ఓఎస్డీ దేశపతి శ్రీనివాస్ చెన్నమనేనికి శుభాకాంక్షలు తెలిపారు.



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం పాండురంగాపురంలో కలప నిల్వలను పరిశీలిస్తున్న డీఎఫ్‌వో రాంబాబు, పోలీస్‌శాఖ, అటవీశాఖ సిబ్బంది

కఠినంగా అటవీ చట్టం

మొదటిపేజీ తరువాయి...

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి పర్యవేక్షణలో అటవీ చట్టాలను సమీక్షించిన ఉన్నతాధికారులు.. శిక్షలను కఠినతరం చేయడంపై కసరత్తు చేశారు. ఈ మేరకు 1962 తెలంగాణ ఫారెస్ట్ యాక్ట్‌లో ఫారెస్ట్ అఫెన్సెస్ (కాంపౌండింగ్ అండ్ ప్రాసిక్యూషన్) నిబంధనల్లో మార్పులు తీసుకురావాలని నిర్ణయించారు. రెండురోజుల్లో ప్రభుత్వానికి నివేదించేలా అటవీశాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకొంటున్నారు.

షెడ్యూల్ జాబితాలో నాలుగు ముఖ్య చెట్లు

తెలంగాణ అడవుల్లో లభించే కలప చాలా శ్రేష్ఠమైనందున అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి విలువ ఉన్నది. కలప అక్రమ రవాణాతోపాటు ఇతర అటవీ నేరాలను అదుపుచేయడానికి వీలుగా కొన్ని జాతుల చెట్లను ప్రత్యేక షెడ్యూల్‌లోకి చేరుస్తున్నారు. వీటిలో టేకు, నల్లమద్ది, ఏగిస, చందనం తదితర విలువైన చెట్లు ఉన్నట్టు సమాచారం. జాబితాలోని చెట్లను నరకడం, స్మగ్లింగ్ చేయడం వంటి కేసుల్లో పదేండ్ల వరకు కఠిన కారాగారశిక్ష విధించేలా నిబంధనలు తీసుకురానున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో స్మగ్లర్లు చాలావరకు అటవీ సంపదను లూటీ చేశారు. ఇప్పటివరకున్న అటవీ సంపదలో ఒక్క చెట్టు కూడా నేలకొరగడానికి వీలులేదని సీఎం కేసీఆర్ ఆదేశించడంతో కఠిన చర్యలకు అధికారులు ఉద్యుక్తులవుతున్నారు.

అటవీ, పోలీసు సిబ్బంది సంయుక్త తనిఖీలు

ఏటూరునాగారం/పాల్వంచ రూరల్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం పాండురంగాపురంలో ఆదివారం అక్రమ కలప నిల్వల కేంద్రాలపై అటవీ, పోలీస్ సిబ్బంది సంయుక్తంగా దాడులు నిర్వహించి రూ.6 లక్షల విలువైన కలప, కోతయంత్రాలను స్వాధీనం చేసుకొన్నారు. అశ్వాపురం మండల కేంద్రంలోని పదమూడు మంది కార్పెంటర్ల ఇండ్లల్లో ఆదివారం తనిఖీలు నిర్వహించి సుమారు రూ.50 వేల విలువైన టేకు, మారుజాతి కలప స్వాధీనం చేసుకొన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కన్నాయిగూడెం మండలం భూపతిపూర్‌లో స్వాధీనం చేసుకొన్న కలపను తరలించే ప్రయత్నాన్ని పలువురు గ్రామస్థులు అడ్డుకొన్నారు. ఇక్కడ రూ.80 వేల విలువైన పెద్దేగి, బిలుగు, టేకు, చెన్నంగి కలప స్వాధీనం పట్టుబడింది. కలప తరలింపును అడ్డుకొన్న ఆలం రాంబాబు, చెరుప ఈశ్వరయ్య, చెరుప పగడయ్య, చెరుప నర్సింగరావుపై కన్నాయిగూడెం పోలీస్‌స్టేషన్‌లో అటవీ అధికారులు ఫిర్యాదుచేశారు.

డాగ్‌స్క్వాడ్ తనిఖీల్లో దొరికిన వేటగాళ్లు



నాగర్‌కర్నూల్ జిల్లాలో డాగ్‌స్క్వాడ్ తనిఖీల్లో దుప్పి మాంసంతో పట్టుబడ్డ వేటగాళ్లు

అమ్రాబాద్: నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ టైగర్ రిజర్వు ఫారెస్ట్‌లో అమ్రాబాద్ మండలం బీకే లక్ష్మాపూర్‌తండా సమీపంలో గల అటవీప్రాంతంలో డాగ్‌స్క్వాడ్ పోలీసులు తనిఖీలు నిర్వహించి చుక్కలదుప్పి మాంసాన్ని, వేటగాళ్లను అదుపులోకి తీసుకున్నారు. బీకే లక్ష్మాపూర్‌తండా సమీపంలో చుక్కల దుప్పిని చంపి వేటగాళ్లు మాంసాన్ని పంచుకుంటున్న సమయంలో బ్రూనో ప్రత్యేక డాగ్‌తో అధికారులు చేపట్టిన తనిఖీల్లో చిక్కారు.

వీటీపీఎస్‌కు 'కృష్ణా'ర్పణం

- రోజుకు 2వేల క్యూసెక్కులు సరఫరా
- నదిలోకి తిరిగి చేరేది 1800 క్యూసెక్కులే..
- ఏడాదికి ఆరున్నర టీఎంసీలు మాయం
- ఏపీ వినియోగాన్ని విస్మరిస్తున్న బోర్డు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కొన్నేండ్లుగా సరైన ఇన్‌ఫ్లోలు లేక కృష్ణా బేసిన్‌లో ఒక్కోచుక్కకోసం ఇబ్బందులు పడుతుంటే.. కృష్ణానదీ యాజమాన్యబోర్డు మాత్రం ఆంధ్రప్రదేశ్‌కు లెక్కల్లేకుండా నీటిని సరఫరా చేస్తున్నది. ప్రకాశం బరాజ్ ఎగువన ఏపీలోని విజయవాడ థర్మల్ పవర్ స్టేషన్ (వీటీపీఎస్)కుమళ్లిస్తున్న నీటికి.. తిరిగి నదిలోకి దానికి మధ్య భారీ వ్యత్యాసం ఉన్నప్పటికీ పట్టించుకోవడం లేదు. ఏడాదికి దాదాపు ఆరున్నర టీఎంసీలను వాడుకొంటున్నా ఏపీ ఖాతాలో వేయకుండా బోర్డు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. విజయవాడలోని డాక్టర్ నార్ల తాతారావు థర్మల్ పవర్ స్టేషన్ (విజయవాడ థర్మల్ పవర్ స్టేషన్)కు కృష్ణానది నుంచి నీటిని సేకరిస్తున్నారు. ప్రకాశం బరాజ్ ఎగువ నుంచి రోజుకు రెండువేల క్యూసెక్కుల నీటిని కూలింగ్ కెనాల్ ద్వారా మళ్లిస్తున్నారు. యాష్‌పిట్స్‌ను శుభ్రం చేయడంతోపాటు ప్లాంట్లను చల్లబరిచేందుకు (కూలింగ్ టవర్స్ కోసం) ఈ నీటిని వినియోగిస్తారు. ఆ తర్వాత అంతే నీటిని నదిలోకి తిరిగి వదలాల్సి ఉంటుంది. ఇందుకు ప్రత్యేకంగా ఒక ఛానల్‌ను ఏర్పాటుచేశారు. అయితే, రోజుకు రెండువేల క్యూసెక్కుల నీటిని తీసుకొంటుండగా.. తిరిగి నదిలోకి వదిలే పరిణామం మాత్రం 1800 క్యూసెక్కులే ఉంటుందని శాస్త్రీయ లెక్కల ద్వారా స్పష్టమవుతున్నది. రోజుకు 200 క్యూసెక్కుల వినియోగాన్ని లెక్కిస్తే.. ఏడాదికి ఆరున్నర టీఎంసీలు అవుతున్నాయి. కృష్ణా బోర్డు మాత్రం ఇప్పటివరకు వీటీపీఎస్‌కు సంబంధించి వినియోగాన్ని ఎక్కడా లెక్కించలేదు.

నామమాత్రపు కమిటీతో..

వీటీపీఎస్ నీటివినియోగం అంశం గతంలోనే ప్రస్తావనకు రావడంతో బోర్డు ఒక కమిటీని నియమించింది. బోర్డు మెంబర్ (పవర్)తో పాటు ఒక ఈఈ, డీఈతో ఈ కమిటీని ఏర్పాటుచేశారు. వీరంతా ఏపీకి చెందినవారే.. వీటీపీఎస్‌కు మళ్లిస్తున్న నీరు, వినియోగం తరువాత నదిలోకి వదులుతున్న నీటిని బేరీజు వేస్తే.. రోజుకు కేవలం 16.15 క్యూసెక్కులు మాత్రమే తక్కువ వస్తున్నాయని.. ఇది ఏడాదికి ఒక్క టీఎంసీ లోపేనని.. దీనిని పరిగణనలోనికి తీసుకోవాల్సిన అవసరంలేదంటూ కమిటీ తేల్చింది. దీని ఆధారంగా బోర్డు కూడా వీటీపీఎస్ వినియోగాన్ని విస్మరిస్తూ వచ్చింది. కానీ, శాస్త్రీయ లెక్కలను చూస్తే నామమాత్రపు కమిటీతో వాస్తవాలను కప్పిపుచ్చారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ మ్యాన్యువల్‌ను పరిశీలిస్తే.. ఒక మెగావాట్ సామర్థ్యం ఉన్న థర్మల్ పవర్‌స్టేషన్‌కు గంటకు 3.5-4 క్యూబిక్ మీటర్ల నీటి వినియోగం ఉంటుందని స్పష్టంగా ఉన్నది. వీటీపీఎస్‌లో మొదటి మూడుస్టేజీల్లో 210 మెగావాట్ల యూనిట్లు రెండుచొప్పున ఉన్నాయి. నాలుగో స్టేజీలో 500 మెగావాట్లు, ఐదో స్టేజీలో 800 మెగావాట్ల సామర్థ్యం ఉన్న యూనిట్ ఒకటి చొప్పున ఉన్నాయి. మరో 800 మెగావాట్ల సామర్థ్యం ఉన్న యూనిట్ నిర్మాణ దశలో ఉన్నది. అంటే ఇప్పటివరకు మొత్తంగా 2,560 మెగావాట్ల సామర్థ్యం ఉన్న యూనిట్లు పనిచేస్తున్నాయి. ఈ చొప్పున యాష్‌పిట్స్ శుభ్రం, ప్లాంట్లను చల్లబరించేందుకు సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ మ్యాన్యువల్ ప్రకారమే రోజుకు 180 క్యూసెక్కుల వరకు అవసరం ఉంటుంది. సరఫరా, ఆవిరి నష్టాలను కనిష్ఠంగా పది శాతాన్ని పరిగణలోకి తీసుకొంటే మరో 18 క్యూసెక్కులు.. మొత్తంగా 198 క్యూసెక్కుల నీటి వినియోగం స్పష్టంగా కనిపిస్తున్నది. ఇలా ఏడాదికి ఆరున్నర టీఎంసీలు అనేది తేలుతున్నది. కానీ ఒక కమిటీ నివేదికను సాకుగా చూపి ఏపీ వినియోగ ఖాతాలో ఆరున్నర టీఎంసీలను బోర్డు విస్మరిస్తున్నది.



వీటీపీఎస్‌లో వినియోగం తర్వాత నీటిని నదిలోకి వదిలే కాల్వ

ఓటాన్ అకౌంట్‌లోనే
కేటాయింపులు!

మొదటిపేజీ తరువాయి...

అందించడానికి ఇప్పటికే చర్యలు చేపట్టారు.. 'మా తండాలో మా రాజ్యం' అని నినదించిన గిరిజన బిడ్డల కోసం తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటుచేసిన సీఎం కేసీఆర్.. పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించారు. గ్రామాభివృద్ధి కోసం చేయాల్సిన కార్యక్రమాలపై కొత్త సర్పంచ్‌లకు శిక్షణ ఇవ్వాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఓట్‌ఆన్ అకౌంట్ బడ్జెట్ నుంచే గ్రామాలకు విరివిగా నిధులు కేటాయించాలని యోచిస్తున్నారు. పేదలకు అందించే సామాజిక పెన్షన్లు ఇప్పుడున్న దానికంటే డబుల్ చేస్తామని కేసీఆర్ ప్రకటించారు. ఈ మేరకు ఏప్రిల్ నుంచి పెంచిన పింఛన్లను లబ్ధిదారులకు అందజేస్తామని ముఖ్యమంత్రి అసెంబ్లీలో ప్రకటించారు. ఇందుకు తగినవిధంగా బడ్జెట్‌లో ప్రతిపాదనలు రూపొందించాలని ఇప్పటికే అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. సామాజిక పింఛన్ల పెంపుతోపాటు అర్హత వయస్సును 60 నుంచి 57 ఏండ్లకు తగ్గించాలని నిర్ణయించారు. అర్హత వయస్సును 57 ఏండ్లకు తగ్గించడం ద్వారా పింఛన్‌దారుల సంఖ్య అదనంగా 20 లక్షల మంది వరకు పెరిగే అవకాశం ఉన్నట్టు సమాచారం. ఇప్పటివరకు సామాజిక పింఛన్ల కోసం ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.5,043 కోట్లు కేటాయిస్తూ వస్తున్నది. తాజాగా పెంపుతో మరో రూ. 5 వేల కోట్ల వరకు అదనంగా పొందుపరచాల్సిన అవసరం ఉన్నది. ఈ మేరకు ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో పెన్షన్ల పెంపుకు అయ్యే నిధులను పొందుపరచాలని సీఎం అధికారులను ఆదేశించిన నేపథ్యంలో ఆర్థికశాఖ అధికారులు ఈ మేరకు ప్రతిపాదనలు రూపొందిస్తున్నట్టు సమాచారం. రైతుబంధు పథకం కింద ఇప్పటివరకు తెలంగాణ ప్రభుత్వం ఒక్క ఎకరం భూమికి రెండు పంటలకు కలిపి ఏడాదికి రూ.8 వేలు ఇచ్చింది. ఈ ఏడాది నుంచి రూ.10 వేలకు పెంచాలని నిర్ణయించింది. ఈ మేరకు ఓట్‌ఆన్‌అకౌంట్ బడ్జెట్‌లోనే నిధులు కేటాయించాల్సిన అవసరం ఉన్నది. ఇదిలా ఉండగా కేంద్రప్రభుత్వం రైతుబంధు స్ఫూర్తితో 5 ఎకరాల లోపు రైతులకు ఏడాదికి రూ. 6 వేలు ఇస్తామని ప్రకటించింది. కానీ, దీనికి సంబంధించిన నిర్దిష్ట కార్యాచరణ ఏమి ప్రకటించలేదు. దీంతో కేంద్రం రైతులకు ఇచ్చే నిధులు ఎంత వస్తాయి? వాటిని కూడా ఈ పథకంలో సర్దుబాటు చేయాలా? లేక ప్రత్యేకంగా ఉంచాలా? ఏవిధంగా నిధులు కేటాయించాలన్న దానిపైనా అధికారులు చర్చిస్తున్నారు. రెండోసారి అధికారంలోకి వచ్చిన టీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను ఓట్‌ఆన్‌బడ్జెట్ నుంచే అమలుచేయడానికి కసరత్తు చేస్తున్నది.

జయరాం కేసులో రోజుకో ట్విస్ట్!

కుక్కను చంపే విషంతో హత్య?

- జయరాంతో వివాహేతర సంబంధం
- విచారణలో శిఖాచౌదరి వెల్లడి!
- జయరాంను రాకేశ్ హత్యచేశాడని ఆరోపణ
- శిఖాకు పలువురితో సంబంధాలున్నాయన్న రాకేశ్!



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కోస్టల్ బ్యాంక్ డైరెక్టర్, ఎన్నారై చిగురుపాటి జయరాం హత్యకేసులో రోజుకో కొత్త కోణం వెలుగు చూస్తున్నది. ప్రియుడు రాకేశ్‌తో కలిసి శిఖా చౌదరి జయరాంను హత్య చేసి ఉంటారన్న కోణంలో పోలీసులు తొలుత అనుమానించారు. అయితే విచారించేకొద్దీ అనేక ఆసక్తికర విషయాలు బయటపడ్డాయి. జయరాంతో వివాహేతర సంబంధం ఉన్నట్టు శిఖా చెప్పగా.. పలువురితో శిఖాకు సంబంధాలు ఉన్నాయని రాకేశ్ విచారణలో పేర్కొన్నట్టు పోలీసు వర్గాల ద్వారా తెలిసింది. డబ్బు వివాదంలోనే జయరాంను రాకేశ్ హత్యచేసినట్టు పోలీసులు భావిస్తున్నారు. కుక్కలను చంపేందుకు వినియోగించే ఇంజెక్షన్ చేసి జయరాంను హత్యచేసినట్టు పోలీసులు గుర్తించారు. ఇంజెక్షన్ ప్రభావంతో పది నిమిషాల్లోనే జయరాం శరీరం విషపూరితమైనట్టు తెలుసుకొన్నారు. హైదరాబాద్‌లోనే హత్య చేసి మృతదేహాన్ని కృష్ణా జిల్లాకు తీసుకెళ్లినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. ఆదివారం ఉదయం రాకేశ్‌ను హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకొని నందిగామ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కృష్ణాజిల్లా ఎస్పీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి స్వయంగా రాకేశ్‌ను విచారించినట్టు తెలిసింది. అలాగే జయరాం మేనకోడలు శిఖాచౌదరిని హైదరాబాద్‌లో, కేసులో కీలకంగా భావిస్తున్న మరో ముగ్గురిని కృష్ణా జిల్లా వత్సవాయి పోలీస్‌స్టేషన్‌లో ప్రశ్నించినట్టు సమాచారం. గత నెల 31న రాత్రి కృష్ణా జిల్లా నందిగామ సమీపంలో కారు వెనుకసీటులో జయరాం మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. అమెరికా నుంచి జయరాం కుటుంబీకులు హైదరాబాద్ రావడంతో ఆదివారం మహాప్రస్థానంలో అంత్యక్రియలు పూర్తిచేశారు.

ఎవరిపైనా అనుమానాలు లేవు: జయరాం భార్య

జూబ్లీహిల్స్‌లోని జయరాం నివాసానికి వచ్చిన నందిగామ పోలీసులు ఆదివారం జయరాం భార్య పద్మశ్రీ స్టేట్‌మెంట్‌ను న్యాయవాది సమక్షంలో రికార్డ్ చేశారు. జయరాం వ్యాపార లావాదేవీలు, గొడవల గురించి ప్రశ్నించారు. తనకు ఎవరిపైనా అనుమానం లేదని పద్మశ్రీ పోలీసులకు చెప్పినట్టు తెలిసింది. తనకు, తన పిల్లలకు రక్షణ కల్పించాలని పోలీసులను కోరారు.

వివాహేతర సంబంధం!

మేనమామ జయరాంతో తనకు వివాహేతర సంబంధం ఉన్నదని పోలీసుల విచారణలో శిఖాచౌదరి వెల్లడించినట్టు తెలిసింది. 'అది మా వ్యక్తిగత విషయం. నేను రాకేశ్‌ను పెండ్లి చేసుకొందామనుకున్నా. మామయ్యది మర్డర్ అన్న విషయం నాకు తెలియదు. ఆ రోజు నేను రాకేశ్ ఫ్రెండ్ శ్రీకాంత్‌తో లాంగ్‌డ్రైవ్‌లో ఉన్నా. మా అమ్మ ఫోన్ చేసి ప్రమాదం గురించి చెప్పింది. వ్యాపార లావాదేవీల విషయంలో రాకేశ్ మా ఇంటికి వచ్చి గొడవచేశాడు. మామయ్యను రాకేశ్ చంపుతాడనుకోలేదు' అని పోలీసుల విచారణలో చెప్పినట్టు సమాచారం.

చాలామందితో సంబంధాలు

ఓ యాంకర్ ద్వారా జయరాంను తన ఇంటి వద్దకే పిలిపించానని, డబ్బు విషయమై వివాదం నెలకొనగా తన ఇంట్లోనే చంపానని రాకేశ్ పోలీసుల విచారణలో వెల్లడించినట్లు సమాచారం. శిఖాచౌదరితో డేటింగ్ చేసినట్టు అంగీకరించిన రాకేశ్.. శిఖాచౌదరికి పలువురితో సంబంధాలు ఉన్నాయని చెప్పినట్టు పోలీసు వర్గాల ద్వారా తెలిసింది.

ఆదర్శ రైల్వేస్టేషన్ మౌలాలి

- రూ.3.5 కోట్లతో ఆధునిక హంగులు
- త్వరలో పాదచారుల వంతెన పూర్తి
- ప్రయాణికులకు సరిపడా వసతులు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: హైదరాబాద్ శివారులోని మౌలాలి రైల్వేస్టేషన్.. ఆదర్శ స్టేషన్‌గా ఆధునిక హంగులు సమకూర్చుకున్నది. 2016-17లో ఆదర్శస్టేషన్‌గా రూపొందించాలనే ఉద్దేశంతో మంజూరైన నిధులతో దక్షిణమధ్య రైల్వే అభివృద్ధి పనులను పూర్తిచేసింది. నగరం శరవేగంగా విస్తరిస్తుండటం, మౌలాలి స్టేషన్ పరిసరప్రాంతాల్లో కాలనీలు ఏర్పడి వేగంగా అభివృద్ధి చెందడంతో ప్రయాణికుల సంఖ్య క్రమేణా పెరుగుతున్నది. నిత్యం సగటున పది ఎక్స్‌ప్రెస్ రైళ్లు, పలు పాసింజర్ రైళ్లు ఈ స్టేషన్



మౌలాలి రైల్వేస్టేషన్‌లో ఆధునిక హంగులు

మీదుగా రాకపోకలు సాగిస్తుంటాయి. 2,500 మంది ఇక్కడి నుంచి ప్రయాణిస్తుంటారు. పెరుగుతున్న ప్రయాణికుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని రూ.3.5 కోట్లు వెచ్చించి సౌకర్యాలను ఏర్పాటుచేయడంతో ఆదర్శస్టేషన్‌గా అభివృద్ధి చెందింది. నాన్‌సబర్బన్ గ్రేడ్ -5 క్యాటగిరీకి చెందిన ముఖ్యమైన స్టేషన్‌గా మౌలాలి విలసిల్లుతున్నది. స్టేషన్ భవన సుందరీకరణ, ప్రయాణికులకు వేచి ఉండు గది, ప్రత్యేక పార్కింగ్ సదుపాయం, పార్కింగ్ నుంచి స్టేషన్‌భవనం వరకు పుట్‌పాత్, దివ్యాంగులు, వృద్ధుల ప్రవేశం కోసం ర్యాంపులు, ఆధునిక, అందమైన సూచికల బోర్డులు, పే అండ్ యూజ్ టాయిలెట్లు, ప్లాటుఫారాల గోడలపై అందమైన ప్రకృతి దృశ్యాలు, సరిపడా తాగునీటి ఏర్పాట్లు, బుకింగ్, విచారణ కార్యాలయాలు వంటివి అందుబాటులోకి తెచ్చారు. వీటికి అదనంగా రూ.1.6 కోట్లతో నిర్మిస్తున్న పాదచారుల వంతెన త్వరలో అందుబాటులోకి రానుంది. దక్షిణ మధ్య రైల్వేలో అభివృద్ధి చెందిన స్టేషన్ల సంఖ్య మౌలాలితో కలిపి 67కు చేరుకుంటుందని సీపీఆర్వో రాకేశ్ తెలిపారు.

క్యాన్సర్‌పై చైతన్యం తేవాలి

- భయాందోళనలు తొలిగించాలి: చినజీయర్‌స్వామి
- శ్రీరామనగరం హోమియో మెడికల్ కాలేజ్‌లో వరల్డ్ క్యాన్సర్‌డే వర్క్‌షాప్
- చినజీయర్‌స్వామి పర్యవేక్షణలో సదస్సు, హాజరైన నిపుణులు

శంషాబాద్: క్యాన్సర్‌పై సమాజంలో అపోహలు, భయాందోళనలు తొలిగేలా చైతన్యం తీసుకురావడానికి అన్నివిధాలా ప్రజల్లో చర్చ జరపడంతోపాటు అన్నిరంగాలవారు కృషిచేయాలని ప్రముఖ ఆధ్యాత్మిక గురువు చినజీయర్‌స్వామి కోరారు. ఆదివారం శంషాబాద్ మండలం ముచ్చింతల్ పరిధిలోని శ్రీరామనగరం హోమియో మెడికల్ కాలేజ్‌లో వరల్డ్ క్యాన్సర్‌డే వర్క్‌షాప్ నిర్వహించారు. వికాస తరంగిణి ద్వారా క్యాన్సర్‌పై అపోహలు, అనుమానాలు తొలగించడంతో అవగాహన కార్యక్రమాలతో ఆత్మస్థైర్యం నింపేందుకు అన్నివిధాలా కృషిచేస్తున్నట్లు ఆయన వివరించారు. ప్రాథమిక దశలోనే వ్యాధి లక్షణాలు గుర్తించి నివారణచర్యలు తీసుకోవచ్చని అన్నారు. హోమియో విధానంలో ప్రత్యేక కోర్సు, శిక్షణ ఇస్తూ వైద్యవిద్యార్థులు నైపుణ్యం సాధించేలా కృషిచేస్తున్నట్లు తెలిపారు. వైద్యసంస్థలు, నిపుణులు మరింతముందుకువచ్చి క్యాన్సర్ అంటే భయంకర ప్రాణాంతక వ్యాధి కాదని ప్రజలకు తెలియజేసే కార్యక్రమాలు చేపట్టాని అన్నారు. ఈ కార్యక్రమంలో దేవనాథ జీయరుస్వామి, ప్రొఫెసర్ పురుషోత్తం, డాక్టర్ సీహెచ్ మోహనవంశీ (చీఫ్ ఆఫ్ సర్జికల్ ఆంకాలజీ, డైరెక్టర్ ఆఫ్ మెగా క్యాన్సర్ హాస్పిటల్), డాక్టర్ దీక్షిత్, సీనియర్ కన్సల్టెంట్ (ముంబయి), శ్రీకిరణ్‌కుమార్(ధాత్రి ఆర్గనైజేషన్), వికాస తరంగిణి కోఆర్డినేటర్ డాక్టర్ పాండురంగరావుతోపాటు పలువురు పాల్గొన్నారు.


శంషాబాద్ మండలం ముచ్చింతల్ పరిధిలోని శ్రీరామనగరం హోమియో మెడికల్ కాలేజ్‌లో వరల్డ్ క్యాన్సర్‌డే వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న ఆధ్యాత్మిక గురువు చినజీయర్‌స్వామి

పాతబస్తీలో భరోసా కేంద్రం!

సేఫ్‌సిటీ ప్రాజెక్టులోభాగంగా ఏర్పాటుపై పోలీస్‌శాఖ యోచన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మహిళలు, చిన్నారుల భద్రత కోసం రాష్ట్రంలో రెండుచోట్ల ఏర్పాటుచేసిన భరోసా కేంద్రాలు సత్ఫలితాలు ఇవ్వడంతో వాటిని మరింత విస్తరించాలని పోలీస్‌శాఖ భావిస్తున్నది. ఇప్పటికే హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో, వికారాబాద్ జిల్లాలో భరోసా కేంద్రాలు ఏర్పాటుచేశారు. వాటికి కొనసాగింపుగా.. కేంద్ర హోంమంత్రిత్వశాఖ కేటాయించిన సేఫ్‌సిటీ ప్రాజెక్టు నిధులతో హైదరాబాద్ పాతబస్తీలోనూ మరో భరోసాకేంద్రం స్థాపనపై పోలీస్‌శాఖ దృష్టి పెట్టినట్టు సమాచారం. పాతబస్తీలో వివాహానంతరం మహిళలను మోసగిస్తున్న కేసులు, ఇతర కేసులు, వైవాహిక సంబంధ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. వాటి పరిష్కారం కోసం, మహిళలకు కౌన్సెలింగ్ ఇచ్చి వారిలో మనోధైర్యం నింపేందుకు భరోసాకేంద్రం ఏర్పాటుచేయాలని యోచిస్తున్నట్టు తెలుస్తున్నది. సేఫ్‌సిటీ ప్రాజెక్టు నిధులు కేవలం మహిళా భద్రత అంశాలపైనే ఖర్చు చేయాల్సి ఉంటుంది. దీనికింద కేంద్ర ప్రభుత్వం రూ.200 కోట్ల వరకు నిధులు కేటాయిస్తుంది. పాతబస్తీతోపాటు రాచకొండ, సైబరాబాద్‌ల్లోనూ భరోసా కేంద్రాలను ఏర్పాటుచేయనున్నట్టు ఉన్నతాధికారులు తెలిపారు. నిధుల ఖర్చుపై త్వరలోనే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన ఓ సమావేశాన్ని నిర్వహించి, నిర్ణయిస్తారని తెలిసింది.



ఆదివారం హైదరాబాద్‌లో రిటైర్డ్ మున్సిపల్ కమిషనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ డైరీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్, సంఘం నాయకులు

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: బంగారు తెలంగాణ నిర్మాణంలో రిటైర్డ్ ఉద్యోగులు భాగస్వాములు కావాలని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తానన్నారు. ఆదివారం రిటైర్డ్ మున్సిపల్ కమిషనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ డైరీని హైదరాబాద్‌లోని సిటీ మేనేజర్స్ ట్రైనింగ్‌సెంటర్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు సుధాకర్, కార్యదర్శి సత్యనారాయణ, సుబ్రమణ్యం, మురళీధర్, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.


హైదరాబాద్‌లోని యాదవ కమ్యూనిటీ హాల్‌లో సర్పంచ్‌ను సన్మానిస్తున్న టీవైవోపీఏ రాష్ట్ర అధ్యక్షుడు ఎంబీ కృష్ణయాదవ్ తదితరులు

కేసీఆర్ పాలనలోనే యాదవుల సంక్షేమం

టీవైవోపీఏ రాష్ట్ర అధ్యక్షుడు ఎంబీ కృష్ణయాదవ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో యాదవుల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ పాటుపడుతున్నారని, ఇందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించారని తెలంగాణ యాదవ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (టీవైవోపీఏ) రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం నేత ఎంబీ కృష్ణయాదవ్ అన్నారు. గొర్రెల పథకంతో యాదవవర్గాలు ఆర్థికంగా లబ్ధి పొందుతున్నాయని చెప్పారు. పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన సర్పంచ్‌లను ఆదివారం హైదరాబాద్‌లోని యాదవ కమ్యూనిటీ హాల్‌లో సన్మానించారు. ఈ సందర్భంగా కృష్ణయాదవ్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో యాదవులు తమవంతు పాత్ర పోషించారని, ఉద్యమంలో పాల్గొన్నవారికి సీఎం కేసీఆర్ హయాంలో న్యాయం జరుగుతున్నదన్నారు. ఈ కార్యక్రమంలో లింగయ్యయాదవ్, అజయ్‌కుమార్, సత్యనారాయణ, నాగరాజు, శ్రీనివాస్, వెంకట్, నర్సింహ, హరికృష్ణ పాల్గొన్నారు.


మహారాష్ట్రలోని నాందేడ్‌లో గొల్ల-గొల్లేవార్ యాదవ సమాజం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రాజ్యాధికారం భవిష్యత్ మేళా కార్యక్రమంలో పాల్గొన్న జాతీయ యాదవ మహిళా ఫ్రంట్ అధ్యక్షురాలు బొంతు శ్రీదేవియాదవ్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు
-నమస్తే తెలంగాణ, హైదరాబాద్

రాజధాని రోడ్లకు మహర్దశ

- హైదరాబాద్‌లో రహదారుల అభివృద్ధికి రూ.5,340 కోట్లు
- అంతర్జాతీయస్థాయిలో 337 కిలోమీటర్ల మేర సుందరీకరణ
- త్వరలో పనుల ప్రారంభానికి సర్కారు సన్నాహాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

'రోడ్లు కేవలం వాహనాలు వెళ్లడానికే కాదు.. వాటి పక్కనుంచి పాదచారులూ సాఫీగా వెళ్లగలుగాలి. సైకిళ్లపైనా సులువుగా ప్రయాణించేలా పరిసరాలుండాలి.. ఆ ప్రాంతాలు పచ్చదనంతో నిండిపోవాలి.. జంక్షన్లు ఆధునికంగా దర్శనమివ్వాలి.. పాశ్చాత్య దేశాల్లో అతిసుందరంగా కనిపించే రహదారులు మన హైదరాబాద్‌లోనూ సాక్షాత్కరించాలి' అని రాష్ట్ర ప్రభుత్వం భావించింది. ఈ బృహత్ లక్ష్యాన్ని విజయవంతంగా చేపట్టడానికి హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను (హెచ్‌ఆర్డీసీఎల్) ఏర్పాటు చేసింది. ప్రత్యేకంగా మోడల్ రోడ్ కారిడార్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే నానక్‌రాంగూడ రోడ్డును అతిసుందరంగా తీర్చిదిద్దింది. మియాపూర్ నుంచి బాచుపల్లి వరకు రహదారిని కొంతమేర విస్తరించింది. తొలుత కేవలం కొన్ని రోడ్లను మాత్రమే అభివృద్ధి చేయాలని భావించగా.. తాజాగా హైదరాబాద్‌లో సుమారు 52 రహదారులకు సరికొత్త సొబగులు అద్దాలని నిర్ణయించింది. దాదాపు రూ.5,340 కోట్లతో 337 కిలోమీటర్ల మేర రహదారులను అభివృద్ధి చేయాలనే నిర్ణయానికొచ్చింది. ఇవి పూర్తిగా అభివృద్ధి చెందితే, నగరంలోని 58 లక్షల మంది ప్రజలకు ఉపయోగపడుతుంది. ఔటర్ రింగ్ రోడ్‌పై సాఫీగా ప్రయాణిస్తున్నట్టుగా.. శంషాబాద్ విమానాశ్రయానికి సులువుగా వెళ్తున్నట్టుగా.. నగరవాసులకు సుఖమయ ప్రయాణాన్ని అందించేందుకు ప్రభుత్వ అడుగులు ముందుకేస్తుండటం విశేషం. ఈ పనిని వీలైనంత త్వరగా పట్టాలెక్కించడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నదని పురపాలకశాఖ అధికారులు చెప్తున్నారు. ఇప్పటికే బేగంపేటలోని మినిస్టర్స్ రోడ్డును ఆకర్షణీయంగా తీర్చిదిద్దే ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ఉప్పల్, సంగీత్ జంక్షన్‌తోపాటు నగరంలో మరో 49 రహదారులను ఆటంకాల్లేని ప్రయాణం సాధ్యమయ్యేలా హెచ్‌ఆర్డీసీఎల్ అభివృద్ధి చేయడానికి సంసిద్ధంగా ఉన్నది. ప్రభుత్వంనుంచి అనుమతి లభించగానే పనులు ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నామని హెచ్‌ఆర్డీసీఎల్ పేర్కొంటున్నది.

డీపీఆర్‌ల పనుల పూర్తి ఇలా..

ఏడాది	పనుల పూర్తి	పొడవు (కి.మీ.లో)	ఖర్చు
2018	పూర్తి/పనుల కొనసాగింపు	160 కి.మీ.	2,400 కోట్లు
2019	ఫిబ్రవరి- ఏప్రిల్	38	600 కోట్లు
2019	ఏప్రిల్- జూన్	38	630 కోట్లు
2019	జూన్- సెప్టెంబర్	50	850 కోట్లు
2019	సెప్టెంబర్- డిసెంబర్	51	860 కోట్లు
మొత్తం		337	5,340 కోట్లు


ఖాజాగూడ రోడ్డు ప్రస్తుత పరిస్థితి


అత్యాధునిక సౌకర్యాలతో రూపుదిద్దుకోనున్న ఖాజాగూడ రహదారి నమూనా చిత్రం

డీపీఆర్ సిద్ధం

హైదరాబాద్‌ను అంతర్జాతీయస్థాయిలో తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం పక్కా ప్రణాళికతో ముందుకుసాగుతున్నది. మొత్తం 337 కిలోమీటర్లను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించగా.. ఇప్పటివరకు 160 కిలోమీటర్ల మేర రహదారుల డీపీఆర్‌ను హెచ్‌ఆర్డీసీఎల్ సిద్ధం చేసింది. మొదటి ప్యాకేజీలో మియాపూర్- అసెంబ్లీ మార్గం ఉండగా, రెండో ప్యాకేజీలో అసెంబ్లీ- ఎల్బీనగర్, అఫ్జల్‌గంజ్- ఆరాంఘర్, మూడో ప్యాకేజీలో ఎల్బీనగర్- సరోజినిదేవి దవాఖాన- వయా ఆరాంఘర్, నాలుగో ప్యాకేజీలో సరోజినిదేవి రోడ్- ఎల్బీనగర్ వయా మెట్టుగూడ మార్గాలున్నాయి. మిగతా నాలుగు డీపీఆర్‌లను ఈ ఏడాది డిసెంబర్‌లోపు పూర్తిచేస్తారు.

ఇలా అభివృద్ధి చేస్తారు..

- పాశ్చాత్య నగరాల తరహాలో రహదారులను అత్యుత్తమంగా తీర్చిదిద్దుతారు. అన్నివయసులవారు సులువుగా రాకపోకలు సాగించేలా, రోడ్లనుదాటేలా అభివృద్ధి చేస్తారు.
- ఇప్పటివరకు రహదారులంటే కేవలం వాహనాలు నడిచేలా మాత్రమే రూపుదిద్దుకున్నాయి. రానున్న రోజుల్లో పాదచారులు సులువుగా నడిచేలా, సైకిళ్లు వెళ్లేందుకు వీలుండేలా రూపొందిస్తారు. నగర ప్రజలు ఆరోగ్యకరంగా జీవించాలంటే ప్రత్యేకంగా వాకింగ్‌ను ప్రోత్సహించేలా రహదారులను తీర్చిదిద్దుతారు.
- వీధులన్నీ పచ్చదనంతో నిండేలా, ఆకర్షణీయంగా అభివృద్ధి చేస్తారు.
- ఆటంకాల్లేని ప్రయాణానికి అడ్డంకులుగా నిలిచే ఇరుకు ప్రాంతాలను తొలిగిస్తారు.
- రహదారులపై కొన్ని ప్రాంతాలను ప్రత్యేకంగా పార్కింగ్ కోసం కేటాయిస్తారు.
- స్కూళ్ల జోన్లకు పెద్దపీట వేస్తూ.. పాఠశాలల విద్యార్థులకు భద్రతను అందించేందుకు ప్రయత్నిస్తారు.
- జంక్షన్లను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తారు. భూగర్భంలో డక్టులను ఏర్పాటు చేస్తారు.

పుష్‌పుల్ ప్రయాణం నరకం

- నిత్యం కిక్కిరిసిపోతున్న వరంగల్- హైదరాబాద్ రైలు
- ప్రతి మూడు బోగీలకు ఒకేఒక్క టాయిలెట్
- పేదల బండిలో ఇబ్బందులెన్నో

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పేదల బండిగా భావించే పుష్‌పుల్‌కోసం నిత్యం వేలమంది హైదరాబాద్, సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో ఎదురుచూస్తుంటారు. తక్కువ ఖర్చుతో హైదరాబాద్ నుంచి వరంగల్‌కు ప్రయాణం చేయవచ్చని ప్రతి ప్రయాణికుడు రైలు వెళ్లే సమయం దగ్గరపడుతుంటే తొందరపడటం సర్వసాధారణం. పుష్‌పుల్‌లో ప్రయాణం ఎంత సరదాగా ఉంటుందో ఇబ్బందులు కూడా అదేస్థాయిలో ఉన్నాయి. సీట్లు దొరకవు, ప్రతి మూడు బోగీలకు ఒక టాయిలెట్ మాత్రమే ఉండటంతో ప్రయాణికులు నిత్యం నరకం అనుభవిస్తున్నారు. ఈ రైలు రోజూ ఉదయం 5:15 గంటలకు వరంగల్ నుంచి బయలుదేరి ఉదయం 9 గంటలకు హైదరాబాద్‌కు చేరుకుంటుంది. మళ్లీ హైదరాబాద్ స్టేషన్ నుంచి ఉదయం 10:30 గంటలకు బయలుదేరి, మధ్యాహ్నం 1:30 గంటలకు వరంగల్ చేరుకుంటుంది. వరంగల్ నుంచి మధ్యాహ్నం 2 గంటలకు మరోసారి హైదరాబాద్‌కు బయలుదేరుతుంది. మళ్లీ హైదరాబాద్ నుంచి సాయంత్రం 6:30 గంటలకు వరంగల్‌కు వెళ్లేందుకు సిద్ధంగా ఉంటుంది. ఇలా నిత్యం లోకల్ రైలు పుష్‌పుల్ ప్రయాణికులకు సేవలందిస్తుంది. ఈ రైలులో వెళ్లేందుకు ప్రయాణికులు ఎంతో ఇష్టపడుతారు. ఎందుకంటే తక్కువ చార్జీ, పైగా తొందరగా గమ్యస్థానానికి చేరుకోవడం దీని ప్రత్యేకత. ఈ రైలులో ఇటీవల ప్రయాణికుల విజ్ఞప్తి మేరకు ప్రతి మూడు బోగీలకు ఒక టాయిలెట్‌ను ఏర్పాటుచేశారు. జనం నిండుగా సౌకర్యాలు తక్కువగా ఉంటుండటంతో ఇబ్బందులు తప్పటంలేదు. అయితే ఈ రైలుకు మరో ప్రత్యేకత కూడా ఉన్నది. దీనికి రెండు వైపుల ఇంజిన్ ఉంటుంది. ఇటువైపు వస్తే ఇక్కడి ఇంజిన్, అటువైపు వెళ్తే అక్కడి ఇంజిన్‌తో ప్రయాణిస్తుంటుంది.



తక్కువ చార్జీతో కిక్కిరిసిపోతున్న రైలు

పుష్‌పుల్ రైలులో తక్కువ చార్జీతో గమ్యానికి చేరే అవకాశం ఉండటంతో అధికశాతం ప్రయాణికులు దీనిని ఎంచుకుంటారు. హైదరాబాద్ నుంచి కేవలం రూ.30కే వరంగల్‌కు చేరుకోవచ్చు. తక్కువ చార్జీ ఉండటంవల్లే ప్రయాణికులు కిక్కిరిసిపోతారు. ఈ రూట్‌లో వెళ్లే మిగతా అన్ని రైళ్లలో రూ.60 నుంచి రూ.80కి పైనే చార్జీలు ఉన్నాయి. పుష్‌పుల్ ప్రతి స్టేషన్‌లో ఆగుతుండటంతో అందిరికి సౌకర్యంగా ఉంటుంది. దీంతో అన్ని రైళ్లకంటే పుష్‌పుల్‌లో జనం కిటకిటలాడుతారు. ఇలాంటి రైళ్లు మరిన్ని నడుపాలని ప్రయాణికులనుంచి విజ్ఞప్తులు వస్తున్నాయి.

టికెట్ లేని ప్రయాణికులే అధికం:అధికారులు

పుష్‌పుల్ లోకల్ ట్రైన్‌లో ప్రయాణికుల చాలామంది టికెట్ తీసుకోకుండానే (బగర్ టికెట్) ప్రయణాలు చేస్తుంటారని అధికారులు చెప్తున్నారు. దీనిలో కిక్కిరిసిపోయి జనం ప్రయాణం చేస్తున్నా ఆశించినస్థాయిలో ఆదాయం రావడం లేదంటున్నారు. 12 కోచ్‌లతో ప్రయాణికులు నిండుగా ఉంటే రోజుకు రూ.5 లక్షల ఆదాయం రావాల్సి ఉంటుంది. కానీ ఈ టార్గెట్‌ను ఇప్పటివరకు రైల్వేశాఖ చేరుకోలేకపోయిందని అధికారులు వాపోతున్నారు. టికెట్‌లేని ప్రయాణికులకు కనీసంగా రూ.250 జరిమానాలు విధిస్తారు. అయితే ఈ జరిమానాలు కట్టే పరిస్థితి ప్రయాణికుల వద్ద లేకపోవడంతో తనిఖీ అధికారులు కూడా పెద్దగా పట్టించుకోరు. ఈ రైలులో అధికశాతం మంది టికెట్ లేకుండానే ప్రయాణం చేస్తారనే ప్రచారం ఉన్నది.

పాఠశాలలకు గ్రాంట్స్ విడుదల చేయాలి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రభుత్వ పాఠశాలలకు గ్రాంట్స్ విడుదల చేయాలని టీపీస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గం కోరింది. రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ రాములు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు తీర్మానాలు చేసినట్టు కార్యవర్గసభ్యులు ఓప్రకటనలో తెలిపారు.

కాంగ్రెస్ విందు రాజకీయాలు

- మల్లు రవి దావత్‌కు హాజరైన నేతలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కాంగ్రెస్‌లో విందు రాజకీయాలు కొనసాగుతున్నాయి. తమకు అనుకూలంగా మలుచుకునేందుకు కొందరు, వచ్చే పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని మరికొందరు విందులు ఏర్పాటుచేస్తున్నారు. ఇటీవల సీనియర్ నేత డీకే అరుణ విందుఇవ్వగా, ఆదివారం మాజీ ఎంపీ మల్లు రవి హైదరాబాద్‌లోని తన నివాసంలో విందు ఏర్పాటుచేశారు. తన సోదరుడైన మల్లు భట్టి విక్రమార్కకు సీఎల్పీ పదవి ఇచ్చిన సందర్భంగా విందు ఇచ్చినట్టు సమాచారం. టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీనియర్ నేతలు జానారెడ్డి, డీకే అరుణ, మల్లు రవి, జీవన్‌రెడ్డి, పార్టీ స్టార్ క్యాంపెయినర్ విజయశాంతి తదితరులు హాజరై భవిష్యత్ రాజకీయాలపై చర్చించారు. ఇటీవలి అసెంబ్లీ, పంచాయతీ ఎన్నికలపై కూడా విశ్లేషణలు చేసినట్టు తెలిసింది.

కలలు నిజంచేస్తున్న 'విదేశీ విద్యానిధి'

- ఏటా 50 మంది క్రిస్టియన్ విద్యార్థుల చదువుకు సాయం
- రూ.20 లక్షలతోపాటు ప్రయాణ ఖర్చులు అదనం
- విద్యార్థుల ప్రతిభే ఆధారం.. ఎంపిక ఎంతో పారదర్శకం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

విదేశాల్లో విద్యను అభ్యసించి ఉన్నతంగా జీవించాలని ఎంతోమంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కలలు కంటుంటారు. కానీ ఆర్థిక పరిస్థితుల కారణంగా చాలామంది క్రిస్టియన్ మైనార్టీ విద్యార్థులు ముందుకు వెళ్లలేకపోతున్నారు. అలాంటివారికి తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆర్థికంగా భరోసా కల్పిస్తూ, వారి కలను నిజం చేస్తున్నది. విదేశీ విద్యానిధి పథకం కింద అర్హులకు స్కాలర్‌షిప్ రూపంలో నిధులను సమకూరుస్తూ ఏ దేశంలోనైనా చదువుకునేలా ప్రోత్సహిస్తున్నది.

రూ.20 లక్షలతోపాటు ప్రయాణ ఖర్చులు

విదేశీ విద్యానిధి పథకానికి అర్హులైన వారికి రూ.20 లక్షల ఆర్థిక సాయాన్ని రెండు విడతలుగా విద్యార్థి ఖాతాలో జమచేస్తారు. ప్రయాణ ఖర్చుల కింద విమాన చార్జీలను అదనంగా అందిస్తున్నారు. విద్యార్థులు చదివే యూనివర్సిటీ ఐడీకార్డును ఈ-పాస్ వెబ్‌సైట్లలో అప్‌లోడ్‌చేసిన అనంతరం మొదటి విడుతగా రూ.10 లక్షలను, మొదటి సెమిస్టర్ మార్కుల జాబితాను అప్‌లోడ్‌చేసిన తర్వాత రెండో విడుత రూ.10 లక్షలను ఖాతాల్లో జమచేస్తారు.

ఏటా 50 మంది విద్యార్థులకు అవకాశం

విదేశీ విద్యానిధి పథకం ద్వారా ఏటా రెండు సీజన్లలో సీజన్‌కు 25 మంది చొప్పున మొత్తం 50 మంది విద్యార్థులకు ఆర్థిక సాయం చేస్తున్నారు. క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా ఇప్పటివరకు మొత్తంగా 65 మంది లబ్ధిపొందారు. వీరిలో 38 మంది అబ్బాయిలు, 27 మంది అమ్మాయిలు ఉన్నారు. ఈ పథకం ద్వారా చదువుకున్న చాలామంది విదేశాల్లోనే ఉద్యోగం చేస్తూ ఆర్థికంగా నిలదొక్కుకున్నారని క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ అధికారులు తెలిపారు.



పారదర్శకంగా విద్యార్థుల ఎంపిక

విదేశీ విద్యానిధి పథకానికి విద్యార్థుల ఎంపిక ఎంతో పారదర్శకంగా నిర్వహిస్తున్నారు. ప్రత్యేకంగా స్టేట్‌లెవల్ సెలక్షన్ కమిటీని ఏర్పాటుచేశారు. దరఖాస్తులను జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారులు పరిశీలించి స్టేట్ కమిటీకి నివేదిక పంపుతారు. ప్రతిభావంతుల జాబితా ఆధారంగా, కుటుంబ వార్షిక ఆదాయం రూ.5 లక్షలలోపు ఉన్న అర్హులను ఎంపికచేస్తారు.

పేద క్రిస్టియన్ విద్యార్థులకు చేయూత

విదేశీ విద్యానిధి పథకం క్రిస్టియన్ మైనార్టీల్లోని పేద విద్యార్థులకు చేయూతనిస్తున్నది. ఉన్నత విద్యతోనే పేద కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే ఆలోచనతో సీఎం కేసీఆర్ ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. కానీ పూర్తిస్థాయిలో ప్రజలు ఈ పథకాన్ని వినియోగించుకోవడం లేదు. దీనిపై విస్తృతంగా ప్రచారంచేసి అవగామన పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

-ఏహెచ్చైన్ కాంతి వెస్లీ, టీఎస్‌సీఎంఎఫ్సీ ఎండీ

పగలు ఎండ.. రాత్రి చలి

హైదరాబాద్/సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో చలితీవ్రత కొంత తగ్గుముఖం పట్టినప్పటికీ మరో వారంపాటు చలి ప్రభావం ఉంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి నాగరత్న తెలిపారు. పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరిగి పొడివాతావరణం నెలకొంటుందన్నారు. ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ వరకు పగటి ఉష్ణోగ్రతలు నాలుగు డిగ్రీలవరకు పెరిగాయి. రాష్ట్రవ్యాప్తంగా 30.8 నుంచి 32 డిగ్రీల మధ్య నమోదవుతున్నాయి. ఆదిలాబాద్, మెదక్, నల్లగొండ, నిజామాబాద్, రామగుండం, రంగారెడ్డి, హన్మకొండ తదితర ప్రాంతాల్లో చలితీవ్రత కొనసాగుతున్నది. ఆదివారం మంచిర్యాల, కుమ్రంభీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో 11.7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. హైదరాబాద్‌లో ఉష్ణోగ్రత సాధారణస్థాయికి చేరి 16.9 డిగ్రీలుగా రికార్డయింది. గాలిలో తేమ 77శాతానికి తగ్గిందని, ఇకనుంచి ఉష్ణోగ్రతలు పెరిగి చలి ప్రభావం తగ్గుతుందని అధికారులు వెల్లడించారు. ఈ నెల 8 వరకు రాత్రి, తెల్లవారుజాము పొగమంచు ఏర్పడే అవకాశాలున్నట్టు చెప్పారు.

ఈ నెల 8వరకు పొగమంచు కురిసే అవకాశం

చలికాలం

జిల్లా	కనిష్ఠం	గరిష్ఠం
మంచిర్యాల	11.7	30.8
ఆసిఫాబాద్	11.7	30.8
ఆదిలాబాద్	11.7	30.8
సంగారెడ్డి	12.3	32.4
నాగర్‌కర్నూల్	13.5	34.6
మెదక్	13.6	32.7
మహబూబ్‌నగర్	13.9	34.6
వికారాబాద్	14.0	28.6
సూర్యాపేట	14.0	30.0
సిద్దిపేట	14.4	32.6
కరీంనగర్	14.5	34.8
జనగామ	14.6	34.3
యాదాద్రి	14.6	34.6
రంగారెడ్డి	15.0	30.0
నిర్మల్	15.0	31.0
జగిత్యాల	15.0	32.0
మహబూబాబాద్	15.2	34.9
వనపర్తి	15.7	34.6
జోగులాంబ గద్వాల	15.8	33.0
కామారెడ్డి	16.0	29.0
రాజన్న సిరిసిల్ల	16.0	31.0
పెద్దపల్లి	16.4	30.0
హైదరాబాద్	16.9	29.0
మేడ్చల్ మల్కాజిగిరి	16.9	29.0
నిజామాబాద్	16.9	31.3
వరంగల్ అర్బన్	17.0	30.5
వరంగల్ రూరల్	17.0	31.0
జయశంకర్	17.0	31.0
నల్లగొండ	18.0	30.0
ఖమ్మం	18.0	31.0
భద్రాద్రి కొత్తగూడెం	18.0	32.0

విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్న సీఎం కేసీఆర్

హోంమంత్రి మహమూద్ అలీ

హైదరాబాద్: రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని హోం మంత్రి మహమూద్ అలీ తెలిపారు. అక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్ 38వ వార్షిక స్పోర్ట్స్ మీట్ సందర్భంగా హైదరాబాద్, ఎల్బీ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సీఎం ప్రత్యేక చొరవతో ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీలకు ప్రత్యేకంగా రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేసి ఉచితంగావిద్యనందిస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ వైస్ చైర్‌పర్సన్ ప్రార్థన, అర్జున అవార్డు గ్రహీత జేజే శోభ, సాట్స్ చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి, వేదకుమార్ తదితరులు పాల్గొన్నారు.





ప్రపంచకప్ హాట్ ఫేవరెట్
టీమ్ ఇండియా

ఎక్కడైనా.. పిచ్ ఏదైనా మనోళ్లు రెచ్చిపోతారు: సచిన్

కోల్‌కతా: ప్రపంచకప్‌లో భారత్ హాట్ ఫేవరెట్ అని భారత క్రికెట్ దిగ్గజం సచిన్ అభివర్ణించాడు. కోల్‌కతాలో ఫుల్‌మారథాన్‌ను జెండా ఊపి ప్రారంభించిన సందర్భంగా సచిన్ ఆదివారం మీడియాతో మాట్లాడుతూ న్యూజిలాండ్‌పై ద్వైపాక్షిక సిరీస్ సాధించిన టీమ్ ఇండియాను ఆకాశానికెత్తాడు. ప్రస్తుతం భారత జట్టు ఎక్కడైనా, ఎలాంటి పిచ్ ఎదురైనా రెచ్చిపోయి ఆడి విజయం సాధిస్తుందన్నాడు. వన్డేల్లో వరుసగా దక్షిణాఫ్రికా(5-1), ఆస్ట్రేలియా(2-1), న్యూజిలాండ్(4-1)పై టీమ్ ఇండియా విజయాలను సాధించిన విషయాన్ని గుర్తు చేశాడు. 'వరుస విజయాల రికార్డు పరిగణనలోకి తీసుకుని నేను చెప్పడం లేదు. ప్రస్తుతం టీమ్ ఇండియా జట్టు కూర్పు అద్భుతంగా ఉంది. ఈ కూర్పు ప్రపంచంలోని వేదిక ఏదైనా ..ఎలాంటి పిచ్ ఎదురైనా వారిని ఆపడం అసాధ్యమే. అందుకే నేను ఎలాంటి సందేహం లేకుండా ఇంగ్లండ్‌లో జరుగనున్న ప్రపంచకప్ టోర్నీకి టీమ్ ఇండియా హాట్ ఫేవరెట్ అని చెబుతున్నాను' అని సచిన్ అన్నాడు. వెస్టిండీస్‌తో జరుగుతున్న టెస్ట్ సిరీస్‌లో ఇంగ్లండ్ ఓడిపోయినా వన్డేల్లో ఆ జట్టు భీకరంగా కనిపిస్తుందన్నాడు. 'సొంతగడ్డపై ఇంగ్లండ్ కఠిన ప్రత్యర్థి అనడం వాస్తవం. ప్రస్తుత సిరీస్‌లో కివీస్ జట్టు ఓడినా.. మరోవైపు న్యూజిలాండ్ జట్టు ప్రపంచకప్‌లో పోటీదారు. ఇంగ్లండ్ గడ్డపై త్వరగా జోరందుకోవడంపైనే జయాపజయాలు ఆధారపడి ఉంటాయి. నిషేధం వేటు ముగిసిన తర్వాత ఆస్ట్రేలియా జట్టు తో స్టీవ్‌స్మిత్, డేవిడ్ వార్నర్ చేరితే బలం పెరుగనుంది. వారి బౌలర్లు జోరు చూపగలిగితే ఆసీస్ కూడా పోటీదారుగా మారుతుంది' అని మాస్టర్ పేర్కొన్నాడు. ఇటీవలి కాలంలో మహిళా అథ్లెట్లు మన దేశానికి ఎనలేని కీర్తి ప్రతిష్ఠలు తీసుకువస్తున్నారని కొనియాడాడు. హిమదాస్, ద్యుతీచంద్, స్వప్నబర్మన్ లాంటి యువ అథ్లెట్లను ప్రశంసించాడు. అంతేకాదు 2016 రియో ఒలింపిక్స్‌లో రెండు పతకాలు నెగ్గింది కూడా మహిళలేనని గుర్తు చేశాడు. బ్యాడ్మింటన్‌లో సింధు(రజతం), కుస్తీలో సాక్షిమాలిక్(కాంస్యం) పతకం నెగ్గిన విషయం తెలిసిందే. వీరంతా మహిళా సాధికారితకు నిలువుటద్దాలని సచిన్ ప్రశంసించాడు.



'పటిష్ఠమైన కివీస్ బౌలింగ్‌ను ఎదుర్కోవడం కష్టమనిపించింది. నాలుగు వికెట్లు కోల్పోయిన దశలో మరో వికెట్ పడకుండా మ్యాచ్‌ను 30వ ఓవర్ వరకు తీసుకెళ్లాలనుకున్నాం. అందుకు అనుగుణంగా నేను, విజయ్, జాదవ్ బ్యాటింగ్ చేశాం. ఇలాంటి క్లిష్టమైన పరిస్థితుల్లో నిలదొక్కుకోవడం చాలా ముఖ్యం. పోరాడే లక్ష్యాన్ని కివీస్ ముందు ఉంచాం. బౌలర్లు సమిష్టిగా రాణించడంతో విజయమందుకున్నాం'

- రాయుడు

రాయుడు గెలిపించాడు

రాణించిన శంకర్, హార్దిక్, చాహల్

ఆఖరి వన్డేలో అద్భుత విజయం ● కివీస్ గడ్డపై 4-1తో భారత్ చిరస్మరణీయ గెలుపు

న్యూజిలాండ్ గడ్డపై గెలుపే గొప్ప అనుకున్నాం ఇన్నాళ్లు. కానీ మనోళ్లు చరిత్ర తిరుగరాశారు. గత అనుభవాలకు భిన్నంగా సమిష్టి ప్రదర్శనతో సత్తాచాటారు. ఆస్ట్రేలియాపై ద్వైపాక్షిక సిరీస్ విజయమిచ్చిన ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగిన టీమ్ ఇండియా కివీస్‌ను మట్టికరిపించింది. రాయుడు, హార్దిక్, చాహల్ రాణింపుతో ఐదో వన్డేలో భారత్ అద్భుత విజయాన్ని ఖాతాలో వేసుకుంది. 4-1తో సిరీస్‌ను దక్కించుకుని ఐదు దశాబ్దాల తర్వాత తొలిసారి మెరుగైన ఆధిక్యంతో ట్రోఫీని ముద్దాడింది. హామిల్టన్‌లో ఎదురైన పరాజయానికి వెల్లింగ్టన్‌లో కివీస్‌పై టీమ్‌ఇండియా కసితీరా ప్రతీకారం తీర్చుకుని టీ20 పోరుకు సిద్ధమైంది.

మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్
రాయుడు(90)


ట్రోఫీతో భారత జట్టు సభ్యులు

వెల్లింగ్టన్: పరాజయం పాఠం నేర్పింది. బ్యాటింగ్‌లో మేమే తోపు అనుకున్న వాళ్లను ఓటమి నేలకు దించింది. అదే సమయంలో లోపాలేంటో బయటపెట్టింది. ఇటీవలి కాలంలో ఇంతటి ఓటమి ఎరుగని మనోళ్లు గెలుపుతో మాకు తిరుగులేదని చాటారు. ఆదివారం న్యూజిలాండ్‌తో జరిగిన ఆఖరిదైన ఐదో వన్డేలో భారత్ 35 పరుగుల తేడాతో విజయం సాధించి సిరీస్‌ను 4-1తో ఖాతాలో వేసుకుంది. దీని ద్వారా కివీస్‌లో తొలి పర్యటన మొదలైన 1967 తర్వాత ఆధిక్యం పరంగా అత్యుత్తమ సిరీస్ విజయాన్ని టీమ్ ఇండియా అందుకుంది. 2008-09 సిరీస్ విజయం(3-1) అనంతరం భారత్‌కు ఇదే మెరుగైన ఫలితం కావడం విశేషం. రోహిత్ సేన నిర్దేశించిన 253 పరుగుల లక్ష్యఛేదనలో కివీస్..44.1 ఓవర్లలో 217 పరుగులకు ఆలౌటైంది. చాహల్(3/41), షమీ(2/35), హార్దిక్(2/50) ధాటికి కివీస్ విలవిలలాడిపోయింది. నీశమ్(44) తప్పా మిగతా బ్యాట్స్‌మెన్ స్థాయికి తగ్గట్లు రాణించలేకపోయారు. తొలుత తెలుగు క్రికెటర్ అంబటి రాయుడు(113 బంతుల్లో 90, 8ఫోర్లు, 4సిక్స్‌లు) అర్ధసెంచరీకి తోడు శంకర్(64 బంతుల్లో 45, 4ఫోర్లు), హార్దిక్ పాండ్యా(22 బంతుల్లో 45, 2ఫోర్లు, 5సిక్స్‌లు) రాణింపుతో భారత్..49.5 ఓవర్లలో 252 పరుగులు చేసింది. హెన్రీ(4/35), బౌల్ట్(3/39) రాణించారు. అర్ధసెంచరీతో జట్టును గెలుపులో కీలకమైన రాయుడుకు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కగా, మహ్మద్ షమీ 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్'గా నిలిచాడు. ఇరు జట్ల మధ్య ఈనెల 6 నుంచి మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ మొదలవుతుంది.

టాపార్డర్ టపాటపా

తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్‌కు సరైన ఆరంభం కలిసిరాలేదు. హామిల్టన్‌లో లాగే..ఐదో వన్డేకు వేదికైన వెల్లింగ్టన్‌లో పిచ్ పేస్‌కు అనుకూలించడంతో భారత టాపార్డర్ బ్యాట్స్‌మెన్ మళ్లీ తడబడ్డాడు. ఓపెనర్లు ధవన్(6), రోహిత్(2)తో పాటు యువ శుభ్‌మన్ గిల్(7), ధోనీ(1)..సింగిల్ డిజిట్ స్కోర్లకే వెనుదిరిగారు. స్టార్ స్పీడ్‌స్టర్ బౌల్ట్‌కు తోడు హెన్రీ పేస్ విజృంభణతో భారత్ 18 పరుగులకే నాలుగు కీలక వికెట్లు కోల్పోయింది. పిచ్ పరిస్థితులను తమకు అనుకూలంగా మలుచుకుంటూ ఈ ఇద్దరు చెలరేగడంతో టీమ్‌ఇండియా బ్యాట్స్‌మెన్ చేతులెత్తేశారు. రోహిత్‌తో మొదలైన వికెట్ల పతనం ధోనీ వరకు కొనసాగింది. హెన్రీ బౌలింగ్‌లో రోహిత్ క్లీన్‌బౌల్డ్ కాగా, ధవన్..బౌల్ట్‌కు దొరికిపోయాడు. మెరుపులు మెరిపిస్తాడనుకున్న గిల్..నిరాశపరుచగా, గాయం నుంచి కోలుకుని జట్టులోకి వచ్చిన ధోనీ ఒక పరుగుకే బౌల్ట్ బౌలింగ్‌లో బౌల్డయ్యాడు.

ఆదుకున్న అంబటి

18 పరుగులకే టాపార్డర్ బ్యాట్స్‌మెన్ పెవిలియన్ చేరుకున్న సమయాన 'హామిల్టన్' ప్రదర్శన పునరావృతమవుతుందని అందరూ అనుకున్నారు. కానీ ఇక్కడే అంబటి రాయుడు ఆపద్బాంధవునిలా ఆదుకున్నాడు. పీకల్లోతు కష్టాల్లో ఉన్న జట్టును శంకర్‌తో కలిసి ఒడ్డును పడేశాడు. కివీస్ బౌలర్లను సమయోచితంగా ఎదుర్కొంటూ స్కోరుబోర్డుకు కీలక పరుగులు జతచేశాడు. శంకర్ అండతో స్వేచ్ఛగా షాట్లు ఆడుతూ ఇన్నింగ్స్‌ను నిర్మించాడు. గ్రాండ్‌హోమ్ బౌలింగ్‌లో వరుస బౌండరీలతో తన వన్డే కెరీర్‌లో 10వ అర్ధసెంచరీని ఖాతాలో వేసుకున్న రాయుడు..ప్రపంచకప్ టోర్నీకి ముందు కీలక ఇన్నింగ్స్‌తో మేనేజ్‌మెంట్ తనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టాడు. అదే జోరు కొనసాగించిన రాయుడు మన్రో బౌలింగ్‌లో సిక్స్‌లతో చెలరేగిపోయాడు. ఇన్నింగ్స్ మొత్తమ్మీద 8 ఫోర్లు, 4సిక్స్‌లతో విజృంభించాడు. మరోవైపు క్రీజులో కుదురుకున్న శంకర్..అవకాశాన్ని చక్కగా సద్వినియోగం చేసుకున్నాడు. సాధికారిక ఆటతీరుతో పరుగులు కొల్లగొట్టాడు. అయితే కమ్యూనికేషన్ లోపంతో శంకర్ రనౌట్‌గా వెనుదిరిగాడు. దీంతో ఐదో వికెట్‌కు 98 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. ఆ తర్వాత కేదార్ జాదవ్, హార్దిక్ పాండ్యా రాణింపుతో భారత్‌కు గౌరవప్రదమైన స్కోరు దక్కింది. సస్పెన్షన్ నుంచి బయటపడి తిరిగి జట్టులోకి వచ్చిన పాండ్యా..వీరవిహారం చేశాడు. లెగ్‌స్పిన్నర్ టాడ్ ఆస్టిల్ బౌలింగ్‌లో హ్యాట్రిక్ సిక్స్‌లతో విరుచుకుపడి జట్టులో తన ప్రాధాన్యమేంటో చెప్పకనే చెప్పాడు.


మ్యాన్ ఆఫ్ ద సిరీస్
మహ్మద్ షమీ

నీశమ్ ఆశలు రేపినా

లక్ష్యఛేదనలో కివీస్‌కు ఆదిలోనే నికోలస్(8) రూపంలో ఎదురుదెబ్బ తగిలింది. షమీ బౌలింగ్‌లో జాదవ్‌కు క్యాచ్ ఇచ్చి నికోలస్ వెనుదిరిగాడు. గాయపడ్డ గప్టిల్ స్థానంలో తుదిజట్టులోకి వచ్చిన కొలిన్ మన్రో(24) నిరాశపరిచాడు. మహ్మద్ షమీ బౌలింగ్‌లో క్లీన్‌బౌల్డ్ అయిన మన్రో రెండో వికెట్‌గా వెనుదిరిగాడు. సిరీస్‌లో సూపర్ ఫామ్‌మీదున్న రాస్ టేలర్(1) సింగిల్ డిజిట్ స్కోరుకే పరిమితమయ్యాడు. పాండ్యా బౌలింగ్‌లో టేలర్ వికెట్ల ముందు అడ్డంగా దొరికిపోయాడు. దీంతో 38 పరుగులకే కివీస్ మూడు కీలక వికెట్లు కోల్పోయింది. ఆదుకుంటారనుకున్న కెప్టెన్ విలియమ్సన్(39), లాథమ్(37) కూడా నిలదొక్కుకోలేకపోవడం కివీస్ ఆశలను వమ్ముచేసింది. వీరిద్దరు వెంటవెంటనే నిష్క్రమించడం ఓటమిని దాదాపు ఖరారు చేసింది. అయితే ఓ దశలో నీశమ్(44) జట్టును గెలిపించేలా కనిపించాడు. జాదవ్ బౌలింగ్‌లో అనవసరంగా ముందుకెళ్లిన నీశమ్‌ను కండ్లు చెదిరే రీతిలో ధోనీ రనౌట్ చేయడం మ్యాచ్‌ను మలుపు తిప్పింది. దీనికి తోడు కీలక సమయాల్లో చాహల్ వికెట్లు తీయడం భారత్‌కు బాగా కలిసొచ్చింది.


చాహల్
(3/41)

స్కోరుబోర్డు

భారత్: రోహిత్ (బి)హెన్రీ 2, ధవన్(సి) హెన్రీ(బి)బౌల్ట్ 6, గిల్(సి)సాంట్నర్(బి)హెన్రీ 7, రాయుడు(సి)మన్రో(బి) హెన్రీ 90, ధోనీ(బి)బౌల్ట్ 1, శంకర్(రనౌట్) 45, జాదవ్(బి)హెన్రీ 34, హార్దిక్(సి)బౌల్ట్(బి)నీశమ్ 45, భువనేశ్వర్(సి)టేలర్(బి)బౌల్ట్ 6, షమీ(రనౌట్) 1, చాహల్ 0 నాటౌట్; **ఎక్స్‌ట్రాలు:** 15; **మొత్తం:** 49.5 ఓవర్లలో 252 ఆలౌట్; **వికెట్ల పతనం:** 1-8, 2-12, 3-17, 4-18, 5-116, 6-190, 7-203, 8-248, 9-252, 10-252; **బౌలింగ్:** హెన్రీ 10-1-35-4, బౌల్ట్ 9.5-2-39-3, నీశమ్ 5-0-33-1, గ్రాండ్‌హోమ్ 7-0-33-0, మన్రో 10-0-47-0, సాంట్నర్ 3-0-18-0, ఆస్టిల్ 5-0-35-0.

న్యూజిలాండ్: మన్రో(బి)షమీ 24, నికోలస్(సి)జాదవ్(బి)షమీ 8, విలియమ్సన్(సి)ధవన్(బి)జాదవ్ 39, టేలర్(ఎల్బీ)హార్దిక్ 1, లాథమ్(ఎల్బీ) చాహల్ 37, నీశమ్(రనౌట్) 44, గ్రాండ్‌హోమ్(ఎల్బీ)చాహల్ 11, సాంట్నర్(సి)షమీ(బి)హార్దిక్ 22, ఆస్టిల్(ఎల్బీ)చాహల్ 10, హెన్ర 17 నాటౌట్, బౌల్ట్(సి)షమీ(బి)భువనేశ్వర్ 1; **ఎక్స్‌ట్రాలు:** 3; **మొత్తం:** 44.1 ఓవర్లలో 217 ఆలౌట్; **వికెట్ల పతనం:** 1-18, 2-37, 3-38, 4-105, 5-119, 6-135, 7-176, 8-194, 9-204, 10-217; **బౌలింగ్:** భువనేశ్వర్ 7.1-0-38-1, షమీ 8-0-35-2, హార్దిక్ 8-1-50-2, శంకర్ 4-0-19-0, చాహల్ 10-0-41-3, జాదవ్ 7-0-34-1.

ధోనీ స్పీడ్..నీశమ్ రనౌట్



వికెట్ల వెనుకాల ధోనీ ఉంటే కొమ్ములు తిరిగిన బ్యాట్స్‌మన్ అయినా ఒళ్లు దగ్గర పెట్టుకోవాల్సిందే. వెల్లింగ్టన్ వన్డేలో ధోనీ విషయంలో కాస్త ఏమరుపాటుగా వ్యవహరించిన కివీస్ బ్యాట్స్‌మన్ నీశమ్ భారీ మూల్యం చెల్లించుకున్నాడు. 36 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 176 పరుగులు చేయగా.. నీశమ్(32 బంతుల్లో 44) వరుస బౌండరీలతో ప్రమాదకరంగా మారాడు. ఈ సమయంలో కేదార్ జాదవ్‌ను బౌలింగ్‌కు పిలిచిన ధోనీ ఫలితం రాబట్టాడు. జాదవ్ బౌలింగ్‌లో స్వీప్ షాట్ ఆడేందుకు నీశమ్ ప్రయత్నించగా బంతి అతని శరీరానికి తగిలి వెనక్కి వెళ్లింది. ఈ సమయంలో ధోనీ సహా అందరూ ఎల్బీకోసం అప్పీల్ చేస్తుండగా.. బంతి ధోనీకి కాస్త దూరంగా ఉండడం గమనించిన నీశమ్ పరుగుకు ప్రయత్నించాడు. అంతే వేగంగా ధోనీ బంతిని అందుకోవడం ..వికెట్లకు విసరడం జరిగిపోయింది. దీంతో నీశమ్ రనౌట్‌తో నిరాశగా పెవిలియన్ చేరాడు..

పాండ్యా హ్యాట్రిక్ సిక్సర్స్



తాత్కాలిక నిషేధం ముగిసిన అనంతరం మళ్లీ హార్దిక్ పాండ్యా మెరిశాడు. భారత్ కష్టాల్లో ఉన్న సమయంలో క్రీజులోకి వస్తూనే బౌండరీలు, సిక్సర్లతో కివీస్ బౌలర్లను వణికించాడు. న్యూజిలాండ్ స్పిన్నర్ ఆస్టిల్ వేసిన 47వ ఓవర్లో వరుసగా మూడు సిక్సర్లు కొట్టి హ్యాట్రిక్ నమోదు చేశాడు. కెరీర్‌లో ఇలా హ్యాట్రిక్ సిక్సర్లు కొట్టడం హార్దిక్‌కు ఇది ఐదోసారి కావడం విశేషం. 2017 ఏడాదిలోనే నాలుగుసార్లు హ్యాట్రిక్ సిక్సర్లు కొట్టిన హార్దిక్ మళ్లీ కివీలకు తన బ్యాట్ పవర్ రుచి చూపాడు. అంతేకాదు బౌల్ట్ వేసిన బౌన్సర్‌ను అద్భుతమైన రీతిలో క్రీజులో బొంగరంలా తిరుగుతూ అతను సంధించిన హుక్ షాట్ ఈ మ్యాచ్‌కే హైలైట్.. బంతి నేరుగా స్టాండ్స్‌లోకి దూసుకెళ్లగా పాండ్యా క్రీజులో నటరాజ భంగిమను ప్రదర్శించాడు.

తొలిరోజు సౌరాష్ట్ర ఆధిపత్యం

బౌలింగ్‌లో నిప్పులు చెరిగిన జైదేవ్ ఉనద్కత్, సకారియా ● తొలి ఇన్నింగ్స్‌లో 7 వికెట్ల నష్టానికి 200 పరుగులు చేసిన విదర్భ

నాగ్‌పూర్: దేశవాళీ టోర్నీ రంజీ ఫైనల్ మ్యాచ్ తొలిరోజు సౌరాష్ట్ర పూర్తిస్థాయి ఆధిపత్యం చెలాయించింది. ఆదివారం నాగ్‌పూర్‌లో రెండు జట్ల మధ్య ఫైనల్ సమరం ప్రారంభమైంది. సౌరాష్ట్ర బౌలర్లు వరుస విరామాల్లో వికెట్లు పడగొట్టడంతో తొలి రోజు ఆట ముగిసే సమయానికి డిఫెండింగ్ చాంపియన్ విదర్భ జట్టు ఏడు వికెట్ల నష్టానికి 200 పరుగులు చేసి కష్టాల్లో పడింది. ఆట ముగిసే సమయానికి అక్షయ్ కర్నేవర్(31 నాటౌట్), వాఖరే పరుగులేమీ చేయకుండా క్రీజులో ఉన్నారు. విదర్భ జట్టులో అక్షయ్ వాడ్కర్(45), కాలే(35), గణేశ్ సతీశ్(32) రాణించారు. సౌరాష్ట్ర బౌలర్లలో కెప్టెన్ జైదేవ్ ఉనద్కత్ (2/26), సకారియా, మక్వానా, మన్కడ్, జడేజా తలో వికెట్ చేజిక్కించుకున్నాడు. టాస్ గెలిచిన విదర్భ జట్టు రెండో ఆలోచన లేకుండా బ్యాటింగ్ ఎంచుకుంది. ఫాంలో ఉన్న కెప్టెన్ ఫయాజ్ ఫజల్(16), సంజయ్(2) ఓపెనర్లుగా బరిలోకి దిగారు. సౌరాష్ట్ర పేసర్లు ఉనద్కత్, సకారియా అద్భుతమైన స్వింగ్ బౌలింగ్‌తో విదర్భ జట్టును హడలెత్తించారు. తొలుత సంజయ్‌ను ఔట్ చేసిన ఉనద్కత్ వికెట్ల పతనానికి శ్రీకారం చుట్టాడు. ఆ తర్వాత వన్‌డౌన్‌లో బరిలోకి దిగిన వెటరన్ వసీం జాఫర్ ..కెప్టెన్ ఫజల్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను నిలబెట్టే ప్రయత్నం చేశాడు. ఈ దశలో ఫజల్ రనౌట్‌గా నిష్క్రమించగా.. జాఫర్(23)ను ఉనద్కత్ పెవిలియన్ బాట పట్టించాడు. మరోవైపు కాలే, గణేశ్ సతీశ్ జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. వీరిద్దరూ నాలుగో వికెట్‌కు 46 పరుగులు జోడించి నిలకడ చూపినా సుదీర్ఘ ఇన్నింగ్స్ ఆడడంలో విఫలమయ్యారు. విదర్భ ఇన్నింగ్స్‌లో అక్షయ్ వాడ్కర్ ఒక్కడే అద్భుతంగా ఆడాడు. అతను అక్షయ్ కర్నేవర్‌తో కలిసి 57 పరుగులు జోడించాడు. వీరిద్దరి ఆట తీరుతో మ్యాచ్‌లో విదర్భ నిలదొక్కుకునేలా కనిపించినా మరో మూడు ఓవర్లలో తొలిరోజు ముగుస్తుందనగా పేసర్ సకారియా ..వాడ్కర్‌ను ఔట్ చేసి సౌరాష్ట్ర బృందంలో ఆనందం నింపాడు. ఫైనల్ వరకు పరుగుల వరద పారించిన వసీం జాఫర్, కెప్టెన్ ఫజల్ త్వరగా ఔట్ కావడంతో బ్యాటింగ్‌లో భంగపడిన విదర్భను వారి బౌలర్లే ఆదుకోవాలి.


సౌరాష్ట్ర ఆటగాళ్ల ఆనందం

హౌ ద జోష్.. హై సార్!

వెల్లింగ్టన్: భారత క్రికెటర్లు దేశభక్తిని రగిలించారు. న్యూజిలాండ్ గడ్డపై చిరస్మరణీయ విజయంతో దశాబ్దాల కల నెరవేరిన వేళ..కప్‌ను అందుకున్న మన క్రికెటర్లు జోష్‌తో కనిపించారు. ఫొటోలకు ఫోజిస్తున్న సందర్భంలో కేదార్ జాదవ్ 'హౌ ద జోష్' అంటూ గట్టిగా అరిచాడు. దీనికి సహచర క్రికెటర్లు అదే స్థాయిలో 'హై సార్' అని అనడంతో స్టేడియం ఒక్కసారిగా దద్దరిల్లింది. పాకిస్థాన్‌పై సర్జికల్ స్ట్రైక్స్ నేపథ్యంలో బాలీవుడ్‌లో ఇటీవలే విడుదలైన 'యురీ- ద సర్జికల్ స్ట్రైక్' సినిమాలోని హౌ ద జోష్ డైలాగ్ ఈమధ్య కాలంలో బాగా పాపులర్ అయ్యింది. సినిమాలో కీలక పాత్ర పోషించిన విక్కీ కౌశల్..ఈ డైలాగ్‌తో జవాన్లలో స్ఫూర్తి రగిలిస్తూ ముందుకు సాగడం ప్రేక్షకులను కట్టిపడేసింది. జాదవ్ డైలాగ్ వీడియోను బీసీసీఐ తమ అధికారిక ట్విట్టర్‌లో పోస్ట్ చేసింది. జట్టులో జోష్ బాగుందంటూ ఫొటో క్యాప్షన్‌తో వీడియోను ట్వీట్ పోస్ట్ చేసింది.

మహారాష్ట్రపై తెలంగాణ విజయం

ఖమ్మం: జిల్లా కేంద్రంలో జరుగుతున్న 5వ జాతీయ మహిళల టీ20 చాంపియన్‌షిప్‌లో తెలంగాణ మహిళల జట్టు వరుసగా రెండో విజయం సాధించింది. ఆదివారం మహారాష్ట్రతో జరిగిన మ్యాచ్‌లో తెలంగాణ బ్యాటర్ చందన (27 బంతుల్లో 52) అర్ధసెంచరీతో జట్టుకు ఘన విజయాన్నందించింది. తొలుత బ్యాటింగ్ చేసిన మహారాష్ట్ర జట్టు నిర్ణీత ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 81 పరుగులు మాత్రమే చేసింది. తెలంగాణ జట్టు 5 ఓవర్లలో కేవలం ఒక వికెట్ మాత్రమే నష్టపోయి 82 పరుగుల విజయలక్ష్యాన్ని అందుకుంది.


చందన

వెస్టిండీస్‌దే విజ్డన్ ట్రోఫీ

రెండో టెస్ట్‌లో ఇంగ్లండ్‌పై ఘన విజయం

నార్త్‌సౌండ్: మూడు రోజుల్లోనే ముగిసిన రెండో టెస్ట్‌లో విండీస్ 10 వికెట్ల తేడాతో భారీ విజయం సాధించింది. మరో మ్యాచ్ మిగిలుండగానే 2-0తో ప్రతిష్ఠాత్మక విజ్డన్ ట్రోఫీని కైవసం చేసుకుంది. ఇంగ్లండ్ నిర్దేశించిన 14 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని విండీస్ వికెట్ కోల్పోకుండా ఛేదించింది. అంతకు ముందు ఓవర్‌నైట్ స్కోరు 272/6 మూడో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన కరేబియన్లు 306 పరుగులకు ఆలౌటయ్యారు. బ్రావో(50) అర్ధసెంచరీతో ఆకట్టుకున్నాడు. బ్రాడ్, అలీ మూడేసి వికెట్లు తీశారు. ఆ తర్వాత రెండో ఇన్నింగ్స్‌కు దిగిన ఇంగ్లండ్..రోచ్(4/52), హోల్డర్(4/43) ధాటికి 132 పరుగులకు కుప్పకూలింది. రోచ్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

హైదరాబాద్-అహ్మదాబాద్ అలయన్స్ ఎయిర్ విమానాలు



ముంబై, ఫిబ్రవరి 3: ప్రభుత్వ రంగ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా ప్రాంతీయ విభాగం అలయన్స్ ఎయిర్.. నాసిక్ మీదుగా హైదరాబాద్-అహ్మదాబాద్‌ల మధ్య విమాన సర్వీసులను ఆరంభించింది. ఉడాన్‌లో భాగంగా ఈ కొత్త సర్వీసును ఈ నెల 1 నుంచి ప్రారంభించింది. కొత్త రూట్‌లో 70 సీట్లుగల ఏటీఆర్-72 విమానాలను అలయన్స్ ఎయిర్ నడుపుతున్నది. అయితే హైదరాబాద్-నాసిక్ మార్గంలో రోజూ సర్వీసులు ఉంటాయని, నాసిక్-అహ్మదాబాద్ మార్గంలో మాత్రం ఆదివారం మినహా మిగతా రోజుల్లోనే విమానాలు నడుస్తాయని స్పష్టం చేసింది. ఢిల్లీ, జైపూర్, కోల్‌కతా, ముంబై, హైదరాబాద్, బెంగళూరు, విశాఖపట్నం, చెన్నై కేంద్రాలుగా దేశవ్యాప్తంగా 53 చోట్లకు అలయన్స్ విమానాలు నడుస్తున్నాయి. అలయన్స్ ఎయిర్‌కు ప్రస్తుతం దాదాపు 100 విమానాలున్నాయి. అందరికీ విమానయోగం, అన్ని ప్రాంతాలకు విమాన సేవల అనుసంధానమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఉడాన్ స్కీంను ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ స్కీం కింద గంటలోపు గమ్యాన్ని చేరుకునే విమానాల గరిష్ఠ టిక్కెట్ ధర రూ.2,500లుగానే ఉన్నది.

ఆర్బీఐ పాలసీయే కీలకం

కార్పొరేట్ల ఆర్థిక ఫలితాలు కూడా

స్టాక్ మార్కెట్లకు దిశానిర్దేశం..



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: ఈ వారంలో స్టాక్ మార్కెట్లు తీవ్ర ఒడిదుడుకులు ఎదుర్కొనే అవకాశాలు కనిపిస్తున్నాయి. రిజర్వు బ్యాంక్ ప్రకటించనున్న ద్రవ్య పరపతి సమీక్ష, కార్పొరేట్ల ఆర్థిక ఫలితాలు, ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న పరిణామాలు స్టాక్ మార్కెట్లకు దిశానిర్దేశం చేయనున్నాయి. వచ్చే ఆర్థిక సంవత్సరానికిగాను నరేంద్ర మోదీ సర్కార్ ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో తీసుకున్న కీలక నిర్ణయాలు కూడా సూచీలపై ప్రభావం చూపనున్నాయని మార్కెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రూ.5 లక్షల లోపు ఆదాయం కలిగిన వారిపై కేంద్ర ప్రభుత్వం వరాల జల్లు కురిపించడం, రైతులను ఆర్థికంగా ఆదుకోవాలనే ఉద్దేశంతో ప్రకటించిన నగదు ప్రోత్సాహక పథకం మదుపరులు కొనుగోళ్లకు మొగ్గు చూపే అవకాశాలున్నాయి. ద్రవ్యలోటును కట్టడి చేస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ గట్టి నమ్మకాన్ని వ్యక్తంచేయడంతో సంస్థాగత పెట్టుబడిదారులు ఈక్విటీ మార్కెట్లలోకి భారీగా నిధులు చొప్పించే అవకాశం ఉన్నదని మార్కెట్ పండితులు అంచనావేస్తున్నారు. గురువారం ఆర్బీఐ తన పరపతి ప్రకటను విడుదల చేయనున్నది. బడ్జెట్‌లో తీసుకున్న కీలక నిర్ణయాలతో కార్పొరేట్ల ఊతమివ్వనున్నదని, గ్రామీణ ప్రాంతాల్లో వినిమయం ఎగబాకనున్నదని విశ్లేషకులు పేర్కొన్నారు. వీటికితోడు సేవా రంగ గణాంకాలు కూడా ఈ వారంలోనే విడుదలకానున్నది. కార్పొరేట్ల ఆర్థిక ఫలితాల విషయానికి వస్తే కోల్ ఇండియా, ఐడీబీఐ, భెల్, గెయిల్, పీఎన్‌బీ, సిప్లా వంటి సంస్థలు తమ మూడో త్రైమాసికపు ఫలితాలను ప్రకటించనున్నాయి. గత వారంలో సెన్సెక్స్ 443.89 పాయింట్లు పెరిగి 36,469.43 వద్ద ముగిసింది.

పదింటిలో ఐదు..

దేశంలో అత్యంత విలువైన పది కంపెనీల్లో ఐదింటి విలువ భారీగా పెరిగింది. గడిచిన వారానికిగాను విడుదలైన జాబితాలో టీసీఎస్ తన తొలి స్థానాన్ని నిలబెట్టుకున్నది. ఆ తర్వాతి స్థానాల్లో రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌యూఎల్, ఐటీసీ, ఇన్ఫోసిస్‌లు ఉన్నాయి. కానీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ, ఎస్‌బీఐ, కొటక్ మహీంద్రా బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంకుల విలువ భారీగా తగ్గింది. టీసీఎస్ మార్కెట్ క్యాపిటలైజేషన్ విలువ మరో రూ.41,914.13 కోట్లు పెరిగి రూ.7,62,015.52 కోట్లకు చేరుకోగా, ఇన్ఫోసిస్ రూ.11,511.39 కోట్లు ఎగబాకి రూ.3,30,510. 06 కోట్లకు, హెచ్‌యూఎల్ రూ.9,362.11 కోట్లు అందుకొని రూ.3,88,825.07 కోట్లుగా నమోదైంది. ఐటీసీ రూ.1,969.90 కోట్లు, రిలయన్స్ ఇండస్ట్రీస్ రూ.668.63 కోట్ల చొప్పున పెరిగాయి. కానీ హెచ్‌డీఎఫ్‌సీ రూ.2,854.33 కోట్ల మేర కోల్పోగా, ఐసీఐసీఐ బ్యాంక్ రూ.1,657.93 కోట్లు, కొటక్ మహీంద్రా బ్యాంక్ రూ.1,344.92 కోట్లు, ఎస్‌బీఐ రూ.847.84 కోట్లు నష్టపోయాయి.

రూ.5,300 కోట్లు వెనక్కితీసుకున్న ఎఫ్‌పీఐలు

గడిచిన నెలలో దేశీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి రూ.5,300 కోట్ల నిధులను విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐ) తరలించుకుపోయారు. సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతుండటంతో ఎఫ్‌పీఐలు ఆచితూచి అడుగులు వేస్తున్నారు. ఒకవేళ ఈ ఎన్నికల్లో ఏ సంస్కరణలకు మొగ్గుచూపే పార్టీ అధికారంలోకి వస్తే భారీ స్థాయిలో నిధులను చొప్పించే అవకాశాలున్నాయి. నవంబర్, డిసెంబర్ 2018 నెలల్లో ఈక్విటీ, డెబిట్ మార్కెట్లలో రూ.17 వేల కోట్ల నిధులను చొప్పించారు. కానీ అక్టోబర్‌లో ఏకంగా 38,900 కోట్ల నిధులను వెనక్కితీసుకున్నారు. కాగా, గత నెలలో ఈక్విటీ మార్కెట్ల నుంచి రూ.5,264 కోట్లు, రూ.97 కోట్లు డెబిట్ మార్కెట్ల నుంచి వెనక్కితీసుకున్నట్లు డిపాజిటరీల ద్వారా తెలిసింది. అంతర్జాతీయంగా జరుగుతున్న పరిణామాలకు తోడు సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఎఫ్‌పీఐలు ఆచితూచి అడుగులు వేస్తున్నారని జియోజిట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. నూతన సంవత్సరం తొలి నెలలోనే ఎఫ్‌పీఐలు భారీ స్థాయిలో నిధులను వెనక్కితీసుకోవడం, భవిష్యత్తులో కూడా వేచి చూసే దోరణిలో ఉంటున్నట్లు సంకేతాలివ్వడం, క్రూడాయిల్, కరెన్సీల గమనం కూడా కీలకంగా మారుతున్నది. వీటికితోడు అమెరికా-చైనా దేశాల మధ్య నెలకొన్న వాణిజ్య యుద్ధం మరింత ముదిరితే ఎఫ్‌పీఐలు నిధుల ఉపసంహరణకు మొగ్గుచూపే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని విశ్లేషకులు అంచనావేస్తున్నారు.

నేటి నుంచి ఇండియా సాఫ్ట్ సదస్సు

హాజరుకానున్న దేశ, విదేశీ కంపెనీల ప్రతినిధులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కేంద్ర ప్రభుత్వ ఐటీ , శాస్త్ర సాంకేతిక శాఖల మద్దతుతో ఎలక్ట్రానిక్స్ అండ్ కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ (ఈఎస్‌సీ) నిర్వహించే ఇండియా సాఫ్ట్ 19వ ఎడిషన్‌కు హైదరాబాద్ వేదికైంది. సోమవారం నుంచి రెండు రోజుల పాటు జరుగనున్న ఈ సదస్సుకు దేశ, విదేశాలకు చెందిన ప్రముఖ ఐటీ సంస్థల కంపెనీల ప్రతినిధులు హాజరుకానున్నారు. అంతర్జాతీయ ఒప్పందాలు మరియు చర్చాగోష్ఠులకు వేదికగా నిలిచే సమావేశం హైదరాబాద్‌లో జరుగడం విశేషం. ఐటీ రంగంలోని చిన్న, మధ్య తరహా పరిశ్రమలు మొదలుకొని భారీ కంపెనీలను ఒక్కతాటిపైకి తెచ్చి పరస్పరం చర్చలు, ఒప్పందాలు కుదుర్చుకోనున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక సదస్సుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ఇస్తోంది. ఎగ్జిబిషన్లో పాల్గొనే సంస్థలకు 50 శాతం పన్ను రాయితి ఇవ్వగా, మహిళలకు వందశాతం పన్ను మినహాయింపునిచ్చారు. తెలంగాణ ప్రభుత్వం ప్రోత్సాహం చూసి మధ్య ప్రదేశ్, గోవా రాష్ట్రాలు ఈ ప్రదర్శనకు మద్దతు ఇచ్చేందుకు ముందుకు వచ్చాయి.

స్టార్టప్‌లపై కేంద్రం చిన్నచూపు

బడ్జెట్ కేటాయింపులు రూ.25 కోట్లే



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: స్టార్టప్‌లపై కేంద్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తున్నది. వచ్చే ఆర్థిక సంవత్సరానికిగాను నరేంద్ర మోదీ సర్కార్ ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో వీటి కోసం రూ.25 కోట్ల నిధులను మాత్రమే కేటాయించింది. అంతక్రితం కేటాయించిన రూ.28 కోట్ల కంటే ఇది తక్కువ. అత్యంత వేగవంతంగా పారిశ్రామికవేత్తగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో కేంద్రం స్టార్టప్ ఇండియా పేరుతో ప్రత్యేక కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. మరోవైపు మేక్ ఇన్ ఇండియా పథకాలకు మాత్రం రూ.232.02 కోట్లు, జాతీయ తయారీదారుల పథకాలకోసం రూ.8.47 కోట్లు, ఫండ్ ఆఫ్ ఫండ్స్‌కోసం రూ.100 కోట్లను కేటాయించింది. మొత్తంమీద వచ్చే ఏడాది మేక్ ఇన్ ఇండియా కోసం రూ.473.3 కోట్ల నిధులను అందించనున్నది. 2018-19లో కేటాయించిన రూ.149 కోట్లతో పోలిస్తే రెండు రెట్లు అధికం. భారత్‌ను అంతర్జాతీయ తయారీ కేంద్రంగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో సెప్టెంబర్ 25, 2014న కేంద్ర ప్రభుత్వం మేక్ ఇన్ ఇండియా పథకాన్ని ప్రారంభించారు. అలాగే డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇండస్ట్రియల్ పాలసీ అండ్ ప్రమోషన్ నిధుల కేటాయింపులు రూ.5,674.51 కోట్లకు తగ్గించింది.

బోలెడు ఉద్యోగాలిచ్చాం

- ఉపాధి రహిత ఆర్థిక వృద్ధి అంటే ఒప్పుకోం
- కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ



న్యూయార్క్, ఫిబ్రవరి 3: తమది ఉద్యోగ రహిత ఆర్థిక వృద్ధి అంటే ఒప్పుకోబోమని కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ అన్నారు. గత ఐదేండ్లుగా తమ ప్రభుత్వ హయాంలో బోలెడు ఉద్యోగాలిచ్చామన్న ఆయన ఇది ఉపాధి రహిత ఆర్థిక వృద్ధి అంటూ ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను తిప్పికొట్టారు. ప్రస్తుతం అమెరికాలో వైద్య చికిత్స తీసుకుంటున్న జైట్లీ.. ఆదివారం పీటీఐకిచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఈ ఐదేండ్లలో ఎటువంటి భారీ సామాజిక, రాజకీయ ఆందోళనలు జరుగకపోవడమే ఇందుకు నిదర్శనమని చెప్పారు. ఇటీవలి మధ్యంతర బడ్జెట్‌లో ఉపాధి కల్పనకు పెద్దపీట వేయలేదన్న దానిపై స్పందిస్తూ సాధారణ బడ్జెట్‌కు, మధ్యంతర బడ్జెట్‌కు తేడా ఉంటుందన్నారు. అయినా ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై ఎవరికీ ఎలాంటి అసంతృప్తి లేదన్న ఆయన అదే గనుక ఉంటే ఆందోళనలు జరిగేవి కావా? అని ప్రశ్నించారు. జైట్లీ అనారోగ్యం కారణంగా కేంద్ర ఆర్థిక శాఖ బాధ్యతలను పీయూష్ గోయల్‌కు అప్పగించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఈ నెల 1న పార్లమెంట్‌లో ఆయన మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన సంగతీ విదితమే.

రైతులకు మరింత లబ్ధి

తమ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తే రైతులకు ఎన్నో ప్రయోజనాలను అందిస్తామని జైట్లీ ఈ సందర్భంగా అన్నారు. ఇందులోభాగంగానే చిన్న రైతులకు నెలనెలా అందిస్తామన్న రూ.500 నగదు సాయం భవిష్యత్తులో మరింత పెరిగే వీలుందన్న సంకేతాలిచ్చారు. ఈ పథకంపై కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఇటీవల చేసిన వ్యాఖ్యలనూ తిప్పికొడుతూ జాతీయ ఎన్నికల్లో పోటీ చేస్తున్న విషయాన్ని గుర్తుంచుకోవాలని, కళాశాల ఎన్నికలు కావని ఎద్దేవా చేశారు. చిన్న, సన్నకారు రైతులకు ఏటా రూ.6,000 సాయంతో 12 కోట్ల మందికి లాభం చేకూరుతుందని చెప్పారు. ప్రభుత్వ ఆదాయ వనరులు పెరిగితే.. ఈ సాయం కూడా పెరుగుతుందన్న హామీనిచ్చారు. గృహ సదుపాయం, చౌక ధరలకే ఆహారం, ఉచిత వైద్యం, మరుగుదొడ్లు, విద్యుత్, రహదారులు, వంటగ్యాస్ కనెక్షన్ల అందజేతతో రైతాంగానికి చేయూతనిస్తున్నట్లు వివరించారు.

బడ్జెట్ చర్చలకు రాకపోవచ్చు

పార్లమెంట్‌లో మధ్యంతర బడ్జెట్‌పై జరిగే చర్చలకు తాను హాజరుకాకపోవచ్చన్న సంకేతాలను జైట్లీ ఇచ్చారు. అమెరికాలోని ఆస్పత్రిలో తీసుకుంటున్న తన చికిత్స పూర్తయినా.. తాను భారత్‌కు రావడానికి మరింత సమయం పట్టవచ్చని తెలిపారు. అయితే రావడం, రాకపోవడం వైద్యుల చేతుల్లోనే ఉందన్నారు. ప్రస్తుతం కోలుకుంటున్నానని, ఆరోగ్యం మెరుగుపడుతున్నదని చెప్పిన జైట్లీ.. బడ్జెట్ చర్చలో గోయల్ ధీటుగానే జవాబిస్తారని ఆశిస్తున్నానన్నారు.

లారస్ హెచ్ఐవీ డ్రగ్‌కు యూఎస్ అనుమతి

హైదరాబాద్, ఫిబ్రవరి 3: రాష్ట్రానికి చెందిన ప్రముఖ ఔషధ సంస్థ లారస్ ల్యాబ్స్‌కు చెందిన హెచ్ఐవీ వ్యాధిని నియంత్రించే ఔషధానికి అమెరికా నియంత్రణ మండలి యూఎస్ఎఫ్‌డీఏ అనుమతినిచ్చింది. అమెరికా అధ్యక్షుడు అత్యవసర పథకం కింద ఎయిడ్స్ వ్యాధిని నియంత్రించే ఉద్దేశంలో భాగంగా టెనోఫోవిర్/లామివుడైన్/డొలుట్‌గ్రెవిర్(టీఎల్‌డీ) 300/300/50 ఎంజీ ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్‌లో లభించనున్నదని కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది. అమెరికాలో తక్కువ, మధ్య స్థాయి ఆదాయ వర్గాలను దృష్టిలో పెట్టుకొని తయారు చేసిన ఈ జనరిక్ ఔషధం త్వరలో అందుబాటులోకి రానున్నది. విశాఖపట్నంలో ఉన్న ఏపీ సెజ్‌లోని రెండో యూనిట్‌లో ఈ ఔషధాన్ని తయారు చేసినట్లు కంపెనీ సీఈవో సత్యనారాయణ చావా తెలిపారు. ఈ నెల 2న అచ్చుతాపూరంలో ఉన్న యూనిట్ 6ను యూఎస్ఎఫ్‌డీఏ ఉన్నతాధికారులు తనిఖీ చేసినట్లు మరో ప్రకటనలో కంపెనీ పేర్కొంది.

వచ్చేసారి 93,693 కోట్లే

నాలుగేండ్ల కనిష్ఠ స్థాయికి ప్రభుత్వ చమురు సంస్థల పెట్టుబడులు

2019-20 మధ్యంతర బడ్జెట్‌లో వెల్లడి



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: ప్రభుత్వ రంగ చమురు సంస్థలు.. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2019-20)గాను నిర్దేశించుకున్న పెట్టుబడులు నాలుగేండ్ల కనిష్ఠ స్థాయిలో ఉన్నాయి. ఓఎన్‌జీసీ, ఇండియన్ ఆయిల్, గెయిల్, భారత్ పెట్రోలియం, హిందుస్థాన్ పెట్రోలియం, మంగళూరు రిఫైనరీస్ అండ్ పెట్రోకెమికల్స్ తదితర సంస్థలు.. చమురు, సహజ వాయువుల అన్వేషణ, శుద్ధి, పెట్రోకెమికల్స్‌ల్లో రూ.93,693 కోట్ల పెట్టుబడులను పెట్టాలని చూస్తున్నాయి. 2014-15 ఆర్థిక సంవత్సరం తర్వాత ఇదే అత్యంత కనిష్ఠ స్థాయి అని తాజా మధ్యంతర బడ్జెట్ గణాంకాలు చెబుతున్నాయి. ఈ ఏడాది మార్చి 31తో ముగుస్తున్న ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2018-19)గాను రూ.89,335 కోట్ల పెట్టుబడులను చమురు రంగ సంస్థలు ప్రతిపాదించినా.. అవి రూ.94,438 కోట్లకు చేరువవుతున్నాయి. ఇక 2017-18లో రూ.1,32,003 కోట్లు, 2016-17లో రూ.1,04,426 కోట్లు, 2015-16లో రూ.97,223 కోట్ల మేర ఆయా చమురు సంస్థలు తమ కార్యకలాపాల అభివృద్ధి, విస్తరణ నిమిత్తం పెట్టుబడులను పెట్టాయి. 2014-15లో రూ.89,180 కోట్ల పెట్టుబడులుండగా, మళ్లీ ఆ తర్వాత 2019-20లోనే తక్కువ పెట్టుబడులకు చమురు సంస్థలు ముందుకొస్తున్నాయి. కాగా, అంతర్జాతీయ మార్కెట్ నుంచి చమురు దిగుమతులు తగ్గించుకుని, దేశంలో ముడి చమురు ఉత్పత్తిని పెంచుకోవాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ముందుకెళ్తున్న వేళ.. ప్రభుత్వ రంగ సంస్థలే పెట్టుబడులను తగ్గించుకోవడం ప్రాధాన్యతను సంతరించుకున్నది. దేశీయ ఇంధన అవసరాల్లో 80 శాతానికిపైగా దిగుమతుల ద్వారానే తీరుతున్నాయి. గత ఆర్థిక సంవత్సరం 2017-18లో భారత చమురు, గ్యాస్ దిగుమతులు 109.1 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ఈ ఆర్థిక సంవత్సరం మరింత పెరిగి 130 బిలియన్ డాలర్లకు చేరవచ్చని అంచనా. దీంతో విదేశీ మార్కెట్‌లో ధరలు ఒడిదుడుకులకు లోనైనప్పుడు భారతీయ మార్కెట్‌లోనూ చమురు ధరలు పడుతూలేస్తున్నాయి. ఫలితంగా దేశ ఆర్థిక వ్యవస్థ కూడా ప్రభావితం అవుతున్నది. ఈ క్రమంలోనే స్థానిక ఉత్పత్తిపై దృష్టి పెట్టాలని ప్రభుత్వ సంస్థలతోపాటు ప్రైవేట్ రంగ సంస్థలనూ కేంద్రం కోరుతున్నది. పెట్టుబడులను ప్రోత్సహిస్తున్నది. కానీ వచ్చే ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ సంస్థల పెట్టుబడులు ఇందుకు భిన్నంగా ఉన్నాయి.

ఏ సంస్థ ఎంతెంత..!

వచ్చే ఆర్థిక సంవత్సరం (2019-20)లో ఓఎన్‌జీసీ రూ.32,921 కోట్ల పెట్టుబడులను పెట్టనున్నట్లు తాజా మధ్యంతర బడ్జెట్ అంచనాల ప్రకారం తెలుస్తున్నది. ఇక ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ రూ.25,083 కోట్ల పెట్టుబడులను పెట్టనుండగా, హిందుస్థాన్ పెట్రోలియం రూ.9,500 కోట్లు, భారత్ పెట్రోలియం రూ.7,900 కోట్ల పెట్టుబడులను పెట్టనున్నాయి. వీటిలో దేశీయ చమురు మార్కెటింగ్ దిగ్గజం ఐవోసీ పెట్టుబడులు దాదాపు 2 శాతం తగ్గగా, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్ పెట్టుబడులు పెరుగడం గమనార్హం. అలాగే గెయిల్ ఇండియా పెట్టుబడులూ 10 శాతం క్షీణించి రూ.5,339 కోట్లుగా ఉన్నాయి. ఓఎన్‌జీసీ విదేశ్ లిమిటెడ్ కూడా గతంతో పోల్చితే పెట్టుబడులను 15.5 శాతం తగ్గించి రూ.5,161 కోట్లకు పరిమితం చేసింది. ఈ క్రమంలో కేంద్రం ఆలోచనలు ఒకలాగా, సంస్థల ఆలోచనలు మరొకలాగా ఉన్నాయా? అన్న సందిగ్ధం ఏర్పడుతున్నది.

నారాయణ హృదయాలయ ఎండీ రాజీనామా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: ప్రముఖ హాస్పిటల్ నిర్వహణ సంస్థయైన నారాయణ హృదయాలయకు అనుకోని షాక్ తగిలింది. కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో అశుతోష్ రఘువంశీ తన పదవికి రాజీనామా చేశారు. ఈ విషయాన్ని కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఆయన రాజీనామాను కంపెనీ బోర్డు వెంటనే ఆమోదం తెలిపింది. దీంతో సంస్థ నూతన ఎండీ, సీఈవోగా ఎమ్మాన్యూయల్ రూపర్ట్ నియమించినట్లు బీఎస్ఈకి సమాచారం అందించింది. రూపర్ట్ 2002 నుంచి సంస్థలో పనిచేస్తున్నారు. అలాగే విరెన్ శెట్టిని గ్రూపు సీవోవోగా నియమించుకున్నది సంస్థ. స్టాన్‌ఫోర్డ్ బిజినెస్ స్కూల్‌లో ఎంబీఏ పట్టాపొందిన శెట్టి..2012 నుంచి కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గాను, సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

త్వరలో మూడు గనుల వేలం!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: మరోమారు గనుల వేలానికి సిద్ధమైంది కేంద్ర ప్రభుత్వం. వచ్చే నెలలో 280.295 మిలియన్ టన్నుల రిజర్వులు కలిగిన మూడు గనులను వేలం వేయనున్నట్లు ఆ శాఖకు సంబంధించిన ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. వీటిలో చత్తీస్‌గఢ్‌లో ఉన్న రెండు లైమ్‌స్టోన్‌కు సంబంధించిన బ్లాకులను ఈ నెల 8 నుంచి 11 వరకు వేలం వేయనుండగా, జార్ఖండ్‌లో ఉన్న గ్రాఫైట్ గనిని మార్చి 2న విక్రయించనున్నారు. గతేడాది అక్టోబర్ 6న ఈ గనుల వేలానికి సంబంధించి బిడ్డింగ్‌లను ఆహ్వానించిన విషయం తెలిసిందే. విక్రయానికి ముందే ఈ గనులకు సంబంధించిన అన్ని అనుమతులు ఇవ్వడం జరిగిందని, వీటిలో పర్యావరణ అనుమతులు కూడా ఉన్నాయి. వేగవంతంగా నిర్ణయాలు తీసుకోవాలనే ఉద్దేశంతో ఈ గనులకు సంబంధించి గ్రీన్ క్లియరెన్స్‌లను వెనువెంటనే మంజూరు చేయడం జరిగిందని మంత్రిత్వ శాఖ వర్గాలు వెల్లడించాయి. గడిచిన రెండేండ్లో 288 గనులకు పర్యావరణ, అటవీకి సంబంధించిన అన్ని అనుమతులు మంజూరు చేసింది. దీంట్లోభాగంగా జనవరిలో 53 గనుల వేలాన్ని నిర్వహించింది.

వడ్డీరేట్లు యథాతథం?

ఆర్బీఐ ఎంపీసీ తటస్థ వైఖరికే మొగ్గు ■ రాబోయే ద్రవ్యసమీక్షపై నిపుణుల అంచనా




న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: రాబోయే ద్రవ్యసమీక్షలో కీలక వడ్డీరేట్లను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) యథాతథంగానే ఉంచవచ్చన్న అంచనాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నెల 5, 6, 7 తేదీల్లో మూడు రోజులపాటు ద్వైమాసిక ద్రవ్యవిధాన పరపతి సమీక్షను ఆర్బీఐ నిర్వహించనున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2018-19)లో ఇదే చివరి ద్వైమాసిక ద్రవ్యసమీక్ష అవగా, ఇందులో రెపో, రివర్స్ రెపో వడ్డీరేట్ల జోలికి ఆర్బీఐ మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) వెళ్లకపోవచ్చని అటు బ్యాంకింగ్, ఇటు ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఎంపీసీ తమ విధానాన్ని తగ్గింపుల నుంచి తటస్థ వైఖరికి మార్చుకునే వీలుందని ప్రభుత్వ రంగ బ్యాంకైన బ్యాంక్ ఆఫ్ బరోడా ముఖ్య ఆర్థికవేత్త సమీర్ నారంగ్ అన్నారు. అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికంలో వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం 3.8 శాతంగా ఉంటుందని ఆర్బీఐ అంచనా వేసినప్పటికీ.. 2.6 శాతంగానే నమోదైంది. అయినప్పటికీ వడ్డీరేట్లు తగ్గకపోవచ్చని చెప్పారు. ఇందుకు కారణం అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న మందగమనంతోపాటు ఈ ఆర్థిక సంవత్సరానికిగాను రిటైల్ ద్రవ్యోల్బణాన్ని 4 శాతం దిగువకు తగ్గించాలన్న ఆర్బీఐ లక్ష్యమేనని వ్యాఖ్యానించారు. అయినప్పటికీ దేశ ఆర్థిక వ్యవస్థలో కీలకమైన వ్యాపార, పారిశ్రామిక రంగాల నిస్తేజం, మరికొన్ని రంగాల నుంచి వస్తున్న డిమాండ్ల మధ్య రెపో రేటును తగ్గించే అవకాశాలూ లేకపోలేదని నారంగ్ అభిప్రాయపడ్డారు. డిసెంబర్ ద్రవ్యసమీక్షలోనూ ఆర్బీఐ.. కీలక వడ్డీరేట్లను యథాతథంగానే ఉంచినా, పరిస్థితులు అనుకూలిస్తే మున్ముందు సమీక్షల్లో వడ్డీరేట్ల కోతలుంటాయన్న సంకేతాలు ఇచ్చిన సంగతి విదితమే. ఈ ఆర్థిక సంవత్సరంలో రెపో, రివర్స్ రెపోలను ఆర్బీఐ రెండుసార్లు పెంచింది. ఆ తర్వాత తిరిగి కోతల వైపునకూ మళ్లింది.

అడ్డంకులెన్నో..

డిసెంబర్‌లో అటు రిటైల్ ద్రవ్యోల్బణం, ఇటు టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ఆధారిత హోల్‌సేల్ ద్రవ్యోల్బణం గణనీయంగా తగ్గుముఖం పట్టిన విషయం తెలిసిందే. అయితే అంతర్జాతీయ మార్కెట్‌లో ఇన్నాళ్లూ శాంతిస్తూ వచ్చిన ముడి చమురు ధరలు.. మళ్లీ విజృంభిస్తుండటం ఆర్బీఐని ఇరకాటంలో పెడుతున్నాయి. అదీగాక తాజా బడ్జెట్‌లో ద్రవ్యలోటు అంచనాలను సవరించడం కూడా ప్రతికూలంగా మారిందని డీబీఎస్ ఎకనామిక్స్ అంటున్నది. వడ్డీరేట్లను తగ్గిస్తే.. వ్యవస్థలో ద్రవ్యలభ్యత పెరిగి, ఆర్థిక పరిస్థితులు మరింతగా దిగజారుతాయా? అన్న కోణంలోనూ ఆర్బీఐ యోచిస్తున్నదని అంటున్నారు. అయితే ఐఎల్ అండ్‌ఎఫ్ఎస్ సంక్షోభం, మొండి బకాయిలతో సతమతమవుతున్న బ్యాంకులపై ప్రాంప్ట్ కరెక్టివ్ యాక్షన్ (పీసీఏ)నిబంధనల మధ్య ద్రవ్య కొరత భయాలూ వెంటాడుతున్నాయని చెబుతున్నారు. వ్యాపార, పారిశ్రామిక రంగాలు ముఖ్యంగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థ (ఎంఎస్ఎంఈ)లకు ఆర్థిక చేయూతనివ్వాలన్న ప్రభుత్వ సలహాలు, సూచనల మధ్య ఆర్బీఐ ఓ వింత పరిస్థితినే ఎదుర్కొంటున్నదని వ్యాఖ్యానిస్తున్నారు. ఇటీవలి బడ్జెట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్.. వడ్డీరేట్ల తగ్గింపుపై చేసిన వ్యాఖ్యలూ ఇందుకు నిదర్శనమని మాగ్మా ఫిన్‌కార్ప్ వైస్ చైర్మన్, ఎండీ సంజయ్ చమ్రియా అన్నారు.

9న ఆర్బీఐ బోర్డునుద్దేశించి గోయల్ ప్రసంగం



కేంద్ర ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్.. ఈ నెల 9న ఆర్బీఐ సెంట్రల్ బోర్డుతో బడ్జెట్ అనంతర సంప్రదాయ సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మధ్యంతర బడ్జెట్‌లోని ముఖ్యాంశాలను వివరించనున్నారు. ఈ క్రమంలోనే ఈ ఆర్థిక సంవత్సరానికిగాను ఆర్బీఐ నుంచి కేంద్ర ప్రభుత్వం కోరుతున్న మధ్యంతర డివిడెండ్ అంశాన్నీ గోయల్ లేవనెత్తుతారన్న సమాచారం ఉన్నది. ఆర్బీఐ నుంచి ప్రభుత్వం రూ.28,000 కోట్ల మధ్యంతర డివిడెండ్‌ను ఆశిస్తున్నది. జూలై-జూన్ వ్యవధిని ఆర్బీఐ ఆర్థిక సంవత్సరంగా పరిగణిస్తుంది.

భావితరాల కోసం ఇంధన పొదుపు

- భారత్ పెట్రోలియం ఎల్పీజీ రాష్ట్ర హెడ్ ధన్‌పాల్


హైదరాబాద్, నమస్తే తెలంగాణ: భావితరాల కోసం ఇంధన వనరులను కాపాడాలంటే పొదుపు చేయడం చాలా అవసరమని భారత్ పెట్రోలియం ఎల్పీజీ తెలంగాణ స్టేట్ హెడ్ ధన్‌పాల్ అన్నారు. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్, పెట్రోలియం కన్జర్వేషన్ రీసెర్చ్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 'సాక్షం సంరక్షణ్ క్షమతా మహోత్సవ్' కార్యక్రమాన్ని ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ధన్‌పాల్ మాట్లాడుతూ... ఇంధన వనరుల అవసరాన్ని ప్రజలకు తెలిపే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పెట్రోలియం, సహజ వనరులను దుర్వినియోగం చేయకుండా సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని, అలాగే శిలాజ ఇంధనాల పరిరక్షణకు పెద్దపీట వేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పెట్రోలియం ఉత్పత్తుల పరిరక్షణపై క్విజ్, ప్రత్యేక చర్చ, వ్యాసం, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు.

అసంతృప్తితో తప్పుకోలేదు

- ఎన్ఎస్‌సీ సభ్యుల రాజీనామాపై కేంద్రం



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: జాతీయ గణాంక సంఘం (ఎన్ఎస్‌సీ) సభ్యులు అసంతృప్తిగా లేరని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇటీవల పలువురు సభ్యులు రాజీనామా చేసిన నేపథ్యంలో తాజాగా సర్కారు పైవిధంగా స్పష్టత ఇచ్చింది. గతకొద్ది నెలలుగా జరిగిన కమిషన్ సమావేశాల్లో వారు ఏ అంశంపైనా ఆందోళన వ్యక్తం చేయలేదని తెలియజేసింది. ఎన్ఎస్‌సీ స్వతంత్ర సభ్యులు పీసీ మోహనన్, జేవీ మీనాక్షి ఈమధ్య రాజీనామా చేసిన విషయం తెలిసిందే. జీడీపీ గణాంకాల సిరీస్ మార్పు, లేబర్ ఫోర్స్ సర్వే విడుదలలో జాప్యంపై ప్రభుత్వంతో విభేదించే వీరు తప్పుకున్నారన్న వార్తలు గుప్పుమన్నాయి. దీంతో గణాంక, కార్యాచరణ అమలు మంత్రిత్వ శాఖ ఇలా వివరణ ఇచ్చింది. ఎన్ఎస్‌సీ సలహాలు, సూచనలను గౌరవిస్తామని కూడా స్పష్టం చేసింది. కాగా, మోహనన్ కమిషన్ తాత్కాలిక చైర్‌పర్సన్‌గా కూడా ఉన్నారు. అయితే ఆయన పీటీఐతో మాట్లాడుతూ ఎన్ఎస్‌సీ నుంచి తాను తప్పుకున్నట్లు చెప్పారు. కమిషన్ బాధ్యతలను తాము నెరవేర్చలేకుండా ఉన్నామని ఈ సందర్భంగా ఆయన అనడం గమనార్హం.



త్రివేణి సంగమంలో ఆదివారం భక్తజన సంద్రం ఉప్పొంగింది. కుంభమేళాలో రెండో అత్యంత పర్వదినమైన మౌని అమావాస్య (సోమవారం)కు ఘడియలు సమీపించడంతో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ప్రయాగ్‌రాజ్‌కు పోటెత్తారు. దీంతో అలహాబాద్ రైల్వే స్టేషన్‌తోపాటు సంగమంలోని ఘాట్ కిటకిటలాడింది. చాలామంది భక్తులు కనీసం ముందుకు కదిలేందుకు కూడా అవకాశం లేకపోవడంతో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు త్వరగా వెళ్లిపోవాలని అధికారులు మైకుల ద్వారా పదేపదే సూచనలు చేశారు.

బ్రెగ్జిట్‌తో బ్రిటన్‌లో అల్లర్లు చెలరేగే అవకాశం

రాజకుటుంబాన్ని రహస్య ప్రాంతానికి తరలించేందుకు ప్రణాళికలు

లండన్, ఫిబ్రవరి 3: యూరోపియన్ యూనియన్ (ఈయూ) నుంచి వచ్చే నెల 29వ తేదీన వైదొలిగేందుకు (బ్రెగ్జిట్‌కు) బ్రిటన్ సిద్ధమవుతున్నది. 28 సభ్య దేశాలున్న ఈయూ నుంచి ఎటువంటి ఒప్పందం లేకుండానే బ్రిటన్ వైదొలగడం వల్ల దేశంలో అల్లర్లు చెలరేగినట్లయితే లండన్‌లోని బర్మింగ్‌హామ్ ప్యాలెస్ నుంచి క్వీన్ ఎలిజబెత్-2తోపాటు రాజకుటుంబంలోని ఇతర సీనియర్ సభ్యులను ఖాళీ చేయించి వేరే ప్రాంతానికి తరలించేందుకు బ్రిటన్ ప్రభుత్వం రహస్య ప్రణాళికలను సిద్ధం చేసినట్టు 'సండే టైమ్స్' పత్రిక ఆదివారం వెల్లడించింది. సామరస్యపూర్వక ఒప్పందమేమీ



లేకుండా ఈయూ నుంచి వైదొలిగితే బ్రిటన్‌కు ముప్పు తప్పదని, దీన్ని దృష్టిలో ఉంచుకుని రాజకుటుంబాన్ని కాపాడేందుకు బ్రిటన్ ప్రభుత్వం ఇటీవలి కాలంలో కొన్ని అత్యవసర ప్రణాళికలను తెరమీదికి తీసుకొచ్చిందని, పూర్వపు సోవియట్ యూనియన్‌లో సభ్యులుగా ఉన్న దేశాల నుంచి అణుదాడి జరిగిన పక్షంలో ఈ ప్రణాళికలను అమలుచేయాలని బ్రిటన్ భావిస్తున్నదని ఆ పత్రిక వివరించింది. బ్రెగ్జిట్‌కు తుది గడువైన మార్చి 29వ తేదీలోగా సమస్య పరిష్కారానికి ఒప్పందాన్ని కుదుర్చుకోవడంలో బ్రిటన్, ఈయూ విఫలమైతే ఎలిజబెత్ రాణితోపాటు ఆమె భర్తను, యువరాజు ఫిలిప్‌ను లండన్ నుంచి రహస్య ప్రదేశానికి తరలించనున్నట్టు 'సండే టైమ్స్' పేర్కొన్నది. అయితే వారిని తరలించే రహస్య ప్రదేశం ఏదో ఆ పత్రిక వెల్లడించలేదు.



రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ సిద్ధంచేసిన గిరిజన పెయింటింగ్స్

గిరిజనుల కళలకు ప్రోత్సాహం

- సంస్కృతి పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు
- సంప్రదాయ పెయింటింగ్‌లకు విస్తృత ప్రచారం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గిరిజనతెగల సంస్కృతి, కళల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకచర్యలు చేపట్టింది. గిరిజన పండుగలు, జాతరల నిర్వహణతోపాటు కళలు, పెయింటింగ్‌లకు విస్తృత ప్రచారం కల్పించేవిధంగా దృష్టిసారించింది. దక్షిణ భారత్‌లో తెలంగాణలోనే గిరిజనులు అధికంగా ఉన్నారు. పురాతన కళాఖండాలుగా నిలిచిన గిరిజన పెయింటింగ్‌లను విశ్వవ్యాప్తంచేయడమే కాకుండా.. చిత్రకారులకు ఆదాయవనరులు పెంపొందించేవిధంగా గిరిజన సంక్షేమశాఖ ప్రణాళికలు రూపొందించింది. గోండు, కోయ, నాయక్‌పోడ్‌లకు సంబంధించిన సంప్రదాయ పెయింటింగ్స్ సహజత్వం కోల్పోకుండా కాన్వాస్, బోర్డులపై వేసేవిధంగా గిరిజన యువతకు అవగాహన కల్పిస్తున్నారు. ఇందుకుగాను గిరిజన సంప్రదాయాలపై అవగాహన కలిగినవారు, గిరిజన జాతుల పెద్దలు, ప్రతినిధుల నుంచి సలహాలు, సూచనలు తీసుకుంటున్నారు.

ట్రైబల్ పెయింటర్స్ సొసైటీ ద్వారా ప్రోత్సాహం

గిరిజన సంప్రదాయ కళారూపాలు, పెయింటింగ్‌లను సిద్ధంచేసేందుకు ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ట్రైబల్ పెయింటర్స్ సొసైటీ ద్వారా చిత్రకారులను ప్రోత్సహిస్తారు. ఈ సొసైటీకి గిరిజన సంక్షేమశాఖ ద్వారా రివాల్వింగ్ ఫండ్ సమకూరుస్తారు. సొసైటీ ద్వారా నేరుగా పెయింటింగ్‌లు విక్రయిస్తారు. వివిధ సైజుల్లో సహజంగా సిద్ధంచేసిన పెయింటింగ్‌లకు ధరలు నిర్ణయించి, ప్రతిపాదిత ధరకు ఆయా పెయింటింగ్‌లను 2019 జూన్ 30 వరకు అందజేయనున్నారు. ట్రైబల్ కల్చరల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ద్వారా ధ్రువీకరించిన సహజమైన చిత్రాలను కోరినవారికి పంపుతారు. గిరిజన సంప్రదాయ చిత్రాలు కొనుగోలు చేయదలచినవారు 09490957073 ఫోన్ నంబరుకు సంప్రదించాలని గిరిజన సంక్షేమశాఖ అధికారులు సూచించారు. గిరిజన సంప్రదాయ చిత్రాల వివరాలను తెలుసుకునేందుకు tribal museumcurator@ gmail.com లేదా www.twd. telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలి.

మద్దతు ధరలో తెలంగాణ టాప్

11 రకాల వ్యవసాయోత్పత్తుల కొనుగోలు

రైతులకు సకాలంలో డబ్బుల చెల్లింపులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వ్యవసాయ ఉత్పత్తులను పూర్తి మద్దతు ధరకు కొనుగోలు చేయడంలో తెలంగాణ దేశంలోనే ముందు నిలిచింది. 11 రకాల వ్యవసాయోత్పత్తులకు మద్దతు ధరను అందిస్తున్న ఏకైక రాష్ట్రంగా గుర్తింపు పొందింది. రైతు పండించిన చివరిగింజ వరకు కొనుగోలు చేయాలనే ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఆదేశాల మేరకు ఇదివరకే వరి, కందులు, పత్తి, మక్కలు, పెసర్లు, మినుములు, సోయాబీన్, పొద్దు తిరుగుడు పంటలను 2018-19లో కేంద్రం ప్రకటించిన మద్దతు ధరకు వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ పూర్తిగా కొనుగోలు చేసేలా ఆ శాఖ మంత్రి హరీశ్‌రావు చర్యలు తీసుకున్నారు. రైతులకు సకాలంలో బిల్లుల చెల్లింపు పారదర్శకంగా జరిగేలా కృషిచేశారు.

అక్టోబర్ 1 నుంచే మద్దతు ధరకు కొనుగోళ్లు

తెలంగాణ ప్రభుత్వం ప్రధాన పంటలకు కనీస మద్దతు ధరను అక్టోబర్ ఒకటి నుంచే అమలు చేసింది. వరిధాన్యం పౌరసరఫరాల విభాగం ద్వారా రూ.1590 చొప్పున 6,027 కొనుగోలు కేంద్రాల ద్వారా రూ.8,575 కోట్లతో 540.45 లక్షల క్వింటాళ్లు కొనుగోలుచేశారు. కాటన్ కార్పొరేషన్ ద్వారా పత్తికి కనీస మద్దతు ధర రూ.4,320గా నిర్ణయించి రూ.1,329 కోట్లతో 2.45 లక్షల టన్నులు 93,591 మంది రైతులనుంచి కొనుగోలుచేశారు. ఇప్పటికే రూ.1,272 కోట్లు రైతులకు చెల్లించారు. రూ.5,450 మద్దతు ధరకు 142 కందుల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేయాలని నిర్ణయించగా, ఇప్పటివరకు 123 కేంద్రాల ద్వారా 0.43 లక్షల టన్నులు కొనుగోలు చేశారు.



సూర్యాపేట మార్కెట్‌కు రైతులు తీసుకొచ్చిన కందులు (ఫైల్)

నాఫెడ్ రూ.153 కోట్లు విడుదల చేసింది. మరో రూ.93 కోట్లు రావాల్సి ఉంది. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో మక్కలను రూ.1,425 కనీస మద్దతు ధరతో కొనుగోలుకు 296 కేంద్రాలను ఏర్పాటుచేసి రూ. 708 కోట్లతో 4.16 లక్షల టన్నులు కొనుగోలుచేశారు. మినుములను రూ.5,400 మద్దతు ధరతో కొనుగోలుకు 3 కేంద్రాలద్వారా రూ.3.24 కోట్లతో 578 టన్నులు కొనుగోలు చేశారు. సోయాబీన్ రూ.3,050 మద్దతు ధరతో 46 కేంద్రాల ద్వారా రూ. 52.78 కోట్ల ఖర్చుతో 0.15 లక్షల టన్నులు కొనుగోలు చేశారు. రైతులకు రూ.51.35 కోట్లు ఇప్పటివరకు చెల్లించారు. పెసర్లను రూ.5,575 మద్దతు ధరతో 8 కొనుగోలు కేం ద్రాల ద్వారా రూ.93.28 కోట్లతో రూ.013 లక్షల టన్నులు సేకరించారు. పొద్దు తిరుగుడును రూ.4,100 మద్దతు ధరతో రూ.88 కోట్లతో 2,169 క్వింటాళ్లు కొనుగోలు చేశారు. జొన్నలను రూ.1,700 మద్దతు ధరతో 4 కేంద్రాల ద్వారా రూ.6.08 కోట్లు వెచ్చించి 35,797 క్వింటాళ్లు కొనుగోలు చేశారు. రూ.4,450 మద్దతు ధరతో వేరుశనగను 274 క్వింటాళ్లు కొనుగోలు చేశారు. ఎర్రజొన్నలను రూ.2,300 మద్దతు ధరతో 37 కేంద్రాల ద్వారా రూ.117.67 కోట్లతో 5.11 క్వింటాళ్లు కొనుగోలు చేశారు. యాసంగి పంటలను కొనుగోలు చేయాలని మార్కెటింగ్‌శాఖ నిర్ణయించింది.

కొలువుల కోసం కసరత్తులు

మైదానాల్లో ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థుల ఉరుకుడు.. దూకుడు

కోచ్‌ల పర్యవేక్షణలో ప్రత్యేక ప్రాక్టీస్ ■ పలుచోట్ల పోలీస్‌శాఖ ఉచిత శిక్షణ

ఈ నెల 11 నుంచి ఫిజికల్ ఈవెంట్స్ ప్రారంభం



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రవ్యాప్తంగా ఏ మైదానంలో చూసినా యువత సందడి ఎక్కువగా కనిపిస్తున్నది. ఎస్సై, కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి సంబంధించి ఈ నెల 11 నుంచి ఫిజికల్ ఈవెంట్స్ ప్రారంభం కానుండటంతో మైదానాల్లో పోలీసు ఉద్యోగార్థుల తాకిడి మరింత పెరిగింది. దేహదారుఢ్య పరీక్షల్లో పురుషులు 800 మీటర్లు, 100 మీటర్ల పరుగు, హైజంప్, లాంగ్‌జంప్, షాట్‌పుట్‌లో తప్పక అర్హత సాధించాల్సి ఉంటుంది. మహిళలకు 800 మీటర్ల పరుగుపందెం మినహా మిగిలిన ఈవెంట్లలోఅర్హత సాధించాలి. ఇప్పటికే ప్రిలిమ్స్ పరీక్షను అధిగమించిన అభ్యర్థులంతా ఫిజికల్ ఈవెంట్స్‌లోనూ అర్హత సాధించేందుకు గంటల తరబడి మైదానాల్లో శ్రమిస్తున్నారు. కొందరు ఏడాది నుంచే ప్రాక్టీస్ మొదలుపెట్టగా.. మరికొందరు ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన తర్వాతనుంచి పూర్తిస్థాయిలో ఈవెంట్స్ ప్రిపేరవుతున్నారు. హైదరాబాద్ నగరంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా ఏ మైదానంలో చూసినా ఉదయం, సాయంత్రం వేళల్లో యువత సందడే కనిపిస్తున్నది. గతంలో పోలీస్ ఉద్యోగానికి ప్రయత్నించిన వారిలో ఎక్కువ మంది రాతపరీక్షపైనే ప్రధానంగా దృష్టి పెట్టేవారు. ఫిజికల్ ఈవెంట్స్ కోసం చివరిలో నెలరోజులు సరిపోతుందన్న ధోరణిలో ఉండేవారు. కానీ, ప్రస్తుతం ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులు ఫిజికల్ ఈవెంట్స్‌ను ఏమాత్రం నిర్లక్ష్యం చేయడంలేదు. అలుపు లేకుండా గెలుపే లక్ష్యంగా ప్రాక్టీస్ చేస్తున్నారు. గతంతో కొందరు స్నేహితులు ఒక బృందంగా ఏర్పడి ప్రాక్టీస్ చేసుకొనేవారు. కానీ, ఇప్పుడు ప్రతిఅభ్యర్థి ఏ చిన్న అవకాశం చేజారకుండా నిపుణులైన కోచ్‌ల ఆధ్వర్యంలో తర్ఫీదు పొందుతున్నారు. కొన్ని కోచింగ్ సెంటర్లు ఫీజు ప్యాకేజీలో భాగంగా ఈవెంట్స్ ప్రాక్టీస్‌కు సైతం వసతులు కల్పిస్తున్నాయి. మరికొన్నిచోట్ల అర్హులైన పీఈటీలు శిక్షణ ఇస్తున్నారు. గతంలో ఆర్ట్స్ విద్యార్థులే ఎక్కువగా పోలీస్ ఉద్యోగాలకు పోటీపడేవారు. ప్రస్తుతం ఎంటెక్, బీటెక్, ఎంఎస్సీ, బీఎస్సీలు చదివిన సైన్స్ విద్యార్థులు కూడా పోటీలోకి వస్తున్నారు. వీరికి రాతపరీక్షతో పోలిస్తే ఫిజికల్ ఈవెంట్స్‌లో అర్హత సాధించడమే పెద్ద సవాల్. దీంతో ఫిజికల్ ఈవెంట్స్‌కు కోచింగ్ తీసకునేవారి సంఖ్య పెరిగింది. అర్హులైన గ్రామీణ పేద విద్యార్థుల కోసం పోలీస్‌శాఖ ఉచిత శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నది. హైదరాబాద్‌సహా అన్ని పోలీస్ కమిషనరేట్లు, దాదాపు అన్ని జిల్లాకేంద్రాల్లోనూ పోలీస్ ఉన్నతాధికారులు, సిబ్బందిని ప్రత్యేకంగా కేటాయించి మరీ పోలీస్ ఉద్యోగార్థులకు శిక్షణ ఇప్పిస్తున్నారు.

తొలుత చాలా ఇబ్బందిపడ్డా



నేను కానిస్టేబుల్ ఉద్యోగానికి ప్రిపేర్ అవుతున్న. ఫిజికల్‌ఈవెంట్స్ కోసం హైదరాబాద్‌లో కోచింగ్ తీసుకుంటున్న. మొదట్లో చాలా కష్టంగా అనిపించేది. ఇప్పుడు ప్రాక్టీస్ పెరిగేకొద్ది ఆత్మవిశ్వాసం పెరిగింది. వారం వారం టెస్టులు పెట్టి మరీ శిక్షణ ఇస్తున్నారు. ఇది చాలా ఉపయోగంగా ఉంది.

-దీపిక, కానిస్టేబుల్ అభ్యర్థి, సూర్యాపేట

ఆత్మవిశ్వాసం పెరిగింది



ఎస్సై ఉద్యోగానికి రెండోసారి ప్రయత్నిస్తున్న. ఈసారి ప్రిలిమ్స్‌లో మంచి మార్కులు వచ్చాయి. ఈవెంట్స్ కోసం ఆరు నెలలుగా ప్రాక్టీస్ చేస్తున్నం. ఈ సారి జాబ్ తప్పక సాధిస్తానన్న ఆత్మవిశ్వాసం నాలో పెరిగింది.

- ఎం నర్సింహారావు, ఎస్సై అభ్యర్థి హైదరాబాద్

ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్న



ఎస్సై జాబ్ కోసం నేను కోచింగ్ సెంటర్‌లో శిక్షణ తీసుకుంటున్న. రాత పరీక్షతోపాటు ఫిజికల్ ఈవెంట్స్‌కు సైతం వాళ్లే కోచ్‌తో శిక్షణ ఇప్పిస్తున్నారు. ప్రాక్టీస్ పెరిగేకొద్దీ ఈవెంట్స్ క్లియర్ చేస్తానన్న నమ్మకం పెరిగింది.

-మహేశ్‌గౌడ్, ఎస్సై అభ్యర్థి నిడమనూరు, నల్లగొండ జిల్లా

కోచింగ్ ఇస్తూ ప్రాక్టీస్ చేస్తున్న



నేను ఎస్సై ఈవెంట్స్‌కు ప్రాక్టీస్ చేస్తున్న. బీపీడీ పూర్తి చేయడంతో ఇతర విద్యార్థులకు కోచింగ్ ఇస్తున్న. ఉదయం, సాయంత్రం ప్రాక్టీస్.. వారానికోసారి ఈవెంట్స్ పరీక్షలు పెడుతున్నాం.

-గణేశ్ ఇనుముల, కోచ్, వరంగల్

తొమ్మిది నెలలుగా శిక్షణ..



రాత పరీక్షలో అర్హత సాధిస్తానన్న నమ్మకం ఉన్నా, ఫిజికల్ ఈవెంట్స్‌పై కొంతభయం ఉండేది. అందుకే నేను తొమ్మిది నెలల నుంచి హైదరాబాద్‌లోనే ఉంటూ ప్రాక్టీస్ చేస్తున్న.

-వాణిశ్రీ, ఎస్సై అభ్యర్థి, సిద్దిపేట

ఏపీ హైకోర్టు తాత్కాలిక భవనాన్ని ప్రారంభించిన

సీజేఐ జస్టిస్ రంజన్ గొగోయ్

అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు తాత్కాలిక భవనాన్ని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ ఆదివారం ప్రారంభించారు. అమరావతి పరిధిలోని నేలపాడులో నిర్మించిన తాత్కాలిక భవన ప్రారంభోత్సవంలో సుప్రీంకోర్టులోని తెలుగు న్యాయమూర్తులు జస్టిస్ నూతలపాటి వెంకట (ఎన్వీ) రమణ, జస్టిస్ లావు నాగేశ్వరరావు, జస్టిస్ రామయ్యగారి సుభాష్‌రెడ్డి, ఏపీ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చాగరి ప్రవీణ్‌కుమార్, తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ తొట్టతిల్ బీ రాధాకృష్ణన్‌తోపాటు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, పలువురు న్యాయమూర్తులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. హైకోర్టు తాత్కాలిక భవనం నుంచి కార్యకలాపాలు ఎప్పుడు ప్రారంభమవుతాయన్న విషయంపై ఇంకా పూర్తి స్పష్టత రాలేదు. ఫిబ్రవరి 15 అనంతరం ఈ భవనం నుంచి హైకోర్టు కార్యకలాపాలు ప్రారంభించవచ్చని తెలుస్తున్నది. మొత్తం 450 ఎకరాల్లో బౌద్ధ స్తూపాకృతిలో న్యాయ నగరం నిర్మితం కానున్నది. దీనికి కూడా జస్టిస్ గొగోయ్ శంకుస్థాపన చేశారు. ముఖ్యమంత్రితో కలిసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. హైకోర్టు భవన నిర్మాణ విశేషాలతో కూడిన గ్యాలరీని సీజేఐ పరిశీలించారు. హైకోర్టు భవన నిర్మాణంపై అధికారులు వీడియో ప్రజెంటేషన్ ఇచ్చారు. రూ.819 కోట్లతో 12.2 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో హైకోర్టు శాశ్వత భవనం నిర్మాణం కానున్నది.

దుర్గమ్మ ఆలయ ఆదాయానికి గండి

దర్శనం టికెట్ల విక్రయాల్లో అవినీతి

విజయవాడ: ఏపీలోని బెజవాడ కనక దుర్గమ్మ ఆలయ ఆదాయానికి గండిపడింది. అమ్మవారి దర్శన టికెట్ల విక్రయాల్లో భారీ అవినీతి బయటపడింది. ఒకేనంబర్‌తో అనేక దర్శన టికెట్లు విక్రయిస్తూ ఆలయ ఖజానాకు తూట్లు పొడుస్తున్నట్టు ప్రత్యేక నిఘాలో తేలింది. భక్తుల రద్దీ అధికంగా ఉన్న రోజుల్లో కూడా తక్కువ ఆదాయం రావడంపై అనుమానం వ్యక్తంచేస్తూ ఆలయ ఈవో టికెట్ల విక్రయాలపై ప్రత్యేక బృందాన్ని ఏర్పాటుచేశారు. బృందం తనిఖీల్లో టికెట్ల విక్రయాల్లో జరుగుతున్న అవినీతి వెలుగులోకి వచ్చింది. ఆలయ ఆదాయానికి లక్షల్లో గండిపడినట్టు ప్రాథమికంగా అంచనావేశారు.

కాంగ్రెస్‌కు కిశోర్ చంద్రదేవ్ రాజీనామా

10న టీడీపీలో చేరిక?

అమరావతి (విజయనగరం): కేంద్ర మాజీ మంత్రి వైరిచర్ల కిశోర్‌చంద్రదేవ్ కాంగ్రెస్‌కు ఆదివారం రాజీనామా చేశారు. ఢిల్లీలో మిత్రులతో చర్చించిన అనంతరం ఏ పార్టీలో చేరేది త్వరలోనే వెల్లడిస్తానని, రాజీనామా పత్రాన్ని శనివారమే పార్టీ అధిష్ఠానానికి పంపానని చెప్పారు. చంద్రదేవ్ ఈ నెల 10న సీఎం చంద్రబాబు సమక్షంలో ఢిల్లీలో తెలుగుదేశం పార్టీలో చేరనున్నట్టు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది.

ములుగులో కలపండి

ఎంపీ వినోద్‌కు కొత్తగూడెం, గంగారం మండలాల ప్రజాప్రతినిధులు, నేతల విజ్ఞప్తి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కొత్తగా ఏర్పాటయ్యే ములుగు జిల్లాలో కొత్తగూడెం, గంగారం మండలాలను కలిపేలా చూడాలని ఆ రెండు మండలాల ప్రజాప్రతినిధులతోపాటు కాంగ్రెస్, టీడీపీ, న్యూడెమోక్రసీ, తుడుందెబ్బ, ఆదివాసీ నాయకులు టీఆర్‌ఎస్ ఎంపీ వినోద్‌కుమార్‌ను కోరారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. రెండు మండలాల పరిధిలోని 69 గ్రామాలకు చెందిన 130 మంది నాయకులు వినతిపత్రంపై సంతకం చేశారు. ప్రస్తుతం మహబూబాబాద్ జిల్లాలో ఉన్న ఈ రెండు మండలాలు.. ములుగు జిల్లా కేంద్రానికి సమీపంలో ఉండటమే కాకుండా ములుగు అసెంబ్లీ నియోజకవర్గపరిధిలో ఉన్నాయని తెలిపారు. కాగా, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి ములుగు జిల్లాలో కలిపేలా కృషిచేస్తానని ఎంపీ వినోద్‌కుమార్ ఈ సందర్భంగా హామీ ఇచ్చినట్టు తెలిపారు. ఎంపీని కలిసిన వారిలో కేయూ ప్రొఫెసర్ ఈసం నారాయణ, రెండు మండల శాఖల టీఆర్‌ఎస్ అధ్యక్షులు ఈసం సమ్మయ్య, ఇర్ప సూరయ్య, తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్, ఆదివాసి జేఏసీ చైర్మన్ దాట్ల నాగేశ్వర్‌రావు, జేఏసీ జిల్లా చైర్మన్ భూర్క యాదగిరి, కాంగ్రెస్ మండలశాఖ అధ్యక్షుడు వజ్జ సారయ్య తదితరులున్నారు.

విద్యుదాఘాతంతో నలుగురు దుర్మరణం

- అరటిగెలలు కోస్తుండగా ఘటన
- ఏపీ శ్రీకాకుళం జిల్లాలో విషాదం

శ్రీకాకుళం: అరటిగెలలు కోస్తుండగా విద్యుదాఘాతానికి గురై ఒకే కుటుంబానికి చెందిన నలుగురు దుర్మరణం చెందారు. ఈ ఘటన ఏపీలోని శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం కొత్తరౌతుపేటలో ఆదివారం జరిగింది. అరటిగెలలు కోసే కత్తి విద్యుత్ తీగలకు తాకడంతో షాక్ కొట్టింది. ఆ వ్యక్తిని కాపాడబోయి మరొకరు అతడిని కాపాడబోయి ఇంకొకరు ఇలా నలుగురు మృతిచెందారు. బాధిత కుటుంబం తమ తోటను అమ్మేసి నగరానికి వెళ్లాలనుకొంటున్న తరుణంలో ఈ విషాదం చోటుచేసుకుంది.

షర్మిల కేసులో మంచిర్యాలవాసి అరెస్ట్

మంచిర్యాల క్రైం: వైఎస్ షర్మిలను కించపరిచేలా సోషల్‌మీడియాలో పోస్టులు చేసిన కేసులో మంచిర్యాలకు చెందిన అడ్డూరి నవీన్‌ను(23) శనివారం రాత్రి మంచిర్యాల పోలీసులు అరెస్ట్‌చేసి హైదరాబాద్ సీసీఎస్ పోలీసులకు అప్పగించారు. తనపై కొందరు సోషల్‌మీడియాలో తప్పుడు పోస్టులు పెడుతున్నారంటూ హైదరాబాద్ పోలీసులకు ఇటీవల షర్మిల ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసును విచారిస్తున్న హైదరాబాద్ సైబర్‌క్రైం పోలీసుల అదుపులో ప్రస్తుతం నవీన్ ఉన్నాడు.

విద్యార్థులే ఉద్యోగ సృష్టికర్తలు

నాణ్యమైన విద్యనందించాలి

- వ్యవసాయరంగంలో గుణాత్మక మార్పులు రావాలి: ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు
- విద్యార్థులు లక్ష్యం పెట్టుకోవాలి: హోంమంత్రి మహమూద్ అలీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ/జీడిమెట్ల: ఉన్నత విద్యాసంస్థల్లో నైపుణ్య ఆధారిత శిక్షణ ద్వారా విద్యార్థులను ఉద్యోగ సృష్టికర్తలుగా తయారుచేయొచ్చని ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు అన్నారు. భవిష్యత్ సవాళ్లను ఎదుర్కొనేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని, వారికి దిశానిర్దేశం చేసేందుకు ప్రత్యేకంగా కౌన్సిలర్లను నియమించాలని విద్యాసంస్థలకు సూచించారు. ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బాచుపల్లిలోని వీఎన్నార్ విజ్ఞానజ్యోతి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్మించిన యోగయ్యనాయుడు భవన్‌ను రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీతో కలిసి వెంకయ్యనాయుడు ప్రారంభించారు. విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను పరిశీలించారు. అనంతరం వ్యవసాయరంగం, గ్రామీణాభివృద్ధిలో శిక్షణ పొందుతున్న విద్యార్థులతో ప్రత్యేకంగా సమావేశమై మాట్లాడారు. విజ్ఞాన్ జ్యోతి సొసైటీ ద్వారా ఉన్నతవిద్యను అందించడం అభినందనీయమన్నారు. వ్యవసాయ రంగంలో గుణాత్మకమైన మార్పుల కోసం ప్రతిఒక్కరు కృషిచేయాలని కోరారు. వ్యవసాయంతోపాటు పౌల్ట్రీ, హార్టికల్చర్, పట్టు పురుగుల పెంపకం, పాడి వంటి అనుబంధరంగాల వైపు రైతులను ప్రోత్సహించడం ద్వారా వ్యవసాయరంగాన్ని లాభదాయకంగా మార్చవచ్చని చెప్పారు. ఈ యేడాది రైతులు, అనుబంధరంగాల్లో విశేష సేవలందించిన 15 మందికి పద్మ అవార్డులు అందించడం శుభ పరిణామమన్నారు. రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ మాట్లాడుతూ విద్యార్థులు ఒక లక్ష్యాన్ని పెట్టుకొని ముందుకుసాగాలని సూచించారు. నిరుపేదలకు కార్పొరేట్‌స్థాయి విద్యనందించేందుకు సీఎం కేసీఆర్ 600 రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటుచేశారని చెప్పారు. కార్యక్రమంలో పద్మశ్రీగ్రహీత డాక్టర్ కాకర్ల సుబ్బారావు, సినీ నిర్మాత దగ్గుబాటి సురేశ్‌బాబు, వీఎన్నార్ విజ్ఞానజ్యోతి అధ్యక్షుడు డాక్టర్ డీఎన్‌రావు, విజ్ఞానజ్యోతి ప్రధాన కార్యదర్శి కే హరిశ్చంద్రప్రసాద్, డీ రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.



బాచుపల్లిలోని వీఎన్నార్ విజ్ఞానజ్యోతి కళాశాలలో యోగయ్యనాయుడు భవనాన్ని ప్రారంభిస్తున్న ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు. చిత్రంలో హోంమంత్రి మహమూద్ అలీ తదితరులు

పంటకాలనీల ఏర్పాటు అభినందనీయం

సీఎం కేసీఆర్ ఆలోచన వ్యవసాయానికి శుభపరిణామం: ఉపరాష్ట్రపతి

రాష్ట్రంలో పంటకాలనీలు ఏర్పాటుచేయాలనే సీఎం కేసీఆర్ ఆలోచన అభినందనీయమని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ప్రశంసించారు. వ్యవసాయరంగానికి ఇది శుభ పరిణామమని తెలిపారు. ఆదివారం హైటెక్‌సిటీలో అగ్రివిజన్- 2019 సదస్సును ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ భారత ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయరంగం చాలా కీలకమన్నారు. వ్యవసాయరంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు యువత నడుం బిగించాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర అగ్రి వర్సిటీ వీసీ ప్రవీణ్‌రావు, సీఐఐ, కోరమాండల్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు అనిల్‌కుమార్, సమీర్ గోయల్, టీఆర్ కేశవన్ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ: బీజేపీ

13న రాష్ట్రంలో అమిత్‌షా పర్యటన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా కృషిచేస్తున్నామని, ఎన్నికల్లో తాము ఒంటరిగానే బరిలో దిగనున్నామని ఎంపీ బండారు దత్తాత్రేయ మీడియాకు తెలిపారు. బీజేపీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం రాష్ట్ర బీజేపీ నేతలు కోర్‌కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి, పంచాయతీ ఎన్నికలు, వచ్చే పార్లమెంట్ ఎన్నికలపై చర్చించారు. అనంతరం దత్తాత్రేయ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు ఎలాంటి ఆర్థిక సహాయం చేయలేదనే వ్యాఖ్యల్లో నిజంలేదని, రాష్ట్రానికి చేసిన సహాయంపై చర్చకు తాము సిద్ధమని చెప్పారు. ఈ నెల 13న బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా తెలంగాణలో పర్యటించనున్నారని తెలిపారు.

నమస్తే తెలంగాణ
జిందగీ
సోమవారం 4 ఫిబ్రవరి 2019 WWW. NTNEWS.COM /nt.zindagi

పాలు వద్దంటున్న ట్రైనర్!

పిల్లలకు తప్పనిసరిగా పాలు తాగించాలా? పాలలో దొరికే పోషకాలు ఇతర ఆహార పదార్థాలలో దొరుకుతాయా? అన్న సందేహం ఉంటుంది. పాలు అవసరం లేదంటున్నదో ట్రైనర్. ఎందుకో కూడా వివరించింది.

పిల్లలకు పాలు అవసరం లేదంటున్నారు రుజుత దివేకర్. ఈమె ఫిట్‌నెస్ ట్రైనర్. కరీనా కపూర్, అలియా భట్‌లాంటి సెలెబ్రిటీలకు రుజుత ఫిట్‌నెస్ ట్రైనర్. ఆమె 'నోట్స్ ఫర్ హెల్దీ కిడ్స్' అనే పుస్తకం రాశారు. ఇందులో పిల్లలకు పాలు తప్పనిసరి కాదని రాసింది ఈవిడ. కెనడాలో దాదాపు ఇలాంటి ఆదేశాలే ఉన్నాయి. కెనడా ఫుడ్‌గైడ్‌లో పాలు తప్పనిసరి అని చెప్పలేదు. ఆయా కాలాల్లో దొరికే ఆహార పదార్థాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కొందరు పాలలో చాక్లెట్ ఫ్లేవర్ కలిపి ఇస్తుంటారు. అలా చేస్తే పాలు తాగి ఏం ప్రయోజనం అంటుంది రుజుత. దాంతో పాటు లావైపోతారని కెనడా నిపుణులు అంటున్నారు. పౌడర్ కలుపడం వల్ల పాల ప్రయోజనాలు తగ్గిపోతాయని చెబుతున్నది. నువ్వుల చిక్కీలు, శనగ పిండి లడ్డు, రాగి పాయసం, దోశతో కూడా కాల్షియాన్ని భర్తీ చేయవచ్చని రుజుత అంటున్నారు. బాదం, సోయా, రైస్‌మిల్క్ లాంటి నాన్‌డెయిరీ మిల్క్ కొనేటప్పుడు వాటిమీద లేబుల్ తప్పకుండా చూడండి. అందులో విటమిన్‌లు, ఖనిజాలు ఉన్నాయో లేదో పరిశీలించండి. ఫార్టిఫైడ్ పాలయితే పిల్లలకు మంచిదే. పాలకు బదులు బలవర్ధకమైన ఆహారం తినిపిస్తే పాలతో పనిలేదంటున్నదీమె.



సక్సెస్ మంత్ర



వినియోగదారులకు, కంపెనీ క్లయింట్లకు వ్యాపారపరమైన సమస్యలను విశ్లేషించి వాటికి తగిన పరిష్కారాలను చూపుతుంది లాటెంట్ వ్యూ సంస్థ. లాటెంట్ వ్యూ అంటే.. 'నిగూఢమైన దృశ్యం' లేదా 'రహస్యమైన దృశ్యం' అని అర్థం. ఇలా సమాచార విశ్లేషణ అందించడం ద్వారా క్లయింట్లు తమ వ్యాపారాల్లో నిర్ణయాలను సులభంగా తీసుకోగలుగుతారు. వ్యాపారంలో సమస్యలేవైనా డిఫరెంట్ యాంగిల్‌లో విశ్లేషించి పరిష్కారం చూపుతుంది. కంపెనీకి అండగా కంపెనీ (తోడు) ఇస్తామంటున్న లాటెంట్ వ్యూ సహ వ్యవస్థాపకురాలు ప్రమద్ జంధ్యాల సక్సెస్‌మంత్ర.

సమస్యలను లాటెంట్ వ్యూతో పరిష్కరిస్తామంటున్న ప్రమద్ జంధ్యాల

ఆత్మవిశ్వాసంతో కూడిన ఆహార్యాన్ని ప్రదర్శించడం, మనసుకు తోచిన విధంగా చేయాలని నిశ్చయించుకోవడం, సమాధానాలు, పరిష్కార మార్గాలను ఆచితూచి జాగ్రత్తగా ఆలోచించి ఇవ్వగలగడం లాటెంట్ వ్యూ ప్రత్యేకత. అంతేకానీ చిన్న గమ్యాలతో సరిపెట్టి .. భారీ లక్ష్యాలను చిదిమేయొద్దు అంటున్నారు ప్రమద్.

తొలి అడుగులు

ప్రమద్ జంధ్యాల బిట్స్ పిలానీ (BITS Pilani)లో తన కంప్యూటర్ సైన్స్ గ్రాడ్యుయేషన్ పూర్తయ్యాక కోల్‌కతా ఐఐఎమ్ (IIM) లో ఆర్థిక విశ్లేషణ, సేవల విభాగంలో పనిచేశారు. ఇదంతా లాటెంట్ వ్యూ (LATENTVIEW) సంస్థకు సహ వ్యవస్థాపకురాలు అవక ముందు నాటి మాట. సమాచార విశ్లేషణ, సమాచార నిర్వహణ రంగాల్లో అప్పటివరకు ఉన్న వాటినే అనుసరించిన ఆమె ఆ తరువాతే ఆ రంగంలో మార్పులు తీసుకురావాలని బలంగా నిర్ణయించుకున్నారు. అలా అనుకుని వదిలేయలేదు. ఆ దిశగా అడుగులు వేశారు. ఇక్కడే ప్రమద్ ప్రయాణం లాటెంట్ వ్యూ స్థాపన దిశగా అడుగులు వేయడానికి మార్గాన్ని సుగమం చేసింది. ఆర్థిక, మానవవనరుల, పెట్టుబడులకు సంబంధించిన సమస్యలను పరిష్కరించే శాఖలో డైరెక్టర్‌గా తన కొత్త జీవితానికి శ్రీకారం చుట్టారు.

కాలేజీ రోజుల్లోనే ..

నిజానికి ఈ కార్యక్రమానికి తన కాలేజీ రోజుల్లోనే బీజాలు పడ్డాయంటున్నది ప్రమద్ జంధ్యాల. మొదటి నుండి కూడా క్రమశిక్షణ, కృషి, నమ్మినదానిపై ఖచ్చితంగా నిలబడడం అనే మూడు విశిష్టమైన లక్షణాలు ప్రమద్ జంధ్యాలపై ప్రభావాన్ని చూపాయి. అదెలా అంటే నేను బ్రాడ్ బేస్డ్ (broad-based) అనే పదంపై పాఠ్యాంశాన్ని తయారు చేసి.. కాలేజీ ఓరియెంటేషన్ సెషన్‌లో (orientation session) లో ప్రదర్శించాను. దాని ఉద్దేశం ఒకరిని ఒకరు సహకరించుకుంటూ నేర్చుకోవడం. దాన్ని నేనే అనుభవపూర్వకంగా తెలుసుకున్నాను. సమస్యలను ఎలాంటి సంకోచం లేకుండా స్వాగతించడాన్ని అభివృద్ధి చేసుకున్నాను. బిట్స్‌లో బిల్లింగ్ సాఫ్ట్‌వేర్‌ను తయారు చేయడం, సహకారాన్ని అందించడమనే వ్యాపారాన్ని తెలుసుకున్నా. విద్యా ప్రపంచానికి వెలుపల కూడా చాలా విజ్ఞానం ఉంటుంది. ఎలాంటి కలతలు లేని పిలానీలో చదువులు అద్భుతమైన అందాల ప్రపంచాన్ని నాకు పరిచయం చేశాయి. అది నా భవిష్యత్‌కు విశాలమైన పునాదులనే వేసింది' అని తన అనుభవాలను వివరించారామె.

ఏం చేస్తుంది?

లాటెంట్ వ్యూ ఇచ్చే వ్యాపార పరిష్కారాలతో ఆయా కంపెనీలు తమ వాణిజ్య సామర్థ్యాన్ని పెంచుకోగలుగుతాయి. వారి వారి వినియోగదారులకు సంతృప్తికరమైన సేవలను అందించడంలో పురోగతి సాధిస్తాయి. వినియోగదారులకు ఆర్థికపరమైన సేవలను, బీమా, వినియోగ వస్తువులు, రిటైల్, సాంకేతిక రంగాల్లో నిపుణుల ద్వారా వ్యాపార అండదండలను కల్పిస్తున్న లాటెంట్ వ్యూ. పలు కంపెనీలకు వ్యాపార విశ్లేషణలు అందిస్తున్నది లాటెంట్ వ్యూ. సమాచార సహాయంతో పాటు మంచి బిజినెస్, మార్కెటింగ్ నిర్ణయాలను అత్యుత్తమ సాంకేతిక విలువలతో వినియోగదారులకు అందిస్తున్నది. విలువలపై ఆధారపడి కంపెనీ పనిచేయడమే కాకుండా ఏ యేటి కాయేడు విజయవంతంగా ఆదాయాన్ని రెట్టింపు చేసుకుంటున్నది.



ఇతర సంస్థలతో తేడా

'మేం కల్పించే వ్యాపార సంబంధమైన పరిష్కారాలు, గణిత సమస్యల్లో కూడా చూసుండరు. మా క్లయింట్స్‌తో సత్సంబంధాలు కలిగి ఉంటాం. ఈ రెండు అంశాల కారణంగా ఇతర కంపెనీలతో మా కంపెనీని పోల్చి చూడలేం' అంటారు ప్రమద్ జంధ్యాల. తమ సేవలను విస్తరించుకుంటూ కంపెనీ ముద్రను మార్కెట్ లో చెరిగిపోనీయకుండా సమీప భవిష్యత్‌లో కొత్త క్లయింట్లను కూడా కలుపుకొని వెళ్తామనే ధీమా వ్యక్తం చేస్తున్నారామె.

> 'ఇప్పుడున్న పరిస్థితుల్లో అయితే సామాజిక మాధ్యమం లేదా సోషల్ మీడియా అనేది చాలా ఉపయోగకరంగా ఉంటున్నది. వ్యాపారంలో వినియోగదారులు చెప్పే విషయాలను తెలుసుకుని.. మార్కెట్‌కు ఏది అవసరమో, అనుగుణంగా ఉంటున్నదో దాన్ని పసిగట్టగలుగతాం. సంప్రదాయ సర్వర్లన్నీ కూడా క్లౌడ్ కంప్యూటింగ్‌కు సరిపోవు. కంపెనీలన్నీ సౌకర్యవంతంగా వ్యాపార విశ్లేషణలు పొందగలగాలంటే క్లౌడ్ అవసరమవుతుంది. ఈ విషయంలో లాటెంట్ వ్యూ అందరికీ సులభతరమైన సేవలనే అందిస్తున్నది. మొబైల్ ప్రభావం ఇప్పటి మార్కెట్‌పై చాలా ఉంది. ఇదో ఆసక్తికరమైన అంశం. ఎందుకంటే మనం ఎక్కడుంటే అక్కడ అంటిపెట్టుకుని ఉండే సాధనం మొబైల్. పైగా వ్యక్తిగత సమాచారాన్ని జతచేసేందుకు ఈ పద్ధతి చాలా తెలివైంది కూడా. సమాచార విశ్లేషణకు సంబంధించిన సందేశాలను పొందేందుకు సహాయపడుతుంది. మన దగ్గరున్న పూర్తి సమాచారం లోతుల్లోకి తల మునకలై వెళ్లాల్సిన అవసరం లేకుండా చేస్తుంది.'
>
> -ప్రమద్ జంధ్యాల

ఇయర్ అనలిటిక్స్ అవార్డు

అందుబాటులో ఉండే అపరిమితమైన ప్రపంచ స్థాయి వ్యాపార విశ్లషకులు, సమాచార నిర్వాహక నిపుణుల సహకారంతో క్షేత్ర స్థాయి నుంచి సమస్యలను పరిష్కరించడంలో లాటెంట్ వ్యూ అనుభవం గల సంస్థగా పేరును సంపాదించుకుంది. అంతేకాదు 2015 ఏడాదికి గాను కంపెనీ ఆఫ్ ద ఇయర్ అనలిటిక్స్ అవార్డును కూడా సొంతం చేసుకుంది. దీన్ని బట్టే లాటెంట్ వ్యూ.. వ్యాపార ప్రపంచంలో ఎలాంటి సేవలను అందిస్తున్నదో అర్థం చేసుకోవచ్చు.

లాటెంట్ వ్యూ స్థాపన..

ప్రమద్ వ్యాపార, వాణిజ్య భద్రతా విభాగంలో (సెక్యూరిటీస్ మార్కెట్లో) పనిచేశారు. ఆర్థిక సేవలు, పరపతి నిర్ధారణ ఇవన్నీ కూడా డేటా అనలిటిక్స్‌లో ఉంటాయి. ప్రజాసంబంధమైన వ్యవహారాలపై కూడా ప్రమద్ ప్రత్యేకమైన దృష్టి పెట్టేది. కష్టమర్లు సులభంగా పనిచేయడానికి స్ఫూర్తిని కలిగించే విషయాలను పరిశీలించి అర్థం చేసుకునేవారు. ఈ అనుభవాలన్నీ కూడా 2006 ఏడాదిలో లాటెంట్ వ్యూ (Latent view) పురుడు పోసుకోవడానికి ఉపయోగపడ్డాయి. ప్రస్తుతం ఈ కంపెనీకి 320 మంది బలమైన , సామర్థ్యవంతమైన బృందం ఐదు ప్రాంతాల్లో పనిచేస్తున్నది. వినియోగదారులకు, కంపెనీ క్లయింట్లకు వ్యాపారపరమైన సమస్యలను విశ్లేషించి వాటికి తగిన పరిష్కారాలను చూపాలనే లక్ష్యమే లాటెంట్ వ్యూ సంస్థ స్థాపనకు దారితీసిందని అంటారామె.. ఇలా సమాచార విశ్లేషణ అందించడం ద్వారా క్లయింట్లు తమ వ్యాపారాల్లో నిర్ణయాలను సులభంగా తీసుకోగలుగుతారు.

latentview

పోరాడి గెలిచింది!

దేశాన్ని కంటికి రెప్పలా కాపాడే సైనికుడు చనిపోతే అతని కుటుంబం రోడ్డున పడాల్సిందేనా? అని ఓ మహిళ పింఛన్ కోసం 30 యేండ్లు పోరాడింది. 94 యేండ్ల వయసులో అధికారులందరినీ కలిసి తనకు రావలిసిన దానికంటే ఎక్కువ వేతనాన్ని రాబట్టింది.



నిరంతరం దేశాన్ని కాపాడే సైనికులంటే కొంతమందికి చులకన. అయితే సైనికులేమో దేశమే వారి కుటుంబంగా భావిస్తారు. ఒక సైనికుడు చనిపోతే వారి కుటుంబం రోడ్డున పడాల్సిందే. అలాంటి సంఘటనే ఈ వృద్ధురాలికి ఎదురైంది. మన దేశానికి చెందిన కోల్ జార్జ్ బెంజామిన్ అనే ఆర్మీ అధికారి 1966లో పదవీ విరమణ తీసుకున్నాడు. తర్వాత అనారోగ్యంతో 1990లో చనిపోయాడు. దీంతో అతని భార్య హెబే బెంజామిన్ ఇజ్రాయేల్ దేశానికి వెళ్లిపోయింది. అయితే, కొన్నాళ్లకు కోల్‌కు వచ్చే పెన్షన్ ఆగిపోయింది. దీంతో కుటుంబంలో ఆర్థిక సమస్యలు ఎదురయ్యాయి. దేశ సైనికుడు చనిపోతే వారి కుటుంబానికి అందాల్సిన పింఛన్ గురించి ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. కుటుంబ భారం తనమీద వేసుకున్నది హెబే. సరైన ఆదాయం లేక కష్టాలను అనుభవించింది. చివరకు పింఛన్ విషయమై అధికారులకు లేఖ రాయాలనుకున్నది. తమ దగ్గరి బంధువు మన్‌ప్రీత్‌కాంత్ సాయంతో అప్పటి రక్షణ శాఖామంత్రికి విషయం తెలియజేస్తూ లేఖ రాసింది. అయితే, పై నుంచి ఎటువంటి సమాధానం రాలేదు. రోజులు గడుస్తున్నాయి.. అధికారులు మారుతున్నారు. కానీ, పింఛన్ రావడం లేదు. 94 యేండ్లు వచ్చినా హెబే పట్టువదలకుండా కుటుంబం కోసం పోరాడింది. చివరి ప్రయత్నంగా ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి లేఖ రాసింది. 'దేశ రక్షణ కోసం పోరాడుతున్న సైనికులకు మీరు ఇచ్చే గౌరవం ఇదేనా' అంటూ నిలదీసింది. దీంతో వెంటనే స్పందించిన పీఎంఓ ఆమెకు పింఛన్ ఇవ్వడానికి సిద్ధపడింది. మొత్తం రూ.75 లక్షలు వస్తాయని అనుకున్న హెబేకు.. వడ్డీతో సహా ప్రభుత్వం కోటి రూపాయలు అందజేసింది.

ఎసిడిటీ బాధిస్తున్నదా?

ఏం తిన్నా గొంతులో పట్టేసినట్లుంటుందా? కారం తింటే కడుపు మంట పుడుతుంటే మీకు ఎసిడిటీ ఉన్నట్లే. ఇలాంటప్పుడు తక్షణమే కొన్ని పనులు చేస్తే తప్ప ఉపశమనం పొందలేరు. అదెలాగో చదువండి.



- పరిగడుపున నాలుగైదు పుదీనా ఆకులను నమిలి మింగాలి. పుదీనాలో ఉండే ఔషధ గుణాలు ఎసిడిటీని తగ్గిస్తాయి.
- భోజనానికి ముందు ఒక గ్లాస్ గోరువెచ్చని నీటిలో ఒక టీస్పూన్ నిమ్మరసం కలిపి తాగితే ఎసిడిటీ రాదు.
- అరటిపండులో అధికంగా పొటాషియంతో పాటు నేచురల్ అంటాసిడ్స్ ఉండి గుండె మంట నుంచి ఉపశమనం కల్పిస్తాయి. జీర్ణకోశం శుభ్రపర్చడానికి అరటిపండు ఉపయోగపడుతుంది.
- పాలలో ఒక చెంచా తేనె చేర్చి తీసుకోవడం వల్ల ఛాతిలో, కడుపులో మంట తగ్గుతుంది.
- రెండు లవంగాలను నోట్లో వేసుకొని నమిలి మింగడం వల్ల ఎసిడిటీ నుంచి తక్షణ ఉపశమనం పొందవచ్చు.

వంటింటి చిట్కాలు



- చికెన్ వేయించేటప్పుడు మొక్కజొన్న పిండికి బదులు పాలపొడి వేస్తే మంచి రంగులోకి వస్తుంది.
- పూరీలు చేసేటప్పుడు వేడి నూనెలో నాలుగు జామ ఆకులు వేస్తే రంగు మారకుండా తెల్లగా ఉంటాయి.
- ఆకు కూరలను ఇనుప భాండ్లీలో వండకూడదు. నల్లబడిపోతాయి.
- కాలీఫ్లవర్ ఉడికేటప్పుడు కొంచెం పాలు పోస్తే దింపిన తరువాత కూడా రంగు మారకుండా ఉంటాయి.
- బియ్యంలో మట్టిగడ్డలు ఎక్కువగా ఉంటే కొంచెం ఉప్పు వేసి కడిగితే నీళ్ళలో కరిగి పోతాయి.
- కూరగాయ ముక్కల్ని పసుపు కలిపిన నీటిల ఉంచితే క్రిములు నీటిపైకి తేలిపోతాయి.

పట్టు పట్టింది.. ఐపీఎస్ అయింది!

ఏదైనా సాధించాలంటే కృషి తప్ప వేరే ప్రత్యామ్నాయం ఉండదు. విజయం సాధించడానికి షార్ట్‌కట్‌లూ ఉండవు. అచ్చం అలాగే పేదరికాన్ని జయించి ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో చదివి ఐపీఎస్‌గా ఎంపికైంది ఇల్మా అఫ్రోజ్..



ఆమె ప్రతిభకు పేదరికం అడ్డం కాలేదు. ఆమె ఆశయం, కష్టం ముందు విజయం తలవంచింది. పుట్టింది పేదకుటుంబంలోనే. సాధారణ రైతు కుమార్తెనే. అంతకు మించి 14 యేండ్ల వయస్సులోనే తండ్రిని కోల్పోయిన బాధ. ఒంటరైన తల్లి. ఎదగాల్సిన సోదరుడు ఇవ్వన్నీ ఆమెలో విజయానికి పునాది రాయి వేశాయి. ఇంటర్ వరకు స్థానిక కళాశాలలో చదివింది. డిగ్రీ విద్యను ఢిల్లీలో పూర్తి చేసింది. అక్కడే తత్వశాస్త్రంలో పట్టాసాధించింది. అక్కడితో ఆగకుండా ఆమె ఉన్నత విద్యను అభ్యసించాలనుకుంది. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో సీటు సాధించింది. మాస్టర్స్‌ని అక్కడే పూర్తి చేసింది. అయితే ప్రజలకు సేవ చేయాలని అప్పుడే తను నిర్ణయించుకుంది. సెలవుల సమయంలో ఇంటికి వచ్చినప్పుడు చుట్టుపక్కల వాళ్లు తమ ఇంటికి వచ్చి మాట్లాడేవారు. చిన్న చిన్న సాయం అడిగేవారు. వాళ్లను చూసినప్పుడు ఇలాంటి వాళ్లకు సాయం చేయాలని నిర్ణయించుకుంది. మళ్లీ యూనివర్సిటీకి వెళ్లినప్పుడు తను రోజూ కాలేజీకి వెళ్తే ఇండియా గురించి ఆలోచించేది. ఇంటిదగ్గర అమ్మా, సోదరుని పరిస్థితిని ఊహించుకునేది. పేదరికంలో ఉండి ఉన్నత చదవులు చదివించినందుకు తల్లిదండ్రులకు, అలాంటి వాళ్లకు అండగా నిలువాలనుకుంది. 2017లో పరీక్షలో యూపీఎస్సీలో 217వ ర్యాంక్ సాధించింది. దీంతో పోలీస్ సర్వీస్‌లోకి చేరింది. హిమాచల్ ప్రదేశ్ క్యాడర్‌లో చోటు సాధించింది. 'నా తల్లి నా చదువుకోసం డబ్బులు పోగేసేది, కష్టపడాలని ఎప్పుడూ చెప్పేది. నా సోదరుడు నా పెండ్లి కోసం ఎలాంటి డబ్బులు పోగుచేయడానికి బదులుగా వాటిని నా చదువుల కోసం ఇచ్చాడు. అందువల్లే నేను సాధించగలిగాను' అంటున్నారు ఇల్మా.

అందమైన ముఖారవిందానికి..

దుమ్ము, ధూళీ వల్ల చర్మంపై మృతకణాలు పెరిగిపోతాయి. చిన్న వయసులోనే ఒత్తిడి కారణంగా ముడుతలు పడుతాయి. తగిన శ్రద్ధ తీసుకోకపోతే ముఖం కాంతిని కోల్పోతుంది. ఈ చిట్కాలు పాటించి ముఖకాంతిని పెంచుకోండి.



- పెరుగులో కొద్దిగా కలబంద గుజ్జు, నిమ్మరసం, శనగపిండి కలిపి పేస్ట్‌లా తయారు చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి రాసుకొని అరగంట తర్వాత కడుక్కోవాలి. ఇలా తరచుగా చేస్తే మొటిమలు, నల్లటి వలయాలు తొలిగిపోతాయి.
- కాఫీ పొడిలో కొద్దిగా ఉప్పు, తేనె, కీరదోస రసం కలిపి ముఖానికి మెడకు పూసుకోవాలి. రెండు గంటల తర్వాత కడిగేస్తే సత్వర ఫలితం కనిపిస్తుంది. కాఫీ పొడిలోని యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ముఖంపై వ్యర్థాలను తొలిగిస్తాయి.
- చక్కెర నీటిలో కొద్దిగా నిమ్మరసం కలిపి స్నానం చేస్తే శరీరంపై జిడ్డు తొలిగిపోతుంది.
- సబ్బును వాడకుండా కనీసం రెండు గంటలకోసారైనా నీటితో ముఖాన్ని కడుక్కుంటే ముఖం కాంతివంతమవుతుంది.
- రెండు స్పూన్ల రోజ్ వాటర్లో ఒక స్పూన్ గ్లిజరిన్‌ను కలిపి చెంపలకు రాసుకుంటే ముడుతలు రాకుండా ఉంటాయి.
- ప్రతి రోజూ 5 లేక 6 సార్లు బూరను ఊదడం వల్ల ముఖానికి మంచి వ్యాయామం దొరుకుతుంది.

II.

నమస్తే తెలంగాణ

నిపుణ

[కరీంనగర్]

సోమవారం 4 ఫిబ్రవరి 2019



ది గైడ్

చాలెంజింగ్ కెరీర్

బిజీబిజీగా జీవితం గడుపుతున్న మనం మనసు ప్రశాంతత కోసం ఏదైనా ప్రాంతాన్ని లేదా చారిత్రక ప్రదేశాన్ని సందర్శిస్తుంటాం. కానీ వాటి గురించి మనకు సరిగా సమాచారం ఉండదు. కాబట్టి వాటి గురించి తెలిసిన గైడ్‌ల అవసరం చాలా ఉంటుంది. ఆ ప్రాంతం, ప్రదేశాన్ని వారు మనకు క్షుణ్ణంగా వివరిస్తారు. టూరిజం పరిశ్రమ విస్తరిస్తున్న నేపథ్యంలో టూరిస్ట్ గైడ్‌లకు సంబంధించి కోర్సులు కూడా అందుబాటులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో గైడ్‌కు సంబంధించిన వివరాలు నిపుణ పాఠకుల కోసం ప్రత్యేకం.

గైడ్ అంటే?

- ఏదైనా ప్రాంతం లేదా చారిత్రక ప్రదేశం గురించి, వాటి వివరాలు, కాలాలు, ప్రత్యేకతలు వివరించే వారినే గైడ్‌లు అంటారు. టూరిజం పరిశ్రమకు సంబంధించినది కాబట్టి టూరిస్ట్ గైడ్‌లు అని కూడా అంటారు. సంతోషంతో పాటు సవాలుతో కూడుకుని ఉంటుంది ఈ ఉద్యోగం.
- ప్రపంచంలోని దేశాలను సందర్శిస్తూ సంపాదించాలనుకునే వారు, ప్రపంచవ్యాప్తంగా నిరంతరం ప్రయాణించాలనుకునే వారు, ప్రపంచంలోని చారిత్రక స్థలాలు, వేర్వేరు సంస్కృతుల గురించి తెలుసుకునేవారు ఈ కోర్సు చదవవచ్చు.

నైపుణ్యాలు

- గైడ్‌కు స్నేహపూర్వక వ్యక్తిత్వంతో పాటు పర్యాటకులకు నచ్చిన భాషలో ఆకట్టుకునేవిధంగా వివరించే నేర్పు, వారిని తమ మాటలతో కంట్రోల్ చేయగల నైపుణ్యం ఉండాలి.
- అంతేకాకుండా పర్యాటకులకు లభించే హాస్పిటాలిటీ, ఇతర సౌకర్యాలు, సేవల గురించి తెలపడంతో పాటు సంస్థాగత నైపుణ్యం కూడా ఉండాలి.
- టైమ్ మేనేజ్‌మెంట్, పరిశోధనలో నైపుణ్యంతో పాటు అద్భుతమైన సంభాషణ నైపుణ్యాలు పెంచుకోవాలి.
- వీటితోపాటు వివిధ రకాల మనస్తత్వంగల పర్యాటకులకు నచ్చే విధంగా వివరించంగల ఓర్పు, సహనం ఉండాలి. వారు అడిగిన ప్రతిదానికి విసుగు చెందకుండా ఉండాలి.

బ్యాచిలర్ ఆఫ్ టూరిజం స్టడీస్

- అడ్వాన్స్‌డ్ ఫుడ్ క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్ (డెహ్రాడూన్-ఉత్తరాఖండ్), అల్ అమీన్ కాలేజ్ ఎదతల (ఎర్నాకుళం-కేరళ), అల్ అజార్ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్, హోలిక్రాస్ కాలేజ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ టెక్నాలజీ, జేపీఎం కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ (ఇడుక్కి-కేరళ), బిషప్ వయలిల్ మెమోరియల్ హోలిక్రాస్ కాలేజ్ (కొట్టాయం-కేరళ), బుందేల్‌ఖండ్ యూనివర్సిటీ (ఝాన్సీ-ఉత్తరప్రదేశ్), హిమాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (డెహ్రాడూన్-ఉత్తరాఖండ్), ఇంపీరియల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ టెక్నాలజీ (నైనిటాల్-ఉత్తరాఖండ్), ఇందిరాగాంధీ ఓపెన్ యూనివర్సిటీ (న్యూఢిల్లీ) తదితర కాలేజీల్లో ఈ కోర్సు అందుబాటులో ఉంది.

కోర్సులు - సంస్థలు

బీఏ (ఆనర్స్) ఇన్ ట్రావెల్ అండ్ టూరిజం

- ఈ కోర్సును గార్డెన్ సిటీ యూనివర్సిటీ (బెంగళూరు), జీడీ గోయెంకా యూనివర్సిటీ (గుర్‌గావ్-హర్యానా), క్రిష్‌నాథ్ కాలేజ్ (బెర్హంపూర్-పశ్చిమ బెంగాల్), నలంద ఓపెన్ యూనివర్సిటీ (పాట్నా-బీహార్), ఆర్ఎం ఇన్‌స్టిట్యూట్ (న్యూఢిల్లీ) కాలేజీలు అందిస్తున్నాయి.

బీఏ ఇన్ మేనేజ్‌మెంట్ ఆఫ్ టూరిజం బిజినెస్

- ఈ కోర్సు ఐఐఎస్ యూనివర్సిటీ-ఇంటర్నేషన్ కాలేజ్ ఫర్ గర్ల్స్ (జైపూర్-రాజస్థాన్) కాలేజీల్లో అందుబాటులో ఉంది.

బీఏ టూరిజం స్టడీస్

- ఈ కోర్సును ఏఈటీ కాలేజ్ (బెంగళూరు), ఆంబిషన్ పాయింట్ అకాడమీ (కోల్‌కతా), అమిటీ యూనివర్సిటీ (ముంబై, నోయిడా), బీఎం రుయా గర్ల్స్ కాలేజ్ (ముంబై), బుందేల్‌ఖండ్ యూనివర్సిటీ (ఝాన్సీ-ఉత్తరప్రదేశ్), డీఏవీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ (డెహ్రాడూన్-ఉత్తరాఖండ్), డా. బీఆర్ అంబేద్కర్ ఫస్ట్ గ్రేడ్ ఈవినింగ్ కాలేజ్, గార్డెన్ సిటీ కాలేజ్, గార్డెన్ సిటీ యూనివర్సిటీ (బెంగళూరు) కాలేజీలు ఆఫర్ చేస్తున్నాయి.

బీఏ ట్రావెల్ అండ్ టూరిజం

- ఈ కోర్సు కాకతీయ యూనివర్సిటీ (వరంగల్), గవర్నమెంట్ కాలేజ్ ఫర్ ఉమెన్, గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ ఫర్ మెన్ (శ్రీకాకుళం-ఏపీ), గవర్నమెంట్ తిలక్ పీజీ కాలేజ్ (కట్ని-మధ్యప్రదేశ్), కస్తూరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ (కోయంబత్తూర్-తమిళనాడు), కవి కులగురు కాళిదాస్ సంస్కృత వర్సిటీ (నాగ్‌పూర్-మహారాష్ట్ర), మహేంద్ర నారాయణ్ చౌదరి బాలికా మహావిద్యాలయ (నల్‌బరి-అసోం), పోకర్ సాహిబ్ మెమోరియల్ ఆర్ఫనేజ్ కాలేజ్ (మళప్పురం-కేరళ), తమిళనాడు ఓపెన్ యూనివర్సిటీ (చెన్నై), యూనివర్సిటీ ఆఫ్ కాలికట్ (కేరళ) కాలేజీల్లో అందుబాటులో ఉంది.

బీఎస్సీ (టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్)

- చండీగఢ్ యూనివర్సిటీ (మొహాలి-పంజాబ్), మద్రాస్ క్రిస్టియన్ కాలేజ్ అటామనస్ (చెన్నై), నలంద కాలేజ్ (బీహార్), పటియాలా ఏవియేషన్ క్లబ్ (పంజాబ్), క్వీన్ మేరీస్ కాలేజ్ అటానమస్ (చెన్నై), ఆర్ఐఎంటీ యూనివర్సిటీ (గోవింద్‌గర్-పంజాబ్), రాయల్ గ్లోబల్ వర్సిటీ (గువాహటి-అసోం), శ్రీరాం కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ (తిరువల్లూర్-తమిళనాడు), యూనివర్సిటీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (మొహాలి-పంజాబ్) కాలేజీల్లో ఈ కోర్సు ఉంది.

బీబీఏ (ఆనర్స్) ట్రావెల్ అండ్ టూరిజం మేనేజ్‌మెంట్

- బెంగాల్ స్కూల్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ (హుగ్లీ-పశ్చిమ బెంగాల్), సీజడ్ పటేల్ కాలేజ్ ఆఫ్ బిజినెస్ అండ్ మేనేజ్‌మెంట్ (వల్లభ్ విద్యానగర్-గుజరాత్), హిందుస్థాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (చెన్నై) కాలేజీల్లో ఈ కోర్సు అందుబాటులో ఉంది.

బీ వొకేషనల్ (టూరిజం)

- ఈ కోర్సును సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ జమ్ము (జమ్ముకశ్మీర్), చండీగఢ్ యూనివర్సిటీ (మొహాలి-పంజాబ్), జగన్నాథ్ యూనివర్సిటీ (జైపూర్-రాజస్థాన్), కేకే యూనివర్సిటీ (నలంద, బీహార్), సిక్కిం వర్సిటీ (గ్యాంగ్‌టక్-సిక్కిం), సోనాపూర్ కాలేజ్ (గువాహటి-అసోం), సెయింట్ జేవియర్ కాలేజ్ (ముంబై) తదితర కాలేజీలు అందిస్తున్నాయి.

ఎంఏ (టూరిజం అడ్మినిస్ట్రేషన్)

- అలహాబాద్ స్టేట్ వర్సిటీ (అలహాబాద్-ఉత్తరప్రదేశ్), అమిటీ యూనివర్సిటీ (జైపూర్, కోల్‌కతా, నోయిడా), డా.రామ్ మనోహర్ లోహియా అవధ్ యూనివర్సిటీ (ఫైజాబాద్-ఉత్తరప్రదేశ్), గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ (కోయంబత్తూర్-తమిళనాడు), క్వీన్ మేరీస్ కాలేజ్ అటానమస్ (చెన్నై), రీజినల్ కాలేజ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (భువనేశ్వర్-ఒడిశా), సాయి అకాడమీ (నోయిడా-ఉత్తరప్రదేశ్), శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ (తిరుపతి) తదితర కాలేజీల్లో ఈ కోర్సు ఉంది.

ఎంబీఏ (ఎకోటూరిజం)

- ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ టెక్నికల్ స్టడీస్ (నోయిడా-ఉత్తరప్రదేశ్), స్వామి వివేకానంద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (పటియాలా-పంజాబ్), ది గ్లోబల్ ఓపెన్ యూనివర్సిటీ (దిమాపూర్-నాగాలాండ్) తదితర కాలేజీలు ఈ కోర్సును ఆఫర్ చేస్తున్నాయి.



బీబీఏ ఎయిర్ ట్రావెల్ మేనేజ్‌మెంట్

ఏషియా పసిఫిక్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, డా. బాబాసాహెబ్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ (అహ్మదాబాద్-గుజరాత్) కాలేజీలు ఈ కోర్సును అందిస్తున్నాయి.

బీబీఏ ఏవియేషన్ ఆపరేషన్స్

పటియాలా ఏవియేషన్ క్లబ్, (పటియాలా-పంజాబ్), టీఎంఐ అకాడమీ ఆఫ్ ట్రావెల్, టూరిజం అండ్ ఏవియేషన్ స్టడీస్ (జైపూర్-రాజస్థాన్), ట్రేడ్ వింగ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ (న్యూఢిల్లీ, ఛతర్‌పూర్-మధ్యప్రదేశ్, కటక్-ఒడిశా, బెంగళూరు, ఔరంగాబాద్-మహారాష్ట్ర, పుణె-మహారాష్ట్ర, జలంధర్-పంజాబ్, జమ్ముకశ్మీర్) కాలేజీలు ఈ కోర్సును ఆఫర్ చేస్తున్నాయి.

బీఏ ట్రావెల్ అండ్ టూరిజం మేనేజ్‌మెంట్

- ఈ కోర్సును ఏబీఎస్ అకాడమీ ఆఫ్ సైన్స్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్, అడ్వాన్స్‌డ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ (బర్ధమన్-పశ్చిమబెంగాల్), అగర్‌చంద్ మన్ముల్ జైన్ కాలేజ్, అన్నా ఆదర్శ్ కాలేజ్ ఫర్ ఉమెన్ (చెన్నై), ఏబీ అబ్దురహిమాన్ హాజి ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్, బైతుల్ ఇజ్జా ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ (కోజికోడ్-కేరళ), చరణ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ (ఈరోడ్-చెన్నై), కొలంబస్ ట్రావెల్ అకాడమీ (ముంబై, పుణె-మహారాష్ట్ర, రాజ్‌కోట్-గుజరాత్) కాలేజీలు అందిస్తున్నాయి.

ఎంకాం (టూరిజం అడ్మినిస్ట్రేషన్)

- ఈ కోర్సు బెంగళూరు యూనివర్సిటీలో ఉంది.

ఎమ్మెస్సీ (ఎకోటూరిజం)

- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎకాలజీ అండ్ ఎన్విరాన్‌మెంట్ (న్యూఢిల్లీ), ది గ్లోబల్ ఓపెన్ యూనివర్సిటీ (దిమాపూర్-నాగాలాండ్), వీపీజీఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (చెన్నై) కాలేజీల్లో ఈ కోర్సు ఉంది.

ఎంఫిల్ (టూరిజం)

- అన్నా ఆదర్శ్ కాలేజ్ ఫర్ ఉమెన్ (చెన్నై), బుందేల్‌ఖండ్ యూనివర్సిటీ (ఝాన్సీ-ఉత్తరప్రదేశ్), సీహెచ్ఆర్ఐఎస్‌టీ డీమ్డ్ వర్సిటీ (బెంగళూరు), మదర్ థెరిసా ఉమెన్స్ యూనివర్సిటీ (కొడైకెనాల్) తదితర కాలేజీల్లో ఈ కోర్సు ఉంది.

డిప్లొమా ఇన్ టూరిస్ట్ గైడ్

- ఇంటిగ్రేటెడ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ టెక్నాలజీ (హైదరాబాద్), ఎఫర్ట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ టెక్నాలజీ, సాయి ఎడ్యుకేషన్ సెల్ (న్యూఢిల్లీ), ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ అండ్ క్యాటరింగ్ (ఉదయ్‌పూర్-రాజస్థాన్), కాలేజీల్లో ఈ కోర్సు అందుబాటులో ఉంది.

సర్టిఫికెట్ ఇన్ టూరిస్ట్ గైడెన్స్

- కమర్‌గావ్ కాలేజ్ (గోళఘాట్-అసోం) ఈ కోర్సును ఆఫర్ చేస్తుంది.
- హైదరాబాద్‌లోని ఫ్రాంక్లిన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎయిర్ హోస్టెస్ ట్రైనింగ్, జరో ఎడ్యుకేషన్-వెలింగ్‌కార్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, డా. వైఎస్ఆర్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ వంటి పలు ప్రైవేట్ సంస్థల్లో టూర్ గైడ్, ట్రావెల్ టూరిజంలో కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

ఉపాధి

- టూర్ గైడ్ వృత్తి విస్తృతమైనది. పర్యాటకుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుంది. దీంతో గైడ్‌ల అవసరం చాలా ఉంది. ఎందుకంటే పర్యాటకులు సందర్శించే ప్రాంతం గురించి తెలుసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. కాబట్టి టూరిస్ట్ గైడ్ కోర్సులు చేసినవారికి త్వరగా ఉపాధి లభిస్తుంది.
- ప్రపంచ దేశాలను చూడాలని చాలామంది కోరుకుంటున్నారు. వారికి ఆ దేశంలోని చారిత్రక, పర్యాటక ప్రదేశాలు, సంస్కృతుల గురించి క్షుణ్ణంగా తెలిసిన గైడ్‌ల అవసరం ఉంటుంది. దీంతో టూరిజం శాఖలు, ట్రావెల్ ఏజెన్సీలు గైడ్‌లకు మంచి వేతనాలు ఇచ్చి నియమించుకుంటున్నాయి.
- మధ్యప్రదేశ్, గోవా, ఉత్తరప్రదేశ్, వివిధ రాష్ట్రాల పర్యాటక అభివృద్ధి సంస్థలతో పాటు ఇండియా టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఐటీడీసీ) లల్లో ఉద్యోగావకాశాలు లభిస్తాయి.
- ప్రతి దేశం పర్యాటక ఆదాయాన్ని పెంచేందుకు ఆసక్తి చూపుతున్నాయి. పర్యాటకులను ఆకర్షించాలంటే ముఖ్యంగా వారికి కావాల్సింది భద్రత.
- అందుకే ఆయా దేశాలు, రాష్ట్రాల పర్యాటక మంత్రిత్వ శాఖలు గైడ్‌లకు లైసెన్సులను ఇస్తున్నాయి. అంతేకాకుండా ప్రాంతీయంగా గైడ్ శిక్షణ కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నాయి.
- ది గోవా రిజిస్ట్రేషన్ ఆఫ్ టూరిస్ట్ యాక్ట్-1982 ప్రకారం గైడ్‌లు అక్కడి జోనల్ ఆఫీసుల్లో నమోదు చేసుకోవాలి.

బీకాం (టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్)

- బేసిలియోస్ పౌలోస్ సెకండ్ కాలేజ్, సీఈటీ కాలేజ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఎర్నాకుళం-కేరళ), భోపాల్ స్కూల్ ఆఫ్ సోషల్ సైన్స్, కెరీర్ కాలేజ్ (భోపాల్), సీహెచ్ఎంఎం కాలేజ్ ఫర్ అడ్వాన్స్‌డ్ స్టడీస్, ఇమ్మాన్యుయేల్ కాలేజ్ (తిరువనంతపురం-కేరళ), సీహెచ్ఆర్ఐఎస్‌టీ-డీమ్డ్ యూనివర్సిటీ (బెంగళూరు, త్రివేండ్రం-కేరళ), డీఏవీ సెంటినరీ కాలేజ్ (ఫరీదాబాద్-హర్యానా), గవర్నమెంట్ పీజీ కాలేజ్ (భోపాల్-మధ్యప్రదేశ్) ఈ కోర్సును అందిస్తున్నాయి.

ఉద్యోగ హోదాలు

- గైడ్ కోర్సు పూర్తిచేసినవారు టూర్ ఆపరేటర్లు, ట్రావెల్ ఏజెంట్లు, రవాణా సర్వీస్ ప్రొవైడర్స్, అడ్వెంచర్ అండ్ లీజర్ టూరిజం ప్రొవైడర్స్, టూర్ ఆపరేటర్ ఫర్ టూర్స్ అండ్ ట్రావెల్స్ కంపెనీ, అవుట్‌బౌండ్ టూర్ ఎగ్జిక్యూటివ్, ట్రావెల్ ఏజెన్సీ స్టాఫ్, టూర్ కన్సల్టెంట్, ట్రావెల్ కన్సల్టెంట్, ఫ్రీలాన్స్ టూర్ మేనేజర్/టూర్ గైడ్, ఎగ్జిక్యూటివ్ ఇన్‌బౌండ్ టూర్, టూర్ ఆపరేషన్స్ మేనేజర్, టూరిజం ఆఫీసర్, ట్రావెల్ ఏజెంట్స్, ఎయిర్‌లైన్ ఎంప్లాయీ/ఎయిర్‌పోర్ట్ స్టాఫ్, టూరిజం ప్రమోటర్/మార్కెటర్, టికెటింగ్ స్టాఫ్ వంటి వివిధ హోదాల్లో ఉపాధి లభిస్తుంది.

...✍ సత్యం చాపల

బిట్‌శాట్-2019

ఐఐటీ, నిట్‌ల తర్వాత అంత క్రేజ్ ఉన్న ఇంజినీరింగ్ ఎగ్జామ్ బిట్‌శాట్. బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ & సైన్స్ అడ్మిషన్ టెస్ట్ (బిట్‌శాట్). ఆన్‌లైన్ విధానంలో నిర్వహించే ఈ టెస్ట్ ద్వారా పిలానీ, గోవా, హైదరాబాద్ క్యాంపస్‌లలో బీఈ/బీటెక్, బీఫార్మా ప్రవేశాలు కల్పిస్తారు. ప్రామాణికమైన విద్య, పక్కా క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌తో బిట్స్ పేరుగాంచింది.

- జేఈఈ మెయిన్ పర్సంటైల్ స్కోర్ ప్రకటించారు. విద్యార్థులకు వారి స్థితి గురించి ఒక ఐడియా వచ్చింది. 90 పర్సంటైల్ కంటే ఎక్కువ వచ్చినవారికి బిట్‌శాట్‌లో ఎక్కువ అవకాశాలు ఉంటాయి. బిట్‌శాట్ ఎగ్జామ్‌కు ఇంకా మూడున్నర నెలల సమయం ఉంది. ఈ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటే తప్పక బిట్స్‌లో సీటు సాధించవచ్చు.

పరీక్ష విధానం:

సెక్షన్లు	సబ్జెక్టు	ప్రశ్నలు
పార్ట్-1	ఫిజిక్స్	40
పార్ట్-2	కెమిస్ట్రీ	40
పార్ట్-3	ఇంగ్లిష్ ప్రొఫిషియన్సీ	15
	లాజికల్ రీజనింగ్	10
పార్ట్-4	మ్యాథ్స్/బయాలజీ (బీఫార్మా)	45
	మొత్తం	150

- నాలుగు సెక్షన్లు ఉంటాయి. ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటాయి. ప్రతి ప్రశ్నకు మూడు మార్కులు. ప్రతి తప్పు జవాబుకు 1 మార్కు కోత విధిస్తారు.
- **బోనస్ ప్రశ్నలు:** మొత్తం 150 ప్రశ్నలకు సమాధానం గుర్తించినవారికి 12 ప్రశ్నలు అదనంగా ఇస్తారు. ఇది అభ్యర్థికి ఆప్షన్. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ/మ్యాథ్స్ నుంచి నాలుగు ప్రశ్నల చొప్పున ఇస్తారు. ఈ ఆప్షన్ ఎన్నుకున్న తర్వాత మొదట గుర్తించిన 150 ప్రశ్నల కరెక్షన్ చేసుకునే వీలు ఉండదు.
- **సిలబస్:** ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్ ప్రకారం ఉంటుంది.
- **పరీక్ష తేదీలు:** మే 16 నుంచి 26 మధ్య ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు.

బిట్‌శాట్-జేఈఈ మెయిన్ మధ్య తేడా

- బిట్‌శాట్‌లో 150 ప్రశ్నలు – 180 నిమిషాల్లో పూర్తిచేయాలి. అదే జేఈఈ మెయిన్‌లో కేవలం 90 ప్రశ్నలు –180 నిమిషాలు. చిన్నప్రశ్నలు, సులభంగా ఉండేవాటిని త్వరత్వరగా గుర్తించుకుంటూ వెళ్లితేనే ఎక్కువ మార్కులు సాధించగలరు.

టైం మేనేజ్‌మెంట్

- 2018 కటాఫ్ ప్రకారం చాలా తక్కువ కటాఫ్ 260 మార్కులు. అంటే మీరు కనీసం 100 ప్రశ్నలకు సరైన జవాబులు గుర్తిస్తేనే పిలానీ క్యాంపస్‌లో మంచి బ్రాంచీ సాధించగలరు. కాబట్టి విద్యార్థులకు తప్పనిసరిగా టైం మేనేజ్‌మెంట్ అనేది చాలా కీలకం. ఎవరైతే వేగంగా, కచ్చితమైన జవాబులను గుర్తిస్తారో వారే విజయం సాధిస్తారు.

No time to go back

- ప్రశ్నలకు సమాధానం గుర్తించి వాటిని తిరిగి రివ్యూ లేదా కొన్ని ప్రశ్నలకు తర్వాత సమాధానం గుర్తించాలనుకుంటే కష్టమే. మొదటిసారే మీకు సాధ్యమైనంత వరకు తక్కువ సమయంలో సమస్యను సాల్వ్ చేయండి. రెండోసారి ఆ ప్రశ్న దగ్గరకు వచ్చే అవకాశం దాదాపుగా ఉండదు. అదేవిధంగా జవాబులను తిరిగి చెక్ చేసుకునే అవకాశం కూడా ఉండదు.

కచ్చితత్వం తప్పనిసరి

- జవాబులను గుర్తించేటప్పుడు నెగెటివ్ మార్కింగ్ విధానం ఉన్న విషయాన్ని మరువద్దు. కచ్చితమైన సమాధానాలను మాత్రమే గుర్తించండి.

ఇంగ్లిష్, లాజికల్ రీజనింగ్

- ఇంగ్లిష్ ప్రొఫిషియన్సీ నుంచి 15 ప్రశ్నలు, లాజికల్ రీజనింగ్ నుంచి 10 ప్రశ్నలు ఇస్తారు. ఈ ప్రశ్నలకు సులభంగా సమాధానాలు గుర్తించవచ్చు. మీరు ఇంగ్లిష్ మీడియం నుంచి వచ్చిన వారైతే ఇంగ్లిష్ సబ్జెక్టులో ఎక్కువ ప్రశ్నలకు ఎటువంటి కష్టం లేకుండా సమాధానాలు గుర్తించగలరు. ఇక లాజికల్ రీజనింగ్ కోసం పజిల్స్, బ్లడ్ రిలేషన్స్, డైరక్షన్ టెస్టులు, కోడింగ్, డికోడింగ్, నంబర్ సిరీస్ , ప్యాట్రన్ రికగ్నైజేషన్ తదితర అంశాలు ప్రాక్టీస్ చేస్తే సరిపోతుంది. మీరు ఈ రెండు అంశాల జవాబులను ఎంత వేగంగా, కచ్చితంగా గుర్తిస్తారో అంతగా మీరు విజయం దిశగా అడుగువేసినట్లే. ఇక్కడ ఆదా అయిన సమయం మ్యాథ్స్, ఫిజిక్స్ సబ్జెక్టులకు ఉపయోగపడుతుంది.



Cut-off BITSAT-2018 (Hyderabad Campus)

B.E.

Chemical -257

Civil- 258

EEE 298

Mechanical- 275

CSE- 334

ECE- 312

EIE- 286

M.Sc.

Biological Sciences-250

Chemistry-254

B.Pharm.-177

స్మార్ట్ ఆన్సరింగ్

- కెమిస్ట్రీకి 30 –35 నిమిషాలు మించి సమయం తీసుకోకూడదు. ఏ ప్రశ్నకైనా 30 సెకండ్లకు మించి క్యాలిక్యులేషన్ చేయకూడదు. మ్యాథ్స్‌కు ఎక్కువ సమయం పడుతుంది. మ్యాథ్స్‌కు కనీసం 60 – 80 నిమిషాలు సమయం పడుతుంది. మిగిలిన సమయాన్ని ఫిజిక్స్, ఇంగ్లిష్, లాజికల్ రీజనింగ్‌లో ఆదా చేసుకోవాలి. అన్ని ప్రశ్నలకు సమాన మార్కులు కాబట్టి చిన్నప్రశ్నలను సాల్వ్ చేయడం తెలివైన పని. పెద్ద (లెంథీ) ప్రశ్నల కోసం సమయం వృథా చేయవద్దు. ఇంగ్లిష్, లాజికల్ రీజనింగ్‌లకు ఎటువంటి క్యాలిక్యులేషన్ అవసరం లేదు కేవలం అనాలసిస్ మాత్రమే అవసరం. ఈ రెండు సబ్జెక్టులకు 30 నిమిషాలు మించకుండా సమాధానాన్ని గుర్తిస్తే సరిపోతుంది.

ఏ విధంగా ప్రిపేర్ కావాలి?

- మార్చి 14 వరకు మీరు ఇంటర్ పరీక్షలతో బిజీగా ఉంటారు. మార్చి 14 నుంచి మే బిట్‌శాట్ వరకు సుమారు రెండునెలల సమయం ఉంటుంది. ఐపీఈ ప్రిపేరయ్యే సమయంలో సెకండియర్ సబ్జెక్టులు రివిజన్ అయినట్లే. అయితే వీటికోసం కొంచెం కష్టపడితే చాలు. కెమిస్ట్రీ, మ్యాథ్స్‌లలో ఆబ్జెక్టివ్ ప్రశ్నలను కొంత ప్రాక్టీస్ చేస్తే చాలు మీకు భవిష్యత్‌లో సమయం ఆదా అవుతుంది.

మార్చి 15 నుంచి

- మార్చి 15 నుంచి సుమారు మూడువారాలు మీరు జేఈఈ మెయిన్ ప్రిపరేషన్‌లో బిజీగా ఉంటారు. అయితే బిట్‌శాట్, జేఈఈ సిలబస్ దాదాపుగా ఒక్కటే కాబట్టి మీకు కలిసి వస్తుంది. రెండు ఆన్‌లైన్ పరీక్షలే కాకపోతే పరీక్ష విధానంలో మార్పులు ఉన్నాయి.

జేఈఈ మెయిన్ తర్వాత

- జేఈఈ మెయిన్ తర్వాత సుమారు ఐదువారాల సమయం ఉంటుంది. ఈ సమయంలో మీ ప్రాక్టీస్ వేగాన్ని పెంచుకోవాలి. చాప్టర్ల వారీగా బిట్‌శాట్ స్టాండర్డ్ టెస్ట్‌లను మొదటి 3–4 వారాలు రాయాలి. ప్రతిరోజు ఇంగ్లిష్, లాజికల్ రీజనింగ్‌ల కోసం కొంత సమయాన్ని కేటాయించండి. చివరి రెండు వారాలు గ్రాండ్ టెస్ట్‌లను రాయండి. కనీసం ఐదు గ్రాండ్ టెస్టులు రాస్తే మంచిది.

ఆన్‌లైన్ టెస్ట్ ప్రాక్టీస్ తప్పనిసరి:

- పరీక్షలో విజయం సాధించడానికి ఆన్‌లైన్ ప్రాక్టీస్ టెస్ట్‌ను రాయండి. వీలైనన్ని ఎక్కువ బిట్‌శాట్ మాక్ టెస్ట్‌లను రాయండి. దీనివల్ల మీ లోటుపాట్లు తెలిసి పరీక్షలో ఆ తప్పులు చేయకుండా సరైనా విధంగా జవాబులు గుర్తించగలరు.
- **బోనస్ ప్రశ్నలు:** ఇవి చాలా సులభంగా ఉంటాయి. వీటికి సంబంధించి 36 మార్కులను సొంతం చేసుకోవచ్చు. అయితే మొదట 150 ప్రశ్నల జవాబులను సబ్మిట్ చేసిన తర్వాతే బోనస్ ప్రశ్నలు స్క్రీన్ మీద ప్రత్యక్షమవుతాయి. వీటికి కూడా నెగెటివ్ మార్కింగ్ విధానం ఉంటుంది.

చివరివారంలో

- చివరివారంలో మ్యాథ్స్‌లో సినాప్సిస్, ఫార్ములాలను చదువుకోండి. బేసిక్స్ జోలికి వెళ్లకండి. చివరివారంలో కనీసం రెండు గ్రాండ్ టెస్ట్‌లను రాయండి. సబ్జెక్టుల వారీగా టెస్ట్‌లను రాస్తే మంచిది.

చివరగా

- బిట్‌శాట్ చాలా కష్టమైన పరీక్ష కాదు. ప్రశాంతంగా కచ్చితమైన జవాబులను గుర్తించడం ప్రధానమైన విషయం. సరైన దిశలో ప్రాక్టీస్ మిమ్మల్ని సరైన దిశలో ముందుకు తీసుకువెళ్తుంది. వేగం, కచ్చితత్వంపై దృష్టి పెట్టండి. విజయం మీ సొంతం అవుతుంది.



వై శ్రీనివాస్
డైరెక్టర్,
నానో ఐఐటీ అకాడమీ,
నల్లకుంట, హైదరాబాద్

III.
నమస్తే తెలంగాణ
నిపుణ
[కరీంనగర్]
సోమవారం 4 ఫిబ్రవరి 2019

తడబాటు వద్దు..

ఇంటర్ ఎంఈసీ.. స్పష్టతతో ఈజీ

ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు మరో రెండువారాల్లో ప్రారంభం కానున్నాయి. ఉన్నత చదువులకు, కెరీర్ ఎంపికకు ఇంటర్ దశే ముఖ్యం కాబట్టి విద్యార్థులు ఈ పరీక్షలను చాలా సీరియస్‌గా భావిస్తారు. దాంతో చాలామంది విద్యార్థులు అనవసర ఆందోళనతో పరీక్షలు సరిగా రాయలేకపోతున్నారు. ఈ పరిస్థితిని నివారించాలంటే ముందునుంచే ఒక క్రమబద్ధమైన ప్రణాళికతో చదివితే పరీక్షలు ఎదుర్కోవడం తేలికవుతుంది. ఇంటర్మీడియట్ మొదటి, రెండో సంవత్సరాల పరీక్షలకు ఎంఈసీ కోర్సులో గణితం, అర్థశాస్త్రం, కామర్స్ సబ్జెక్టులకు సంబంధించిన ప్రిపరేషన్ టిప్స్‌ను నిపుణ పాఠకుల కోసం మాస్టర్‌మైండ్స్ అకడమిక్ అడ్వైజర్ రాధ అందిస్తున్నారు.

కామర్స్

- ఇంటర్ ఎంఈసీ గ్రూపులోని అన్ని సబ్జెక్టుల్లో కామర్స్ ప్రముఖమైనది. విద్యార్థి భవిష్యత్తులో కామర్స్ కోర్సులు చదవాలన్నా లేదా పోటీ పరీక్షలు రాయాలన్నా కామర్స్ వంటి ఆర్ట్స్ గ్రూపుపై పట్టు అవసరం.
- ప్రత్యేకించి భవిష్యత్తులో సీఏ, సీఎంఏ, సీఎస్ వంటి ప్రొఫెషనల్ కోర్సులకు, బీకాం, ఎంకాం, ఎంబీఏ వంటి కోర్సులకు ఎంఈసీలోని సబ్జెక్టుల ఫౌండేషన్ తప్పనిసరి.
- పదో తరగతి పూర్తిచేసిన విద్యార్థులు ఇంటర్‌లో ఎంఈసీ గ్రూపు తీసుకుంటే కామర్స్ అనే సబ్జెక్టు కొత్తగా పరిచయవుతుంది. దీంతో కొంతమంది విద్యార్థులు కామర్స్ అంటే భయపడతారు. కానీ మొదటి నుంచే అన్ని అంశాలపై పూర్తి అవగాహన ఏర్పర్చుకుంటే, ఒక నిర్దిష్ట ప్రణాళిక ప్రకారం చదివితే కామర్స్ సబ్జెక్టు పరీక్షను సులువుగా రాయడమే కాకుండా మంచి మార్కులు సాధించవచ్చు.
- వ్యాపార, వాణిజ్య రంగాలకు సంబంధించిన అనేక విషయాలను పరిచయంచేసే వేదిక కామ ర్స్. రకరకాల వ్యాపార సంబంధిత వ్యవహారాలు ఎలా నిర్వహిస్తారు. ఎలా నిర్వర్తిస్తారో విపులంగా వివరించే సబ్జెక్టు కామర్స్.
- కామర్స్ 50 మార్కులకు థియరీ, మరో 50 మార్కులకు అకౌంట్స్ మొత్తం కలిపి 100 మార్కులకు ఉంటుంది.
- కామర్స్ మొదటి ఏడాదిలో వ్యాపార భావనలు, వివిధ రకాల వ్యాపార సంస్థలు, కంపెనీ నిర్మా ణం, వ్యాపార ఆర్థిక వనరులు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థలు, వ్యాపారంలో ఉద్భవిస్తున్న ధోరణులు, బహుళ జాతీయ సంస్థలు వంటి అంశాలుంటాయి.
- కామర్స్ ద్వితీయ ఏడాదిలో వ్యవస్థాపకుడు, వ్యవస్థాపకత, స్వదేశీ, విదేశీ వర్తకం, వ్యాపార సేవలు, ఫైనాన్షియల్ మార్కెట్లు, వినియోగదారుల రక్షణ వంటి అంశాలుంటాయి.
- అకౌంటింగ్‌లో మొదటి ఏడాదిలో అకౌంటింగ్ భావనలు, ఖాతాల నిర్వహణ, జంట పద్దు విధానంలో ఖాతాల నిర్వహణ, చిట్టాలు, బ్యాంకు నిల్వల సమన్వయ పట్టీ, ముగింపు లెక్కలు ఉంటాయి.
- సెకండియర్‌లో కన్‌సైన్‌మెంట్ ఖాతాలు, భాగస్వామ్య ఖాతాలు, కంపెనీ ఖాతాలు వంటివి ప్రధానంగా ఉంటాయి. అకౌంటింగ్‌లో ఒక అధ్యాయానికి ఇంకొక అధ్యాయానికి సంబంధం ఉండదు కాబట్టి ప్రతి అధ్యాయానికి జాగ్రత్త వహించాలి.

1. ఎంఈసీలో ఉన్న అన్ని సబ్జెక్టుల్లో సులువుగా చదవగలిగిన మంచి మార్కులు సాధించగలిగిన పేపర్ కామర్స్.
2. కామర్స్, అకౌంట్స్ రెండు సబ్జెక్టులు ఒక్కొక్కటి 50 మార్కులు. రెండు కలిపి 100 మార్కులకు ఒకే పేపర్‌గా పరీక్షల్లో ఇవ్వడం జరుగుతుంది.
3. పార్ట్-ఏ కామర్స్, పార్ట్-బీ అకౌంట్స్.
4. పార్ట్-ఏ 50 మార్కులకు ప్రశ్నలు కింది విధంగా ఉంటాయి.
5. సెక్షన్-1 మొత్తం మూడు 10 మార్కుల ప్రశ్నలు ఇస్తారు. వాటిలో రెండు ప్రశ్నలకు సమాధానాలు రాయాలి. (Q.NO.. 1, 2, 3)
6. సెక్షన్-2లో ఐదు మార్కుల ప్రశ్నలు మొత్తం ఆరు ఇస్తారు. వాటిలో నాలుగు ప్రశ్నలకు సమాధానాలు రాయాలి. (Q.NO.. 4,5,6,7,8,9)
7. సెక్షన్-3లో మొత్తం ఎనిమిది 2 మార్కుల ప్రశ్నలు ఇస్తారు. వాటిలో ఐదు ప్రశ్నలకు సమాధానాలు రాయాలి. (Q.NO.. 10, 11, 12, 13, 14, 15, 16, 17)
8. ఈ ప్రశ్నల్లో ముందుగా సెక్షన్-3 అంటే 2 మార్కుల ప్రశ్నలకు, తర్వాత 10 మార్కుల ప్రశ్నలకు, చివరగా 5 మార్కుల ప్రశ్నలకు సమాధానాలు రాస్తే మంచిది.
9. 5, 10 మార్కుల ప్రశ్నలను పాయింట్ల వైజ్‌గా రాస్తే వ్యాల్యుయేషన్ సులువుగా అర్థం చేసుకోడానికి వీలవుతుంది.
10. 5, 10 మార్కుల ప్రశ్నలు రాసేటప్పుడు సైడ్ హెడ్డింగ్స్‌ను పెన్సిల్‌తో అండర్‌లైన్ చేస్తూ మధ్య మధ్యలో ఇంపార్టెంట్ పాయింట్స్ వచ్చినప్పుడు పెన్సిల్‌తో అండర్‌లైన్ చేయడం ద్వారా పేపర్‌ను నీటుగా ప్రజెంట్ చేయవచ్చు.
11. అన్ని ప్రశ్నలకు సమాధానాలు రాయాలి. వీలైనంతవరకు 5, 10 మార్కుల ప్రశ్నలకు ఇంట్రడక్షన్ రాయాలి.
12. ముందుగా అకౌంట్స్ ప్రశ్నలు రాసి తర్వాత కామర్స్ రాస్తే విద్యార్థి చివరి నిమిషంలో టెన్షన్ పడకుండా ఉండవచ్చు.
13. సమాధాన పత్రంలో సాధ్యమైనంతవరకు కొట్టివేతలు లేకుండా రాయాలి.
14. విద్యార్థులు పాత ప్రశ్నపత్రాలను ఒకసారి చూసుకుని ఏయే ప్రశ్నలు రిపీటెడ్‌గా వస్తున్నాయో చూసుకుని వాటిపై ఎక్కువ శ్రద్ధ వహిస్తే మంచి ఫలితాలు పొందవచ్చు.
15. పరీక్ష హాల్లో సమయం ఉంటే అకౌంట్స్ చాయిస్ చేసి ఇంకా సమయం ఉంటే కామర్స్ 2 మార్కు ల ప్రశ్నల చాయిస్ రాయాలి.
16. ప్రశ్నలో డిఫైన్ అని అడిగితే ఆ ప్రశ్నకు డెఫినీషన్ తప్పనిసరిగా రాయాలి.
17. వ్యత్యాసాలకు సంబంధించిన ప్రశ్నలు రాసేటప్పుడు ఇంట్రడక్షన్ తప్పనిసరిగా రాయాలి.
18. ప్రశ్నకు ఎంత సమాధానం రాశామన్నదాని కంటే ఎంత కరెక్ట్‌గా జవాబు రాశామన్నదే ముఖ్యం.

అకౌంట్స్‌లో ఎక్కువ మార్కులు..

- మెయిన్ పరీక్షలో కామర్స్ ప్రశ్నపత్రంలో పార్ట్-ఏగా కామర్స్ ప్రశ్నలు, పార్ట్-బీగా అకౌంట్స్ (18వ ప్రశ్న నుంచి) స్టార్ట్ అవుతాయి.
- అకౌంట్స్ సబ్జెక్టుతో పరీక్ష ప్రారంభించడం మంచిది. ఎందుకంటే కామర్స్ సబ్జెక్టు థియరీ కాబట్టి ఎక్కువ టైమ్ కావాలి. అకౌంట్స్ పార్ట్ గంటలో ముగించి కామర్స్ స్టార్ట్ చేయడం మంచిది.
- కొంతమంది సరైన అవగాహన లేక ముందుగా కామర్స్ పార్ట్‌తో స్టార్ట్ చేస్తారు. దీనివల్ల ఎక్కువ టైమ్ రాసి తర్వాత చివరి గంటలో అకౌంట్స్ పార్ట్ రాసేటప్పుడు క్యాలిక్యులేషన్ మిస్టేక్స్ రావడానికి అవకాశం ఉంటుంది.
- ప్రశ్నపత్రంలో ప్రతి ప్రాబ్లమ్‌కు సొల్యూషన్ చేసే ముందు జాగ్రత్తగా చదివి సరైన అవగాహన తెచ్చుకుని ఇంతకుముందు చేసిన తప్పులు జరుగకుండా చూడాలి.
- ప్రతి ప్రాబ్లమ్‌లో సొల్యూషన్ చేసేటప్పుడు అమౌంట్స్‌ను జాగ్రత్తగా రాసుకోవాలి. అంటే రాంగ్ అమౌంట్స్ రాయకుండా చూసుకోవాలి.
- అకౌంట్ పార్ట్‌లో బాగా పర్‌ఫెక్ట్‌గా ఉన్న ప్రాబ్లమ్‌తో స్టార్ట్ చేయాలి. 5 మార్కుల్లో ప్రాబ్లమ్స్ అటెంప్ట్ చేయడానికే ఇంపార్టెన్స్ ఇవ్వాలి. 2 మార్కుల్లో ప్రాబ్లమ్స్ అటెంప్ట్ చేసి థియరీ ప్రశ్నలు రాయడం మంచిది.
- 20 మార్కుల ప్రాబ్లమ్ (జూనియర్ ఇంటర్ వారికి ఫైనల్ అకౌంట్స్, సీనియ ర్ ఇంటర్‌వారికి పార్ట్‌నర్‌షిప్ అకౌంట్స్) సొల్యూషన్ చేసేటప్పుడు పక్కపక్కన ఉండేలా చూసుకోవాలి. దీనివల్ల చాలా టైమ్ సేవ్ అవుతుంది.
- ప్రతి ప్రాబ్లమ్‌కు పెన్సిల్‌తో నీట్‌గా ప్రొఫార్మాస్ గీసి, హెడ్డింగ్స్ కోసం బ్లాక్ పెన్, ప్రాబ్లమ్ చేయడానికి బ్లూపెన్ వాడాలి.
- అకౌంట్స్ పార్ట్‌లో ఎక్కువ మందికి క్యాలిక్యులేషన్స్ మిస్టేక్స్ వచ్చే అవకాశం ఉంటుంది. ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో క్యాలిక్యులేటర్లను అనుమతించరు. కాబట్టి క్యాలిక్యులేషన్ల విషయంలో జాగ్రత్త వహించాలి.
- అమౌంట్స్ రాసేటప్పుడు ఒక ఆర్డర్‌లో రాసుకుంటే క్యాలిక్యులేషన్స్ ఈజీగా ఉంటుంది, మిస్టేక్స్ తగ్గే అవకాశం ఉంటుంది.
- ప్రతి సెక్షన్‌లో రాయాల్సిన వాటిని (చాయిస్ ప్రకారం) కచ్చితంగా రాయాలి. అంటే 50 మార్కులను కంప్లీట్‌గా అటెంప్ట్ చేయాలి.
- పరీక్ష పూర్తయ్యే ముందు చివరి 10 నిమిషాల్లో అన్ని సమాధానాలను, క్యాలిక్యులేషన్స్‌ను ఒకసారి సరిచూసుకోవాలి.
- అకౌంట్స్ 50 మార్కులు, కామర్స్ 50 మార్కులు రాయడం పూర్తయిన తర్వాత ఇంకా టైమ్ మిగిలితే అకౌంట్స్‌లో చాయిస్ రాయడం మంచిది. 10, 5, 2, మార్కుల ప్రశ్నల్లో డౌట్‌గా ఉన్నవాటికి చాయిస్ రాయాలి.

జూనియర్ ఇంటర్‌లో

- ఫైనల్ అకౌంట్స్ చాప్టర్‌లో రాని బాకీలు, రాని బాకీల నిధి, స్థిరాస్తులపై తరుగుదల వంటి సర్దుబాట్ల విషయంలో జాగ్రత్త వహించాలి.
- మూడు వరుసల నగదు చిట్టా చేసేటప్పుడు ఎదురు పద్దుల విషయంలో జాగ్రత్తగా రాయాలి.
- బ్యాంకు నిల్వల సమన్వయ పట్టీలో నగదు పుస్తకంలో జరిగిన తప్పులను అలాగే పాస్‌బుక్‌లో జరిగిన తప్పులను లెక్కలో తీసుకునేటప్పుడు జాగ్రత్తగా పరిశీలించాలి.
- సహాయక చిట్టాల తయారీ విషయంలో వర్తకపు డిస్కౌంట్‌ని లెక్కించే విషయంలో జాగ్రత్తగా ఉండాలి.
- వ్యక్తిగత ఖాతాను తయారుచేసేటప్పుడు ప్రారంభ నిల్వ విషయంలో అలాగే ఖాతా ముగింపు విషయంలో లెక్కలో ఇచ్చిన సమాచారాన్ని జాగ్రత్తగా గమనించాలి.

సీనియర్ ఇంటర్‌లో

- భాగస్వామ్య ఖాతాలు తయారుచేసేటప్పుడు గుడ్‌విల్ ఖాతా విషయంలో, మూలధన ఖాతాల విషయంలో, పునర్‌మూల్యాంకన ఖాతా విషయంలో జాగ్రత్త వహించాలి.
- కన్‌సైన్‌మెంట్ ఖాతాల తయారీలో ముగింపు సరుకు లెక్కింపులో జాగ్రత్తగా ఉండాలి.
- వ్యాపారేతర సంస్థల ఖాతాల విషయంలో ఆదా య వ్యయాల ఖాతా తయారుచేసేటప్పుడు రాబడి అంశాలను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలి. మూలధన అంశాలను వదిలివేయాలి.
- తరుగుదల ఖాతాల్లో ఆస్తి ఖాతా తయారుచేసేటప్పుడు తరుగుదల ఎన్ని నెలలకు లెక్కించాలనే విషయంలో, వర్తకపు బిల్లుల విషయంలో డిస్కౌంట్ లెక్కించే విషయం జాగ్రత్తగా పరిశీలించాలి.
- ఒంటిపద్దు విధానం చాప్టర్‌లో లాభనష్టాల నివేదిక తయారీలో ముగింపు మూలధనంతో ప్రారంభించాలి.

మ్యాథమెటిక్స్

- ఎంపీసీ గ్రూప్‌లో ఉండే మ్యాథ్స్, ఎంఈసీ గ్రూప్‌లో ఉండే మ్యాథ్స్ ఒకటే. ఇంటర్ ఎంఈసీ గ్రూప్‌లో మ్యాథ్స్ సబ్జెక్టు ఉండటంవల్లనే ఎంఈసీ కోర్సు చదివిన వారికి భవిష్యత్తులో ఏ కోర్సు అయినా చదువుకునే వీలు కలిగింది. ఎంఈసీలో మ్యాథ్స్ కీలకమైన సబ్జెక్టు. మొదటి ఏడాది 100 మార్కులకు రెండు పేపర్లు (1ఎ, 1బి) ఉంటాయి. రెండో ఏడాదిలోనూ ఇదేవిధంగా రెండు పేపర్లు ఉంటాయి.
- మ్యాథ్స్ పేపర్ మొత్తం మూడు విభాగాలుగా ఉంటుంది. అవి సెక్షన్-ఎ, సెక్షన్-బి, సెక్షన్-సి. ముందుగా 7 మార్కుల ప్రశ్నలు, తర్వాత నాలుగు మార్కుల ప్రశ్నలు, ఆ తర్వాత రెండు మార్కుల ప్రశ్నలు ఉంటాయి. ప్రతి ప్రశ్నకు జవాబు రాసేటప్పుడు ఇచ్చిన డాటా, కంక్లూజన్ రాసినందుకు ప్రత్యేక మార్కులు ఉంటాయి. కాబట్టి వీటిపై శ్రద్ధపెట్టాలి. డెఫినిషన్స్, థియరీకి సంబంధించిన ప్రశ్నలు బాగా చదవాలి. ఫార్ములాలు ఉన్న ప్రశ్నలకు తప్పనిసరిగా ఫార్ములా రాస్తూ, అవసరమైన ప్రతిచోట డయాగ్రమ్స్ గీస్తూ మంచి ప్రజంటేషన్ చూపితే మ్యాథ్స్‌లో ఎక్కువ మార్కులు పొందవచ్చు.

జూనియర్ ఇంటర్

మ్యాథ్స్-1A లో ఎక్కువ మార్కులు సాధించాలంటే..

- ఫంక్షన్స్, వెక్టార్ ఆల్జీబ్రా, మ్యాట్రిక్స్, Trigonometric ratios వంటి చాప్టర్ల నుంచి రెండు మార్కుల ప్రశ్నలు వస్తాయి.
- మ్యాథమెటికల్ ఇండక్షన్ చాప్టర్లో వివిధ ఫార్ములాలపై పట్టు సాధించాలి. ఈ ప్రశ్న కంక్లూజన్ స్టెప్‌పై దృష్టిపెట్టాలి.
- ఫంక్షన్స్ థియరమ్స్ బాగా ప్రాక్టీస్ చేయాలి. ఇది థియరిటికల్ ప్రశ్న కాబట్టి ఏ తప్పు లేకుండా రాయాలి.
- మ్యాట్రిసెస్‌లో డెఫినిషన్స్, డిటర్మినెంట్ ప్రాబ్లమ్స్, Consistant, Inconsistant Problems, CRAMER'S రూల్, Matix Inversion Method, Gouss Jordan Problems బాగా ప్రాక్టీస్ చేయాలి.
- ఆడిషన్ ఆఫ్ వెక్టార్స్‌లో Collinear, Coplanarకు సంబంధించిన ప్రశ్నలపై పట్టు సాధిస్తూ ప్రొడక్ట్ ఆఫ్ వెక్టార్స్‌లో Distance b/w Skew Lines Problems, వెక్టార్ ట్రిపుల్ ప్రొడక్ట్ థియరమ్ బాగా ప్రాక్టీస్ చేయాలి.
- Trigonometry ఫార్ములాలపై బాగా పట్టు సాధించాలి.
- ప్రాపర్టీస్ ఆఫ్ ట్రయాంగిల్స్ చాప్టర్‌లో సైడ్స్ ఇచ్చినప్పుడు ఇన్ రేడియస్, ఎక్స్ రేడియస్, సర్కమ్ రేడియస్‌లు కనుగొనడం బాగా ప్రాక్టీస్ చేయాలి.

మ్యాథ్స్-1B లో ఎక్కువ మార్కులు సాధించాలంటే

- మ్యాథ్స్-1బి లో రెండు మార్కుల ప్రశ్నలు బాగా రాయాలంటే స్ట్రెయిట్ లైన్స్, లిమిట్స్ అండ్ కంటిన్యుటీ, డెరివేటివ్స్, అప్లికేషన్ ఆఫ్ డెరివేటివ్స్ నుంచి ఎక్కువ ప్రశ్నలు వస్తాయి. కాబట్టి వీటిని బాగా ప్రాక్టీస్ చేయాలి.
- లోకస్, ట్రాన్స్‌ఫర్మేషన్ ఆఫ్ యాక్సెస్, లిమిట్స్ అండ్ కంటిన్యుటీ, Derivative of The Funtion using first Priniciple Problems పై శ్రద్ధ పెడితే నాలుగు మార్కుల సెక్షన్‌లో గరిష్ఠ మార్కులు సాధించవచ్చు.
- స్ట్రెయిట్‌లైన్స్‌లో సర్కమ్ సెంటర్, ఆర్థో సెంటర్ ప్రాబ్లమ్స్, ఫుట్ ఆఫ్ ద పర్‌పెండిక్యులర్, ఇమేజ్ థియరమ్స్ బాగా ప్రాక్టీస్ చేయాలి.
- పెయిర్ ఆఫ్ స్ట్రెయిట్‌లైన్స్ చాప్టర్‌లో థియరమ్స్, హోమోజెనిసింగ్ కాన్సెప్ట్స్‌కు సంబంధించిన ప్రాబ్లమ్స్ బాగా ప్రాక్టీస్ చేయాలి.
- Angle b/w Two Lines by Using DR's & DC's పై శ్రద్ధపెట్టాలి.
- అప్లికేషన్ ఆఫ్ డెరివేటివ్స్ నందు టాంజెంట్ అండ్ నార్మల్ కాన్సెప్ట్‌లో Angle b/w Two Curves పై శ్రద్ధ పెడుతూ.. Maxima & Minima Concept కు సంబంధించిన కోన్, సిలిండర్, Sphere రిలేటెడ్ ప్రాబ్లమ్స్ బాగా ప్రాక్టీస్ చేయాలి. ఈ చాప్టర్లోని సమాధానాలకు అవసరమైనచోట ప్రమాణాలు పెట్టాలి.
- జూనియర్ ఇంటర్ క్యాలిక్యులస్ ప్రశ్నలకు సమాధానాలు రాయాలంటే Trigonometry, డెరివేటివ్ ఫార్ములాలపై పట్టు సాధించాలి.


సీనియర్ ఇంటర్

మ్యాథ్స్-2A లో ఎక్కువ మార్కులు సాధించాలంటే..

- రెండు మార్కుల ప్రశ్నలు కాంప్లెక్స్ నంబర్స్, Permutations & Combinations మొదలైన చాప్టర్ల నుంచి ఎక్కువ వస్తాయి.
- క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్, కాంప్లెక్స్ నంబర్స్, పార్షియల్ ఫ్రాక్షన్స్‌పై శ్రద్ధ పెట్టడంవల్ల నాలుగు మార్కుల విభాగంలో గరిష్ఠ మార్కులు సాధించవచ్చు.
- Permutations & Combinations చాప్టర్‌లో Sum of the digits, Rank of the given word problems పై శ్రద్ధ పెట్టాలి. కాంబినేషన్స్ కాన్సెప్ట్‌కు సంబంధించి టీమ్ సెలక్షన్ ప్రాబ్లమ్స్‌పై పట్టు సాధించాలి. ఈ చాప్టర్లోని ప్రశ్నలకు స్టెప్స్ రాయాలి. డైరెక్ట్ స్టెప్స్ రాయకూడదు. కొత్తగా ప్రవేశపెట్టిన Palindrome మొదలైన అంశాలపై లెక్కలు తప్పనిసరిగా చేయాలి.
- థియరీ ఆఫ్ ఈక్వేషన్స్ చాప్టర్‌లో relation between the roots and coefficients, మల్టిపుల్ రూట్స్, రెసిప్రోకల్ ఈక్వేషన్ కాన్సెప్ట్‌కు సంబంధించిన ప్రశ్నలపై పట్టు సాధించాలి.
- బైనామియల్ థియరమ్‌లో రేషనల్ ఇండెక్స్ ప్రాబ్లమ్స్‌పై పట్టు సాధించాలి. number of terms in a Binominal and Trinomial expansions, జనరల్ టర్మ్, ఇండిపెండెంట్ టర్మ్, మిడిల్ టర్మ్, Binomial Coefficientsకు సంబంధించిన ప్రాబ్లమ్స్‌పై పట్టు సాధించాలి.
- ప్రాబబిలిటీ చాప్టర్‌లో ఆడిషన్ థియరమ్, మల్టిప్లికేషన్ థియరమ్, Bay's థియరమ్ వాటికి సంబంధించిన అప్లికేషన్స్‌పై పట్టు సాధించాలి.
- De-moivre's థియరమ్, రాండమ్ వేరియబుల్స్ చాప్టర్లలో చాలా సులభమైన ప్రశ్నలు అడుగుతారు. అందువల్ల వాటిపై శ్రద్ధ పెట్టాలి.

మ్యాథ్స్-2B లో ఎక్కువ మార్కులు సాధించాలంటే..

- మ్యాథ్స్-2బి లో రెండు మార్కుల ప్రశ్నలు బాగా రాయాలంటే సర్కిల్స్, Consic Section, ఇంటిగ్రేషన్స్ బాగా ప్రాక్టీస్ చేయాలి.
- సర్కిల్స్, ఇంటిగ్రేషన్స్, డెఫినైట్ ఇంటిగ్రేషన్స్ చాప్టర్ల నుంచి 55 మార్కుల వరకు ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది. వీటిపై ఎక్కువ దృష్టి పెట్టాలి.
- సర్కిల్స్, సిస్టమ్ ఆఫ్ సర్కిల్స్, కోనిక్ సెక్షన్స్‌పై శ్రద్ధపెట్టడం వల్ల సెక్షన్-బిలో గరిష్ఠ మార్కులు సాధించవచ్చు.
- సర్కిల్స్‌లో Concyclic Points, డైరెక్ట్ కామన్ టాంజెంట్స్, Transverse Common Tangents of given Two Circles పై దృష్టిపెట్టాలి.
- కోనిక్ సెక్షన్‌లో Parabola Standard Form, Properties of Ellipse, Hyper bola పై పట్టు సాధించాలి.
- డిఫరెన్షియల్ ఈక్వేషన్స్ చాప్టర్లో ఉన్న నాలుగు మెథడ్స్ (వేరియబుల్-సెపరేబుల్, హోమోజీనియస్, నాన్‌హోమోజీనియస్, లీనియర్ డిఫరెన్షియల్ ఈక్వేషన్స్), Order & Degree of Differential Equations పై పట్టు సాధించాలి.
- సీనియర్ ఇంటర్ క్యాలిక్యులస్ ప్రశ్నలకు సమాధానాలు రాయాలంటే Trigonometry, డెరివేటివ్స్, ఇంటిగ్రేషన్స్ ఫార్ములాలపై పట్టు సాధించాలి.



ఎకనామిక్స్

ఇంటర్మీడియట్‌లో ఎకనామిక్స్ అంటే చాలా కష్టమైన సబ్జెక్టు అనుకుంటారు. అయితే పాఠం చెప్పేటప్పుడు ప్రాథమిక అంశాలు అర్థమైతే ఎకనామిక్స్ అంత తేలికైన సబ్జెక్టు మరొకటి లేదు.

- ఫస్టియర్ ఎకనామిక్స్ సిలబస్‌లో 10 యూనిట్లు ఉన్నాయి. అవి ఉపోద్ఘాతం, వినియోగ సిద్ధాంతం, ఉత్పత్తి సిద్ధాంతం, విలువ సిద్ధాంతం, పంపిణీ సిద్ధాంతం, జాతీయ ఆదాయం, స్థూల ఆర్థిక అంశాలు, ద్రవ్యం-బ్యాంకింగ్-ద్రవ్యోల్బణం, ఆర్థికశాస్త్రం-గణాంకశాస్త్రం.
- సెకండియర్‌లో ఆర్థికాభివృద్ధి, ఆర్థికవృద్ధి, జనాభా, మానవ వనరుల అభివృద్ధి, జాతీయాదాయం, వ్యవసాయ రంగం, పారిశ్రామిక రంగం, తృతీయ రంగం, సేవల రంగం, ప్రణాళిక-ఆర్థిక సంస్కరణలు, పర్యావరణం-సుస్థిర ఆర్థికాభివృద్ధి, తెలంగాణ ఆర్థిక వ్యవస్థ-లక్షణాలు వంటి అంశాలుంటాయి.
- పరీక్షలో ఎక్కువ మార్కులు స్కోర్ చేయాలంటే ప్రతి అధ్యాయాన్ని క్షుణ్ణంగా చదవాలి. దేనిని చాయిస్‌గా వదిలివేయకూడదు.
- ఫస్టియర్‌లో వినియోగ సిద్ధాంతాలు, డిమాండ్, ఉత్పత్తి, విలువ సిద్ధాంతం, జాతీయాదాయం, స్థూల ఆర్థిక అంశాలు వంటి చాప్టర్లపై పట్టు సాధించాలి.
- సెకండియర్‌కు సంబంధించి ఆర్థిక వృద్ధి, ఆర్థికాభివృద్ధి, ప్రణాళికలు, పర్యావరణం, జనాభా మానవ వనరుల అభివృద్ధి, జాతీయాదాయం, వ్యవసాయం, పారిశ్రామికాభివృద్ధి చాప్టర్లపై మంచి పట్టు ఉండాలి.

జూనియర్ ఇంటర్ విద్యార్థులకు..

- మంచి మార్కులు సాధించాలనుకునే విద్యార్థులు ముందుగా సమాధానాలపై పట్టు సాధించాలి.
- ఎస్సేలు రాసేటప్పుడు ఇంట్రడక్షన్, డెఫినిషన్లు తప్పులేకుండా రాయాలి. పట్టికలు, డయాగ్రమ్స్ తప్పుల్లేకుండా వేయాలి.
- 10 మార్కుల ప్రశ్నలు రాసిన తర్వాత రెండు మార్కులు, ఆ తర్వాత 5 మార్కుల ప్రశ్నలు రాస్తే సమయం కలిసి వస్తుంది.
- పటాలు ఉన్న ప్రశ్నలు రాస్తే ఎక్కువ మార్కులు రావడానికి అవకాశం ఉంది.
- ప్రశ్నల సంఖ్య స్పష్టంగా కనబడేటట్లు వేయాలి.

ముఖ్యమైన ప్రశ్నలు (10 మార్కులు)

1. క్షీణోపాంత ప్రయోజన సూత్రం పరిమితులను పరిశీలించండి. దాని ప్రాధాన్యతను విశ్లేషించండి.
2. ఉదాసీనత వక్రరేఖ విశ్లేషణద్వారా వినియోగదారుని సమతౌల్యాన్ని విపులీకరించండి.
3. సమోపాంత ప్రయోజన సూత్రం సహాయంతో వినియోగదారుని సమతౌల్యాన్ని విపులీకరించండి.
4. చరానుపాత సూత్రాన్ని విమర్శనాత్మకంగా పరిశీలించండి.
5. తరహాననుసరించి ప్రతిఫలాల సూత్రాన్ని వివరించండి.
6. అంతర్గత ఆదాలు, బహిర్గత ఆదాలను విశదీకరించండి.
7. మార్కెట్ల వర్గీకరణను విశదీకరించండి.
8. పరిపూర్ణ పోటీ మార్కెట్‌లో ధరనిర్ణయ విధానాన్ని వివరించండి.
9. ఏకస్వామ్యంలో ధర ఏ విధంగా నిర్ణయించబడుతుందో వివరించండి.
10. జాతీయాదాయాన్ని నిర్వచించి దాని వివిధ భావనలను వివరించండి.

ముఖ్యమైన ప్రశ్నలు (5 మార్కులు)

1. ప్రయోజనం అంటే ఏమిటి? అవి ఎన్ని రకాలు?
2. కోర్కెల లక్షణాలను విశ్లేషించండి.
3. కొరత నిర్వచనం గురించి వివరించండి.
4. ఉదాసీనత వక్రరేఖల లక్షణాలు వివరించండి.
5. డిమాండ్‌ను నిర్ణయించే కారకాలు ఏవి?
6. డిమాండ్ సూత్రాన్ని వివరించండి.
7. డిమాండ్ సూత్రానికి గల మినహాయింపులను విపులీకరించండి.
8. డిమాండ్ రేఖ ఋణాత్మక వాలుకుగల కారణాలను విపులీకరించండి.
9. ధర-డిమాండ్ వ్యాకోచత్వంలోని రకాలను వివరించండి.
10. ధర-డిమాండ్ వ్యాకోచత్వాన్ని నిర్ణయించే అంశాలు ఏవి?

సీనియర్ ఇంటర్ విద్యార్థులకు..


- పరీక్ష రాసేటప్పుటు పాఠ్యపుస్తకంలో ఉన్న సైడ్ హెడ్డింగ్స్ రాసి అండర్‌లైన్ చేయాలి.
- ముందుగా 10 మార్కులు ప్రశ్నలు రాసి, తర్వాత 2 మార్కులు, 5 మార్కుల ప్రశ్నలు రాయాలి.
- ఆర్థికవృద్ధి-ఆర్థికాభివృద్ధి, జనాభా మానవ వనరుల అభివృద్ధి, వ్యసాయరంగం, పారిశ్రామిక రంగం, జాతీయాదాయం చాప్టర్ల నుంచి ఎస్సే ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది.
- మిగిలిన చాప్టర్ల నుంచి 5 మార్కుల ప్రశ్నలు వస్తాయి. అయితే ప్రశ్నపత్రం తయారీలో వెయిటేజీ కచ్చితంగా పాటిస్తారని చెప్పలేం. కాబట్టి అన్ని చాప్టర్లను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలి.
- పట్టికలు, డాటా తప్పులు లేకుండా వేయాలి.

ముఖ్యమైన ప్రశ్నలు (10 మార్కులు)

1. ఆర్థికవృద్ధి-ఆర్థికాభివృద్ధి భావనలను గురించి వివరించండి. వాటి మధ్య తారతమ్యాలు ఏవి?
2. భారతదేశాన్ని దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి చెందుతున్న దేశాల లక్షణాలను విమర్శణాత్మకంగా విశ్లేషించండి.
3. జనాభా పరిణామ సిద్ధాంతాన్ని వివరించండి.
4. భారతదేశంలో జనాభా వేగంగా పెరగడానికి కారణం ఏమిటి?
5. జనాభా విస్ఫోటనాన్ని అరికట్టడానికి తీసుకోవాల్సిన చర్యలు ఏవి?
6. ఆర్థికాభివృద్ధిలో విద్యకున్న పాత్రను పరిశీలించండి.
7. ఆదాయ-సంపద పంపిణీలోని అసమానతలను ఏ విధంగా తగ్గించవచ్చు?
8. భారతదేశంలో పేదరిక నివారణా చర్యలను వివరించండి.
9. వ్యవసాయరంగంలో తక్కువ ఉత్పాదకతకు గల కారణాలను విశదీకరించండి. ఉత్పాదకతను పెంచేందుకు చేపట్టవలసిన చర్యలు ఏవి?
10. గ్రామీణ ఋణగ్రస్తతకు గల కారణాలు, వాటిని సరిదిద్దడానికి తీసుకునే చర్యలను పరిశీలించండి.

ముఖ్యమైన ప్రశ్నలు (5 మార్కులు)

1. జాతీయాదాయంలో రంగాల వారీ వాటాలను సంక్షిప్తంగా పరిశీలించండి.
2. ఆదాయ-సంపద పంపిణీలోని అసమానతలకు గల ప్రధాన కారణాలేవి?
3. వివిధ నిరుద్యోగిత రకాలను పరిశీలించండి.
4. నీతి ఆయోగ్‌పై లఘు వ్యాఖ్యను రాయండి.
5. సంతులిత ప్రాంతీయాభివృద్ధికి ప్రభుత్వం తీసుకున్న చర్యలను వివరించండి.
6. వ్యవసాయ పరపతికి గల ఆధారాలను సంక్షిప్తంగా వివరించండి.
7. ఎన్‌ఏబీఏఆర్డీ విధులు వివరించండి.
8. భారతదేశంలో పంటల తీరును పరిశీలించండి.
9. ప్రత్యేక ఆర్థిక మండళ్లు (సెజ్) భారతదేశ పారిశ్రామికాభివృద్ధికి ఎలా దోహదం చేస్తాయి?
10. తెలంగాణలోని విద్యా విధానాన్ని విపులీకరించండి.



రాధ (సీఏ)
అకడమిక్ అడ్వైజర్
మాస్టర్‌మైండ్స్
హైదరాబాద్

సుడోకు

డైలీ సుడోకు 55 సమాధానం

2	6	7	3	8	9	4	5	1
8	5	3	2	1	4	6	9	7
9	1	4	7	5	6	8	2	3
3	7	8	4	9	1	5	6	2
1	4	6	8	2	5	3	7	9
5	9	2	6	3	7	1	4	8
6	2	1	5	7	3	9	8	4
4	8	9	1	6	2	7	3	5
7	3	5	9	4	8	2	1	6

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు -56

1	3				6			
	7	4			2	5	8	
				5		3		
	8			1				
				6			2	9
						4	3	
				3			5	
9		3				7		4
				7	5	8		

నమస్తే తెలంగాణ
చిత్రం
[కరీంనగర్]
సోమవారం 4 ఫిబ్రవరి 2019



ప్రశాంత్‌వర్మ, రాజశేఖర్, జీవిత, సి.కల్యాణ్, శివాని, శివాత్మిక

'కల్కి'తో సమాధానం దొరికింది

''గరుడ వేగ' విజయం తర్వాత మంచి కథల కోసం దాదాపు ఆరునెలల పాటు అన్వేషించాను. ప్రశాంత్‌వర్మ చెప్పిన ఈ కథ నన్ను బాగా ఆకట్టుకుంది. 'గరుడవేగ'కు ముందు కూతుళ్లు నటిస్తున్నారు..నువ్వు విశ్రాంతి తీసుకో అని సి.కల్యాణ్ అన్నారు. సినిమా సక్సెస్ తర్వాత కలిసి సినిమా చేద్దామని ముందుకు వచ్చారు. ఆయనతో ఈ సినిమా చేయడాన్ని ప్రమోషన్‌గా భావిస్తున్నాను' అని అన్నారు రాజశేఖర్. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'కల్కి'. ప్రశాంత్ వర్మ దర్శకుడు. సి.కల్యాణ్ నిర్మాత. అదాశర్మ, నందితాశ్వేత కథానాయికలు. నేడు రాజశేఖర్ పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో చిత్రబృందం టీజర్‌ను విడుదలచేసింది. సి.కల్యాణ్ మాట్లాడుతూ '1983 నేపథ్యంలో సాగే విభిన్నమైన సినిమా ఇది. 70 శాతం చిత్రీకరణ పూర్తయింది. మార్చి, ఏప్రిల్ నెలల్లో కర్ణాటక, తమిళనాడు, హైదరాబాద్‌లలో తదుపరి షెడ్యూల్స్‌ను చిత్రీకరిస్తాం' అని తెలిపారు.'గరుడవేగ' సినిమా చేస్తున్నప్పుడు ఎంత ఉత్సుకతకు లోనయ్యానో అదే ఎగ్జైట్‌మెంట్ ఈ సినిమాకు కలుగుతున్నది. ఈ సినిమా కోసం నా కంటే ఎక్కువగా జీవిత కష్టపడుతున్నది. ఇదివరకు నన్ను అందరూ యాంగ్రీ యంగ్‌మెన్ అనేవారు. వయసుపై బడిన తర్వాత ఆ పేరును కొనసాగించడం ఎలా అనుకుంటున్న తరుణంలోఈ సినిమాతో ప్రశాంత్‌వర్మ మంచి సమాధానం ఇచ్చారు. నన్ను యాంగ్రీస్టార్‌గా సినిమాలో ఆవిష్కరించారు' అని రాజశేఖర్ చెప్పారు. దర్శకుడు ప్రశాంత్‌వర్మ మాట్లాడుతూ ''అ! కంటే పదిరేట్లు ఎక్కువ కష్టపడి నేను చేస్తున్న సినిమా ఇది. 'కల్కి' ఉన్నతమైన టైటిల్ కావడంతో గౌరవంగా, బాధ్యతగా భావించి ఈ సినిమా చేస్తున్నాను. కమర్షియల్ సినిమాల్లో సొంత ముద్రను సృష్టించుకుంటుంది. ఈ సినిమాను ఫ్రాంచైజ్‌గా చేయాలని ఉంది. రాజశేఖర్‌గారి వచ్చే ఏడాది పుట్టినరోజుకు సీక్వెల్ ప్రారంభించాలనుకుంటున్నాం. పరిశోధన అధికారిగా రాజశేఖర్ పాత్ర వినూత్నంగా ఉంటుంది' అని తెలిపారు. 'గరుడవేగ'కు ముందు అధఃపాతాళానికి వెళ్లిన తాము కెరీర్‌లో మళ్లీ పైకి రాగలుగుతామా? లేదా? అనే భయం ఉండేదని, సినిమా పెద్ద విజయాన్ని సాధించి తమకు పూర్వవైభవాన్ని తెచ్చిపెట్టిందని, ప్రస్తుత తరుణంలో సినిమా తీయడం, పెట్టిన డబ్బుల్ని వెనక్కి రాబట్టుకోవడం కష్టంగా మారిందని, కథను నమ్మి సి.కల్యాణ్ ఈ చిత్రాన్ని నిర్మించడానికి ముందుకు రావడం ఆనందంగా ఉందని, మే నెలలో 'కల్కి' సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నామని జీవిత రాజశేఖర్ చెప్పింది. ఈ కార్యక్రమంలో శివాని, శివాత్మిక, శివేంద్ర, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

చింతకింది మల్లేశం కథ



ప్రియదర్శి ,ఝాన్సీ

ఆసు యంత్రాన్ని కనిపెట్టి పద్మశ్రీ పురస్కారాన్ని సొంతం చేసుకున్న చింతకింది మల్లేశం జీవిత కథ ఆధారంగా రూపొందుతున్న చిత్రం 'మల్లేశం'. 'ఎక్స్‌ట్రార్డినరీ స్టోరీ ఆఫ్ యాన్ ఆర్డినరీ మ్యాన్' అని ఉప శీర్షిక. ప్రియదర్శి టైటిల్ పాత్రలో నటిస్తుండగా, అనన్య, ఝాన్సీ, చక్రపాణి కీలక పాత్రల్ని పోషిస్తున్నారు. రాజ్ ఆర్ దర్శకుడు. స్టూడియో 99 ఫిల్మ్స్ పతాకంపై ఈ చిత్రాన్ని రాజ్. ఆర్. శ్రీఅధికారి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌ను చిత్ర బృందం రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఆదివారం విడుదల చేసింది. ఈ చిత్ర టైటిల్ లోగోను ఇటీవల ట్విట్టర్ ద్వారా విడుదల చేసిన తెలంగాణ రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదివారం ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌ను సోషల్ మీడియా ట్విట్టర్‌లో షేర్ చేశారు. 'తెలంగాణకు చెందిన 'మల్లేశం: ఎక్స్‌ట్రార్డినరీ స్టోరీ ఆఫ్ యాన్ ఆర్డినరీ మ్యాన్' సినిమా ఫస్ట్‌లుక్‌ను విడుదల చేయడం ఆనందంగా వుంది. ఈ చిత్ర బృందానికి ఆల్ ది బెస్ట్' అని ట్వీట్ చేశారు. దర్శకుడు మాట్లాడుతూ 'పద్మశ్రీ చింతకింది మల్లేశం జీవితం ఆధారంగా రూపొందుతున్న చిత్రమిది. అగ్గిపెట్టెలో పట్టేంత చీరలను చేసి ప్రపంచాన్ని అబ్బురపరిచిన వ్యక్తి ఆయన. తను సాధించిన విజయాలతో చేనేత ప్రాముఖ్యతను ప్రపంచానికి చాటి చెప్పిన ఘనత మల్లేశం సొంతం. అలాంటి గొప్ప వ్యక్తి జీవితం ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. చిత్రీకరణ చివరి దశకు చేరుకుంది. త్వరలోనే విడుదల చేస్తాం' అన్నారు. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: బాబు శాండిల్య, ప్రొడక్షన్ డిజైనర్: లక్ష్మణ్ ఏలె,సౌండ్ డిజైనింగ్: నితిన్ లుకోస్, సంగీతం: మార్క్ కె. రాబిన్, మాటలు: పెద్దింటి అశోక్‌కుమార్, పాటలు: గోరేటి వెంకన్న, చంద్రబోస్, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: వెంకట్ సిద్ధారెడ్డి.



కేథరిన్



రష్మిక మందన్న

కోపమెందుకో..?

కథానాయికలు తమపై వచ్చే పుకార్ల గురించి పెద్దగా పట్టించుకోరు. మీడియాలో వచ్చే ప్రతి వార్తపై దృష్టిపెట్టడం సమయం వృథా అనే భావనలో ఉంటారు. అయితే కన్నడ సోయగం రష్మికమందన్న మాత్రం ఓ వెబ్‌సైట్‌లో వచ్చిన వార్తపై వ్యంగ్యంగా స్పందించింది. నిజానిజాలు తెలుసుకోవాలంటే నేరుగా తననే సంప్రదించాలని సూచించింది. వివరాల్లోకి వెళితే.. 'ఛలో' 'గీత గోవిందం' వంటి విజయవంతమైన చిత్రాల ద్వారా మంచి గుర్తింపును సంపాదించుకున్న ఈ సొగసరి ప్రస్తుతం తెలుగులో రెండు సినిమాల్లో నటిస్తున్నది. కన్నడంలో కూడా రెండు చిత్రాలు నిర్మాణంలో ఉన్నాయి. అయితే మాతృపరిశ్రమను నిర్లక్ష్యం చేస్తూ రష్మిక తెలుగు చిత్రాలకే ప్రాధాన్యతనిస్తున్నదని, ఈ విషయంలో కన్నడ చిత్రసీమ ఆమెపై అసంతృప్తిగా ఉందని ఓ వెబ్‌సైట్‌లో కథనం వెలువడింది. దీనిపై సదరు వెబ్‌సైట్ వివరణ కోరింది రష్మిక. కన్నడ చిత్రసీమ తనపై ఎందుకు కోపంగా వుందో చెప్పాలని డిమాండ్ చేసింది. 'మామూలుగా ఇలాంటి పుకార్లను పట్టించుకోను. అసత్య వార్తలు సృష్టించడంలో అర్థం లేదు. కన్నడ ఇండస్ట్రీ నాపై ఎందుకు కోపంగా ఉందో ఆధారాలతో సహా నిరూపించాలి. వాటిని నాకు నేరుగా పంపించండి' అంటూ నవ్వుతో కూడిన ఎమోజీని జత చేసి ట్విట్టర్‌లో పోస్ట్ పెట్టింది రష్మిక.

విజయ్ దేవరకొండకు జోడీగా..

'నేనే రాజు నేనే మంత్రి' తరువాత తెలుగులో కేథరిన్ నటించిన సినిమా ఏదీ ఇంత వరకు ప్రేక్షకుల ముందుకు రాలేదు. తాజాగా ఆమెకు బంపర్ ఆఫర్ లభించింది. వరుస విజయాలతో క్రేజీ స్టార్‌గా మారిన విజయ్ దేవరకొండ తాజా చిత్రంలో నటించే అవకాశాన్ని సొంతం చేసుకుంది. 'టాక్సీవాలా' విజయంతో రెట్టించిన ఉత్సాహంతో వున్న విజయ్ దేవరకొండ వరుస చిత్రాల్లో నటిస్తున్నారు. ప్రస్తుతం భరత్ కమ్మ దర్శకత్వంలో మైత్రీ మూవీమేకర్స్ నిర్మిస్తున్న 'డియర్ కామ్రేడ్'తో పాటు క్రాంతి మాధవ్ చిత్రంలోనూ నటిస్తున్నారు. క్రియేటివ్ కమర్షియల్స్ పతాకంపై కె.స్.రామారావు సమర్పణలో కె.ఎ.వల్లభ నిర్మిస్తున్న ఈ సినిమాలో రాశీఖన్నా, ఐశ్వర్యరాజేష్, ఇజబెల్లా కథానాయికలుగా నటిస్తున్నారు. కాగా వీరితో పాటు మరోనాయికగా కేథరిన్‌ను చిత్ర బృందం ఖరారు చేసింది. రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం ఖమ్మంలో జరుగుతోంది. ఖాకీ దుస్తుల్లో కనిపిస్తున్న విజయ్ దేవరకొండను సినిమాలో కొత్త పంథాలో ఆవిష్కరిస్తున్నట్లు తెలుస్తోంది.



అలీ అస్గర్, భూషన్‌పటేల్, సచిన్‌జోషి, సి.కల్యాణ్, విజయ్, కందికొండ

అమావాస్య రోజున..


సచిన్‌జోషి కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'అమావాస్య'. వైకింగ్ మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై రైనా సచిన్‌జోషి, దీపెన్ ఆమిన్ నిర్మిస్తున్నారు. భూషన్ పటేల్ దర్శకుడు. నర్గీస్ ఫక్రి కథానాయిక. ఈ నెల 8న ప్రేక్షకులముందుకురానుంది. ఈ చిత్ర ప్రీరిలీజ్ వేడుక శనివారం హైదరాబాద్‌లో జరిగింది. ఆడియో బిగ్‌సీడీని సి.కల్యాణ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఈ సినిమాలో సచిన్ కొత్తగా కనిపిస్తున్నాడు. ఎన్నో వ్యాపారాలు ఉన్నప్పటికి పాషన్‌తో సినిమాలు చేస్తున్నాడు. ట్రైలర్ చాలా ఆసక్తికరంగా ఉంది' అని చెప్పారు. 'చాలా రోజుల నుంచి హారర్ జోనర్ సినిమా చేయాలనుకుంటున్నాను. ఇదొక క్లాసిక్ హారర్ మూవీ. ప్రస్తుతం ఉన్న అధునాతన సాంకేతికతను ఉపయోగించిన అద్భుతమైన గ్రాఫిక్స్‌తో సినిమా తీశాం. హాలీవుడ్ స్థాయి హారర్ చిత్రాన్ని అందించాలనే తపనతో ఈ సినిమా చేశాం. హిందీ, తెలుగు భాషల్లో చిత్రాన్ని విడుదల చేస్తున్నాం' అని సచిన్‌జోషి తెలిపారు. దర్శకుడు మాట్లాడుతూ 'ఉత్తమమైన వీఎఫ్‌ఎక్స్ సాంకేతిక నిపుణులు ఈ సినిమా కోసం పనిచేశారు. అమావాస్య రాత్రి ఓ దుష్టశక్తి ప్రేమజంట మీద ఎలాంటి చర్యలకు పూనుకుందన్నదే చిత్ర కథ' అన్నారు. ఈ కార్యక్రమంలో నటుడు అలీఅస్గర్, ఫైట్ మాస్టర్ విజయ్, గీత రచయిత కందికొండ తదితరులు పాల్గొన్నారు.

అంచనాల్ని చేరుకున్నాం!



శివ కంఠంనేని

'కథలోని భావోద్వేగాలతో ప్రేక్షకులు కనెక్ట్ అయితే చిన్న సినిమా, పెద్ద సినిమా అనే తేడా లేకుండా విజయాన్ని అందుకోవచ్చని ఈ చిత్రం నిరూపించింది' అని అన్నారు శివ కంఠంనేని. ఆయన ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'అక్కడొకడుంటాడు'. శ్రీపాదవిశ్వక్ దర్శకుడు. రామ్‌కార్తిక్, శివహరీష్, అలేఖ్య, రసజ్ఞదీపిక ప్రధాన పాత్రలను పోషించారు. కె.శివశంకర రావు, రావుల వెంకటేశ్వరరావు నిర్మించారు. ఇటీవల ఈ చిత్రం విడుదలైంది. ఆదివారం హైదరాబాద్‌లో ఏర్పాటుచేసిన విజయోత్సవ వేడుకలో దర్శకుడు మాట్లాడుతూ 'ప్రస్తుతం ప్రేక్షకులు ముందుచూపుతో ఆలోచిస్తున్నారు. వారి అంచనాల్ని అందుకోవాలనే తలంపుతో వైవిధ్యతను నమ్మి ఈ సినిమా చేశాం' అని తెలిపారు. 'అపరిచితుడు', 'భారతీయుడు' తరహాలో అంతర్లీనంగా చక్కటి సందేశం మిళితమైన ఈ చిత్రం అందరిని ఆకట్టుకుంటున్నదని, వసూళ్లు పెరుగుతున్నాయని శివ కంఠంనేని చెప్పారు. నిర్మాత మాట్లాడుతూ 'దాదాపు వంద థియేటర్లలో ఈ సినిమాను విడుదలచేశాం. మా తొలి ప్రయత్నం విజయవంతం కావడం ఆనందగా ఉంది. ఇదే బ్యానర్‌లో మరో సినిమా చేయబోతున్నాం' అని తెలిపారు.





దేవిప్రసాద్

నేటి రాజకీయం

దేవిప్రసాద్, వాయుతనయ్, శశి, సుచిత్ర ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'నేనే ముఖ్యమంత్రి'. అట్లూరి నారాయణరావు, ఆలూరి సాంబశివరావు నిర్మిస్తున్నారు. మోహన్ రావిపాటి దర్శకుడు. ఈ నెల 8న ఈ చిత్రం విడుదలకానుంది. నిర్మాతలు మాట్లాడుతూ 'సమకాలీన రాజకీయాలకు దర్పణంలా నిలిచే చిత్రమిది. సమాజహితాన్ని కాంక్షిస్తూ రాజకీయాల్లోకి అడుగుపెట్టిన ఓ యువకుడు ఎలాంటి ఆటుపోట్లను ఎదుర్కొన్నాడు? చివరకు ముఖ్యమంత్రి పీఠాన్ని ఎలా అధిష్ఠించాడన్నది ఆసక్తిని పంచుతుంది. నటీనటులంతా అద్భుతమైన అభినయాన్ని కనబరిచారు. ఇటీవల విడుదలైన టీజర్, పాటలకు చక్కటి స్పందన లభిస్తున్నది. సినిమా అన్ని వర్గాల ప్రేక్షకుల్ని అలరిస్తుంది' అని తెలిపారు. నళినికాంత్, శుభలేఖ సుధాకర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ఫణికళ్యాణ్, కెమెరా: కమలాకర్.



రమేష్ చౌదరి, విక్కీరాజ్ తదితరులు

చెడ్డీగ్యాంగ్ చెరలో..

రాజ్ ప్రొడక్షన్స్ ఇంటర్నేషనల్ సంస్థ నిర్మిస్తున్న చిత్రం 'చెడ్డీగ్యాంగ్'. శ్రీనివాసరెడ్డి ముఖ్యపాత్రలో నటిస్తుండగా అమర్, ప్రదీప్‌వర్మ, ఉదయ్, అభి, సి.టి.ఖాదర్, లక్ష్మీ ఇతర ప్రధాన పాత్రల్ని పోషిస్తున్నారు. రమేష్ చౌదరి దర్శకుడు. విక్కీరాజ్ నిర్మాత. సస్పెన్స్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. టీజర్‌ను శనివారం 'మా' అధ్యక్షుడు శివాజీరాజా విడుదల చేశారు. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'పదిమంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కేరళ అడవులకు విహారయాత్రకు వెళ్లి అక్కడి కోయవారి నిబంధనలను అతిక్రమించి ఇరుక్కుపోతారు. అక్కడి నుంచి వాళ్లు ఎలా బయటపడ్డారన్నదే ఈ చిత్ర కథాంశం. 125రోజులు షూటింగ్ చేశాం' అన్నారు. 'కేరళలోని ఎర్నాకుళం, ఇరిట్టి అడవుల్లోని చక్కటి లొకేషన్లలో చిత్రీకరణ జరిపాం. మలేషియాలో తెరకెక్కించిన క్లైమాక్స్ సినిమాకు హైలైట్‌గా నిలుస్తుంది. చిత్రంలో ఐదు పాటలున్నాయి. బాలీవుడ్ నటి స్నేహాకపూర్ చేసిన ఐటమ్‌సాంగ్ యువతరాన్ని ఆకట్టుకుంటుంది' అని నిర్మాత తెలిపారు. ఈ సినిమాలో అన్ని పాటలు బాగా కుదిరాయని గీత రచయిత లక్ష్మణ్ చెప్పారు.